ఈనాడు

విజయవాడ 10-12-2025 బుధవారం సిటీ సంపుటి 52 . సంచిక 120

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 18

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఈనాడు

విజయవాడ 10-12-2025 బుధవారం సిటీ సంపుటి 52 . సంచిక 120
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 18
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru


ప్రధాని నరేంద్ర మోదీతో మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల

దేశంలో మైక్రోసాఫ్ట్ పెట్టుబడులు
రూ.1.58 లక్షల కోట్లు

సీఈఓ సత్య నాదెళ్ల ప్రకటన

దిల్లీ: అమెరికా సాంకేతిక దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్, మనదేశంలో కొత్తగా 17.5 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.1.58 లక్షల కోట్లు) పెట్టుబడులు పెట్టనున్నట్లు సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) సత్య నాదెళ్ల ప్రకటించారు. దేశ కృత్రిమ మేధ (ఏఐ) భవితవ్యానికి అవసరమైన మౌలిక వసతుల నిర్మాణం, నైపుణ్య సామర్థ్యాలను సమకూర్చేందుకు ఇవి ఉపయోగపడతాయని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆయన తెలిపారు. 'భారత లక్ష్యాలకు మద్దతుగా, ఆసియాలోనే అత్యధిక పెట్టుబడులు పెట్టడానికి మైక్రోసాఫ్ట్ సిద్ధంగా ఉంద'ని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీని కలిసిన అనంతరం సత్య నాదెళ్ల ఈ ప్రకటన చేశారు. (మిగతా 6లో)

ఏడాదిలోగా రెవెన్యూ ప్రక్షాళన

ఒకే సమస్యపై పదేపదే అర్జీలొస్తే కుదరదు

- జేసీలకు రెవెన్యూ సమస్యల పరిష్కార బాధ్యత
- వివాదాస్పద భూముల పరిష్కారం ఆర్డీవోలకు
- భూమి విలువల్ని మార్కెట్ విలువలతో అప్‌గ్రేడ్ చేయండి
- ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: రెవెన్యూ శాఖలో ఒకే సమస్యపై పదేపదే అర్జీలు ఎందుకు వస్తున్నాయని సీఎం చంద్రబాబు అధికారుల్ని ప్రశ్నించారు. ఇకనుంచైనా పరిస్థితి మారాలని.. ఏడాదిలో ప్రక్షాళన జరగాలని ఆదేశించారు. రీసర్వే చేసిన భూములకు సంబంధించి ఒక్క సమస్య కూడా ఉండకూడదని, భూమి ఎవరిదో వారి పేరిటే నమోదు చేయాలని స్పష్టం చేశారు. రెవెన్యూపై మంగళవారం సచివాలయంలో చంద్రబాబు సమీక్షించారు. రెవెన్యూ శాఖ మంత్రి సత్యప్రసాద్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఉన్నతాధికారులు హాజరయ్యారు. 'రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఇతర రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేసి నివేదిక ఇవ్వండి. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో రూ.10,169 కోట్ల రెవెన్యూ లక్ష్యంగా నిర్ణయించాం. మార్కెట్ విలువలతో భూమి విలువల్ని అప్‌గ్రేడ్ చేయండి' అని సీఎం ఆదేశించారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు కులధ్రువీకరణ పత్రం వెంటనే



పొందేలా కార్యాచరణ రూపొందించాలని, ఆర్టీజీఎస్‌తో అనుసంధానించిన సమాచారం ద్వారా ఆదాయ ధ్రువపత్రం ఇవ్వాలని నిర్దేశించారు.

చిక్కుముడులకు తావు లేకుండా

జిల్లాల్లో సంయుక్త కలెక్టర్లకు రెవెన్యూ బాధ్యతలు పెంచాలని, ప్రతి నెలా నిర్వహించే సమీక్షలో వారు తప్పనిసరిగా పాల్గొనాలని చంద్రబాబు సూచించారు. జిల్లాల్లో ఒక్క రెవెన్యూ సమస్య కూడా లేకుండా చేయాల్సిన బాధ్యత వారిదేనని స్పష్టం చేశారు. (మిగతా 6లో)

స్క్రబ్‌టైఫస్‌పై అధ్యయనానికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్
అపరిశుభ్రతే పెద్ద జబ్బు.. దానిపై చైతన్యం పెంచాలి
వైద్యారోగ్య శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

2లో

'అటల్-మోదీ సుపరిపాలన యాత్ర' విజయవంతం చేయాలి
కూటమిలోని మూడు పార్టీల నేతలూ పాల్గొనాలి
టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు పిలుపు

'సర్' నిరాటంకంగా కొనసాగాలి



రాష్ట్రాలకు స్పష్టంచేసిన సుప్రీంకోర్టు

- బీఎల్‌వోలను అడ్డుకుంటే మాకు చెప్పండి
- ఎన్నికల సంఘానికి సూచించిన సీజేఐ ధర్మాసనం

దిల్లీ: ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కసరత్తులో పాల్గొంటున్న బూత్‌స్థాయి అధికారులు (బీఎల్‌వో), ఇతర అధికారులకు పశ్చిమ బెంగాల్, మరికొన్ని రాష్ట్రాల్లో బెదిరింపులు రావడంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. దీనిని గట్టిగా ఎదుర్కోవాలని లేకుంటే అరాచకానికి దారితీస్తుందని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి ధర్మాసనం మంగళవారం హెచ్చరించింది. సర్ కసరత్తుకు రాష్ట్రాలు సహకరించడంలేదన్న ఆరోపణలపైనా స్పందించింది. 'క్షేత్రస్థాయిలో సర్ కసరత్తు ఎలాంటి అవాంతరాలూ లేకుండా కొనసాగాలి. సహకారం కొరవడినా, బీఎల్‌వోలను అడ్డుకున్నా మా దృష్టికి తీసుకురండి. తగు ఆదేశాలు జారీ చేస్తాం' అని ఎన్నికల సంఘం తరపున హాజరైన సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేదికి ధర్మాసనం తెలిపింది. ఈసీ విధుల నిర్వహణకు సహకరించడంతో పాటు సిబ్బందికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని ద్వివేది పేర్కొన్నారు. 'రాష్ట్రాలు అందుకు నిరాకరిస్తే స్థానిక పోలీసులను డిప్యుటేషన్‌పై తీసుకోవడం మినహా ఈసీకి మరో మార్గం లేదు. అప్పటికీ పరిస్థితి మెరుగుపడకపోతే కేంద్ర బలగాలను రప్పించాల్సి ఉంటుంది' అని రాకేశ్ ద్వివేది తెలుపగా జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి అభ్యంతరం చెప్పారు. ఎన్నికల సమయంలో మాత్రమే పోలీసులను ఈసీ తన నియంత్రణలోకి తీసుకోగలదన్నారు. పశ్చిమ బెంగాల్‌లో బీఎల్‌వోలు, ఇతర అధికారులపై దాడులు జరుగుతున్నందున (మిగతా 6లో)

భారత బియ్యంపై అదనపు సుంకాలు!

సంకేతాలిచ్చిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్



న్యూయార్క్, వాషింగ్టన్: భారత్ నుంచి దిగుమతయ్యే బియ్యంపై అదనపు సుంకాలు విధించే యోచనలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉన్నట్లు తెలుస్తోంది. స్వదేశీ వ్యవసాయ రంగ ప్రతినిధులతో శ్వేతసౌధంలో సోమవారం ఆయన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. చౌకైన విదేశీ ఉత్పత్తులు అమెరికా ఉత్పత్తిదారులను దెబ్బతీస్తున్నాయని ట్రంప్‌నకు వారు మొరపెట్టుకున్నారు. సబ్సిడీ బియ్యం దిగుమతులు అమెరికా విపణిని దెబ్బతీస్తున్నాయని, దేశీయంగా ధరలను తగ్గిస్తున్నాయని పేర్కొన్నారు. వాటిని నిరోధించాలని విన్నవించారు. అమెరికాకు బియ్యం సహా పలు ఉత్పత్తులను డంప్ చేస్తున్న దేశాల్లో (మిగతా 6లో)

లోపలి పేజీల్లో

ఓటుచోరీ.. అతిపెద్ద దేశద్రోహం
ఈసీ - భాజపా కుమ్మక్కు
ప్రశ్నలు, డిమాండ్లతో లోక్‌సభలో గళమెత్తిన రాహుల్

ఇండిగో సర్వీసుల్లో 10% కోత
ప్రస్తుత సంక్షోభానికి ఆ సంస్థదే పూర్తి బాధ్యత
కఠిన చర్యలు తప్పవు
కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

మన వరి రైతుకూ ట్రంప్ దెబ్బ
సుంకాల ప్రతిపాదనతో ఆందోళన
2024-25లో అమెరికాకు రూ.3,311 కోట్ల బియ్యం ఎగుమతి
బాస్మతి బియ్యం ఎగుమతులే అధికం


అంగన్‌వాడీలకు సెల్‌ఫోన్‌లు

నేడు పంపిణీని ప్రారంభించనున్న మంత్రి సంధ్యారాణి

ఈనాడు, అమరావతి: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సేవల్ని మరింత వేగంగా అందించేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలకు సెల్‌ఫోన్‌లను అందించనుంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన, మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న 58,402 మంది కార్యకర్తలు, వాటిని పర్యవేక్షిస్తున్న సూపర్‌వైజర్లకు సామ్‌సంగ్ కంపెనీకి చెందిన 5జీ సెల్‌ఫోన్‌లను ఇవ్వనున్నారు. ఏపీటీఎస్ ద్వారా టెండర్లు నిర్వహించి వీటిని కొనుగోలు చేశారు. ఒక్కో సెల్‌ఫోన్ ధర రూ.12,500గా నిర్ధారించారు. బుధవారం విజయవాడలో నిర్వహించే కార్యక్రమంలో మహిళాశిశు సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి పంపిణీని లాంఛనంగా ప్రారంభిస్తారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా వీటిని పంపిణీ చేస్తారు. సెల్‌ఫోన్‌ల కోసం ప్రభుత్వం రూ.74 కోట్లు వెచ్చించింది.

లేత మనసులపై చదువుల ఒత్తిడి

- మానసిక సమస్యలతో సతమతం
- ఏపీ, తమిళనాడు, కర్ణాటకలలో తీవ్రం
- తాజా పరిశోధనలో వెల్లడి



రాష్ట్రాలవారీగా జనరలైజ్డ్ యాంగ్జైటీ డిజార్డర్ ఫలితాలు (ఈ స్కోర్ 5 దాటితే ఆందోళన ఉన్నట్లు అర్థం)

ఆంధ్రప్రదేశ్	కర్ణాటక	తమిళనాడు
20.81	17.38	16.38

ఈనాడు, చెన్నై: రోజంతా తరగతులు, అదనంగా పోటీ పరీక్షలకు తర్ఫీదు.. నియంత్రణలేని ఈ విధానం విద్యార్థుల్ని తీవ్ర వేదనకు, ఒత్తిళ్లకు గురిచేస్తోందని, పలు మానసిక సమస్యలు వారిని ఇబ్బంది పెడుతున్నాయని తాజా పరిశోధనలో తేలింది. ప్రధానంగా ఇంటర్ స్థాయి విద్యార్థుల్లో ఒత్తిడి ఎక్కువగా ఉంటోంది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి 25,020 మంది విద్యార్థులతో జరిపిన సర్వేలో ఇది బయటపడింది. విజన్ వికసిత్ భారత్‌లో భాగంగా ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్) నిధులతో జరిపిన ఈ సర్వేను ప్రాజెక్టు కో-ఆర్డినేటర్, వీఎఫ్ఎస్‌టీఆర్ పరిశోధకులు సిహెచ్. సురేష్‌చంద్ర చేయగా.. చెన్నై మెస్టన్ కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్, గుంటూరు విజ్ఞాన్ ఫౌండేషన్ ఫర్ సైన్స్, టెక్నాలజీ అండ్ రీసెర్చ్ (వీఎఫ్ఎస్‌టీఆర్), జైపుర్ నిమ్స్ యూనివర్సిటీ, కర్ణాటకలోని సెంట్రల్ యూనివర్సిటీ, గ్లోబల్ అకాడమీ ఆఫ్ టెక్నాలజీలకు చెందిన (మిగతా 6లో)

పేదరైతు బిడ్డకు పెళ్లి చేసిన పల్లె

మధ్యప్రదేశ్‌లోని భిండ్ జిల్లా మంగత్‌పురా గ్రామస్థులు తలో చెయ్యి వేసి నిరుపేద రైతు బిడ్డకు పెళ్లి చేయడం ద్వారా గొప్ప మానవతా స్ఫూర్తిని చాటారు. గ్రామానికి చెందిన రాకేశ్ కుశ్వాహ్ కుమార్తె లక్ష్మీ వివాహం వికాస్ అనే యువకుడితో డిసెంబరు 6న జరిగేలా నిశ్చయమైంది. గతంలో కౌలురైతుగా ఉన్న రాకేశ్ ప్రస్తుతం దినకూలీగా పనిచేస్తున్నాడు. పెళ్లికి సమయం దగ్గరపడుతున్నా డబ్బు సమకూరక ఇంటిల్లిపాది తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ విషయం గ్రామస్థులకు తెలిసి అందరూ ఒక్కటై రూ.లక్ష విరాళాలు సేకరించారు. మరికొందరు గోధుమలు, కావాల్సిన వస్తువులు సమకూర్చారు. హలవాయీ (మిఠాయి వ్యాపారి) లల్లూ ఉచితంగా మిఠాయిలు ఇచ్చారు. శిశుపాల్ నర్వారియా అనే సప్లయర్స్ వ్యాపారి పైసా తీసుకోకుండా కుర్చీలు, వేదిక, లైటింగు తదితర ఏర్పాట్లను చేశారు. చక్కటి విందుతో వివాహం ఘనంగా జరిగింది. అప్పగింతల సమయంలో లక్ష్మికి కుట్టు మిషను, మిక్సీ, గ్యాస్ స్టవ్, టీవీ వంటి కానుకలు కూడా గ్రామస్థులు ఇచ్చారు.



ఖర్చులు పోగా.. మిగిలిన రూ.18 వేల నగదును లక్ష్మీ పేరుతో బ్యాంకు ఖాతా తెరిచి డిపాజిట్ చేశారు. "లక్ష్మీ మాకూ బిడ్డ లాంటిదే. ఇది మా గ్రామ గౌరవం, ఓ కుమార్తె భవిష్యత్తుకు సంబంధించిన విషయం" అని గ్రామస్థులు తెలిపారు.

ఈటీవీ భారత్

తుపాకులు వదిలేసి.. పునర్జన్మకు పునరావాసం

తుపాకులు పట్టి అడవుల్లో తిరిగిన మాజీ నక్సలైట్లు నేడు పునరావాస శిబిరంలో కుట్టుపనులు, డ్రైవింగు వంటి ఇతర నైపుణ్యాలు నేర్చుకొంటూ కొత్త జీవితాలకు శ్రీకారం చుడుతున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోయిన 133 మంది నక్సలైట్లకు ప్రభుత్వం ఈ పునరావాస కేంద్రం ఏర్పాటు చేసింది. గతంలో వీరి హింసాత్మక కార్యకలాపాలకు కేంద్రంగా ఉన్న నారాయణపుర్ జిల్లాలో వెలసిన లైవ్లీహుడ్ కాలేజి అండ్ ఫీల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ కొత్త చరిత్ర రాస్తోంది. స్థానికంగా ఉన్న వీటీపీ అనే సంస్థ గొన్సు, రవికలు, చొక్కాలు, ప్యాంట్లు, చీరల ఫాల్స్ వంటివి కుట్టడంలో వీరికి శిక్షణ ఇస్తోంది. పీఎం, సీఎం స్కిల్ డెవలప్‌మెంట్ స్కీంల కింద ఇక్కడే ఆశ్రయం కల్పించి, నైపుణ్యాలు నేర్పుతున్నారు. పోలీసు అధికారుల ఫోన్ నంబర్లు కూడా ఇస్తూ గోండి భాషలో 'పూనా మార్గెం' (పునరావాసంతో పునర్జన్మ) అంటూ అడవుల్లో వెలసిన పోస్టర్లు చాలామంది నక్సలైట్ల లొంగుబాటుకు, శాంతిపథానికి దోహదం చేశాయి. వీరి



పేర్లతో ఆధార్, ఓటర్ ఐడీలు, బ్యాంకు ఖాతాల వంటివి ఏర్పాటుచేసి పీఎంఏవై కింద గృహాలు మంజూరు చేస్తున్నట్లు నారాయణపుర్ జిల్లా కలెక్టర్ ప్రతిష్ఠా మమగాయీ తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకొన్నాక తమ స్వస్థలాలకు తిరిగి వెళ్లి స్వయం ఉపాధితో ముందుకు సాగాలని వీరంతా ఎదురుచూస్తున్నారు.



విదర్భలో నేల నెమలి

ఈటీవీ భారత్: చారల తోక కలిగిన 'బార్ టెయిల్డ్ గాడ్విట్' (నేల నెమలి) పక్షి మహారాష్ట్రలోని అమరావతిలో తొలిసారిగా కనిపించింది. వన్యప్రాణి ఫొటోగ్రాఫర్ తుషార్ అంబేడ్కర్, మరో ముగ్గురు పక్షి వీక్షకులు జిల్లాలోని బోర్ డ్యాము వద్ద దీనిని గుర్తించారు. సైబీరియా, అలాస్కా, ఉత్తర ఆసియా ప్రాంతాలకు చెందిన ఈ పక్షి మహారాష్ట్రలోని కొంకణ్ తీరంలో శీతాకాలంలో కనిపిస్తుంది. విదర్భ ప్రాంతంలో కనిపించడం మాత్రం ఇదే తొలిసారి. విలక్షణమైన ఎర్రటి ఈకలు, పొడవాటి కాళ్లు, ముక్కుతో ఈ పక్షిని ఇట్టే గుర్తించవచ్చని పక్షి ప్రేమికుడు యాదవ్ తర్టే పాటిల్ తెలిపారు. 250 నుంచి 600 గ్రాముల బరువు ఉండే ఈ పక్షి ముక్కుతోనే మట్టిని తవ్వి కీటకాలను తింటుంది. అక్టోబరు - మార్చి మధ్యకాలంలో భారత్‌లోని తీరప్రాంతాల్లో విహరించే ఈ వలస పక్షి పది రోజుల వ్యవధిలో 11,000 నుంచి 12,000 కి.మీ.ల మేర తిరుగుతుందని పాటిల్ చెప్పారు.



బీట్‌రూట్‌తో రక్తప్రసరణ మెరుగు

రక్తప్రసరణ మెరుగవ్వాలంటే బీట్‌రూట్ తినండి. అందులో సహజ నైట్రేట్లు సమృద్ధిగా ఉంటాయి. అవి శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్‌గా మారి రక్తనాళాలపై ఒత్తిడి తగ్గించి వ్యాకోచించేలా చేస్తాయి. దీంతో రక్తప్రవాహం పెరిగి, రక్తపోటు తగ్గుతుంది.

– క్రిస్టైన్ జకోబిట్జ్, న్యూట్రిషన్ కోచ్

ఇండిగో సర్వీసుల్లో 10% కోత

- ప్రస్తుత సంక్షోభానికి ఆ సంస్థదే పూర్తి బాధ్యత
- కఠిన చర్యలు తప్పవు
- స్పష్టం చేసిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు



దిల్లీ: ఇండిగో విమాన సర్వీసుల్లో 10 శాతం కోత విధిస్తున్నామని పౌర విమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. దీనివల్ల ఆ సంస్థ సర్వీసులను స్థిరీకరించవచ్చని, రద్దులను తగ్గించవచ్చని తెలిపారు. ఈ నిబంధనకు కట్టుబడటంతోపాటు గతంలో మాదిరిగానే అన్ని గమ్య స్థానాలకూ విమానాలను సంస్థ నడుపుతుందని స్పష్టం చేశారు. ప్రస్తుత సంక్షోభానికి ఆ సంస్థదే పూర్తి బాధ్యతని, కఠిన చర్యలు తప్పవని, ఎంత పెద్ద సంస్థ అయినా ప్రణాళికా లోపం, నిబంధనలను అంగీకరించకపోవడం ద్వారా ప్రయాణికులను ఇబ్బంది పెడితే ఉపేక్షించబోమని తేల్చి చెప్పారు. ఇండిగో సంక్షోభంపై మంగళవారం ఆయన లోక్‌సభలో ప్రకటన చేశారు. అనంతరం సాయంత్రం ప్రత్యేకంగా ఒక ప్రకటన విడుదల చేశారు. పౌర విమానయాన రంగ భద్రత విషయంలో రాజీపడబోమని రామ్మోహన్ తేల్చి చెప్పారు. 'విమానాల షెడ్యూల్‌లో భారీ అంతరాయాలకు ఇండిగో బాధ్యత వహించాల్సిందే. ఆ సంస్థపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఆ సంస్థ అంతర్గత రోస్టరింగ్ వ్యవస్థలో లోపాలవల్ల భారీగా విమాన సర్వీసులు రద్దయ్యాయి' అని వివరించారు.

పోటీతత్వ వ్యవస్థను నిర్మిస్తాం

'విమానయాన రంగంలో మరింత పోటీతత్వాన్ని పెంపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ రంగంలో మరిన్ని సంస్థలు ప్రవేశించేలా మా విధానాలను అమలు చేస్తాం' అని రామ్మోహన్ తెలిపారు.

నివేదిక అందగానే చర్యలు

'ఇండిగో సంక్షోభంపై వెంటనే స్పందించాల్సిందిగా డీజీసీఏను ఆదేశించాం. విచారణ జరపాలని సూచించాం. సీఈవో, సీవోవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించాం. విచారణ నివేదిక రాగానే సంస్థపై కఠిన చర్యలు తీసుకుంటాం' అని మంత్రి వెల్లడించారు. మంత్రి ప్రకటనపై అసంతృప్తి వ్యక్తం చేసిన విపక్షాలు లోక్‌సభ నుంచి వాకౌట్ చేశాయి.

సీఈవోకు సమన్లు

ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్‌ను మంత్రిత్వ శాఖ కార్యాలయానికి వచ్చి వివరణ ఇవ్వాలని ఆదేశించామని మంత్రి రామ్మోహన్ తెలిపారు. ఈనెల 6వరకూ రద్దయిన విమానాల సమాచారాన్ని అందజేయాలని కోరామని వెల్లడించారు.

■ ఇండిగో విమాన సర్వీసుల్లో 5శాతం కోత విధిస్తూ మంగళవారం ఉదయం డీజీసీఏ ఆదేశాలిచ్చింది. సాయంత్రం మంత్రి చేసిన ప్రకటనలో 10శాతం కోత విధిస్తున్నట్లు ప్రకటించారు.

మెరుగుపడిన సర్వీసులు

ఈ నెల 5వ తేదీన ఇండిగో విమాన సర్వీసులు గణనీయంగా 706కు పడిపోయాయని, సోమవారానికి మెరుగుపడి 1,800కు చేరుకున్నాయని మంత్రి తెలిపారు. మంగళవారం మరింత మెరుగయ్యాయని వెల్లడించారు.

రూ.750 కోట్ల రిఫండ్

'రద్దయిన విమాన సర్వీసులకు సంబంధించిన రిఫండ్‌లను వెంటనే, కచ్చితంగా చెల్లించాలని ఇండిగోను ఆదేశించాం. ఇప్పటికే రూ.750 కోట్లు ప్రయాణికులకు అందాయి' అని రామ్మోహన్ నాయుడు వివరించారు.



తల్లి మృతదేహానికి స్ట్రెచర్ కోసం పూచీకత్తుగా భార్య, కుమారుడు

ఈటీవీ భారత్: బిహార్‌లోని నవాదా జిల్లాకు చెందిన అక్బర్‌పుర్ పీహెచ్‌సీలో చనిపోయిన తల్లి మృతదేహాన్ని ఇంటికి తరలించేందుకు స్ట్రెచర్ కోసం ఓ వ్యక్తి తన భార్య, కుమారుణ్ని పూచీకత్తుగా పెట్టాల్సి వచ్చింది. అంబులెన్సు ఏర్పాటుకు సిబ్బంది ససేమిరా అనడంతో బాధితునికి గత్యంతరం లేకపోయింది. పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న అజయ్ సావో తల్లి కేశరీ దేవి (75) ఆదివారం రాత్రి మృతిచెందారు. రాత్రి పది దాటడంతో కిలోమీటరు దూరాన ఉన్న ఇంటికి మృతదేహాన్ని తరలించడానికి అంబులెన్సు సమకూర్చాలని అజయ్ అభ్యర్థించినా సిబ్బంది తిరస్కరించారు. చివరకు ఇద్దరు వ్యక్తులను పూచీకత్తుగా పెడతామని చెప్పడంతో స్ట్రెచర్‌ను సమకూర్చారు. మృతదేహాన్ని ఇంటికి చేర్చాక, అజయ్ మళ్లీ వెనక్కు వచ్చి స్ట్రెచరు అప్పగించి భార్యను, కుమారుడిని పిలుచుకుపోయారు. ఈ ఉదంతంపై ప్రభుత్వం విచారణ కమిటీని ఏర్పాటు చేసింది.

బెల్జియం సుప్రీంకోర్టులో మెహుల్ చోక్సీకి ఎదురుదెబ్బ

దిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకును రూ.13 వేల కోట్ల మేర మోసగించిన కేసులో నిందితుడు, పరారీలో ఉన్న వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీకి బెల్జియం సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తనను అప్పగించాలన్న భారత దేశ అభ్యర్థనను సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం తిరస్కరించింది.

ఓటుచోరీ.. అతిపెద్ద దేశద్రోహం

- ప్రశ్నలు, డిమాండ్లతో గళమెత్తిన రాహుల్

దిల్లీ: ఓటుచోరీ అనేది అతిపెద్ద దేశద్రోహమని, ఎన్నికల సంఘంతో కలిసి భాజపా దానికి పాల్పడుతోందని లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి ఆరోపించారు. ఎన్నికల సంస్కరణలపై మంగళవారం లోక్‌సభలో ప్రత్యేక చర్చలో ఆయన పాల్గొన్నారు. దేశ మూలాలనే దెబ్బతీసేలా ఓటుచోరీ జరుగుతోందని, సంస్థాగత వ్యవస్థ మొత్తాన్ని ఆరెస్సెస్ టోకుగా గుప్పిట పట్టిందని ఆందోళన వ్యక్తంచేశారు. భారత ప్రజాస్వామ్యానికి భంగం కలిగేలా ఈసీని భాజపా వాడుకుంటోందని ఆరోపించారు. "ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఎన్నికల కమిషనర్ల (ఈసీల) ఎంపిక కమిటీ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)ని ఎందుకు తప్పించారు? ఎన్నికల కమిషనర్‌గా ఎవరు ఉండాలనేదానిపై ప్రధానికి, కేంద్ర హోంమంత్రికి అంత ఆసక్తి ఎందుకు? ఎన్నికల కమిషనర్లు తీసుకునే ఎలాంటి చర్యలకైనా భవిష్యత్తులో వారిని శిక్షించడానికి వీల్లేదని చట్టాన్ని ఎందుకు మార్చారు? అలాంటి రక్షణను కల్పించాల్సిన అవసరం ఏమొచ్చింది? ఎన్నికలు జరిగిన 45 రోజుల తర్వాత సీసీటీవీ ఫుటేజీని ధ్వంసం చేయవచ్చని చట్టంలో ఎందుకు మార్చారు?" అని ప్రశ్నించారు.



ఆ చట్టాన్ని మార్చండి

"ఎన్నికలకు నెల ముందు మెషీన్ రీడబుల్ నమూనాలో అన్ని పార్టీలకూ ఓటర్ల జాబితాలు ఇవ్వండి. సీసీటీవీ దృశ్యాలను భద్రపరచాల్సిన అవసరం లేదనే చట్టాన్ని వెనక్కి తీసుకోండి. ఈవీఎంల కూర్పును తనిఖీ చేసే అవకాశం మాకివ్వండి. ఏం కావాలంటే అది చేసుకునేందుకు ఎన్నికల కమిషనర్లకు అవకాశమిస్తున్న చట్టాన్ని మార్చండి" అని రాహుల్ డిమాండ్ చేశారు. 'సర్'ను నిర్వహించే చట్టబద్ధమైన హక్కు ఈసీకి లేదని కాంగ్రెస్ సభ్యుడు మనీశ్ తివారీ అన్నారు. చర్చలో సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్‌యాదవ్ పాల్గొంటూ.. ఈసీ నిష్పాక్షికంగా ఉన్నప్పుడే ఎన్నికల సంస్కరణలు సాధ్యమవుతాయని చెప్పారు. రాహుల్ ఆరోపణల్ని కేంద్రమంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్, భాజపా ఎంపీ నిశికాంత్ దుబె ఖండించారు. ఎన్నికలవ్యవస్థపై దాడిచేసే బదులు నిర్మాణాత్మక విమర్శలు చేయాలని వారితోపాటు తెదేపా, జేడీయూ సభ్యులు సూచించారు.

సోనియాగాంధీకి జన్మదిన శుభాకాంక్షల వెల్లువ

దిల్లీ: కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ మంగళవారం 79వ పడిలో అడుగుపెట్టారు. ఆమెకు ప్రధాని మోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సహా పలువురు నేతలు శుభాకాంక్షలు తెలియజేశారు. "సోనియాగాంధీకి జన్మదిన శుభాకాంక్షలు. ఆమె మంచి ఆరోగ్యంతో దీర్ఘకాలం జీవించాలని కోరుకుంటున్నా" అని ప్రధాని 'ఎక్స్'లో పేర్కొన్నారు. అణగారిన వర్గాల వారి హక్కుల కోసం దీర్ఘకాలంగా పోరాడుతున్న నాయకురాలంటూ సోనియాను ఖర్గే ప్రశంసించారు. ఆమె దార్శనిక నాయకత్వం కాంగ్రెస్‌కు మార్గనిర్దేశం చేయడంతో పాటు గ్రామీణ ఉపాధి హామీ, విద్యాహక్కు, సమాచార హక్కు, జాతీయ ఆహార భద్రత వంటి చట్టాల ద్వారా దేశాన్ని పరివర్తనం చెందించిందంటూ కాంగ్రెస్ పార్టీ 'ఎక్స్'లో పోస్టు పెట్టింది.



తన పుట్టిన రోజు సందర్భంగా కేక్ కోస్తున్న సోనియాగాంధీ. చిత్రంలో పార్టీ నేతలు ఖర్గే, రాహుల్, ప్రియాంక, కేసీ వేణుగోపాల్, ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ తదితరులు

గోవా నైట్ క్లబ్ యజమానులపై బ్లూ నోటీసు

- జారీ చేసిన ఇంటర్‌పోల్

దిల్లీ: గోవా నైట్ క్లబ్ 'బిర్చ్ బై రోమియో లేన్' ప్రమాదం కేసులో నిందితులైన యజమానులు సౌరభ్ లూథ్రా, గౌరవ్ లూథ్రాల కోసం ఇంటర్‌పోల్ బ్లూ నోటీసు జారీ చేసింది. ప్రమాదం జరిగిన వెంటనే థాయ్‌లాండ్‌లోని పుకెట్‌కు పరారైన వారిపై సీబీఐ విజ్ఞప్తి మేరకు అంతర్జాతీయ సంస్థ మంగళవారం ఈ నిర్ణయం తీసుకుంది. అంతకుముందు నిందితులపై బ్లూ నోటీసు జారీ చేయించాల్సిందిగా కోరుతూ సీబీఐకి గోవా పోలీసులు విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన సీబీఐ.. ఇంటర్‌పోల్‌ను సంప్రదించింది. నిందితుల గుర్తింపునకు సంబంధించిన అదనపు సమాచారం, లొకేషన్, కార్యకలాపాలను తెలుసుకోవడానికి ఈ బ్లూ నోటీసును జారీ చేస్తారు. విదేశాల్లోని నిందితులను అరెస్టు చేయడానికి సాధారణంగా రెడ్ కార్నర్ నోటీసు జారీ చేస్తారు. అయితే ఛార్జిషీటు దాఖలై, నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేశాకే ఈ నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది.

■ క్లబ్‌ను లూథ్రాలకు లీజుకిచ్చిన యజమానులైన అజయ్ గుప్తా, సురీందర్ కుమార్ ఖోస్లాలపై గోవా పోలీసులు లుకవుట్ నోటీసులు జారీ చేశారు. ఖోస్లా.. బ్రిటిష్ పౌరుడు. అయితే మంగళవారం సాయంత్రానికి అజయ్ గుప్తాను దిల్లీలో గోవా పోలీసులు అరెస్టు చేశారు.

■ వగాటర్ ప్రాంతంలో లూథ్రా సోదరులు అక్రమంగా నిర్మించిన మరో క్లబ్ 'రోమియో లేన్' బీచ్ షేక్‌ను మంగళవారం అధికారులు కూల్చేశారు. గత ఏడాది ఈ క్లబ్‌ను కూల్చేయగా లూథ్రా సోదరులు మళ్లీ నిర్మించినట్లు తెలిసింది.



అగ్నిప్రమాదానికి గురైన నైట్ క్లబ్ వద్ద శిథిలాల తొలగింపు

■ లూథ్రా సోదరులను భారత్‌కు రప్పించేందుకు చర్యలు చేపట్టామని డీఐజీ వర్షా శర్మ తెలిపారు.

■ నైట్ క్లబ్ ప్రమాదం నేపథ్యంలో అన్ని క్లబ్‌లలో అగ్నిమాపకశాఖ అధికారులు తనిఖీలు చేయాలనే ఆదేశాలు జారీ అయ్యాయి.

■ బిర్చ్ బై రోమియో లేన్ నైట్ క్లబ్‌కు అర్పోరా గ్రామ సర్పంచి ఎన్వోసీ ఇచ్చినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది. విద్యుత్తు, వాటర్ కనెక్షన్లకు, మరమ్మతులకు అనుమతి ఇవ్వడంతో పాటు వాణిజ్య లైసెన్సునూ ఆయనే ఇచ్చారని వివరించింది. 2024 మార్చిలోనే వాణిజ్య లైసెన్సు గడువు తీరినా క్లబ్ కొనసాగుతున్నట్లు తెలిపింది.

20 ఏళ్లుగా న్యాయపోరాటం

బిర్చ్ బై రోమియో లేన్ నైట్ క్లబ్ అక్రమాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. క్లబ్ అక్రమాలను తాను ఎప్పుడో బయటపెట్టానని దాని భూయజమాని ప్రదీప్ ఘడీ అమోంకర్ తెలిపారు. క్లబ్ యజమానులపై తాను 20 ఏళ్లుగా న్యాయ పోరాటం చేస్తున్నానని వెల్లడించారు. 1994లో అర్పోరా గ్రామంలో తాను రెండు ప్లాట్లను కొన్నానని, 2004లో సురీందర్ కుమార్ ఖోస్లాతో క్లబ్ ఏర్పాటుకు విక్రయ ఒప్పందం చేసుకున్నానని తెలిపారు. అతడు డబ్బు చెల్లించకపోవడంతో ఆ ఒప్పందాన్ని రద్దు చేసుకున్నానని, ఆ తర్వాత ఖోస్లా నుంచి క్లబ్‌ను సౌరభ్, గౌరవ్‌లు తీసుకున్నారని వివరించారు. అయితే అప్పటి నుంచే తాను క్లబ్ అక్రమాలపై ఫిర్యాదులు చేస్తూ వస్తున్నానని వెల్లడించారు. ఖోస్లా అక్రమాలపై 20 ఏళ్లుగా పోరాటం చేస్తున్నానని తెలిపారు.

■ ప్రమాదం జరిగిన నైట్ క్లబ్‌లో డ్యాన్సర్‌గా పని చేస్తున్న కజకిస్థాన్ జాతీయురాలు క్రిస్టినాకు బిజినెస్ వీసా లేదు. క్లబ్‌లో ఆమె బెల్లీ డ్యాన్స్ చేసే సమయంలోనే ఈ ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఆమె బిజినెస్ వీసాకు దరఖాస్తు చేసుకున్నా అధికారులు ఇంకా జారీ చేయలేదని పోలీసులు తెలిపారు.

ఏ చట్టమూ పౌరులకు భారం కాకూడదు

- ప్రజల జీవితాలను సులభతరం చేయడమే ప్రభుత్వ లక్ష్యం
- ఎన్డీయే ఎంపీల సమావేశంలో ప్రధాని మోదీ

దిల్లీ: ప్రజల జీవనాన్ని సులభతరం చేయడమే తమ ప్రభుత్వ ప్రాధాన్యమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఏ చట్టం కూడా పౌరులకు భారం కాకూడదని, చట్ట నిబంధనలన్నీ వారికి అనుకూలంగా ఉండాలని స్పష్టంచేశారు. మంగళవారం ఆయన ఇక్కడ పార్లమెంట్ హౌస్ సముదాయంలో ఎన్డీయే ఎంపీల సమావేశంలో మాట్లాడారు. మూడో విడత తమ ప్రభుత్వంలో స్పష్టమైన ఉద్దేశంతో వేగవంతంగా సంస్కరణలు చేపడుతున్నామని, ప్రస్తుతం మన దేశం పూర్తిస్థాయి సంస్కరణల దశ (రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్)లో ఉందని చెప్పారు. సంస్కరణలన్నీ కూడా ఆర్థిక, ఆదాయ దృష్టి పైనే కాకుండా పౌర కేంద్రీకృతంగా ఉంటున్నాయని వివరించారు. నిత్య జీవితంలో ప్రజలు ఎదుర్కొంటున్న సవాళ్లను తొలగించి, వారు సంపూర్ణంగా ఎదగాలనేదే తమ లక్ష్యమన్నారు. తమ పరిధిలో సామాన్యులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎంపీలందరూ చొరవ తీసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని, తద్వారా వాటిని పరిష్కరించేందుకు సర్కారు కృషి చేస్తుందని మోదీ చెప్పారు. 30-40 పేజీల దరఖాస్తుల విధానానికి, పదేపదే సమాచార సేకరణ సంస్కృతికి ముగింపు పలికి, ప్రజల ఇళ్ల వద్దకే సేవలు అందించాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. ఇటీవల బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే ఘన విజయం సాధించడంతో ఈ సమావేశం ప్రారంభానికి ముందు మోదీని కూటమి నేతలు సత్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డాతో పాటు జేడీయూ నేత సంజయ్ ఝా, రాష్ట్రీయ లోక్ మోర్చా అధ్యక్షుడు ఉపేంద్ర కుశ్వాహ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సమావేశ వివరాలను పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు విలేకర్లకు వెల్లడించారు. "చట్టసభ సభ్యులకు ప్రధాని చక్కటి మార్గనిర్దేశం చేశారు. చట్ట నిబంధనలు వ్యవస్థను అభివృద్ధి చేసేలా ఉండాలే తప్ప, ప్రజలను వేధించేలా ఉండకూడదని ఆయన స్పష్టం చేశారు. మూడోసారి అధికారం చేపట్టిన ఎన్డీయే ప్రభుత్వంలో రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్ కీలక అంశమన్న విషయాన్ని ఆయన నొక్కిచెప్పారు. ఇప్పటికే రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్ ముందుకు కదిలింది. ఇక ఇది ఆగదు. ప్రజల జీవితాలను ఇది మారుస్తుంది" అని కిరణ్ రిజిజు పేర్కొన్నారు.



ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని మోదీని సత్కరిస్తున్న నేతలు. చిత్రంలో కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా, అమిత్ షా తదితరులు



జకార్తాలో అగ్నిప్రమాదానికి గురైన భవనం

జకార్తాలో అగ్నిప్రమాదం.. 22 మంది మృతి

జకార్తా: ఇండోనేసియా రాజధాని నగరమైన జకార్తాలో మంగళవారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఏడంతస్తుల భవనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో వాటిలో చిక్కుకొని 22 మంది మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అగ్నికీలలు సమీప భవనాలకు వ్యాపించడంతో అక్కడ ఉంటున్నవారిని ఖాళీ చేయించి.. సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు వెల్లడించారు. భవనంలోని మొదటి అంతస్తులో ఉన్న ఏరియల్ సర్వే డ్రోన్ల కంపెనీ గోదాంలో బ్యాటరీ పేలడంతో మంటలు అంటుకున్నట్లు తెలిపారు. డ్రోన్ బ్యాటరీలో షార్ట్ సర్క్యూట్ లేదా థర్మల్ వైఫల్యం ప్రమాదానికి కారణమై ఉండవచ్చని భావిస్తున్నారు. మృతుల్లో ఓ గర్భిణి సహా 15 మంది మహిళలు ఉన్నారు.

'పౌరసత్వానికి ముందే ఓటరుగా నమోదు' కేసులో సోనియా గాంధీకి దిల్లీ కోర్టు నోటీసు

దిల్లీ: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియా గాంధీకి దిల్లీ కోర్టు నోటీసు జారీ చేసింది. భారత పౌరసత్వం రాక ముందే ఆమె పేరును ఓటరు జాబితాలో చేర్చారని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్‌పై దిల్లీలోని రౌజ్ అవెన్యూ సెషన్స్ కోర్టులో మంగళవారం విచారణ జరిగింది. అనంతరం స్పెషల్ జడ్జి విశాల్ గొగ్నే నోటీసు జారీ చేశారు. పిటిషనర్ తరఫు న్యాయవాది పవన్ నారంగ్ వాదనలు వినిపిస్తూ... సోనియాగాంధీకి పౌరసత్వం రాకముందే ఆమె పేరును ఓటరు జాబితాలో చేర్చారని, అందుకోసం అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. దీనిపై పునఃపరిశీలన అవసరమన్నారు. 1980లో ఓటర్ల జాబితాలో పేరు కోసం కొన్ని నకిలీ పత్రాలను సృష్టించి ఉంటారనే అనుమానం వ్యక్తం చేశారు. ఆ తర్వాత ఆమె పేరును తొలగించి.. 1983లో తిరిగి చేర్చారన్నారు. ఈ రెండు కూడా సోనియాకు పౌరసత్వం రాకముందే జరిగాయన్నారు. కొన్ని ఆధారాలు సమర్పించారు. వీటిని పరిశీలించిన కోర్టు.. వివరణ ఇవ్వాలని సోనియాతో పాటు దిల్లీ పోలీసులకు కూడా నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ వచ్చే ఏడాది జనవరి 6న జరగనుంది.

'బంకిం దా' అనడం బెంగాల్‌కు అవమానం

- వందేమాతరం గేయ రచయితకు ప్రధాని కనీస గౌరవం ఇవ్వలేదు
- మమతా బెనర్జీ మండిపాటు

కూచ్ బిహార్: వందేమాతరం గేయ రచయిత బంకించంద్ర ఛటర్జీని ప్రధాని మోదీ పార్లమెంటులో సోమవారం 'బంకిం దా' అని సంబోధించడాన్ని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తీవ్రంగా తప్పుబట్టారు. ప్రధాని సంబోధన బెంగాల్‌కు అవమానకరమని పేర్కొన్నారు. ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కూచ్ బిహార్ జిల్లాలో మంగళవారం ఓ బహిరంగ ర్యాలీలో మమత ఈ విషయంపై మాట్లాడారు. బెంగాల్‌కు చెందిన సాంస్కృతిక దిగ్గజాలు, స్వాతంత్ర్య సమరయోధులను భాజపా పదేపదే అప్రతిష్ఠపాలు చేస్తోందని ఆరోపించారు. బంకించంద్ర ఛటర్జీకి మోదీ కనీస గౌరవం ఇవ్వలేదంటూ మండిపడ్డారు. మరోవైపు- బంకించంద్ర ఛటర్జీ, రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి బెంగాల్ దిగ్గజాలను భాజపా అవమానిస్తోందని ఆరోపిస్తూ పార్లమెంటు సెంట్రల్ హాలులో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు మంగళవారం మౌన ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేశారు. 'వందేమాతరం'పై లోక్‌సభలో సోమవారం చర్చ సందర్భంగా బంకిం చంద్ర ఛటర్జీని ప్రధాని తొలుత 'బంకిం దా' అని సంబోధించారు. దానిపై తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సౌగతారాయ్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో.. తర్వాత 'బంకిం బాబు' అని సంబోధించారు.



ఓటరు జాబితా రాగానే నోటిఫికేషన్ ఇస్తారు

బెంగాల్‌లో ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను పూర్తిచేసి ఫిబ్రవరిలో తుది ఓటర్ల జాబితాను విడుదల చేసిన మరుసటి రోజే ఎన్నికల సంఘం (ఈసీ) అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ ఇస్తుందని మమతా బెనర్జీ జోస్యం చెప్పారు. తుది ఓటర్ల జాబితాపై ఎవరూ న్యాయస్థానాలను ఆశ్రయించే అవకాశం లేకుండా చేసేందుకే అలా చేస్తుందని పేర్కొన్నారు. రాస్ మేలాలో ఓ బహిరంగ సభలో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.

వివాదాలను తగ్గించాలి... సృష్టించరాదు

అలహాబాద్ హైకోర్టు ఉత్తర్వులను కొట్టివేస్తూ సుప్రీంకోర్టు వ్యాఖ్య

దిల్లీ: ఒక గ్రామ రెవెన్యూ పటానికి సంబంధించిన వివాదంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. వివాదాలను తగ్గించాలి కాని కొత్త వాటిని సృష్టించేలా ఉండరాదని అలహాబాద్ హైకోర్టుకు జస్టిస్ రాజేశ్ బిందల్, జస్టిస్ మన్మోహన్ ధర్మాసనం సూచించింది. రెవెన్యూ పటంలోని తప్పును సరిదిద్దాలంటూ వచ్చిన అభ్యర్థనను పునఃపరిశీలించాలంటూ జిల్లా అధికారులకు హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వును కొట్టివేసింది. గ్రామంలో భూమికి సంబంధించిన రెవెన్యూ మ్యాప్‌ను సవరించాలన్న ఓ వ్యక్తి అభ్యర్థనను కలెక్టర్ తోసిపుచ్చారు. అదనపు కమిషనర్ వద్దకు వెళ్లినా ఆయన కూడా తిరస్కరించారు. 17 ఏళ్ల తర్వాత మళ్లీ అదే అభ్యర్థన రాగా కలెక్టర్ నుంచి అదే సమాధానం ఎదురైంది. దీనిపై ఆ వ్యక్తి హైకోర్టుకు వెళ్లగా.. ఆ అభ్యర్థనను పరిశీలించి చర్యలు తీసుకోవాలని న్యాయస్థానం ఆదేశించింది. దీనిపై సుప్రీంకోర్టులో అప్పీలు దాఖలు కాగా.. తాజా నిర్ణయం వెలువడింది.

బంగ్లాదేశ్ చీర, అఫ్గాన్ పెయింటింగ్‌లకు యునెస్కో గుర్తింపు

దిల్లీ: బంగ్లాదేశ్‌కు చెందిన తంగైల్ చీర నేత కళతోపాటు అఫ్గాన్‌కు చెందిన మినియేచర్ పెయింటింగ్‌లోని బేజాద్ శైలికి యునెస్కో వారసత్వ గుర్తింపు లభించింది. వీటితోపాటు బిష్త్ (పురుషుల గౌను) తయారీ, నైపుణ్యానికి, పాకిస్థాన్‌లో అంతరిస్తున్న పురాతన జానపద సంగీత పరికరం బోరీండో, దాంతో ఆలపించే జానపద గీతాలు, పరాగ్వేకు చెందిన పురాతన సిరామిక్ పనితనం, కెన్యాలోని దైదా కమ్యూనిటీకి చెందిన మ్వాజిందికా ఆధ్యాత్మిక నృత్యం.. అంతర్జాతీయ గుర్తింపును దక్కించుకున్నాయి. ఇంకా వియత్నాంకు చెందిన డాంగ్ హో జానపద చెక్కబ్లాకుల ప్రింటింగ్ నైపుణ్యం.. తయారీ, ఫిలిప్పీన్స్‌లోని బొహోల్ ద్వీపానికి చెందిన సముద్రపు ఉప్పుతో తయారుచేసే ఆసిన్ టిబోక్ తయారీ విధానం, పనామాలోని క్వించా ఇంటి నిర్మాణం, జుంటా డి ఎంబారా, పోర్చుగల్‌లోని మోలిసీరో బోటు కార్పెంటరీ కళ, ఉజ్బెకిస్థాన్‌లోని కోబిజ్ కళ, ఆడే విధానం ఈ జాబితాలో చోటు సంపాదించాయి. వీటిని రక్షించుకోవాల్సి ఉందని యునెస్కో ప్రతినిధులు మంగళవారం స్పష్టం చేశారు. యునెస్కో 20వ సదస్సు ఈ నెల 13 వరకూ దిల్లీలోని ఎర్రకోటలో జరుగుతోంది.

■ 80 దేశాలు సమర్పించిన 67 ప్రతిపాదనలను యునెస్కో కమిటీ పరిశీలిస్తోంది.

■ ఈ సదస్సులో పాల్గొనేందుకు వందల మంది ప్రతినిధులు వచ్చారు.

■ ఎయిరిండియా 1971లో సమకూర్చుకున్న బీ747-237బీ (వీటీ-ఈబీఈ) విమానాన్ని సదస్సు సందర్భంగా ప్రదర్శనకు ఉంచారు. దీనికి ఎంపరర్ షాజహాన్ అని పేరు పెట్టారు.

■ యునెస్కో గుర్తించిన బిష్త్‌ను ఖతార్, బహ్రెయిన్, ఇరాక్, జోర్డాన్, కువైట్, ఒమన్, సౌదీ అరేబియా, సిరియన్ అరబ్ రిపబ్లిక్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రతిపాదించాయి.

ఈనాడు

విజయవాడ 10-12-2025 బుధవారం సిటీ సంపుటి 52 . సంచిక 120


THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 18 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

అమరావతిలో క్రియేటివ్ ల్యాండ్ ప్రాజెక్టు

- రెండేళ్లలో పనులు ప్రారంభించేందుకు అంగీకారం
- క్వాంటమ్ పరిశోధన కేంద్రం ఏర్పాటుపై పరిశీలించాలి
- అమెరికాలో పలు సంస్థల ప్రతినిధులతో మంత్రి లోకేశ్ భేటీలు



కాన్వా సంస్థ చీఫ్ కస్టమర్ సక్సెస్ అధికారి రోబ్ గిగిలియోతో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్



అమరావతిలో ఏర్పాటు చేయనున్న క్రియేటివ్ ల్యాండ్ ప్రాజెక్టు గురించి మంత్రి లోకేశ్‌కు వివరిస్తున్న క్రియేటివ్ ల్యాండ్ ఆసియా ప్రతినిధి

ఈనాడు, అమరావతి: పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా అమెరికాలో పర్యటిస్తున్న మంత్రి లోకేశ్ పలు సంస్థల ప్రతినిధులతో వరుస భేటీలు నిర్వహించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వారికి వివరించారు. సంస్థలకు నిర్దేశిత వ్యవధిలో ప్రోత్సాహకాలు చెల్లించేందుకు వీలుగా ఎస్క్రో ఖాతా ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. గతంలో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు క్రియేటివ్ ల్యాండ్ ప్రాజెక్టు-అమరావతిని సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలని క్రియేటివ్ ల్యాండ్ ఆసియా ఫౌండర్ సజన్‌రాజ్ కురుప్, సీనియర్ పార్ట్‌నర్ ఇయాంగ్ కాపింగ్, అమెరికన్ ఫిల్మ్ డైరెక్టర్ షిక్ రసెల్‌ను మంత్రి లోకేశ్ కోరారు. 'అమరావతిని ఏఐ ఆధారిత వర్చువల్ స్టూడియోలు, ఏఆర్/వీఆర్ థీమ్ పార్కులతో అత్యాధునిక ట్రాన్స్‌మీడియా నగరంగా తీర్చిదిద్దడంలో సహకరించాలి' అని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వంతో గత ఏడాది మేలో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు రెండేళ్లలో ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభిస్తామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తయితే రూ.10,000 కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని.. తద్వారా 1.5 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని వివరించారు.

క్రియేటివ్ ల్యాండ్ ఆసియాతో కలిసి పనిచేయాలి

అమరావతిలో శిక్షణ, నైపుణ్యాల అభివృద్ధికి క్రియేటివ్ ల్యాండ్ ఆసియాతో కలిసి పనిచేయాలని కాన్వా సంస్థను మంత్రి లోకేశ్ కోరారు. ఆ సంస్థ చీఫ్ కస్టమర్ సక్సెస్ అధికారి రోబ్ గిగిలియో, ఎడ్యుకేషన్ అండ్ పబ్లిక్ సెక్టార్ విభాగాధిపతి జాసన్ విల్ మాట్‌లతో భేటీ అయ్యారు. 190 దేశాల్లో కాన్వా సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తోందని సంస్థ ప్రతినిధులు మంత్రికి తెలిపారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై తమ సంస్థ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు.

ఇన్నోవేషన్ అకాడమీ ఏర్పాటుకు సహకరించాలి


అమరావతిలో ఆటో డెస్క్ డిజైన్, ఇన్నోవేషన్ అకాడమీని ఏర్పాటు చేయాలని ఆటో డెస్క్ సంస్థ ముఖ్య టెక్నాలజిస్టు దేవ్ పటేల్, సీనియర్ డైరెక్టర్ అల్లిసన్ రోస్‌ను లోకేశ్ కోరారు. 'బీఐఎం సాంకేతికతతో అమరావతి రూపుదిద్దుకుంటోంది. డిజిటల్ ఫ్యాబ్రికేషన్, సుస్థిర డిజైన్‌లో శిక్షణ, పరిశోధనలకు అవకాశం ఏర్పడుతుంది. తీర ప్రాంతంలో తుపానులు తట్టుకునేలా భవనాల నిర్మాణానికి మాస్టర్ ప్లాన్‌లను ఆటో డెస్క్ సీఎఫ్‌డీ (కంప్యూటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్) సాంకేతిక సహకారాన్ని అందించాలి' అని పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఆటో డెస్క్ ప్రతినిధులు తెలిపారు.

క్వాంటమ్ పరిశోధన కేంద్రం ఏర్పాటుకు అవకాశం

అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్ పరిశోధన విభాగాన్ని ఏర్పాటు చేయాలని రిగెట్టి కంప్యూటింగ్ సంస్థకు మంత్రి లోకేశ్ ప్రతిపాదించారు. ఆ సంస్థ చీఫ్ టెక్నాలజీ అధికారి డేవిడ్ రివాస్‌తో భేటీ అయ్యారు. 'ఏపీ ప్రభుత్వ డిజిటల్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో రిగెట్టి క్లౌడ్ క్వాంటమ్ వ్యవస్థలను అనుసంధానించడం ద్వారా దేశంలో మొదటి క్వాంటమ్ రెడీ రాష్ట్రంగా నిలిచేందుకు సహకరించండి' అని లోకేశ్ కోరారు.

ఆధునిక సాంకేతికత అందిపుచ్చుకున్నాం లోపలి పేజీలో

నేటి నుంచి రోజుకు రెండు విడతల్లో టెట్



ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను బుధవారం నుంచి ఈ నెల 21 వరకు రోజూ రెండు విడతల్లో నిర్వహించనున్నారు. ఉదయం 9.30 నుంచి 12 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 వరకు ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహిస్తారు. మొత్తం 2,71,692 మంది దరఖాస్తు చేయగా మంగళవారం సాయంత్రం వరకు 96.25% మంది హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు. రాష్ట్రంలో 133 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అభ్యర్థుల దరఖాస్తులో పేరు, జెండర్, పుట్టిన తేదీ లాంటి వాటిలో తప్పులు ఉంటే పరీక్షా కేంద్రంలో తగిన ఆధారాలు సమర్పించి నామినల్ రోల్స్‌లో సరిదిద్దుకునే అవకాశం కల్పించారు. స్క్రైబ్ దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు జిల్లా విద్యాధికారి ద్వారా సహాయకులను కేటాయిస్తారు. అభ్యర్థులకు ఎలాంటి సందేహాలున్నా డీఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాన్ని సంప్రదించాలని టెట్ కన్వీనర్ కృష్ణారెడ్డి సూచించారు.

కాగ్నిజెంట్‌కు 12న శ్రీకారం



కాగ్నిజెంట్‌కు భూమిపూజ జరగనున్న ప్రాంతం

- విశాఖలో ఆ సంస్థ శాశ్వత క్యాంపస్‌కు అదేరోజు సీఎం చంద్రబాబు శంకుస్థాపన
- రూ.1,583 కోట్ల పెట్టుబడులు.. 8,000 మందికి ఉపాధి



ఈనాడు-అమరావతి: అంతర్జాతీయ దిగ్గజ ఐటీ సంస్థ కాగ్నిజెంట్ టెక్నాలజీస్ విశాఖలో ప్రస్థానానికి శ్రీకారం చుడుతోంది. ఈ నెల 12న తాత్కాలిక క్యాంపస్‌లో కార్యకలాపాలు ప్రారంభించడంతో పాటు శాశ్వత క్యాంపస్ నిర్మాణానికి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేయనున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత దిగ్గజ ఐటీ సంస్థలను రాష్ట్రానికి తెచ్చే ప్రయత్నం చేసింది. ఐటీలో పెట్టుబడులను ఆకర్షించడంలో భాగంగా కాపులుప్పాడ ఐటీ హిల్స్‌లో 21.31 ఎకరాలను కాగ్నిజెంట్ సంస్థకు లీజుపై కేటాయించింది. ఆ సంస్థ ఇందులో ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఏఐ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఐటీ క్యాంపస్‌ను మూడుదశల్లో నిర్మించనుంది. మొదటిదశ 2029 నాటికి పూర్తి చేయాలన్నది లక్ష్యం.

తాత్కాలిక క్యాంపస్ నుంచి..: విశాఖలో ఐటీ క్యాంపస్ ఏర్పాటుకు కాగ్నిజెంట్ రూ.1,583 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. దీని ద్వారా సుమారు 8,000 మందికి ఉపాధి అవకాశాలు కల్పించనుంది. శాశ్వత క్యాంపస్ నిర్మాణం పూర్తయ్యేవరకు ప్రత్యామ్నాయంగా మధురవాడ ఐటీ జోన్‌లో ప్లగ్ అండ్ ప్లే విధానంలో అందుబాటులో ఉన్న స్పేస్‌లో కార్యకలాపాలు ప్రారంభించాలని నిర్ణయించింది. ఈ నెల 12న 800 సీటింగ్ కెపాసిటీతో కార్యకలాపాలు ప్రారంభించనుంది. దీన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించడంతో పాటు అదే రోజు ప్రధాన క్యాంపస్ భవనానికి శంకుస్థాపన చేయనున్నారు. విశాఖలో కాగ్నిజెంట్ కార్యకలాపాలు ప్రారంభించడం వల్ల సుమారు రూ.15,000 కోట్ల ఆర్థిక కార్యకలాపాలకు అవకాశం ఏర్పడుతుందని అంచనా.

రాజధానిలో నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ

- స్థలం కేటాయించిన ఏపీ ప్రభుత్వం
- త్వరలోనే తాత్కాలిక భవనాల్లో క్యాంపస్ ప్రారంభం
- 'ఈనాడు'కు వెల్లడించిన ఎన్‌ఎఫ్‌ఎస్‌యూ వీసీ జేఎం వ్యాస్
- గాంధీనగర్ నేషనల్ ఫోరెన్సిక్ యూనివర్సిటీలో ప్రత్యేకతలెన్నో



గాంధీనగర్‌లోని నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ

గుజరాత్ నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి: ప్రపంచంలోనే ఏకైక ఫోరెన్సిక్ విశ్వవిద్యాలయమైన గుజరాత్‌లోని నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ (ఎన్‌ఎఫ్‌ఎస్‌యూ) ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో క్యాంపస్ ఏర్పాటు చేయనుంది. ఏపీ ప్రభుత్వం అందుకు అవసరమైన స్థలాన్ని కేటాయించగా విశ్వవిద్యాలయం బృందం దాన్ని పరిశీలించి అంగీకారం తెలిపింది. త్వరలో తాత్కాలిక భవనాల్లో క్యాంపస్ ప్రారంభించి, తర్వాత శాశ్వత భవనాలు నిర్మించేందుకు సిద్ధమవుతోంది. ఎన్‌ఎఫ్‌ఎస్‌యూ ఉపకులపతి జేఎం వ్యాస్ ఈ వివరాలను 'ఈనాడు' ప్రతినిధికి వెల్లడించారు. గుజరాత్ పర్యటనలో భాగంగా. ఈనాడు ప్రతినిధి మంగళవారం గాంధీనగర్‌లోని నేషనల్ ఫోరెన్సిక్ యూనివర్సిటీని సందర్శించారు. దాని ప్రత్యేకతలు, విశేషాలివీ...

130కి పైగా సంస్థలతో అనుసంధానం

నేరాల వెనుకనున్న నిజాలు బయటపెట్టటం, న్యాయవ్యవస్థకు కావాల్సిన సాంకేతిక సాక్ష్యాలు అందించటంలో ఫోరెన్సిక్ పాత్ర అత్యంత కీలకం. అలాంటి ఫోరెన్సిక్ సైన్స్‌లో సమగ్ర అధ్యయనానికి ప్రపంచంలోనే తొలిసారిగా ఏర్పాటైన విశ్వవిద్యాలయంగా గుజరాత్‌లోని నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ (ఎన్‌ఎఫ్‌ఎస్‌యూ) గుర్తింపు పొందింది. 2009లో గుజరాత్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ పేరుతో గాంధీనగర్‌లో దీన్ని ఏర్పాటు చేశారు. 2020లో దీన్ని కేంద్ర ప్రభుత్వం నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీగా తీర్చిదిద్దింది. ఎన్‌ఎఫ్‌ఎస్‌యూకు అనుబంధంగా దేశంలో 15 క్యాంపస్‌లు, ఆఫ్రికాలోని ఉగాండాలో మరో క్యాంపస్ కొనసాగుతున్నాయి. అంతర్జాతీయంగా ఇంటర్‌పోల్ గ్లోబల్ నెట్‌వర్క్ సహా 130కి పైగా సంస్థలతో ఈ వర్సిటీ అనుసంధానమైంది.


ఇవీ లక్ష్యాలు

ఫోరెన్సిక్ సైన్స్, క్రైమ్ ఇన్వెస్టిగేషన్ సంబంధిత విభాగాల్లో సత్ఫలితాలు సాధించడం, అత్యున్నత నైపుణ్యాలున్న వారిని తయారు చేయటం, ప్రపంచవ్యాప్తంగా ఫోరెన్సిక్ నిపుణుల కొరత తీర్చటం, ఫోరెన్సిక్ సైన్స్, క్రైమ్ ఇన్వెస్టిగేషన్, సెక్యూరిటీ, బిహేవియరల్ సైన్స్, క్రిమినాలజీలో పరిశోధనలు, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నత విద్యను అందించటం తదితర లక్ష్యాలతో ఇది ఏర్పాటైంది.

70కి పైగా కోర్సులు

ఈ విశ్వవిద్యాలయం ప్రస్తుతం 70 కంటే ఎక్కువ పీజీ, ఇంటిగ్రేటెడ్ కోర్సులు అందిస్తోంది. పోలీసు, న్యాయ వ్యవస్థ, సాయుధ దళాలు, అకడమిక్స్, ఫైనాన్స్, బ్యాంకింగ్ తదితర రంగాల అధికారులకు స్వల్పకాలిక శిక్షణ ఇస్తోంది. 90 దేశాలకు చెందిన పోలీసులు ఇక్కడ శిక్షణ పొందారు. దేశంలోని 3 వేల మంది పోలీసులకు సైబర్ భద్రతలో శిక్షణ ఇచ్చి సైబర్ కమాండోలుగా తీర్చిదిద్దింది. ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరాలకు ప్రభుత్వాలూ బాధితులుగా మారుతున్నాయి. సైబర్ మోసాల కట్టడి అత్యంత ప్రాధాన్యంగా మారిన నేపథ్యంలో ఎన్‌ఎఫ్‌ఎస్‌యూ.. నిపుణులకు శిక్షణ ఇస్తోంది. విద్యార్థులకు సైబర్- ఫోరెన్సిక్స్‌లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాల్లో శిక్షణ ఇస్తోంది.

రూ.100కే వారసత్వ భూముల రిజిస్ట్రేషన్ ప్రారంభం



ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వారసత్వ భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మంగళవారం నుంచి మొదలైంది. దీనికి అనుగుణంగా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసి అందుబాటులోకి తెచ్చారు. మంగళవారం కొన్నిచోట్ల రిజిస్ట్రేషన్లు జరిగాయని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఆస్తుల రిజిస్ట్రేషన్ విలువ రూ.10 లక్షల లోపు ఉంటే రూ.100 చొప్పున చెల్లించాలి. ఆస్తుల రిజిస్ట్రేషన్ విలువ రూ.10 లక్షలు మించితే రూ.1,000 నిర్ణయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా చిన్న, సన్నకారు రైతులకు ఊరట లభించింది.



రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతులమీదుగా పురస్కారాలు అందుకుంటున్న డి.శివమ్మ ★ పి.విజయలక్ష్మి ★ గోర్సా సంతోష్

జాతీయ హస్తకళా పురస్కారాలు అందుకున్న ఏపీ కళాకారులు

ఈనాడు, దిల్లీ: హస్తకళల్లో విశేష ప్రతిభ చూపుతున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు కళాకారులను కేంద్ర జౌళి శాఖ జాతీయ అవార్డులతో సత్కరించింది. మంగళవారం ఇక్కడి విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కళాకారులకు అవార్డులు ప్రదానం చేసి, అభినందించారు. అవార్డులు అందుకున్న వారిలో శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మండలం నిమ్మలకుంట గ్రామానికి చెందిన తోలుబొమ్మల కళాకారిణి డి.శివమ్మ, అనకాపల్లి జిల్లా యలమంచిలి మండలం ఏటికొప్పాకకు చెందిన ఏటికొప్పాక బొమ్మల తయారీ కళాకారుడు గోర్సా సంతోష్, తిరుపతి జిల్లా వెంకటగిరి మండలం కుప్పం గ్రామానికి చెందిన కళంకారి కళాకారిణి పి.విజయలక్ష్మి ఉన్నారు. డి.శివమ్మ, పి.విజయలక్ష్మిలు 2023 సంవత్సరానికి 'శిల్పగురు అవార్డు', 'నేషనల్ హాండీక్రాఫ్ట్ అవార్డు' సొంతం చేసుకోగా, సంతోష్ 2024 సంవత్సరానికి జాతీయ అవార్డు అందుకున్నారు. అవార్డుల ప్రదానోత్సవంలో కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ పాల్గొన్నారు.

★ కార్యక్రమంలో 12 శిల్పగురు, 36 జాతీయ, 2 డిజైన్ అండ్ ఇన్నోవేషన్ అవార్డులను రాష్ట్రపతి ప్రదానం చేశారు.

స్క్రబ్‌టైఫస్‌పై అధ్యయనానికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్

- వైద్యారోగ్య శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: స్క్రబ్‌టైఫస్‌పై అధ్యయనం చేసి, భవిష్యత్తులో దాన్ని పూర్తి స్థాయిలో నివారించేందుకు జాతీయ స్థాయి వైద్య నిపుణులతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. స్క్రబ్‌టైఫస్ కేసుల తీవ్రత, బాధితులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. చంద్రబాబు మాట్లాడుతూ.. "ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఇచ్చే నివేదిక ఆధారంగా స్క్రబ్‌టైఫస్‌ను సమర్థంగా అరికట్టేలా చర్యలు తీసుకోవాలి. వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృత స్థాయిలో ప్రచారం చేయాలి. అన్ని శాఖల సమన్వయంతో సీజనల్ వ్యాధులు సున్నా స్థాయికి తీసుకురావాలి. అందరూ కలిసి పని చేస్తే ఇది సాధ్యం అవుతుంది. సమాజంలో అతిపెద్ద జబ్బు అపరిశుభ్రతే. దాన్ని దూరం చేయాలంటే ప్రజల్లో నిరంతరం చైతన్యం నింపాలి. మలేరియా, డెంగీ, గన్యా లాంటి వ్యాధుల నివారణకు మరింత పకడ్బందీ చర్యలు చేపట్టాలి" అని చెప్పారు.

1,592 పాజిటివ్ కేసులు

రాష్ట్రంలో ప్రస్తుతం 1,592 స్క్రబ్‌టైఫస్ పాజిటివ్ కేసులు నమోదయ్యాయని అధికారులు సీఎంకు వివరించారు. అత్యధికంగా చిత్తూరు జిల్లాలో 420 కేసులు ఉన్నట్లు తెలిపారు. వ్యాధి కారణంగా ప్రాణాలు కోల్పోతున్నట్లు ఇప్పటివరకు నిర్ధారణ కాలేదని, పాజిటివ్ కేసుల్లో తొమ్మిది మంది మరణాలకు ఇతర ఆరోగ్య సమస్యలు, మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ కారణమని వెల్లడించారు. మరణాలపై లోతుగా అధ్యయనం చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు వ్యాధి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రచారం చేస్తున్నామని, ఆయా ప్రాంతాల్లో వైద్య బృందాలతో పరీక్షలు చేయిస్తున్నామని వెల్లడించారు.

48% తగ్గిన అంటువ్యాధులు

రాష్ట్రవ్యాప్తంగా గతేడాది ప్రభుత్వ చర్యలతో సీజనల్ వ్యాధులు 48 శాతం తగ్గాయని అధికారులు వివరించారు. సమీక్షలో వైద్యారోగ్య శాఖ- కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, కమిషనర్ వీరపాండియన్, ఎన్టీఆర్ వైద్య సేవ సీఈవో దినేష్‌కుమార్, ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ గిరీశ పాల్గొన్నారు.

గుంటూరు జీజీహెచ్‌లో మరో మరణం

గుంటూరు జీజీహెచ్‌లో మరో స్క్రబ్‌టైఫస్ మరణం సంభవించింది. ప్రకాశం జిల్లా సంతనూతలపాడు మండలం రుద్రవరానికి చెందిన బోయ నాగేంద్రం (56) అనే మహిళ అనారోగ్యంతో ఈ నెల 4న గుంటూరు జీజీహెచ్‌లో చేరారు. పరీక్షలు చేయగా.. స్క్రబ్‌టైఫస్‌గా నిర్ధారణ అయింది. చికిత్స పొందుతూ మంగళవారం చనిపోయినట్లు జీజీహెచ్ వర్గాలు తెలిపాయి. ఆమెతో కలిపి జీజీహెచ్‌లో మొత్తం ఐదుగురు ఈ వ్యాధితో మరణించారు.

'అటల్- మోదీ సుపరిపాలన యాత్ర' విజయవంతం చేయాలి

టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు పిలుపు

ఈనాడు, అమరావతి: మాజీ ప్రధాని వాజ్‌పేయీ స్ఫూర్తిని యువతలో నింపేలా ఈ నెల 11 నుంచి 25 వరకు నిర్వహిస్తున్న 'అటల్- మోదీ సుపరిపాలన యాత్ర'లో కూటమిలోని మూడు పార్టీల నేతలు పాల్గొని విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. మంగళవారం ఎన్డీయే మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. యాత్రకు రూపకల్పన చేసిన భాజపా కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. రాజకీయ భీష్మునిగా భావించే అటల్ బిహారీ వాజ్‌పేయీ శతజయంతి ఉత్సవాలు నిర్వహించడం ఆనందంగా ఉందని అన్నారు. 'వాజ్‌పేయీ అజాత శత్రువు. 18 ఏళ్ల వయసులో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. తొమ్మిదిసార్లు లోక్‌సభకు, 2సార్లు రాజ్యసభకు ఎన్నికయ్యారంటే ఆయన గొప్పతనం ఏంటో తెలుస్తుంది. ఆయన తెచ్చిన పాలసీలు దేశాభివృద్ధికి పునాదులు వేశాయి. స్వర్ణచతుర్భుజి హైవే ప్రాజెక్టు దేశ దశ, దిశ మార్చింది. 1998లో పోఖ్రాన్- 2 అణుపరీక్షలు జరిపి భారత శక్తిని చాటారు. కార్గిల్ యుద్ధంతో శత్రువులకు తిరుగులేని సమాధానం ఇచ్చారు. వాజ్‌పేయీతో నాకు వ్యక్తిగత అనుబంధం ఉంది. రాష్ట్రాభివృద్ధికి ఎంతో సహాయం చేశారు' అని చంద్రబాబు పేర్కొన్నారు.

తొలి సభకు ముఖ్యఅతిథిగా మధ్యప్రదేశ్ సీఎం: అటల్- మోదీ సుపరిపాలన యాత్ర ఈ నెల 11న ధర్మవరంలో ప్రారంభమవుతుందని, రోజుకు రెండు జిల్లాల్లో కొనసాగుతుందని టెలికాన్ఫరెన్స్‌లో పాల్గొన్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. తొలి సభలో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు.



జెండా ఊపి రైలును ప్రారంభిస్తున్న మంత్రి జనార్దన్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే శ్రీనివాసులు, దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ తదితరులు

తిరుపతి కేంద్రంగా రూ.6,700 కోట్లతో రైల్వే అభివృద్ధి పనులు

- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
- తిరుపతి- సాయినగర్ శిర్డీ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభం



తిరుపతి(రైల్వే), న్యూస్‌టుడే: తిరుపతి జిల్లాకు సంబంధించి దక్షిణమధ్య రైల్వే దక్షిణ రైల్వే సంయుక్త ఆధ్వర్యంలో రూ.6,700 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతుండటం రాష్ట్రానికి గర్వకారణమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బి.సి.జనార్దన్‌రెడ్డి అన్నారు. తిరుపతిలో మంగళవారం జరిగిన తిరుపతి- సాయినగర్ శిర్డీ నూతన ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కేంద్ర రైల్వే, జలశక్తి శాఖల సహాయమంత్రి వి.సోమన్న, రాజ్యసభ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి వర్చువల్ విధానంలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రాలైన తిరుపతి, శిర్డీలను కలిపే ఈ రైలు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. రాష్ట్రంలో రూ.33,630 కోట్లకు పైగా విలువైన రైల్వే ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయని, నూతనంగా 1,564 కి.మీ. పొడవైన అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వివరించారు. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిలను వరల్డ్ క్లాస్ రైల్వేస్టేషన్లుగా అభివృద్ధి చేయడంతోపాటు నూతనంగా అమరావతి రైల్వేస్టేషన్ పనులను ప్రభుత్వం వేగవంతంగా చేపడుతోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 373 చోట్ల రైల్ ఓవర్, అండర్ బ్రిడ్జిల నిర్మాణానికి ప్రణాళికలు వేసామని, గోదావరి పుష్కరాలకు రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌ను రూ.271 కోట్లతో ఆధునికీకరణ చేయడం ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. దక్షిణమధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, తిరుపతి పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, ఎమ్మెల్యే బల్లి కల్యాణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.


అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటుకు ప్రభుత్వం హామీ

అగ్రిగోల్డ్ ఏజెంట్స్ సంఘం అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు

ఈనాడు, అమరావతి: అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు త్వరితగతిన పరిష్కరించేందుకు విజయవాడ కేంద్రంగా ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేస్తామని హోంమంత్రి అనిత చెప్పారని అగ్రిగోల్డ్ వినియోగదారులు, ఏజెంట్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు తెలిపారు. ఇప్పటికే ఈ కోర్టు ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అంగీకరించారని, సంబంధిత దస్త్రం ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉందని ఆమె దృష్టికి తీసుకువెళ్లగా, వెంటనే ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారని చెప్పారు. అగ్రిగోల్డ్ బాధితుల సమస్యపై మంగళవారం సచివాలయంలో హోంమంత్రి అనిత సమీక్ష నిర్వహించారు. ముప్పాళ్ల నాగేశ్వరరావుతో పాటు సంఘం ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు, ఉప ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు హాజరయ్యారు. అనంతరం నాగేశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ.. "అగ్రిగోల్డ్ బాధితులకు యుద్ధప్రాతిపదికన న్యాయం చేయాలి. సిట్ ఏర్పాటు చేసి 6 నెలల్లో బాధితులకు డబ్బు చెల్లించాలి. దాదాపు 14 వేల మంది 2015 కంటే ముందు స్థలాలు, ఫ్లాట్లు కొనుగోలు చేశారు. వాటి ఎటాచ్‌మెంట్ తప్పించి బాధితులకు ఇవ్వాలని కోరాం. ఇలాంటి వారు తమ వద్ద ఉన్న డాక్యుమెంటేషన్‌తో 45 రోజుల్లో సీఐడీకి సమర్పిస్తే ఆ తర్వాత నెల రోజుల్లో ఆయా యజమానులకు అందేలా చర్యలు తీసుకుంటామని హోంమంత్రి తెలిపారు. కూటమి ప్రభుత్వంలో అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నాం. న్యాయం జరగకపోతే మళ్లీ ఉద్యమం చేస్తాం" అని చెప్పారు.

గ్రామీణ రోడ్ల నిర్మాణానికి రూ.2,123 కోట్లు

ఈనాడు, అమరావతి: ప్రయాణికుల కష్టాలను తొలగించేలా గ్రామీణ ప్రాంత రహదారులను బాగు చేసేందుకు నిధులు విడుదలయ్యాయి. రాష్ట్రంలో దెబ్బతిన్న గ్రామీణ ప్రాంత రోడ్ల నిర్మాణానికి సాస్కీ పథకం కింద మొత్తం రూ.2,123 కోట్ల నిధుల విడుదలకు కూటమి ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. ఈ నిధులతో రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల పరిధిలో 4,007 కి.మీ. పొడవున 1,299 గ్రామీణ రహదారులను బాగు చేయనున్నారు. ఈ రహదారులు 157 నియోజకవర్గాల్లోని 484 మండలాల్లో ఉన్నాయి. ఈ మేరకు తదుపరి చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ ఇంజినీర్ ఇన్ చీఫ్‌ను ఆదేశిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.



మామూలు ఆలోచన అద్భుతంగా మారాలంటే..

వాస్తవానికి అద్భుతమైన ఆలోచనలంటూ ఉండవు. మామూలు ఆలోచనే కూడా నిబద్ధతతో అమలు చేస్తే అదే అద్భుతంగా మారుతుంది. ఎందుకంటే మెదడున్న ప్రతి వ్యక్తికీ ఎన్నో ఆలోచనలు వస్తుంటాయి. కానీ తమ ఆలోచనలను ఆచరణలో పెట్టడానికి మాత్రం చాలా మంది బద్ధకిస్తుంటారు. అందుకే ఆలోచన కన్నా ఆచరణ అత్యంత ముఖ్యం.

- ఎమ్మా కొలిన్స్, బ్రాండింగ్ కన్సల్టెంట్



మీ ముందు రెండే ఆప్షన్లు

జీవితంలో మీకు రెండే ఆప్షన్లు ఉన్నాయి. అవేంటంటే.. 1.మీరు లక్ష్యాన్ని నిర్దేశించుకొని ప్రయత్నాలు మొదలుపెట్టడం. 2.అసలు ప్రయత్నాలే చేయకపోవడం. మొదటి మార్గాన్ని ఎంచుకుంటే, మీరు విజయం సాధించొచ్చు లేదా మీకు వైఫల్యం ఎదురుకావొచ్చు. కానీ రెండో మార్గంలో మాత్రం ఒక్కటే ఫలితం ఉంటుంది. అదేంటో తెలుసా..కచ్చితమైన ఓటమి. మరి మీరు దేన్ని ఎంచుకుంటారు?

– డైలాన్ ఫిలిప్, కంటెంట్ లీడ్

గ్రహం అనుగ్రహం

10–12–2025 బుధవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; హేమంత ఋతువు, మార్గశిర మాసం, బహుళపక్షం

షష్ఠి: రా. 7-08 తదుపరి సప్తమి

ఆశ్లేష: ఉ. 8-06 తదుపరి మఖ

వర్జ్యం: రా. 8-05 నుంచి 9-41 వరకు

అమృత ఘడియలు: ఉ. 6-32 నుంచి 8-06 తిరిగి తె. 5-40 నుంచి

దుర్ముహూర్తం: ఉ 11-30 నుంచి 12-14 వరకు

రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు

సూర్యోదయం: ఉ.6.23; సూర్యాస్తమయం: సా.5.22

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	7.7	29.3
మెదక్	8.5	30.4
హైదరాబాద్	13.0	29.9
విజయనగరం	16.0	28.0
విశాఖపట్నం	16.8	29.2
కర్నూలు	16.9	32.7
విజయవాడ	17.0	30.2
కడప	18.0	28.0
శ్రీకాకుళం	18.0	29.0
గుంటూరు	18.0	29.0
అనంతపురం	18.6	29.0
నరసాపురం	18.8	32.6
రాజమహేంద్రవరం	20.0	35.0
ఒంగోలు	20.6	31.6
తిరుపతి	21.6	29.8
నెల్లూరు	22.0	30.2
తాడేపల్లిగూడెం	24.0	30.0

నెయ్యి కొనుగోలు విధివిధానాలేంటి?

- భోలేబాబా డైరెక్టర్లు మిమ్మల్ని కలిశారా?
- కల్తీ నెయ్యి కేసు విచారణలో మాజీ జీఎంకు సిట్ ప్రశ్నలు
- రసాయనాల సరఫరాపై సుగంధ్‌ను ప్రశ్నించిన అధికారులు



రుయా ఆసుపత్రిలో సుబ్రహ్మణ్యం, అజయ్ కుమార్ సుగంధ్ (మాస్క్ పెట్టుకున్న వ్యక్తి)

ఈనాడు – తిరుపతి, న్యూస్‌టుడే, తిరుపతి (నేరవిభాగం): తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదానికి కల్తీ నెయ్యి సరఫరా కేసులో నిందితులైన తితిదే కొనుగోళ్ల విభాగం మాజీ జీఎం ఆర్ఎస్ఎస్‌వీఆర్ సుబ్రహ్మణ్యం (ఏ29), సుగంధ్ ఆయిల్స్ అండ్ కెమికల్స్ యజమాని అజయ్‌కుమార్ సుగంధ్ (ఏ16)ను తొలి రోజు మంగళవారం సిట్ అధికారులు ప్రశ్నించారు. వారిద్దరినీ నాలుగు రోజుల కస్టడీకి ఏసీబీ కోర్టు అనుమతి ఇవ్వడంతో నెల్లూరు కేంద్ర కారాగారం నుంచి మధ్యాహ్నం ఒంటి గంటకు తిరుపతి రుయా ఆసుపత్రికి తీసుకొచ్చి వైద్య పరీక్షలు నిర్వహించారు. సుబ్రహ్మణ్యానికి బీపీ ఎక్కువగా ఉండటంతో మాత్రలు ఇచ్చి కొద్దిసేపు కూర్చోబెట్టారు. సాధారణ స్థితికి చేరుకున్నాక అలిపిరిలోని సిట్ కార్యాలయానికి తరలించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇద్దరినీ వేర్వేరుగా విచారించారు. సుబ్రహ్మణ్యాన్ని ప్రధానంగా నెయ్యి కొనుగోలుకు తితిదే ఎలాంటి నిబంధనలు విధిస్తుంది? విధివిధానాలేంటి? టెండర్ షరతులు ఉల్లంఘిస్తే తీసుకునే చర్యలేంటి అని ప్రశ్నించినట్లు సమాచారం. గతంలో టెండర్లలో పాల్గొనే డెయిరీలు ప్రతిరోజూ నాలుగు లక్షల లీటర్ల ఆవుపాలు సేకరించడంతో పాటు 8 టన్నుల నెయ్యి ప్రాసెసింగ్ సామర్థ్యం, ఏడాదికి రూ.250 కోట్ల టర్నోవర్ కలిగి ఉండాలని నిబంధనలు ఉన్నాయని ఆయన వివరించారు. 2020లో వీటిని సరళతరం చేశారని చెప్పారు. అప్పట్లో తితిదేకు చెందిన ఐదుగురు అధికారులు, ముగ్గురు నిపుణులతో కమిటీని నియమించారని, ఆ కమిటీ సభ్యులు నివేదిక ఇచ్చారని వెల్లడించారు. ఈ వ్యవహారంతో తనకు సంబంధం లేదని, అప్పట్లో తాను జీఎంగా లేనని స్పష్టం చేశారు. భోలేబాబా ప్రతినిధులు మిమ్మల్ని కలిశారా అని ప్రశ్నించగా డెయిరీ ప్లాంట్ల తనిఖీలకు వెళ్లినప్పుడు మాట్లాడారని సుబ్రహ్మణ్యం సమాధానమిచ్చారు. డైరెక్టర్లు పొమిల్ జైన్, విపిన్ జైన్ లంచం ఇచ్చారా, కల్తీ నెయ్యి సరఫరాకు మీరు సహకరించారా అని అడగ్గా లేదని బదులిచ్చారు. సుబ్రహ్మణ్యం అనారోగ్యం దృష్ట్యా మొదటిరోజు ఆయన్ను పెద్దగా ప్రశ్నించలేదని తెలుస్తోంది. విచారణ అనంతరం ఇద్దరినీ తిరుపతి తూర్పు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

విచారణకు సహకరించని సుగంధ్

దిల్లీకి చెందిన అజయ్‌కుమార్ సుగంధ్‌ను సైతం సిట్ అధికారులు ప్రశ్నించినా అతను విచారణకు సహకరించలేదని తెలుస్తోంది. నెయ్యి కల్తీకి ఎలాంటి రసాయనాలు వినియోగించారని అడగ్గా ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. మోనో గ్లిజరైడ్స్, ఎసిటిక్ యాసిడ్ ఈస్టర్ తదితర పదార్థాలను మీరు దిల్లీ నుంచి పంపితే వాటితో భోలేబాబా డెయిరీలో నకిలీ నెయ్యి తయారు చేశారని తేలిందని సిట్ అధికారులు ప్రశ్నించారు. కొన్నేళ్లుగా రసాయనాల వ్యాపారం చేస్తున్నానని, వాటిని ఎందుకు వినియోగించారో తనకు తెలియదని సుగంధ్ చెప్పారు. భోలేబాబా డైరెక్టర్లతో జరిపిన లావాదేవీల గురించి ప్రశ్నించగా తాను సరఫరా చేసిన రసాయనాలకు వారు డబ్బు పంపారే తప్ప కల్తీ వ్యవహారంలో తన ప్రమేయం లేదని పేర్కొన్నారు.

ఇది సూడో సెక్యులరిజం కాదా?

- హిందూ ఆచారాలకు అనుకూలంగా తీర్పు ఇస్తే జడ్జిపై అభిశంసనా?
- ఇండియా కూటమిపై పవన్ కల్యాణ్ మండిపాటు

ఈనాడు, అమరావతి: ‘హిందూ విశ్వాసాలను, ఆచారాలను పాటించడం రాజ్యాంగం ప్రకారం హిందూ సమాజం హక్కు. దాన్ని కాపాడేలా తీర్పు ఇచ్చిన ఒక న్యాయమూర్తి అభిశంసనకు 120 మంది ఇండియా కూటమి ఎంపీలు డీఎంకే నాయకత్వంలో పిలుపునివ్వడాన్ని ఏమనాలి? కొన్ని రాజకీయ పార్టీలు ఎందుకు అంతటి తీవ్రమైన చర్యలకు దిగుతున్నాయి? ఇది కోర్టులను బలవంతంగా మౌనం వహించేలా చేసే కుట్ర కాదా? హిందూ విశ్వాసాలు, సంప్రదాయాలపై తీర్పులు ఇచ్చేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించడం కాదా? సూడో సెక్యులరిజం కాదా?’ అని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రశ్నించారు. ఈ పరిస్థితుల్లో సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు తక్షణమే ఏర్పాటు చేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ‘ఎక్స్’లో మంగళవారం పోస్టు చేశారు. తమిళనాడులోని తిరుప్పరకుండ్రం కొండపైనున్న దీపస్తంభంపై కార్తిక దీపాన్ని వెలిగించే విషయమై అక్కడి దర్గా కమిటీకి, సుబ్రహ్మణ్య స్వామి ఆలయ కమిటీకి ఏర్పడిన వివాదంలో.. మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం న్యాయమూర్తి జస్టిస్ జీఆర్ స్వామినాథన్ ఇటీవల తీర్పునిచ్చారు. పరిమిత సంఖ్యలో వెళ్లి దీపం వెలిగించవచ్చంటూ ఆదేశాలివ్వగా, తమిళనాడు ప్రభుత్వం తదనుగుణంగా ఏర్పాట్లు చేయలేదు. తాజాగా మంగళవారం డీఎంకే నేతృత్వంలో ఇండియా కూటమి ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి జస్టిస్ స్వామినాథన్‌పై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టాలంటూ లేఖ అందించారు. దీనిపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించారు.



గతంలో ఇలా స్పందించలేదేం?

‘సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం గతంలో శబరిమల వివాదంపై అక్కడి శతబ్దాల ఆచారాలకు వ్యతిరేకంగా తీర్పునిచ్చినా ఏ న్యాయమూర్తీ అభిశంసనకు గురికాలేదు. ఆ అంశాన్ని న్యాయపరంగా ఎదుర్కొన్నారే తప్ప, న్యాయమూర్తుల అభిశంసనకు రాజకీయ తీర్మానాలు చేయలేదు. ఇటీవల సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఓ కేసులో ‘మీరు విష్ణుమూర్తికి గొప్ప భక్తుడైనందున ఏం చేయాలో ఆ దేవుడినే అడగండి, ఆయన్నే ప్రార్థించండి’ అని వ్యాఖ్యానించినప్పుడు ఏ జవాబుదారీతనమూ లేకుండా పోయింది. తర్వాత ఆ ప్రధాన న్యాయమూర్తికి జరిగిన అవమానాన్ని అన్ని రాజకీయ పార్టీలూ ఖండించాయి. తాజాగా తమిళనాడు ఉదంతంలో రాజకీయ వ్యవస్థ అందుకు భిన్నంగా స్పందిస్తోంది. ఓ సీనియర్ జడ్జి హిందువుల దీర్ఘకాలిక విశ్వాసాలను పాటించేందుకు అనుకూలంగా తీర్పు ఇస్తే.. ఆయన్ను అభిశంసించాలని ఇండియా కూటమి డిమాండ్ చేస్తోంది. ఈ వైఖరి భయానక వివక్షను చాటుతోంది. ఈ పరిస్థితుల్లో హిందూ ధర్మ పరిరక్షణ బోర్డు ఏర్పాటుకు అన్ని స్వరాలూ ఏకం కావాల్సిన అవసరముంది’ అని పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు.

ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బందికే వేతన బకాయిలు

- విద్యుత్ సంస్థల నిర్ణయం
- ‘ఈనాడు’ కథనానికి స్పందన

ఈనాడు, అమరావతి: విద్యుత్ సంస్థల్లో ప్రస్తుతం పనిచేస్తున్న పొరుగు సేవల సిబ్బందికి మాత్రమే వేతన బకాయిలు చెల్లించాలని నిర్ణయించినట్లు ట్రాన్స్‌కో ఒక ప్రకటనలో తెలిపింది. హాజరు పట్టీ ఆధారంగా సంబంధిత కాంట్రాక్టర్ల ద్వారా డిసెంబరు నెల జీతంతో కలిపి వాటిని చెల్లిస్తామని పేర్కొంది. ‘రూ.కోట్ల స్వాహాకు స్కెచ్’ శీర్షికన ఈనాడులో మంగళవారం ప్రచురితమైన కథనంపై ట్రాన్స్‌కో స్పందించింది. “ప్రస్తుతం సర్వీసులో లేని సిబ్బందికి వేతన బకాయిలు చెల్లించబోం. 2022 ఏప్రిల్ నుంచి 2023 ఆగస్టు మధ్య పదవీ విరమణ చేసిన, చనిపోయిన సిబ్బందికి వేతనబకాయిల చెల్లింపుపై ఇంకా ఎలాంటి నిర్ణయాన్ని సంస్థ తీసుకోలేదు. పొరుగు సేవల సిబ్బందికి బకాయిలు చెల్లించేందుకు తయారు చేసిన బిల్లుపై సంబంధిత కాంట్రాక్టర్, విద్యుత్ సంస్థల అధికారులు సంతకాలు చేసిన తర్వాతే చెల్లిస్తాం” అని విజయవాడ, విశాఖ, కడప జోనల్ చీఫ్ ఇంజినీర్లు తెలిపారు.

పీఎంజీఎస్‌వై బకాయిల చెల్లింపునకు రూ.47 కోట్ల మంజూరు

ఈనాడు, అమరావతి: ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) పథకం కింద రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన రహదారుల నిర్మాణానికి సంబంధించిన బిల్లులు చెల్లించే నిమిత్తం రూ.47.84 కోట్ల విడుదలకు ప్రభుత్వం పరిపాలన అనుమతులిచ్చింది.

దశాబ్దాల రోడ్డు సమస్యకు పరిష్కారం

మరమ్మతులకు..రూ.7.60 కోట్లు మంజూరు చేసిన ఉప ముఖ్యమంత్రి

ఈనాడు, అమరావతి: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇటీవల ఏలూరు జిల్లా ఐఎస్ జగన్నాథపురంలో పర్యటించిన సందర్భంగా తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారంపై దృష్టి సారించారు. ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న రెండు రహదారుల నిర్మాణానికి రూ.7.60 కోట్లు మంజూరు చేశారు. పోలవరం నియోజకవర్గం కొయ్యలగూడెం మండలం తిమ్మనకుంట-గవరవరం మధ్య రోడ్డు అభివృద్ధికి రూ.7 కోట్లు ప్రకటించారు. ఇటీవల పవన్ అక్కడ పర్యటించిన సందర్భంలో.. బిడ్డను ఎత్తుకున్న ఓ మహిళ వచ్చి రోడ్డు సమస్యను వివరించారు. సాస్కి నిధులతో అక్కడ రహదారి నిర్మించాలని అప్పుడే పంచాయతీరాజ్ అధికారులకు పవన్ ఆదేశాలిచ్చారు. 9 కి.మీ. మేర రోడ్డు వేసేలా తాజాగా అనుమతులిచ్చారు. అదే నియోజకవర్గం పరిధిలోని యర్రంపేట రైతుల కోరిక మేరకు.. పంట పొలాలకు వెళ్లేలా 3 కి.మీ. డొంక రోడ్డు నిర్మాణానికి ఉపాధి హామీ పథకం కింద రూ.60 లక్షలు మంజూరు చేశారు.

ప్రతి ఆదివారం సంక్షేమ వసతిగృహాల తనిఖీ

సాంఘిక సంక్షేమ మండలి ఛైర్మన్ బాలకోటయ్య వెల్లడి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ వసతిగృహాలను ప్రతి ఆదివారం తాను స్వయంగా వెళ్లి తనిఖీ చేయనున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ మండలి ఛైర్మన్ బాలకోటయ్య తెలిపారు. అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక డ్రైవ్ ద్వారా వసతిగృహాల పనితీరును పరిశీలిస్తానని పేర్కొన్నారు. సచివాలయంలో మంగళవారం ఆయన సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామిని కలిసి పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఓ ప్రకటన విడుదల చేశారు. “రాష్ట్రవ్యాప్తంగా సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో 1,365 మంది పారిశుద్ధ్య సిబ్బందిని నియమించేందుకు ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టింది. మౌలిక వసతుల కల్పనకు నిధులు విడుదల చేసింది. వైకాపా ప్రభుత్వం వీటిని పట్టించుకోకపోవడంతో సమస్యలు తిష్టవేశాయి. వాటిని ఒక్కొక్కటిగా కూటమి ప్రభుత్వం చక్కదిద్దుతోంది” అని అందులో పేర్కొన్నారు.

కొత్త డ్వాక్రా సంఘాలకు రివాల్వింగ్ ఫండ్

ఒక్కో సంఘానికి రూ.15 వేలు

ఈనాడు, అమరావతి: నూతనంగా ఏర్పాటయిన డ్వాక్రా సంఘాలకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. రూ.3 కోట్ల రివాల్వింగ్ ఫండ్‌ను ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2 వేల కొత్త డ్వాక్రా సంఘాలకు రూ.15 వేల చొప్పున అందించనున్నారు. ఈ మొత్తాన్ని ఆయా సంఘాల సభ్యులు తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదు. సంఘం ఖాతాలోనే నిల్వ ఉంటుంది. సంఘం నిధి పెంచేందుకు, సభ్యుల అవసరానికి అనుగుణంగా అంతర్గతంగా అప్పులు మంజూరు చేసుకునేందుకు, బ్యాంకుల ద్వారా ఎక్కువ మొత్తంలో సంఘానికి రుణం మంజూరయ్యేందుకు రివాల్వింగ్ ఫండ్ ఉపయోగపడుతుంది. త్వరలో సంఘాల ఖాతాల్లో నిర్దేశిత మొత్తం జమ కానుంది. ఆయా సంఘాల జాబితాను ఇప్పటికే జిల్లాలకు పంపగా తదుపరి చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.


ఈనాడు

ఎన్‌టీఏ పనితనానికి పరీక్ష!

స్వాతంత్ర్యం సిద్ధించి వందేళ్లు అయ్యేనాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలన్నది భారతావని స్వప్నం. జ్ఞానాధారిత పోటీ ప్రపంచంలో నెగ్గుకొస్తూ వికసిత భారత గమ్యాన్ని చేరుకోవాలంటే- యువత శక్తియుక్తులను సరైన దిశలోకి మళ్లించి సద్వినియోగం చేసుకోవాలి. అందుకుగానూ ప్రతి ఒక్క విద్యార్థిలోని సహజ సామర్థ్యాలను వెలికి తీస్తూ, 21వ శతాబ్ది అవసరాలకు తగినట్లుగా వారిని తీర్చిదిద్దుకోగలగాలి. ఆ మేరకు దేశీయ విద్యా వసతుల్లో, బోధనలో పరిశోధనల్లో ప్రమాణాలు పెరగాలి. దానికి భిన్నంగా దశాబ్దాల కిందటి దురవస్థల్లోంచి నేటికీ విముక్తం కాలేకపోతున్న మన విద్యావ్యవస్థలో కనీసం ఉన్నత చదువుల్లో చేరేకలకు సంబంధించిన పరీక్షలు సైతం సక్రమంగా జరగట్లేదు. జాతి భవితకు చేటుచేసే ఈ దుస్థితిని రూపుమాపే సదాశయంతో ఎనిమిదేళ్ల కిందట ఏర్పాటైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) పనితీరు ఇప్పటికీ గాడినపడలేదు. వివిధ యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు పోటీపడే అభ్యర్థుల్లోంచి అర్హులను వడపోయడానికి సమర్థంగా, పారదర్శకంగా, అంతర్జాతీయ ప్రమాణాలతో పరీక్షలు నిర్వహించాలన్న కర్తవ్యాన్ని నెరవేర్చడంలో ఎన్‌టీఏ తరచూ చేతులెత్తేస్తోంది!

పరీక్షల నిర్వహణ నుంచి ఫలితాల వెల్లడి వరకు ప్రతి దశలోనూ అసమర్థ నిర్వాకాలతో విద్యార్థులు వారి తల్లిదండ్రులను ముప్పుతిప్పలు పెట్టడం ఎన్‌టీఏకు రివాజైంది. ఆ సంస్థ 'నీట్'ను నిర్వహించిన తీరు ఆందోళనకరంగా ఉందని సర్వోన్నత న్యాయస్థానమే నిరుడు ఆక్షేపించింది. ఎన్‌టీఏను సంస్కరించే యత్నాల్లో భాగంగా ఇస్రో మాజీ ఛైర్మన్ డాక్టర్ కె.రాధాకృష్ణన్ నేతృత్వంలో నిపుణుల కమిటీని కేంద్ర విద్యాశాఖ కొలువుతీర్చింది. ఆ సంఘం సిఫార్సుల అమలును పర్యవేక్షించడానికి ఆపై ఉన్నతస్థాయి స్టీరింగ్ కమిటీని సైతం ఏర్పరచింది. ఇంతచేసినా ఎన్‌టీఏ పనితనం మెరుగుపడని చేదువాస్తవాన్ని పార్లమెంటరీ స్థాయీసంఘం తాజా నివేదిక వెల్లడించింది. 2024లో యూజీసీ-నెట్, సీఎస్ఐఆర్-నెట్, నీట్-పీజీ పరీక్షలు వాయిదాపడ్డాయి. ప్రశ్నపత్రాల లీకేజీతో నీట్-యూజీ అస్తవ్యస్తమైతే... 'సీయూఈటీ' ఫలితాల వెల్లడిని ఎన్‌టీఏ పర్యాయాలు వాయిదావేశాయి. తుది ఆన్సర్‌కీలో గుర్తించిన తప్పుల కారణంగా ఈ ఏడాది మొదట్లో నిర్వహించిన జేఈఈ మెయిన్స్‌లో కనీసం 12 ప్రశ్నలను ఉపసంహరించారు. ఇలాంటివి వ్యవస్థపై నమ్మకాన్ని కలిగించవన్న స్థాయీసంఘం అభిప్రాయం సరైనదే. పూర్తిగా నివారించదగిన ఇటువంటి అవాంఛనీయ ఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్న పార్లమెంటరీ కమిటీ సిఫార్సు ఎన్‌టీఏకు శిరోధార్యమైనది!

ప్రశ్నపత్రాల తయారీ, పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం వంటివాటిలో పాలుపంచుకునే సంస్థల్లో కొన్ని ఎక్కడోచోట అవకతవకలకు పాల్పడి నిషేధానికి గురవుతున్నాయి. నిబంధనల ఉల్లంఘన పనులకు తెగబడిన వాటికి మరోచోట మళ్లీ అవే కాంట్రాక్టులు దక్కుతున్నాయన్న దారుణ నిజాన్ని స్థాయీసంఘం నివేదికాంశాలు కళ్లకుకడుతున్నాయి. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే అలాంటి సంస్థలు వ్యక్తులను పరీక్షల నుంచి దూరంపెట్టడానికి జాతీయస్థాయిలో బ్లాక్‌లిస్టు నిర్వహించాలని కమిటీ సూచన ఎన్నదగినది. సమర్థత కలిగిన వృత్తినిపుణులతో ఎన్‌టీఏను బలోపేతం చేయడం, దాని కార్యకలాపాల్లో గోప్యతను నివారించడంపైనా ప్రభుత్వం దృష్టిపెట్టాలి. ఇంజినీరింగ్, మెడికల్ కళాశాలలు విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలకోసం దేశవ్యాప్తంగా కోట్ల మంది విద్యార్థులు నిద్రాహారాలు మాని చదువుతుంటారు. వారిని తీవ్ర ఒత్తిడికి, అంతులేని ఆవేదనకు గురిచేసే వ్యవస్థాగత లోపాలను వీలైనంత వేగంగా సరిదిద్దడం ప్రభుత్వ విద్యుక్తధర్మం!



ఆయుధాల వల్ల అయిన గాయాలు మానిపోతాయి. కాలిన మచ్చలు కూడా కొన్నాళ్లకు చర్మంలో కలిసిపోతాయి. కానీ మాటలు చేసే గాయాలు మనసుకు గుచ్చుకుంటాయి. మనసూ గాయమూ ఏదీ కన్పించదు కానీ, జీవితాంతం వెంటాడతాయి.

– సి.రాజగోపాలాచారి

పోరాడాలి... గెలవాలి!

జీవితంలో గొడవలు ఉండకూడదు. ఇంట్లోనూ బయటా శాంతంగా ఉండాలి. ఒకరి కొకరు మర్యాదలు ఇచ్చిపుచ్చుకుంటూ బతకాలి. ఆధ్యాత్మిక ప్రవచనాలు, సూక్తులు, స్తోత్రాలు వింటూ జీవించాలి. ఇల్లు ఒక నిశ్చల సరస్సులా, గ్రంథాలయంలా నిశ్శబ్దంగా ఉండాలి. ఆదర్శ కుటుంబం అని పేరు తెచ్చుకోవాలి. ఇటువంటి కుటుంబాలను కృత్రిమ మేధతో సృష్టించుకోవచ్చేమో కానీ, నిజానికి ఏ ఇల్లూ ఇలా ఉండదు!

గొడవలు లేని జీవితం జీవితమే కాదు. మనం కోరుకోకపోయినా సమస్యలు వస్తూనే ఉంటాయి. వాటిని పరిష్కరించుకోవాలి. కొత్తవి వస్తుంటే మళ్లీ మళ్లీ ఎదుర్కొని, పరిష్కారాలు సాధించి జీవనయానం సాగించాలి. ఓం శాంతి శాంతి శాంతిః అని ఇంట్లో అనుకుంటూ బతకడం మంచిదే గాని, శాంతిని ఎవరు కోరుకుంటున్నారో వాళ్లు పోరాటానికి సిద్ధపడాలి. యుద్ధం లేని జీవితం లేదు. దాని గురించి పూర్తి అవగాహన ఉండాలి. పుట్టుకలో యుద్ధం ఉంది. బతకడంలో, చావడంలో యుద్ధం ఉంది. గీతాచార్యుడు యుద్ధానికి భయపడొద్దని చెప్పాడు. దాన్ని ఎదుర్కోవాలి. భీరువులా పారిపోకూడదు. లేనిపోని భయాలతో వణికిపోకూడదు. ప్రతి మనసూ కురుక్షేత్రమే. మనుషులు మనసులు రణ రంగాలవుతుంటే, వాళ్లు నివసిస్తున్న ఇల్లు శాంతి క్షేత్రం ఎలా అవుతుంది? ధ్యానమందిరంగా ఎలా విలసిల్లుతుంది? యుద్ధం పూర్వాపరాలు తెలుసుకోవడానికే ప్రతి జీవి భూమ్మీదకు వచ్చింది. తెలిసో తెలియకో ప్రతి ఒక్కరూ యుద్ధం చేస్తారు. గెలుస్తారు, ఓడిపోతారు. ఓడుతూ గెలుస్తారు. గెలుస్తూ ఓడుతారు. యుద్ధమనేది నిరంతరం జరిగే ప్రక్రియ.



అంతర్యామి

భూమి మీద ఎప్పుడూ యుద్ధ వాతావరణం ఉంటుంది. ప్రతి ఇంట్లో కూడా చిన్నదో పెద్దదో యుద్ధం జరుగుతూ ఉంటుంది. ప్రతి సభ్యుడూ అలవాటైన సైనికుడిలా క్షణాల్లో యుద్ధానికి తయారైపోతారు. బంధాలు, బంధుత్వాలు వెనక్కి లాగుతున్నా పోరాడాలి, పోరాడుతూనే ఉండాలి! గొడవలు లేని ఇల్లని ఏ ఇంటినైనా చెప్పుకోగలమా? కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాల కారణంగా జ్ఞానుల కుటుంబాలలో కూడా యుద్ధం ఉంటుంది. అయితే అది శ్రీకృష్ణుడు చెప్పినట్లుగా ఉంటుంది. అంతా కృష్ణార్పణం అని వాళ్లు పోరాటంలో పాల్గొంటారు. కర్మఫలత్యాగం అని గెలుపోటములకు అతీతంగా ఉంటారు. యుద్ధాన్ని నివారించే రాయబారాలు ఇళ్లల్లో ఉంటాయి. అవి సఫలం కావొచ్చు. కాకపోవచ్చు.

భగవద్గీతలో మూల విషయం యుద్ధం. దాన్ని సృష్టించి, అందులో మానవ ఆత్మని సమగ్రంగా ఆవిష్కరించాడు పరమాత్మ. యుద్ధ నైపుణ్యం తెలిసినవాడు, యుద్ధంలో వేదాంతం, వైరాగ్యం గ్రహించినవాడు యుద్ధవీరుడిగా పేరు తెచ్చుకుంటాడు. మరణానికి భయపడడు. తాను బతుకుతాడు. ఇతరులను బతికిస్తాడు. గొడవలు లేని జీవితం ఉంటుందంటే అతడు నమ్మడు, ఎవరూ నమ్మకూడదు. పోరాటానికి సిద్ధపడటం అంటే జీవితంలో ముందుకెళ్లడమే. మానసిక యుద్ధంలో నెగ్గుకొచ్చిన వ్యక్తే శాంతి సామరస్యాలను అనుభవించడానికి అర్హుడవుతాడు.

– ఆనందసాయి స్వామి



ఆన్‌లైన్‌లో ఆమెకేదీ భద్రత?

ఆధునిక మనిషి అస్తిత్వానికి చిరునామాగా మారింది ఆన్‌లైన్ యాక్టివిటీ. టీనేజర్ల నుంచి సీనియర్ సిటిజెన్ల వరకు అందరూ స్వేచ్ఛగా ఉపయోగించుకుంటున్న సామాజిక మాధ్యమాలు మహిళలకు మాత్రం పీడకలగా మారుతున్నాయి. వారిని వెంటాడి, వేధించి, జీవితాలను నరకప్రాయం చేస్తోంది సైబర్ బుల్లీయింగ్. ప్రైవసీని హరిస్తూ, ప్రాణహానిని ప్రేరేపిస్తూ తీవ్రమైన మానవహక్కుల ఉల్లంఘనకు పాల్పడుతోంది.

ప్రముఖ నటీనటుల పెళ్లి వీడియో ఒకటి ఇటీవల సామాజిక మాధ్యమాల్లో బాగా వైరల్ అయ్యింది. చూసినవాళ్లంతా అచ్చం నిజం పెళ్లి వీడియోలాగే ఏంతో ఎంత బాగా చేశారో... అనుకున్నారు. స్నేహితులైన ఆడ మగా ఇద్దరిని చేర్చి ఇలాంటి వీడియో సృష్టించడం... ఎంత తప్పు! అలాగే ఇంకెవరి ఫొటోలైనా పెళ్లి వీడియోలు చేస్తే? ఆ ఇంకెవరో... మన కుటుంబ సభ్యులైతే..?! ఇంతదారుణం ఎవరూ ఆలోచిస్తున్నట్లు లేదు. అందుకే ఇలాంటి వీడియోని ఎడాపెడా షేర్ చేశారు. రెండు నెలల క్రితం ఇలాగే ఇతరుల శరీరాలకు హీరోయిన్ల ముఖాలను కలిపిన డీప్ ఫేక్ చిత్రాలు చక్కర్లు కొట్టాయి. పోలీసులు బాధ్యులపై చర్యలు తీసుకున్నారు. అయినా ఇలాంటి వీడియోలు వస్తూనే ఉన్నాయి, వైరల్ అవుతున్నాయి అంటే- దానివెనక పొంచివున్న ప్రమాదం తీవ్రత సమాజానికి అర్థం కావడంలేదు. అందుకే ఈ ఏడాది 'ఇంటర్నేషనల్ డే ఫర్ ది ఎలిమినేషన్ ఆఫ్ వయొలెన్స్ ఎగెనెస్ట్ ఉమెన్' సందర్భంగా నిర్వహించే పదహారు రోజుల అవగాహన కార్యక్రమాలకు 'డిజిటల్ హింస'ను నేపథ్యంగా ఎంచుకుంది ఐక్యరాజ్యసమితి.

డిజిటల్ హింస... ఎన్నో రూపాలు

గృహహింసనే ఇప్పటికీ సీరియస్‌గా తీసుకోని పురుషాధిక్య సమాజం మనది. ఇక డిజిటల్ వయొలెన్స్ తీవ్రతను అర్థం చేసుకుంటుందని ఆశించడం అత్యాశే. ఆ మాటే చెబుతోంది ఇటీవల వెలువడిన ఒక అధ్యయనం. 'ఎక్స్‌ప్లోరింగ్ టెక్నాలజీ ఫెసిలిటేటెడ్ జెండర్ బేస్డ్ వయొలెన్స్ ఇన్ ఇండియా' అన్న ఆ నివేదికలో అధ్యయన వివరాలతో పాటు బాధితులు, నిపుణుల ఇంటర్వ్యూలు కూడా ఉన్నాయి. వ్యక్తిగత ఫొటోలు, వీడియోలను సామాజిక మాధ్యమాలనుంచి తస్కరించి వాటితో డీప్ ఫేక్‌లు సృష్టించడం, ఇతరుల వ్యక్తిగత సమాచారాన్ని బహిరంగ వేదికలపై, అశ్లీల వెబ్‌సైట్లలో పంచుకోవడం, ఒకరిని లక్ష్యంగా చేసుకుని వేర్వేరు వేదికలపై వెంటాడి వేధించడం, ఫేక్ ఐడెంటిటీలతో లైంగిక వేధింపులకు పాల్పడడం, స్త్రీలపట్ల ద్వేషాన్నీ, స్త్రీవాదం పట్ల వ్యతిరేకతనీ ప్రచారం చేయడం (మ్యానోస్ఫియర్, ఇన్‌సెల్స్)... డిజిటల్ వయొలెన్స్ రూపాలే. ఏఐ సాంకేతికతను ఆయుధంగా మలిచాక ఇవన్నీ ఆన్‌లైన్లో పేట్రేగిపోతున్నాయి. ఐరాస అధ్యయనం ప్రకారం 38 శాతం స్త్రీలు డిజిటల్ హింసను ఎదుర్కొంటున్నారు. కులం, వర్గం, వృత్తి, వైకల్యం... లాంటి వాటిని బట్టి ఈ వేధింపుల తీవ్రత కూడా ఉంటోంది. గమనార్హం. డిజిటల్ హింస అనేది ఒక కామెంట్‌తోనో, ఇన్‌బాక్స్‌లో మెసేజ్‌తోనో... చిన్నగానే మొదలవుతుంది. అక్కడే దానికి గట్టిగా చెక్ పెట్టకపోతే అదే వెంటాడి, వేధించే పెనుముప్పుగా పరిణమిస్తుంది.

ఆన్‌లైన్ వేధింపులు విస్తృతరూపం దాలుస్తున్నాయనడానికి నిదర్శనం- 'సైబర్ బుల్లీసైడ్'(సైబర్‌బుల్లీయింగ్ కారణంగా చోటుచేసుకుంటున్న ఆత్మహత్యలు). ఈ వేధింపుల బాధితుల వ్యక్తిగత, కుటుంబ, సామాజిక, ఉద్యోగ జీవితాలపై తీవ్ర ప్రభావం చూపడమే కాదు, భౌతిక, మానసిక ఆరోగ్యాలనూ హరిస్తున్నాయి. కుంగుబాటు లోనై ఆత్మహత్యలకూ పాల్పడేలా చేస్తున్నాయి. సైబర్ బుల్లీయింగ్ బాధితుల్లో ఆత్మహత్యల ఆలోచనలు 14.5శాతం, ఆత్మహత్యా యత్నాలు 8.7శాతం ఎక్కువని ఓ అధ్యయనం చెబుతోంది. ఫిర్యాదు చేయడమంటే మరోసారి జరిగిందంతా తలచుకుని బాధపడటమేననీ, అంతా విని తమనే తప్పుపడతున్నారని బాధితులు వాపోతున్నారు. ఒకసారి ఆన్‌లైన్‌లోకి ఏదైనా వెళ్తే దాన్ని పూర్తిగా తొలగించడం దాదాపు అసాధ్యం. ప్రస్తుతమున్న ఐటీ రూల్స్ ప్రకారం న్యాయవిరుద్ధమైన కంటెంట్‌ని ఫిర్యాదు చేసిన 36 గంటల్లోపల తొలగించాలి. కానీ అందుకు బాధితులతోసహా పోలీసులు కూడా పోరాటం చేయాల్సి వస్తోంది. ఏఐ టూల్స్ దుర్వినియోగం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత టెక్నాలజీ సంస్థలదే. అవి స్పందించకపోగా తాత్సారం చేస్తున్నాయని, దాంతో తప్పనిసరై చట్టపరంగా వెళ్లాల్సి వస్తోందని, అదేమో ఎక్కువ సమయం తీసుకుంటోందని నివేదిక చెబుతోంది. భారతీయ సైబర్ చట్టాల్లోని ఖాళీల్నీ ఎత్తిచూపుతోందీ నివేదిక. ప్రస్తుతానికి ఈ కేసులన్నీ ఐటీ యాక్ట్‌లోని సెక్షన్లు 66సి, 66డి, 66ఇ, 67, 67ఎ, 67బి; భారతీయ న్యాయసంహితలోని సెక్షన్లు 75, 77, 78, 351, 356 లాంటి వాటిమీద ఆధారపడుతున్నాయి.

తప్పు మీది కాదు...

డిజిటల్ వేధింపులను ఎదుర్కొనేవారికి, అది చూసినవారికి వెంటనే ఎలా స్పందించాలో తెలియదు. అయితే ప్రతిఒక్కరూ ముందుగా అది తమ తప్పు కాదన్నది గుర్తుపెట్టుకోవాలి. వెంటనే బ్లాక్ చేసి రిపోర్ట్



చేయాలి. సాధ్యమైనచోటల్లా ఆ కాంటాక్ట్‌ని తొలగించాలి. అలాగే 'స్టాప్ ఎన్‌సీఐఐ.ఓఆర్‌జి' సాయంతో ఆయా చిత్రాలను, వీడియోలను ఆన్‌లైన్ నుంచి తీసివేయవచ్చు. తీసేసేముందు స్క్రీన్‌షాట్స్, లింక్స్, టైమ్ స్టాంప్స్ రూపంలో సాక్ష్యాలను భద్రపరచుకోవాలి. ఒక్కరే లోలోన ఆందోళన చెందకుండా నమ్మకస్తులతో షేర్ చేసుకోవాలి. ఆన్‌లైన్, సోషల్ మీడియా తదితర ఖాతాలన్నింటికీ టూ ఫ్యాక్టర్ ఆథెంటిఫికేషన్ పెట్టుకోవాలి. డిజిటల్ అబ్యూజ్ మన కళ్ల ముందు మరొకరికి జరుగుతున్నా మౌనంగా ఉండకూడదు. బాధితులతోపాటు పక్కవారు కూడా ఎదురు తిరిగినప్పుడు సంఘటనలు తగ్గుతున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. దేశవ్యాప్త హెల్ప్‌లైన్(181), నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్, మిషన్ శక్తి లాంటివి ఈ విషయంలో బాధితులకు అండగా నిలుస్తున్నాయి. లీగల్ నోటీసులు పంపడం కూడా కొంతవరకు ఉపయోగపడుతుంది. బాధితులు కోరుకునేది... సత్వర స్పందన, సానుభూతితో సమస్యను వినడం, వారి భద్రతను, గౌరవాన్ని కాపాడే పరిష్కారం. కాబట్టి వేధింపులపై ఫిర్యాదులు వచ్చినప్పుడు పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలి. ఆ భయం ఉంటేనే ఆన్‌లైన్ పోకిరీలు జడుస్తారు. మహిళలు గౌరవంగా సురక్షితంగా సంతోషంగా జీవించే హక్కును కాలరాస్తున్న డిజిటల్ హింసను కట్టడి చేయడానికి ప్రభుత్వాలు నేటి అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగానైనా గట్టి సంకల్పం చెప్పుకోవాలి.

– డి.పద్మశ్రీ

సంజయ్ ఆరంకెల జీతమున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. 'నాకు ఇంటి రుణం ఎందుకివ్వరు?' అని ఆవేశంగా అడుగుతున్నాడు బ్యాంక్ ఆఫీసర్‌ని. 'మీ సిబిల్ స్కోర్ తక్కువగా ఉంది. క్రెడిట్, డెబిట్ కార్డుల వాడకాన్ని విశ్లేషిస్తే ఖర్చులపై మీకు ఏమాత్రం నియంత్రణ లేనట్టు అర్థమవుతోంది. అందుకే మేము అప్పు ఇవ్వలే'మని ఆయనన్నాడు. సంజయ్‌కి చాలా అవమానంగా అనిపించింది. రెండురోజుల క్రితం పిల్లాడి స్కూల్ యాజమాన్యం కూడా తనని పిలిచి సున్నితంగా హెచ్చరించింది.

'మీరు మీ అమ్మానాన్నలను నిర్లక్ష్యం చేస్తున్నారు. ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు. అనవసర వివాదాల్లోనూ ఎక్కువగా ఇరుక్కుంటున్నారు. మీరు మారకపోతే మీ పిల్లాడు కూడా మిమ్మల్ని చూసి చెడిపోయే అవకాశముంది. అందుకే మీవాడికి టీసీ ఇచ్చి పంపించేయాలనుకుంటున్నాం' అంటూ



స్కోర్ పెంచుకుందామా?

ఏఐ ఆధారంగా తయారుచేసిన నివేదికను చూపిస్తూ చెప్పారు. ఆశ్చర్యపోవడం సంజయ్ వంతయింది. స్మార్ట్ ఫోన్లు వచ్చాక, వాటికి ఏఐ జత కలిశాక వ్యక్తిగత గోప్యత అనేదే లేకుండాపోయింది. అడుగుతీసి అడుగేసినా అంతా బహిరంగమే!

నిజంగానే ఇలా జరిగితే ఎలా... అని భయపడుతున్నారా? అది ఎంతో దూరంలో లేకపోవచ్చు. చైనాలో 'సోషల్ క్రెడిట్ స్కోర్ (సామాజిక పరపతి విలువ)' పేరిట పౌరులు చేసే పనులన్నింటినీ మంచీచెడుల ఆధారంగా బేరీజు వేస్తున్నారు. అందులో మంచి మార్కులు వచ్చిన వాళ్లకు విద్య, వైద్యం, ఉపాధి, రుణాలు తదితర విభాగాలకు చెందిన సంక్షేమ పథకాలన్నింట్లో ప్రత్యేక వసతులు కల్పిస్తున్నారు. అదే తక్కువ మార్కులొచ్చిన వారికి సాధారణంగా అందాల్సిన రాయితీలూ పౌరసేవల్లో ఆలస్యం చేస్తున్నారు. మన దగ్గర కూడా ఇలాంటి విధానాలను అమలుచేస్తే బ్రహ్మాండంగా ఉంటుందనుకుంటున్నారా?

పోలీసు చూడకపోతే ఎర్రలైటు వెలుగుతున్నా ఆగకుండా దూసుకుపోతాం. రోడ్డుమీద నడుస్తున్నా, వాహనం నడుపుతున్నా, పరిసరాల్ని లెక్కచేయకుండా ఫోను మాట్లాడుతూనే ఉంటాం. ఎక్కడ లైన్లో నిలబడాలన్నా, పక్కదారులెక్కడున్నాయో వెతికిపట్టుకుని మరీ దూరిపోతాం. ఆఖరికి గుళ్లో సైతం ప్రత్యేక దర్శనానికి వెంపర్లాడతాం. క్యూలలో ఉన్నవాళ్లని చేతకాని వాళ్లలాగా, పనీపాటాలేని వాళ్లుగా భావిస్తూ, తోసుకుంటూ ముందుకెళ్లిపోతాం. ఏ కార్యాలయంలో పనున్నా ఎవరి చేయి తడిపితే ఆ పని సులువుగా అవుతుందో ఆరా తీస్తాం. ప్రభుత్వం కొరడా ఝుళిపిస్తేనే మనం మారతామా? మనకంటూ సామాజిక బాధ్యత అక్కర్లేదా?

సమాచారం, సాంకేతికతల మేళవింపుతో చైనా ఈ విషయంలో ఓ నిర్ణయం తీసుకుంది. మన ప్రభుత్వాలు కూడా ఆ బాట పట్టేవరకూ వేచి చూద్దామా? మనంతట మనమే మారదామా? ప్రయత్నించి చూడకూడదూ? నిబంధనల ఉల్లంఘన లేకుండా, నియంత్రణలో జీవించడంలోని ఆనందం ఎలా ఉంటుందో అనుభవిస్తేనే తెలుస్తుంది. ఎవరికి వారు వ్యక్తులుగా మారితే సమాజం మొత్తంగా మారినట్లే కదా. అప్పుడిక ప్రభుత్వాలు సైతం ప్రోత్సాహకాలు అందించవచ్చు. ఏమంటారు..?

– శ్రీహరి

పేటెంట్ల జోరు

ఇటీవలి కాలంలో చాలామంది విద్యుత్ వాహనాలవైపు మొగ్గుతున్నారు. ప్రభుత్వాలు సైతం వాటి విక్రయాన్ని ప్రోత్సహించేందుకు రాయితీలు అందిస్తున్నాయి. ఈ క్రమంలో ఈవీ ఇంజిన్లు, వాటి కమ్యూనికేషన్ సాంకేతికతలు, నిర్వహణ, ఛార్జింగ్ స్టేషన్ తదితరాలపై పరిశోధనలు చురుగ్గా సాగుతున్నాయి. వీటికి సంబంధించి 2000 సంవత్సరంలో 5,254 పేటెంట్లు దాఖలైతే, 2021 నాటికి వాటి సంఖ్య అంతకు పదిహేను రెట్లకు పెరిగింది.



ప్రపంచవ్యాప్తంగా ఈవీ సాంకేతికతలపై ఆయా సంవత్సరాల్లో నమోదైన మొత్తం పేటెంట్ల సంఖ్య...

2015	2016	2017	2018	2019	2020	2021
34,964	43,149	57,149	66,955	78,805	82,430	77,678

(ఆధారం: ఐఆర్ఈఎన్ఏ-ఇన్‌స్పైర్ ప్లాట్‌ఫాం-2025)

ప్రయాణం... ఒక పద్మవ్యూహం!

'ఇదిగో రాజ్యం.. అర్జెంటుగా ఆ వంటింట్లో ఉన్న అంట్ల గిన్నెలన్నీ తోమేసి హాల్లోకి పట్రా. అటక మీదనున్న పాత సామాను మొత్తం కిందకి దించు. ప్రహరీ పక్కన పదేళ్లుగా పాడుబడి ఉన్న మన పండుగాడి పాత సైకిల్ దుమ్ము దులుపు. నేను బయటకెళ్లి పాతిక డజన్ల మేకులు, యాభై సెట్ల నట్లు, బోల్టులు తీసుకొస్తా'

'ఆగండాగండి.. ఏంటీ గోలంతా? ఇవాళ ఆదివారం కూడా కాదు కదా! ఏం వెలగబెడుతున్నారు?'

'అర్జెంటుగా టైమ్ మెషీన్ తయారు చేయాలి రాజ్యం!'

'హాఁ... ఏంటి మీరే?'

'ఏం నాకేం తక్కువ.. డోన్ట్ అండర్ ఎస్టిమేట్ ద పవర్ ఆఫ్ ఎ కామన్ మాన్ అని షారుఖ్‌ఖాన్ చెన్నై ఎక్స్‌ప్రెస్ టైమ్‌లోనే చెప్పాడు, మర్చిపోయావా?'


'ఆయన చెప్పాడు కరెక్టే కానీ, ఇప్పుడు అంత అర్జెంటుగా టైమ్ మెషీన్ తయారుచేసి ఎవర్ని కలుద్దాం అని? డిగ్రీలో దివ్యనా.. పాత ఆఫీసు ప్రియనా?'

'నీ అనుమానం పాడుకాను... భర్త ఎంత గొప్ప పని తలపెట్టినా మీ చాదస్తపు డౌటింగులు పోవు కదా.. నేను ఈ బృహత్తర బాధ్యతను భుజ స్కంధాలకు ఎత్తుకున్నది దేశం ఇప్పుడు చాలా క్లిష్టపరిస్థితుల్లో ఉండటం వల్ల!'

'అబ్బో.. ఏంటో ఆ సంక్లిష్ట పరిస్థితులు?'

'దేశమున రవాణా సౌకర్యాలు చదువుకునే రోజుల్లో నా జుట్టు వలె గజిబిజిగా ఉన్నవి. అందుకే అర్జెంటుగా ఆ యంత్రము కనిపెట్టి ప్రజలకు మేలు చేయ తలపెట్టితిని'

'ఏడ్చారులే కానీ.. బైకులు, బస్సులు, ఆటోలు, ట్యాక్సీలు, రైళ్లు... చివరికి ఫ్లైట్లతో సహా ఎన్ని లేవు? ఇప్పుడు మీరు కొత్తగా కనిపెట్టడానికి నేను



ప్రేమగా తోముకునే నా అంట్ల గిన్నెలే కావాలా.. అసలు ఇదంతా ఎందుకు?'

'ఎందుకంటే ఏం చెప్తాం రాజ్యం.. కడుపు చించుకుంటే కాళ్ల మీద పడుతుంది'

'అందుకే ఏమీ చించుకోకుండా చెప్పండి'

'సరే చెప్తా జాగ్రత్తగా విను. మన దేశంలో జనం బయట తిరగడం అనేది పద్మవ్యూహంలో నిలబడి పబ్‌జీ ఆడటం లాంటిది.. కోరుకున్న గమ్యాన్ని చేరుకోవడానికి అంత సాహసం చేయాలని చెప్పడం నా ఉద్దేశం. బైకు మీద వెళ్దామంటే రోడ్ల గతుకులకు మనకంటే ముందే యమధర్మరాజు దున్నపోతు మీద వచ్చి, ఓవర్‌టేక్ చేసి మరీ తీసుకుపోతున్నాడు. ఆటోలో అయినా ఆలస్యం లేకుండా వెళ్దాం అంటే.. కొందరు భయ్యాలు తోలే తోలుడుకు కడుపులో పేగులన్నీ డిస్‌ప్లేస్‌మెంట్‌కి గురవుతున్నాయి. పోన్లే ట్యాక్సీ కట్టించుకుందాం అంటే నెల జీతగాళ్లం.. ఆస్తులు రాసిమ్మంటే ఎలా చెప్పు? అదీ కాదు.. హాయిగా బస్సులో పోదాం అంటే ఎక్కడ ఆగిపోతుందో, ఎప్పుడు కాలిపోతుందో తెలియని అయోమయం... భయం. ప్రయాణం కోసం మరీ లైఫు రిస్కు చేయలేం కదా! అసలు ఇవన్నీ కాదు.. బోలెడన్ని సినిమాల్లో ప్రేయసీ ప్రేమికులకు ప్రేమించుకునే స్కోప్ ఇచ్చిన మన ప్రియతమ రైలుబండిలో వెళ్దాం అంటే కూడా బోలెడన్ని చిక్కులు. అదెప్పుడు వస్తుందో తెలీదు, ఎందుకు ఆపుతారో తెలీదు, ఎక్కడ పట్టాలు తప్పిపోతుందో అస్సలే తెలీదు, మన సీట్లో వేరే వాడు ఎందుకున్నాడో అర్థం కాదు, ఒకటికో రెంటికో పోవాలంటే.. ఆ శౌచాలయాల గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది'

'చాలా కష్టపడ్డారు కానీ.. ఈ మంచి నీళ్లు తాగండి'

'థాంక్యూ. ఇక ఇవన్నీ కాదు.. తాడో పేడో తేల్చుకుని విమానం ఎక్కేద్దాం, సాఫీగా చెక్కేద్దాం అంటే.. అవేమో ఇండిగో, నాట్ రెడీ టు గో అంటున్నాయి. మీ రూళ్లు మీవి, మా రుబ్బురోళ్లు మావి అంటూ ప్రయాణికులను నలగ్గొట్టేస్తున్నాయ్. ఇక ఎలా వేగేది చెప్పు?'

'అవును, కొత్త జంట తమ రిసెప్షన్‌కు తామే ఆన్‌లైన్‌లో హాజరయ్యే గతి పట్టింది'

భయం 'అంతేనా.. గంటల తరబడి పడిగాపులు, వస్తాయో రావో తెలీని ఫ్లైట్లూ.. ఒకటా రెండా మొత్తం వ్యవస్థే గందరగోళమైపోతేనూ..'

'అదీ నిజమే..

'హమ్మయ్య... ఇప్పటికైనా అర్ధాంగిగా నా ఆర్తనాదాలు అర్థం చేసుకున్నావ్'

'అది ఓకే గానీ మీకే ఓ విషయం అర్థం కాలేదు'

'ఏంటది?'


'టైమ్ మెషీన్ ఉండేది కాలంలో ప్రయాణించడానికి కానీ.. ఒకే కాలంలో ఒకచోట నుంచి మరో చోటుకు వెళ్లడానికి కాదు. ఈమాత్రం తెలీదుకానీ దేశాన్ని ఉద్ధరించడానికి బయల్దేరిపోయారు. అయినా మనం ఓట్లేసి తెచ్చి పెట్టుకున్న ప్రభుత్వాలున్నాయ్‌గా... ఉద్ధరించేదేదో వాటినే ఉద్ధరించనివ్వండి. ఇక మారుమాట్లాడకుండా ఆ మాగాయ పచ్చడి పెరుగులో కలిపి ముందు భోజనం ముగించండి. టైమ్ మెషీన్ కనిపెడతాడంట పెద్ద టైమ్ మెషీన్..'

'..........'

– చంద్రమౌళిక సాపిరెడ్డి

ఇంతకీ ఎలా దొరికాడంటే..

దేవగిరిలో ఉండే సుబ్బయ్య వడ్డీ వ్యాపారం చేసేవాడు. డబ్బులు మిగుల్చుకోవడానికి కొన్నిసార్లు అబద్ధాలు కూడా చెప్పేవాడు. అదే గ్రామంలో ఉండే రంగయ్య చిన్న రైతు. తనకు వచ్చిన డబ్బులో కొంత సుబ్బయ్య దగ్గర దాచుకునేవాడు. మొత్తం ఒకేసారి తీసుకుంటే కూతురు పెళ్లికి ఉపయోగపడుతుందని అతని ఆలోచన. దాంతోపాటు కొంత వడ్డీ కూడా కలిపి ఇస్తానని సుబ్బయ్య అనడం దానికి ఇంకో కారణం. కొన్నిరోజుల తరవాత రంగయ్య కూతురుకు పెళ్లి కుదిరింది. అప్పుడు వెళ్లి.. 'దగ్గర్లో మా అమ్మాయి పెళ్లి ఉంది. నేను దాచిన డబ్బు ఎంత అయిందో లెక్కగట్టి ఇవ్వండి' అని సుబ్బయ్యని అడిగాడు. 'ఇంకెక్కడి డబ్బు! మొన్న పదిహేనో తేదీన సాయంత్రమే నీ డబ్బు నీకు ఇచ్చేశాను కదా! అయినా మళ్లీ అడుగుతావేంటి?' అన్నాడు సుబ్బయ్య. ఆ మాటలు విన్న రంగయ్య ఒక్కసారిగా



కూలబడిపోయాడు. 'అయ్యా! మీరలా మాట్లాడటం సరైంది కాదు. నా డబ్బు నాకు ఇవ్వండి' అన్నాడు రంగయ్య. ఈ గొడవ గ్రామాధికారి వరకూ వెళ్లింది. కానీ రంగయ్య డబ్బు తీసుకోలేదు అనడానికి ఎలాంటి సాక్ష్యాలూ లేవు. ఏమని తీర్పు చెబుతారోనని అందరూ ఎదురుచూస్తున్నారు. అప్పుడు గ్రామాధికారి.. 'ఎలాంటి సాక్ష్యాలు లేవు కాబట్టి..' అని అంటుండగానే ఒక్క నిమిషం ఆగండని.. గోపి అనే వ్యక్తి వచ్చాడు. అతను రంగయ్య ఇంటి పక్కనే ఉంటాడు. విషయమంతా తెలుసుకున్నాడు. సుబ్బయ్య దగ్గరికి వెళ్లి.. 'మీరు రంగయ్యకి డబ్బులు ఎప్పుడు తిరిగి ఇచ్చారు' అని అడిగాడు. 'ఈ నెల పదిహేనో తేది సాయంత్రం' అన్నాడు సుబ్బయ్య. 'లేదు.. అంతా అబద్ధం! సుబ్బయ్య ఎవ్వరికీ సాయంత్రం పూట డబ్బులు ఇవ్వడు. కావాలంటే అతని దగ్గర డబ్బు తీసుకున్న ఎవరినైనా అడగండి' అన్నాడు గోపి. అక్కడున్న చాలామంది అవునంటూ సమాధానమిచ్చారు. దాంతో సుబ్బయ్యకి ఏం మాట్లాడాలో అర్థంకాలేదు. 'నా అలవాటే నా తప్పుని పట్టిస్తుందని అనుకోలేదు' అనుకుంటూ వెంటనే రంగయ్య డబ్బు ఇచ్చేశాడు.

– కూచిమంచి నాగేంద్ర

హాయ్! బుజ్జీ!!

మన సామెతలు!

ఇక్కడ కొన్ని సామెతలు అసంపూర్తిగా ఉన్నాయి. వాటిని పూర్తి చేయగలరా?

1. ▢▢ చేసి ▢▢ కూడు.
2. ▢▢ వచ్చి ▢▢ను వెక్కిరించినట్లు.
3. ▢▢ రానిది ▢▢▢▢ వస్తుందా?
4. ▢▢▢▢ వారే ▢▢▢ తీరే!

జవాబు: 1.అప్పు, పప్పు 2.గుడ్డు, పిల్ల 3.కొంటే, కొసరితే 4.ఎవరికి, యమునా

గౌరవనీయ ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏ.పి.ఇ.ఆర్.సి) వారి సమక్షంలో

విద్యుత్ నియంత్రణ భవన్, 220/132/33/11 కెవి A.P.ట్రాన్స్‌కో SS ప్రక్కన, దిన్నెదేవరపాడు రోడ్, కర్నూల్ - 518 002, ఆంధ్ర ప్రదేశ్, ఫోన్ నెం: 08518-294823, 24, 25, 26.

ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్

బహిరంగ ప్రకటన

1. ఇందుమూలంగా ఏపిఎస్‌పిడిసిఎల్ పరిధిలోని యావన్మందికి తెలియజేయునది ఏమనగా ప్రభుత్వ యాజమాన్యంలోని డిస్ట్రిబ్యూషన్ మరియు రిటైల్ సప్లయి లైసెన్స్ నెం.15/2000 కలిగి ఉన్న పంపిణీ సంస్థ "సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ (ఏపిఎస్‌పిడిసిఎల్)", ఆ.సం॥ 2026-27 నకు రిటైల్ సరఫరా వ్యాపారమునకు గాను సమగ్ర ఆదాయ అవసరాల ప్రతిపాదనలు, టారిఫ్ ప్రతిపాదనలు మరియు క్రాస్ సబ్సిడీ సర్‌చార్జీలతో సహా (ఏ.ఆర్.ఆర్, టారిఫ్ & సిఎస్ఎస్) తేది.30.11.2025 న గౌరవ ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమీషన్ (ఏపిఈఆర్‌సి) వారికి సమర్పించడమైనది. ఈ ప్రతిపాదనలను గౌరవనీయులైన కమీషను వారిచే ఓ.పి. నెం.75/2025 గా నమోదు చేయబడినవి.
2. పైన 1వ పేరాలో పేర్కొన్న ప్రతిపాదనల ప్రతులు చీఫ్ జనరల్ మేనేజర్, ఆర్ఏసి&ఐపిసి, "సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ (ఏపిఎస్‌పిడిసిఎల్)", ప్రధాన కార్యాలయం, డోర్ నెం. 19-13-65/ఎ, విద్యుత్ నిలయం, శ్రీనివాసపురం, తిరుపతి-517503 మరియు నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, కడప, అన్నమయ్య, అనంతపురం, శ్రీ సత్యసాయి, కర్నూల్ మరియు నంద్యాల సర్కిల్ లో ఉన్న సూపరింటెండింగ్ ఇంజనీర్ వారి కార్యాలయం వద్ద అందుబాటులో ఉంటాయి. ఆసక్తి గల వారు ఈ ఎ.ఆర్.ఆర్ ప్రతిపాదనలు మరియు టారిఫ్ ప్రతిపాదనలను డిస్ట్రిబ్యూషన్ కంపెనీ వారి వెబ్‌సైట్ www.apspdcl.in లో లభించును మరియు ఏపిఈఆర్‌సి వెబ్‌సైట్ www.aperc.gov.in వెబ్‌సైట్‌లో కూడా పరిశీలించవచ్చును. ప్రతిపాదనలను పైన తెలిపిన కార్యాలయాల నుండి రూ. 100/- (వ్యక్తిగతంగా నగదు రూపేణ లేదా ఎస్/కుకీ, ఏపిఎస్‌పిడిసిఎల్, తిరుపతి వారి పేరున డిడి రూపేణా) చెల్లించి పొందవచ్చును. ఈ ప్రతిపాదనల యొక్క సంక్షిప్త సమాచార ప్రతులను ఇంగ్లీష్ లేదా తెలుగు లో కాపీ ఒక్కింటికి రూ.10/- (వ్యక్తిగతంగా నగదు రూపేణా లేదా ఎస్/కుకీ, ఏపిఎస్‌పిడిసిఎల్ తిరుపతి వారి పేరున డిడి రూపేణా) చొప్పున చెల్లించి పై పేర్కొనిన కార్యాలయాలలో పొందవచ్చును.
3. డిస్ట్రిబ్యూషన్ కంపెనీ సమర్పించిన సమగ్ర ఆదాయ అవసరాల ప్రతిపాదనలు మరియు టారిఫ్ ప్రతిపాదనలు (ఏ.ఆర్.ఆర్, టారిఫ్&సిఎస్ఎస్) పై సూచనలు/అభ్యంతరాలు/సలహాలు ఏవైనా ఉన్నయెడల వాటిని సంబంధిత ఆధారాలతో జతపరిచి తేది.31.12.2025 సా॥ 5.00 గంటల లోపు అందే విధంగా రిజిస్టర్ పోస్ట్ ద్వారా లేదా వ్యక్తిగతంగా చీఫ్ జనరల్ మేనేజర్, ఆర్ఏసి&ఐపిసి, "సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ (ఏపిఎస్‌పిడిసిఎల్)", ప్రధాన కార్యాలయం డోర్ నెం. 19-13-65/ఎ, విద్యుత్ నిలయం, శ్రీనివాసపురం, తిరుపతి – 517503 గారికి పంపుతూ అట్టి పంపిన వాటి నకలును మరియు కమీషన్ సెక్రటరీ, ఏపిఈఆర్‌సి కి పైన తెలిపిన చిరునామాకు పంపవలెను. సదరు సూచనలు/అభ్యంతరాలు/సలహాలు నిర్దేశిత అనుబంధం (a) పూర్తి పేరు (a) మరియు పోస్టల్ చిరునామా (a) పొందుపరచవలెను. ఏదైనా సంస్థ లేదా ఏదైనా వినియోగదారుల కేటగిరీ తరపున సూచనలు/అభ్యంతరాలు/సలహాలు సమర్పించినట్లయితే ఆ విషయం కూడా నివేదికలో స్పష్టీకరించవలెను. తమ వాదనలు / అభ్యంతరాలను వ్యక్తిగతంగా లేదా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యక్షముగా వినిపించాలనుకొంటున్నారో ప్రత్యేకంగా పేర్కొనవలెను. సూచనలు/అభ్యంతరాలు/సలహాల వివరాలను ఈ క్రింద తెలుపబడిన పట్టికలో పొందుపరచవలెను.

అభ్యంతర దారుని పేరు, పూర్తి చిరునామా & ఫోన్ నెంబరు	సూచనలు/ అభ్యంతరాలు / సలహాల సంక్షిప్త వివరాలు	ఏపిఎస్‌పిడిసిఎల్ ప్రతిపాదనల పై అభ్యంతరాలు	ఏపిఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయమునకు అభ్యంతర ప్రతుల & పంపిన విధానము అతకపరచవలెను (అవును/కాదు)	అభ్యంతర దారు వ్యక్తిగతంగా లేక వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ కోరుచున్నారా (అవును/కాదు). అవును అయితే అతను ఏ ఆఫీస్ నుండి హాజరైనది తెలపండి

4. ఆర్థిక సంవత్సరం 2026–27 నకు లైసెన్సీలు ప్రతిపాదించిన రిటైల్ సరఫరా వ్యాపారము కొరకు ఎఆర్ఆర్, టారిఫ్ & సిఎస్ఎస్ షెడ్యూలు క్రింద పొందుపరచబడినది:

ఏపిఎస్‌పిడిసిఎల్ – ఆ.సం॥ 2026–27 యొక్క ఎఆర్ఆర్ సారాంశము

క్రమ సంఖ్య	వివరములు	2026–27 అంచనాలు (రూ॥ కోట్లలో)	క్రమ సంఖ్య	వివరములు	2026–27 అంచనాలు (రూ॥ కోట్లలో)
1	ట్రాన్స్‌మిషన్ ఖర్చు	1540.94	14	పెన్షన్ బాండ్లపై అదనపు వడ్డీ	633.06
2	ఎస్ఎల్‌డిసి ఖర్చు	51.13	15	ఇతర ఖర్చులు	60.94
3	రిటైల్ సరఫరా వ్యాపారమునకు ఆపాదించిన పంపిణీ ఖర్చు	3654.25	16	గౌరవ కమీషన్ ఆ. సం. 2024–25నకు ఆమోదించిన FPPCA సర్దుబాటు	575.44
4	పిజిసిఐఎల్ ఖర్చు	693.10	17	ఆ. సం. 2025-26 టారిఫ్ ఉత్తర్వుల ప్రకారం విద్యుత్ కొనుగోలు ఖర్చు సర్దుబాటు	97.53
5	యుఎల్‌డిసి ఖర్చు	1.95	18	సరఫరా వ్యయం (7+8+9+10+11+12+13+14+15+16+17)	17836.51
6	నెట్‌వర్క్ మరియు ఎస్ఎల్‌డిసి ఖర్చు (1+2+3+4+5)	5941.36	19	సమగ్ర ఆదాయ అవసరాలు (6+18)	23777.87
7	విద్యుత్ కొనుగోలు / సేకరణ ఖర్చు	14966.67	20	ప్రస్తుత టారిఫ్ నుండి వచ్చే రాబడి	14,016.06
8	రిటైల్ సరఫరా వ్యాపారమునకు ఆపాదించిన పంపిణీ ఖర్చు	1485.75	21	టారిఫేతర రాబడి	1,838.31
9	వినియోగదారుల ధరావత్తు మీద వడ్డీ	171.38	22	ప్రస్తుత టారిఫ్ వద్ద నికర ఆదాయం / లోటు (20+21–19)	-7923.50
10	రిటైల్ సరఫరా వ్యాపారంలో సరఫరా మార్జిన్	55.75	23	ప్రతిపాదిత టారిఫ్ మరియు ఫుల్ కాస్ట్ రికవరీ టారిఫ్ నుండి రాబడి	7733.85
11	పెట్టుబడి మూలధనంపై వడ్డీ	0.00	24	క్రాస్ సబ్సిడీ సర్ ఛార్జీ మరియు గ్రిడ్ సపోర్ట్ ఛార్జీలు	189.65
12	మొండి బకాయిలకు సదుపాయం	0.00	25	నికర ఆదాయం/లోటు (22+23+24)	0.00
13	N–2 సంవత్సరానికి (ఆ. సం. 2024–25): నియంత్రణలేని అంశముల విధింపు	-210.01			

ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్

బహిరంగ ప్రకటన

1. ఇందుమూలంగా ఏపిసిపిడిసిఎల్ పరిధిలోని యావన్మందికి తెలియజేయునది ఏమనగా ప్రభుత్వ యాజమాన్యంలోని డిస్ట్రిబ్యూషన్ లైసెన్స్ నెం.1/2020 కలిగి ఉన్న పంపిణీ సంస్థ "ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపిసిపిడిసిఎల్)", ఆ.సం॥ 2026–27 నకు రిటైల్ సరఫరా వ్యాపారమునకు గాను సమగ్ర ఆదాయ అవసరాల ప్రతిపాదనలు మరియు టారిఫ్ ప్రతిపాదనలను క్రాస్ సబ్సిడీ సర్‌చార్జీలతో సహా (ఏ.ఆర్.ఆర్, టారిఫ్ & సిఎస్ఎస్) తేది.30.11.2025 న గౌరవ ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమీషన్ (ఏపిఈఆర్‌సి) వారికి సమర్పించడమైనది. ఈ ప్రతిపాదనలను గౌరవనీయులైన కమీషను వారిచే ఓ.పి.నెం.76/2025గా నమోదు చేయబడినవి.
2. పైన 1వ పేరాలో పేర్కొన్న ప్రతిపాదనల ప్రతులు చీఫ్ జనరల్ మేనేజర్ (ప్లానింగ్), "ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపిసిపిడిసిఎల్)", ప్రధాన కార్యాలయం, గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజ్ ప్రక్కన, ఐటిఐ రోడ్, విజయవాడ –520008 మరియు ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు, సిఆర్‌డిఏ, ఒంగోలు మరియు బాపట్ల సర్కిల్‌లో ఉన్న సూపరింటెండింగ్ ఇంజనీర్ వారి కార్యాలయం వద్ద లభ్యమగును. ఆసక్తి గల వారు ఈ ఎ.ఆర్.ఆర్ ప్రతిపాదనలు మరియు టారిఫ్ ప్రతిపాదనలను కార్యాలయ వేళలలో ఉచితంగా పరిశీలించవచ్చును. ఈ ప్రతిపాదనలను డిస్ట్రిబ్యూషన్ కంపెనీ వారి వెబ్‌సైట్ www.apcpdcl.in లో లభించును మరియు ఏపిఈఆర్‌సి వెబ్‌సైట్ www.aperc.gov.in వెబ్‌సైట్‌లో కూడా పరిశీలించవచ్చును. ప్రతిపాదనలను పైన తెలిపిన వారి నుండి కాపీ ఒక్కింటికి రూ. 100/– (వ్యక్తిగతంగా నగదు రూపేణా లేదా ఏఓ/సిఎఓ, ఏపిసిపిడిసిఎల్, విజయవాడ వారి పేరున డిడి రూపేణా) చెల్లించి పైన తెలిపిన కార్యాలయాల నుండి పొందవచ్చును. ఈ ప్రతిపాదనల యొక్క సంక్షిప్త సమాచార ప్రతులను ఇంగ్లీష్ లేదా తెలుగులో కాపీ ఒక్కింటికి రూ.10/– (వ్యక్తిగతంగా నగదు రూపేణా లేదా ఏఓ/సిఎఓ, ఏపిసిపిడిసిఎల్, విజయవాడ వారి పేరున డిడి రూపేణా) చొప్పున చెల్లించి పై పేర్కొనిన కార్యాలయాలలో పొందవచ్చును.
3. డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ప్రతిపాదించిన సమగ్ర ఆదాయ అవసరాల ప్రతిపాదనలు మరియు టారిఫ్ ప్రతిపాదనలు (ఏ.ఆర్.ఆర్, టారిఫ్ & సిఎస్ఎస్) పై సూచనలు/అభ్యంతరాలు/సలహాలు ఏవైనా ఉన్నయెడల వాటిని సంబంధిత ఆధారాలతో జతపరిచి తేది.31.12.2025 సా॥ 5.00 గంటల లోపు అందే విధంగా రిజిస్టర్ పోస్ట్ ద్వారా లేదా వ్యక్తిగతంగా గాని సదరు అభ్యంతరాల ప్రతులను ఏపిసిపిడిసిఎల్, కార్పొరేట్ కార్యాలయాలలో చీఫ్ జనరల్ మేనేజర్ (ప్లానింగ్), "ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపిసిపిడిసిఎల్)", ప్రధాన కార్యాలయం, గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజ్ ప్రక్కన, ఐటిఐ రోడ్, విజయవాడ – 520008 గారికి పంపుతూ అట్టి పంపిన వాటి నకలును మరియు కమీషన్ సెక్రటరీ, ఏపిఈఆర్‌సి కి పైన తెలిపిన చిరునామాకు పంపవలెను. సదరు సూచనలు/అభ్యంతరాలు/సలహాలు నిర్దేశిత అనుబంధం (a) పూర్తి పేరు (a) మరియు పోస్టల్ చిరునామా (a) పొందుపరచవలెను. ఏదైనా సంస్థ లేదా ఏదైనా వినియోగదారుల కేటగిరీ తరపున సూచనలు/అభ్యంతరాలు/సలహాలు సమర్పించినట్లయితే ఆ విషయం కూడా నివేదికలో స్పష్టీకరించవలెను. తమ వాదనలు / అభ్యంతరాలను వ్యక్తిగతంగా లేదా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యక్షముగా వినిపించాలనుకొంటున్నారో ప్రత్యేకంగా పేర్కొనవలెను. సూచనలు/అభ్యంతరాలు/సలహాల వివరాలను ఈ క్రింద తెలుపబడిన పట్టికలో పొందుపరచవలెను.

అభ్యంతర దారుని పేరు, పూర్తి చిరునామా & ఫోన్ నెంబరు	సూచనలు/ అభ్యంతరాలు / సలహాల సంక్షిప్త వివరాలు	ఏపిసిపిడిసిఎల్ ప్రతిపాదనల పై అభ్యంతరాలు	ఏపిసిపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయమునకు అభ్యంతర ప్రతుల & పంపిన విధానము అతకపరచవలెను (అవును/కాదు)	అభ్యంతర దారు వ్యక్తిగతంగా లేక వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ కోరుచున్నారా (అవును/కాదు). అవును అయితే అతను ఏ ఆఫీస్ నుండి హాజరైనది తెలపండి

4. ఆర్థిక సంవత్సరం 2026–27 నకు లైసెన్సీలు ప్రతిపాదించిన రిటైల్ సరఫరా వ్యాపారము కొరకు ఎఆర్ఆర్, టారిఫ్ & సిఎస్ఎస్ షెడ్యూలు క్రింద పొందుపరచబడినది:

ఏపిసిపిడిసిఎల్ – ఆ.సం॥ 2026–27 యొక్క ఎఆర్ఆర్ సారాంశము

క్రమ సంఖ్య	వివరములు	2026–27 అంచనాలు (రూ॥ కోట్లలో)	క్రమ సంఖ్య	వివరములు	2026–27 అంచనాలు (రూ॥ కోట్లలో)
1	ట్రాన్స్‌మిషన్ ఖర్చు	938.63	14	పెన్షన్ బాండ్లపై అదనపు వడ్డీ	385.61
2	ఎస్ఎల్‌డిసి ఖర్చు	31.14	15	ఇతర ఖర్చులు	61.67
3	రిటైల్ సరఫరా వ్యాపారమునకు ఆపాదించిన పంపిణీ ఖర్చు	2223.93	16	గౌరవ కమీషన్ ఆ. సం. 2024–25నకు ఆమోదించిన FPPCA సర్దుబాటు	510.79
4	పిజిసిఐఎల్ ఖర్చు	422.19	17	ఆ. సం. 2025-26 టారిఫ్ ఉత్తర్వుల ప్రకారం విద్యుత్ కొనుగోలు ఖర్చు సర్దుబాటు	35.41
5	యుఎల్‌డిసి ఖర్చు	1.19	18	సరఫరా వ్యయం (7+8+9+10+11+12+13+14+15+16+17)	10829.85
6	నెట్‌వర్క్ మరియు ఎస్ఎల్‌డిసి ఖర్చు (1+2+3+4+5)	3617.08	19	సమగ్ర ఆదాయ అవసరాలు (6+18)	14446.93
7	విద్యుత్ కొనుగోలు / సేకరణ ఖర్చు	9169.38	20	ప్రస్తుత టారిఫ్ నుండి వచ్చే రాబడి	10344.51
8	రిటైల్ సరఫరా వ్యాపారమునకు ఆపాదించిన పంపిణీ ఖర్చు	806.87	21	టారిఫేతర రాబడి	613.27
9	వినియోగదారుల ధరావత్తు మీద వడ్డీ	113.25	22	ప్రస్తుత టారిఫ్ వద్ద నికర ఆదాయం / లోటు (20+21–19)	-3489.15
10	రిటైల్ సరఫరా వ్యాపారంలో సరఫరా మార్జిన్	0.00	23	ప్రతిపాదిత టారిఫ్ మరియు ఫుల్ కాస్ట్ రికవరీ టారిఫ్ నుండి రాబడి	3465.35
11	పెట్టుబడి మూలధనంపై వడ్డీ	–	24	క్రాస్ సబ్సిడీ సర్ ఛార్జీ మరియు గ్రిడ్ సపోర్ట్ ఛార్జీలు	23.80
12	మొండి బకాయిలకు సదుపాయం	3.32	25	నికర ఆదాయం/లోటు (22+23+24)	0.00
13	N–2 సంవత్సరానికి (ఆ. సం. 2024–25): నియంత్రణలేని అంశముల విధింపు	-256.45			

ఆంధ్రప్రదేశ్ ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్

బహిరంగ ప్రకటన

1. ఇందుమూలంగా ఏపిఈపిడిసిఎల్ పరిధిలోని యావన్మందికి తెలియజేయునది ఏమనగా ప్రభుత్వ యాజమాన్యంలోని డిస్ట్రిబ్యూషన్ మరియు రిటైల్ సప్లయి లైసెన్స్ నెం.12/2000 కలిగి ఉన్న పంపిణీ సంస్థ "ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ (ఏపిఈపిడిసిఎల్)", ఆ.సం॥ 2026–27 నకు రిటైల్ సరఫరా వ్యాపారమునకు గాను సమగ్ర ఆదాయ అవసరాల ప్రతిపాదనలు మరియు టారిఫ్ ప్రతిపాదనలను క్రాస్ సబ్సిడీ సర్‌చార్జీలతో సహా (ఏ.ఆర్.ఆర్, టారిఫ్ & సిఎస్ఎస్) తేది.30.11.2025 న గౌరవ ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమీషన్ (ఏపిఈఆర్‌సి) వారికి సమర్పించడమైనది. ఈ ప్రతిపాదనలను గౌరవనీయులైన కమీషను వారిచే ఓ.పి. నెం.77/2025గా నమోదు చేయబడినవి.
2. పైన 1వ పేరాలో పేర్కొన్న ప్రతిపాదనల ప్రతులు చీఫ్ జనరల్ మేనేజర్ (ఆర్.ఏ.సి), "ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ (ఏపిఈపిడిసిఎల్)", ప్రధాన కార్యాలయం, పి & టి కాలనీ, సీతమ్మధార, విశాఖపట్నం–530013 మరియు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి, డా.బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు మరియు పశ్చిమగోదావరి సర్కిల్ లో ఉన్న సూపరింటెండింగ్ ఇంజనీర్ వారి కార్యాలయం వద్ద లభ్యమగును. ఆసక్తి గల వారు ఈ ఎ.ఆర్.ఆర్ ప్రతిపాదనలు మరియు టారిఫ్ ప్రతిపాదనలను కార్యాలయ వేళలలో ఉచితంగా పరిశీలించవచ్చును. ఈ ప్రతిపాదనలను డిస్ట్రిబ్యూషన్ కంపెనీ వారి వెబ్‌సైట్ www.apeasternpower.com లో లభించును మరియు ఏపిఈఆర్‌సి వెబ్‌సైట్ www.aperc.gov.in వెబ్‌సైట్‌లో కూడా పరిశీలించవచ్చును. ప్రతిపాదనలను పైన తెలిపిన వారి నుండి కాపీ ఒక్కింటికి రూ. 100/– (వ్యక్తిగతంగా నగదు రూపేణా లేదా పే ఆఫీసర్, ఏపిఈపిడిసిఎల్, విశాఖపట్నం వారి పేరున డిడి రూపేణా) చెల్లించి పైన తెలిపిన కార్యాలయాల నుండి పొందవచ్చును. ఈ ప్రతిపాదనల యొక్క సంక్షిప్త సమాచార ప్రతులను ఇంగ్లీష్ లేదా తెలుగులో కాపీ ఒక్కింటికి రూ.10/– (వ్యక్తిగతంగా నగదు రూపేణా లేదా పే ఆఫీసర్, ఏపిఈపిడిసిఎల్, విశాఖపట్నం వారి పేరున డిడి రూపేణా) చొప్పున చెల్లించి పై పేర్కొనిన కార్యాలయాలలో పొందవచ్చును.
3. డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ప్రతిపాదించిన సమగ్ర ఆదాయ అవసరాల ప్రతిపాదనలు మరియు టారిఫ్ ప్రతిపాదనలు (ఏ.ఆర్.ఆర్, టారిఫ్& సిఎస్ఎస్) పై సూచనలు/అభ్యంతరాలు/సలహాలు ఏవైనా ఉన్నయెడల వాటిని సంబంధిత ఆధారాలతో జతపరిచి తేది.31.12.2025 సా॥ 5.00 గంటల లోపు అందే విధంగా రిజిస్టర్ పోస్ట్ ద్వారా లేదా వ్యక్తిగతంగా గాని సదరు అభ్యంతరాల ప్రతులను ఏపిఈపిడిసిఎల్, కార్పొరేట్ కార్యాలయాలలో చీఫ్ జనరల్ మేనేజర్ (ఆర్.ఏ.సి), "ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ (ఏపిఈపిడిసిఎల్)", పి & టి కాలనీ, సీతమ్మధార, విశాఖపట్నం–530013 గారికి పంపుతూ అట్టి పంపిన వాటి నకలును మరియు కమీషన్ సెక్రటరీ, ఏపిఈఆర్‌సి కి పైన తెలిపిన చిరునామాకు పంపవలెను. సదరు సూచనలు/అభ్యంతరాలు/సలహాలు నిర్దేశిత అనుబంధం (a) పూర్తి పేరు (a) మరియు పోస్టల్ చిరునామా (a) పొందుపరచవలెను. ఏదైనా సంస్థ లేదా ఏదైనా వినియోగదారుల కేటగిరీ తరపున సూచనలు/అభ్యంతరాలు/సలహాలు సమర్పించినట్లయితే ఆ విషయం కూడా నివేదికలో స్పష్టీకరించవలెను. తమ వాదనలు / అభ్యంతరాలను వ్యక్తిగతంగా లేదా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యక్షముగా వినిపించాలనుకొంటున్నారో ప్రత్యేకంగా పేర్కొనవలెను. సూచనలు/అభ్యంతరాలు/సలహాల వివరాలను ఈ క్రింద తెలుపబడిన పట్టికలో పొందుపరచవలెను.

అభ్యంతర దారుని పేరు, పూర్తి చిరునామా & ఫోన్ నెంబరు	సూచనలు/ అభ్యంతరాలు / సలహాల సంక్షిప్త వివరాలు	ఏపిఈపిడిసిఎల్ ప్రతిపాదనల పై అభ్యంతరాలు	ఏపిఈపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయమునకు అభ్యంతర ప్రతుల & పంపిన విధానము అతకపరచవలెను (అవును/కాదు)	అభ్యంతర దారు వ్యక్తిగతంగా లేక వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ కోరుచున్నారా (అవును/కాదు). అవును అయితే అతను ఏ ఆఫీస్ నుండి హాజరైనది తెలపండి

4. ఆర్థిక సంవత్సరం 2026–27 నకు లైసెన్సీలు ప్రతిపాదించిన రిటైల్ సరఫరా వ్యాపారము కొరకు ఎఆర్ఆర్, టారిఫ్ & సిఎస్ఎస్ షెడ్యూలు క్రింద పొందుపరచబడినది:

ఏపిఈపిడిసిఎల్ – ఆ.సం॥ 2026–27 యొక్క ఎఆర్ఆర్ సారాంశము

క్రమ సంఖ్య	వివరములు	2026–27 అంచనాలు (రూ॥ కోట్లలో)	క్రమ సంఖ్య	వివరములు	2026–27 అంచనాలు (రూ॥ కోట్లలో)
1	ట్రాన్స్‌మిషన్ ఖర్చు	1458.68	14	పెన్షన్ బాండ్లపై అదనపు వడ్డీ	599.26
2	ఎస్ఎల్‌డిసి ఖర్చు	48.40	15	ఇతర ఖర్చులు	30.86
3	రిటైల్ సరఫరా వ్యాపారమునకు ఆపాదించిన పంపిణీ ఖర్చు	2765.94	16	గౌరవ కమీషన్ ఆ. సం. 2024–25నకు ఆమోదించిన FPPCA సర్దుబాటు	-1086.23
4	పిజిసిఐఎల్ ఖర్చు	656.10	17	ఆ. సం. 2025-26 టారిఫ్ ఉత్తర్వుల ప్రకారం విద్యుత్ కొనుగోలు ఖర్చు సర్దుబాటు	-115.26
5	యుఎల్‌డిసి ఖర్చు	1.85	18	సరఫరా వ్యయం (7+8+9+10+11+12+13+14+15+16+17)	16799.62
6	నెట్‌వర్క్ మరియు ఎస్ఎల్‌డిసి ఖర్చు (1+2+3+4+5)	4930.97	19	సమగ్ర ఆదాయ అవసరాలు (6+18)	21730.59
7	విద్యుత్ కొనుగోలు / సేకరణ ఖర్చు	14266.28	20	ప్రస్తుత టారిఫ్ నుండి వచ్చే రాబడి	16,550.98
8	రిటైల్ సరఫరా వ్యాపారమునకు ఆపాదించిన పంపిణీ ఖర్చు	1219.06	21	టారిఫేతర రాబడి	567.29
9	వినియోగదారుల ధరావత్తు మీద వడ్డీ	194.02	22	ప్రస్తుత టారిఫ్ వద్ద నికర ఆదాయం / లోటు (20+21–19)	-4612.32
10	రిటైల్ సరఫరా వ్యాపారంలో సరఫరా మార్జిన్	0.00	23	ప్రతిపాదిత టారిఫ్ మరియు ఫుల్ కాస్ట్ రికవరీ టారిఫ్ నుండి రాబడి	4452.73
11	పెట్టుబడి మూలధనంపై వడ్డీ	–	24	క్రాస్ సబ్సిడీ సర్ ఛార్జీ మరియు గ్రిడ్ సపోర్ట్ ఛార్జీలు	159.59
12	మొండి బకాయిలకు సదుపాయం	28.90	25	నికర ఆదాయం/లోటు (22+23+24)	0.00
13	N–2 సంవత్సరానికి (ఆ. సం. 2024–25): నియంత్రణలేని అంశముల విధింపు	1662.72			

ఆర్థిక సంవత్సరం 2026–27నకు రిటైల్ సరఫరా వ్యాపారం కొరకు ప్రతిపాదించిన టారిఫ్ షెడ్యూలు

కేటగిరి	వినియోగదారుని కేటగిరి	ఎల్ టి సరఫరా: స్థిర / డిమాండ్ ఛార్జీలు నెలకు (రూ॥ / హెచ్ పి లేక కిలో వాటు)	ఎల్ టి సరఫరా: ఎనర్జీ ఛార్జీలు (రూ॥ / యూనిట్)	జి.ఓ.ఆర్.టి. నెం. 161, తేదీ. 15-11-2021 ప్రకారం ప్రతిపాదించిన ఫుల్ కాస్ట్ రికవరీ ఛార్జీలు రూ॥ / యూనిట్: ఏపిఎస్‌పిడిసిఎల్	ఏపిసిపిడిసిఎల్	ఏపిఈపిడిసిఎల్	బిల్లింగ్ యూనిట్	హెచ్ టి సరఫరా: స్థిర / డిమాండ్ ఛార్జీలు నెలకు (రూ॥/కెవిఏ)	హెచ్ టి ఎనర్జీ ఛార్జీలు (రూ॥ / యూనిట్): 11 కెవి	33 కెవి	132 కెవి	220 కెవి	ఫుల్ కాస్ట్ రికవరీ ఛార్జీలు
I	గృహ వినియోగం												ఏపిఎస్‌పిడిసిఎల్, ఏపిసిపిడిసిఎల్, ఏపిఈపిడిసిఎల్‌లకు సంబంధించి అన్ని హెచ్‌టి కేటగిల ఎనర్జీ ఛార్జీలతో సమానంగా ఫుల్‌కాస్ట్ రికవరీ ఛార్జీలు ఉంటాయి.
	(A) : గృహ వినియోగం (టెలిస్కోపిక్)												
	0–30	10	1.90	4.12	5.16	5.00	kWh	-	-	-	-	-	
	31–75	10	3.00	4.50	5.70	5.17	kWh	-	-	-	-	-	
	76–125	10	4.50	5.50	6.68	5.51	kWh	-	-	-	-	-	
	126–225	10	6.00	6.00	7.72	7.15	kWh	-	-	-	-	-	
	226–400	10	8.75	8.75	8.75	8.75	kWh	-	-	-	-	-	
	>400	10	9.75	9.75	9.75	9.75	kWh	-	-	-	-	-	
	బి) టౌన్ షిప్‌లు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు మరియు విల్లాలు	–	–	–	–	–	kVAh	75	7.00	7.00	7.00	7.00	
II	వాణిజ్యము మరియు ఇతరములు												
	A (i) : వాణిజ్యము												
	0-50	75	5.40	5.40	5.40	5.40	kWh/kVAh	475	7.65	6.95	6.70	6.65	
	51-100		7.65	7.65	7.65	7.65	kWh/kVAh						
	101-300		9.05	9.05	9.05	9.05	kWh/kVAh						
	301-500		9.60	9.60	9.60	9.60	kWh/kVAh						
	500 యూనిట్లు పైబడి		9.95	9.95	9.95	9.95	kWh/kVAh						
	టైమ్ ఆఫ్ డే టారిఫ్ (టిఒడి)– పీక్ (19.00 నుండి 23.00 వరకు) లోడ్ ≥10 కిలో వాటు (ప్రీమియం)	-	+1.00	+1.00	+1.00	+1.00	-		-	-	-	-	
	టైమ్ ఆఫ్ డే టారిఫ్ (టిఒడి)– ఆఫ్ పీక్ (09.00 నుండి 17.00 వరకు) లోడ్ ≥ 10 కిలో వాటు(ప్రీమియం/ రాయితీ)	-	0.00	0.00	0.00	0.00	-		-	-	-	-	
	టైమ్ ఆఫ్ డే టారిఫ్ (టిఒడి)– పీక్ (19.00 నుండి 23.00 వరకు)	-	-	-	-	-	kWh/ kVAh		8.65	7.95	7.70	7.65	
	టైమ్ ఆఫ్ డే టారిఫ్ (టిఒడి)– ఆఫ్ పీక్ (09.00 నుండి 17.00 వరకు) (లోడ్ > 75 కిలో వాటు)	-	-	-	-	-	kWh/ kVAh		7.65	6.95	6.70	6.65	
	(ii) ప్రకటన హోర్డింగులు	200	9.95	9.95	9.95	9.95	kWh/kVAh	-	-	-	-	-	
	(iii) ఫంక్షన్ హాల్‌లు / ఆడిటోరియంలు	200	9.95	9.95	9.95	9.95	kWh/kVAh	200	9.95	9.95	9.95	9.95	
	(బి): స్టార్టప్ పవర్	-	9.95	9.95	9.95	9.95	kWh/kVAh	-	9.95	9.95	9.95	9.95	
	(సి): విద్యుత్ వాహనాలు (ఇవిలు) / చార్జింగ్ స్టేషన్‌లు	-	6.70	6.70	6.70	6.70	kWh/kVAh	-	6.70	6.70	6.70	6.70	
III	పరిశ్రమలు												
	(ఎ) : పరిశ్రమలు (సాధారణ)	75	6.70	6.70	6.70	6.70	kWh/kVAh	475	-	-	-	-	
	టైమ్ ఆఫ్ డే టారిఫ్ (టిఒడి)– పీక్ (19.00 నుండి 23.00 వరకు) (లోడ్ ≥ 10 కిలో వాటు/13.4 హెచ్.పి. నుండి ≤ 75 కిలో వాటు/100 హెచ్.పి వరకు (ప్రీమియం)	75	+1.00	+1.00	+1.00	+1.00			-	-	-	-	
	టైమ్ ఆఫ్ డే టారిఫ్ (టిఒడి)– పీక్ (19.00 నుండి 23.00 వరకు) (లోడ్ >75 కిలో వాటు/100 హెచ్.పి నుండి 112 కిలో వాటు/150 హెచ్.పి (ప్రీమియం) (ఐచ్ఛికం తో)	275	+1.00	+1.00	+1.00	+1.00			-	-	-	-	
	టైమ్ ఆఫ్ డే టారిఫ్ (టిఒడి)– ఆఫ్ పీక్ (09.00 నుండి 17.00 వరకు) (లోడ్ ≥10 కిలో వాటు/13.4 హెచ్.పి నుండి ≤ 75 కిలో వాటు/100 హెచ్.పి వరకు) (ప్రీమియం/ రాయితీ)	75	-1.00	-1.00	-1.00	-1.00			-	-	-	-	
	టైమ్ ఆఫ్ డే టారిఫ్ (టిఒడి)– ఆఫ్ పీక్ (09.00 నుండి 17.00 వరకు) (లోడ్ >75 కిలో వాటు/100 హెచ్.పి నుండి 112 కిలో వాటు/150 హెచ్.పి) (ప్రీమియం/ రాయితీ) (ఐచ్ఛికం తో)	275	-1.00	-1.00	-1.00	-1.00			-	-	-	-	
	టైమ్ ఆఫ్ డే టారిఫ్ (టిఒడి) (అధిక విద్యుత్ డిమాండ్) (ఫిబ్రవరి '27, మార్చి '27), (ఏప్రిల్'26 – మే '26) & (సెప్టెంబర్ '26 – అక్టోబర్ '26)	-	-	-	-	-			-	-	-	-	
	పీక్ (05–09) & (19–23)	-	-	-	-	-			7.80	7.35	6.90	6.85	
	ఆఫ్–పీక్ (09–17)	-	-	-	-	-			5.55	5.10	4.65	4.60	
	సాధారణం (17–19) & (23–24) & (00–05)	-	-	-	-	-			6.30	5.85	5.40	5.35	
	టైమ్ ఆఫ్ డే టారిఫ్ (టిఒడి) (తక్కువ విద్యుత్ డిమాండ్) (జూన్ '26–ఆగస్ట్ '26) & (నవంబర్ '26 – జనవరి '27)	-	-	-	-	-			-	-	-	-	
	పీక్ (05–09) & (19–23)	-	-	-	-	-			7.30	6.85	6.40	6.35	
	ఆఫ్–పీక్ (09–17)	-	-	-	-	-			5.55	5.10	4.65	4.60	
	సాధారణం (17–19) & (23–24) & (00–05)	-	-	-	-	-			6.30	5.85	5.40	5.35	
	పరిశ్రమల కాలనీలు	-	-	-	-	-	kWh/kVAh	-	7.00	7.00	7.00	7.00	
	(బి) : సీజనల్ పరిశ్రమలు (ఆఫ్ సీజన్)	75	7.45	7.45	7.45	7.45	kWh/kVAh	475	7.65	6.95	6.70	6.65	
	(సి) (i): ఎనర్జీ ఇంటెన్సివ్ పరిశ్రమలు	-	-	-	-	-	kWh/kVAh	475	5.80	5.35	4.95	4.90	
	(సి) (ii): జి. ఒ . ఐ – పి ఎల్ ఐ స్కీమ్ క్రింద కేటాయించబడిన పివి సోలార్ మాడ్యూల్ తయారీ పరిశ్రమలు	-	-	-	-	-	kWh/ kVAh	-	4.00	4.00	4.00	4.00	
	(డి) : కుటీర పరిశ్రమలు 10 హెచ్ పి★ వరకు	20	3.75	3.75	3.75	3.75	kWh	-	-	-	-	-	
	*- గవర్నమెంట్ జారీ జేసిన ఉత్తర్వులు సూచిక జి.ఒ. నెం. 75, తేది. 27–06–2018 ప్రకారం ధోబి ఘాట్లకు ఉచిత విద్యుత్ సరఫరాను విస్తరించాలి.												
IV	ఇన్‌స్టిట్యూషనల్												
	(ఎ) : యుటిలిటీస్ (వీధి దీపాలు, యన్.టి.ఆర్ సుజల పథకం, (సిపిడబ్ల్యూయస్ మరియు పిడబ్ల్యూయస్)	75	7.00	7.00	7.00	7.00	kWh/ kVAh	475	7.65	6.95	6.70	6.65	
	(బి) : సాధారణ ప్రయోజనాలు	75	7.00	7.00	7.00	7.00	kWh/ kVAh	475	7.95	7.25	7.00	6.95	
	(సి) (i) : మత సంబంధమైన ప్రదేశాలు ≤ 2kW	30	3.85	3.85	3.85	3.85	kWh/ kVAh	30	5.00	5.00	5.00	5.00	
	(సి) (ii) : మత సంబంధమైన ప్రదేశాలు > 2kW		5.00	5.00	5.00	5.00							
	(డి) : రైల్వే ట్రాక్షన్	-	-	-	-	-	kVAh	350	6.50	6.50	6.50	6.50	
V	వ్యవసాయం మరియు సంబంధిత												
	(ఎ) వ్యవసాయం												
	(i) కార్పొరేట్ రైతులు	-	3.50	3.50	7.69	7.75	kWh	-	-	-	-	-	
	(ii) కార్పొరేట్ రైతులు కానివారు	-	-	7.94	8.06	7.99	-	-	-	-	-	-	
	(iii) ఉప్పు తయారీ కేంద్రాలు 15 హెచ్ పి వరకు	-	2.50	2.50	7.53	7.73	kWh/ kVAh	-	-	-	-	-	
	(iv) చెఱకు గానుగ	-	-	7.94	8.13	7.55	-	-	-	-	-	-	
	(v) గ్రామీణ ఉద్యానవన నర్సరీలు	-	-	7.94	7.99	6.63	-	-	-	-	-	-	
	(vi) : ఫ్లోరీ కల్చర్ ఇన్ గ్రీన్ హౌస్	75	4.50	4.50	7.05	6.58	kWh/ kVAh	-	-	-	-	-	
	(బి) : ఆక్వా కల్చర్ మరియు పశు సంపర్ధక	30	3.85	6.00	7.53	7.49	kWh/ kVAh	30	3.85	3.85	3.85	3.85	
	(డి) : వ్యవసాయ ఆధారిత కుటీర పరిశ్రమలు 10 హెచ్ పి వరకు	20	3.75	3.75	7.44	7.09	kWh	-	-	-	-	-	
	(ఇ) : ప్రభుత్వ / ప్రైవేట్ ఎత్తిపోతల సరఫరా	-	6.40	6.40	7.70	6.40	kVAh	-	7.15	7.15	7.15	7.15	

గమనిక: (i) తాత్కాలిక సరఫరా : తాత్కాలిక సరఫరా కొరకు విడిగా కేటగిరి లేదు. అయినప్పటికి, ప్రతి కేటగిరికి వర్తించు నియమ నిబంధనలతో సంబంధిత కేటగిరిలో తాత్కాలిక సరఫరా విడుదల చేయటం జరుగుతుంది మరియు ఈ ఉత్తర్వులో నిర్దేశించిన ధరలు మరియు ఇతర షరతుల ప్రకారం బిల్లింగు చేయబడును. (ii) హెచ్ టి సప్లై లేదా ఎల్ టి సప్లై సందు నిర్వచించని కేటగిరీలకు కేటగిరి ఎ (i) – వాణిజ్యం సూచించిన రేట్లతో బిల్లు చేయబడతాయి. (iii) అన్ని ఇతర షరతులు ఆర్థిక సంవత్సరం 2025–26 యొక్క రిటైల్ సరఫరా ఉత్తర్వులోని చాప్టర్–XI ప్రకారం ఉంటాయి. (iv) హెచ్ టి (iii) (సి) (ii): జి. ఒ . ఐ – పి ఎల్ ఐ స్కీమ్ క్రింద కేటాయించబడిన పివి సోలార్ మాడ్యూల్ తయారీ పరిశ్రమలకు మొదటి ఏడు సంవత్సరాలకు రూ.4.00/యూనిట్ చొప్పున మరియు తదుపరి ఎనిమిది సంవత్సరాలకు రూ.4.50/యూనిట్‌గా ప్రతిపాదించడమైనది. (v) నెట్ మీటరింగ్ లేదా నెట్ బిల్లింగ్ పద్ధతులలో సోలార్ రూఫ్‌టాప్ ఇన్‌స్టాలేషన్‌లు లేదా మీటర్ తరువాత వున్న ఆమోదిత బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (BESS) కలిగిన ఏదైనా వినియోగదారుడు లేదా సంస్థ యొక్క ఇంపోర్ట్ ఎనర్జీకి, సంబంధిత కేటగిరీ టారిఫ్ ప్రకారం నాన్–టెలిస్కోపిక్ విధానంలో బిల్లు చేయబడుతుంది.

ఆర్థిక సంవత్సరం 2026–27 కొరకు ప్రతిపాదించిన క్రాస్ సబ్సిడీ సర్‌చార్జ్ ధరలు క్రింద తెలుపబడినవి

కేటగిరి		హెచ్‌టి సరఫరా	వర్తించే సియస్‌యస్ (రూ॥ / యూనిట్): ఏపిఎస్‌పిడిసిఎల్	ఏపిసిపిడిసిఎల్	ఏపిఈపిడిసిఎల్
11 కె.వి. వద్ద					
I	B	టౌన్ షిప్‌లు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు మరియు విల్లాలు	0.35	0.66	0.42
II	A (i)	వాణిజ్యము	2.11	2.35	2.23
II	A (iii)	ఫంక్షన్ హాళ్ళు / ఆడిటోరియంలు	3.41	3.61	2.45
II	B	స్టార్టప్ పవర్	1.99	1.99	2.45
III	A	పరిశ్రమలు (సాధారణ)	1.92	1.85	1.65
III	B	సీజనల్ పరిశ్రమలు	2.42	1.64	2.75
III	C (i)	ఎనర్జీ ఇంటెన్సివ్ పరిశ్రమలు	1.05	1.69	--
IV	A	యుటిలిటీలు	1.88	1.81	1.92
IV	B	సాధారణ ప్రయోజనము	2.31	2.15	2.26
V	E	ప్రభుత్వ / ప్రైవేట్ లిఫ్ట్ ఇరిగేషన్	--	0.11	0.097
33 కె.వి. వద్ద					
I	B	టౌన్ షిప్ లు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీస్ మరియు విల్లాలు	1.52	1.50	1.47
II	A (i)	వాణిజ్యము	2.32	1.86	2.14
II	B	స్టార్టప్ పవర్	1.99	1.99	2.45
II	C	విద్యుత్ వాహనాలు (ఇవిలు) / ఛార్జింగ్ స్టేషన్లు	--	0.81	--
III	A	పరిశ్రమలు సాధారణ	1.55	1.55	1.49
III	B	సీజనల్ పరిశ్రమలు	2.21	1.59	2.15
III	C (i)	ఎనర్జీ ఇంటెన్సివ్ పరిశ్రమలు	0.23	--	0.28
IV	A	యుటిలిటీలు	1.78	--	2.14
IV	B	సాధారణ ప్రయోజనము	1.93	1.75	2.05
V	E	ప్రభుత్వ / ప్రైవేట్ లిఫ్ట్ ఇరిగేషన్	1.07	1.26	1.27
132 కె.వి.వద్ద					
II	A (i)	వాణిజ్యము	1.70	--	2.01
II	B	స్టార్టప్ పవర్	1.99	1.99	2.45
III	A	పరిశ్రమలు సాధారణ	1.38	1.40	1.46
III	C (i)	ఎనర్జీ ఇంటెన్సివ్ పరిశ్రమలు	0.16	--	0.56
IV	D	రైల్వే ట్రాక్షన్	1.65	1.57	1.59
V	E	ప్రభుత్వ / ప్రైవేట్ లిఫ్ట్ ఇరిగేషన్	1.43	1.43	--
220 కె.వి.వద్ద					
II	A (i)	వాణిజ్యము	--	--	1.67
II	B	స్టార్టప్ పవర్	--	--	2.45
III	A	పరిశ్రమలు సాధారణ	1.59	1.96	1.39
III	C (i)	ఎనర్జీ ఇంటెన్సివ్ పరిశ్రమలు	--	--	1.60
IV	D	రైల్వే ట్రాక్షన్	1.68	--	--
V	E	ప్రభుత్వ / ప్రైవేట్ లిఫ్ట్ ఇరిగేషన్	1.43	--	1.43

5. కమీషన్ బహిరంగ విచారణను హైబ్రిడ్ పద్ధతి (అనగా వ్యక్తిగతంగా మరియు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా) నిర్వహించవలెనని నిర్ణయించినది. బహిరంగ విచారణలు మూడు డిస్కంలకు కలిపి 20.01.2026 తిరుపతిలో, 22.01.2026, 23.01.2026 విజయవాడలో మరియు 27.01.2026 తేదీన కార్యాలయ సమావేశ మందిరము (గ్రౌండ్ ఫ్లోర్) కర్నూలు నందు ఉదయం 10.30 గంటల నుండి మ॥ 01.00 వరకు మరియు మ॥ గం. 2.00 నుండి సా॥ గం. 04.30 వరకు జరుపబడును.

గమనిక : ఉదయపు సభాకాలము ఉ.గం॥ 10.30 నుండి మ॥ గం. 01.00 వరకు వ్యక్తిగతంగాను మరియు మ॥ 02.00 వరకు మరియు సా॥ గం॥ 4.30 వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారాను జరుపబడును. బహిరంగ విచారణలో పాల్గొను ప్రజా బాహుళ్యమును బట్టి పైన తెలిపిన సమయములలో గౌరవ కమీషన్ వారిచే తగు మార్పులు చేయబడతాయి.

తిరుపతి మరియు విజయవాడలలో జరుగు బహిరంగ విచారణ ప్రదేశాల వివరములు విడిగా తగు సమయంలో ప్రచురించబడతాయి.

ప్రతిరోజు బహిరంగ విచారణ షెడ్యూల్ దిగువ ఇవ్వబడినది.

20.01.2026 (మంగళవారం) తిరుపతి

11:00 AM to 11:15 AM	కమీషన్ సెక్రటరీ ప్రారంభ వ్యాఖ్యలు
11:15 AM to 11:30 AM	గౌరవ చైర్మన్ ఏ.పి.ఇ.ఆర్.సి వారి ప్రారంభ వ్యాఖ్యానం
11:30 AM to 12:00 Noon	డిస్కంల నివేదిక
12:00 Noon to 01:30 PM	వ్యక్తిగతంగా ప్రజల యొక్క సూచనలు/అభ్యంతరములు/సలహాలు
01:30 PM to 02:30 PM	భోజన విరామం
02:30 PM to 04:30 PM	వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజల యొక్క సూచనలు/అభ్యంతరములు/సలహాలు

22.01.2026 (గురువారం) విజయవాడ

10:30 AM to 01:00 PM	వ్యక్తిగతంగా ప్రజల యొక్క సూచనలు/అభ్యంతరములు/సలహాలు
01:00 PM to 02:00 PM	భోజన విరామం
02:00 PM to 04:30 PM	వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజల యొక్క సూచనలు/అభ్యంతరములు/సలహాలు

23.01.2026 (శుక్రవారం) విజయవాడ

10:30 AM to 01.00 PM	వ్యక్తిగతంగా ప్రజల యొక్క సూచనలు/అభ్యంతరములు/సలహాలు
01:00 PM to 02:00 PM	భోజన విరామం
02:00 PM to 04:30 PM	వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజల యొక్క సూచనలు/అభ్యంతరములు/సలహాలు

27.01.2026 (మంగళవారం) కర్నూలు

10:30 AM to 1.00 PM	వ్యక్తిగతంగా ప్రజల యొక్క సూచనలు/అభ్యంతరములు/సలహాలు
01:00 PM to 02:00 PM	భోజన విరామం
2.00 PM to 3.00 PM	వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజల యొక్క సూచనలు/అభ్యంతరములు/సలహాలు
03:00 PM to 04:30 PM	సిఏండి / డిస్కంల ప్రతిస్పందన

గమనిక: అభ్యంతరదారులు పైన తెలిపిన షెడ్యూల్ సూచనాత్మకం అని గమనించగలరు. అవసరమైతే, విచారణలోని అత్యవసరముల ఆధారంగా కమీషన్ షెడ్యూల్‌ను మార్చవచ్చును.

(6) బహిరంగ విచారణలో వీడియో కాన్ఫరెన్స్/వ్యక్తిగతంగా పాల్గొను ఆసక్తి కల సభ్యులు తమ ఉద్దేశాన్ని ముందుగానే డిస్కంకు తెలియజేస్తూ కమీషన్ కు సకలు సమర్పించవలెను. ఆ ఉద్దేశంలో సభ్యుడు సమీపంలోని ఏ కార్యనిర్వాహక ఇంజనీరు / డివిజనల్ ఇంజనీరు కార్యాలయము నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తన అభిప్రాయములను సమర్పించాలనుకుంటున్నారో ఆ కార్యాలయమును తెలియజేయాలి. ఆ ఉద్దేశములో ఏ తేదీన విచారణలో పాల్గొనదలచుకున్నారో కూడా తెలియజేయాలి. (7) రోజువారీగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తమ దృక్పథం (ఆలోచన) వ్యక్తపరిచే అభ్యంతరదారుల జాబితాను కమీషన్ తమ వెబ్ సైట్ నందు ఉంచుతుంది. (8) తమ మౌఖిక సమర్పణలు చేయుటకు ఇంతకు మునుపు తెలియజేయని వ్యక్తుల నుండి ఏదైనా ఎస్ఇ/డిఇ/ఇఇ ఆఫీసుకు అభ్యర్థనలు అందితే వాటిని షెడ్యూలులోని అభ్యంతరములు విన్న తరువాత విచారణ రోజున సంబంధిత ఎస్ఇ/డిఇ/ఇఇ వీడియో సమావేశం ద్వారా కమీషన్ కు తెలియపరుస్తారు. కమీషన్ అనుమతించినచో అట్టి వ్యక్తులు సమర్పణలు చేయవచ్చును. డిస్కం సమావేశపు లింకును ఏర్పాటు చేసి, ప్రజలు ఎస్ఇ/డిఇ/ఇఇ కార్యాలయాలకు వెళ్లనవసరం లేకుండా వీడియో కాన్ఫరెన్స్ పద్ధతిలో సమర్పించుటకు పత్రికలలో వేరుగా ఆ లింకు ప్రచురించబడును. (9) బహిరంగ విచారణలు ప్రత్యక్ష ప్రసారం చేయబడతాయి. ప్రత్యక్ష ప్రసారమును వీక్షించే పద్ధతి మరియు విధానము విడిగా ప్రింట్ / ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రచురించబడుతుంది.

తేది: 10-12-2025
ప్రదేశం: తిరుపతి
చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్
సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్

తేది: 10-12-2025
ప్రదేశం: విజయవాడ
చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్
ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్

తేది: 10-12-2025
ప్రదేశం: విశాఖపట్నం
చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్
ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్

ఫిట్‌నెస్ ఫీజుల తగ్గింపునకు ప్రభుత్వం హామీ
లారీల సమ్మె వాయిదా

ఈనాడు, అమరావతి: కేంద్రం గత నెలలో పెంచిన ఫిట్‌నెస్ ధ్రువీకరణ ఫీజులను తగ్గించేలా చర్యలు చేపట్టినట్లు రాష్ట్రప్రభుత్వం హామీ ఇవ్వడంతో బుధవారం నుంచి నిర్వహించ తలపెట్టిన లారీల సమ్మెను లారీ యజమానుల సంఘం వాయిదా వేసింది. 12, 15, 20 ఏళ్లు దాటిన వాహనాలకు ఫిట్‌నెస్ ఫీజులను కేంద్రం గత నెలలో పెంచింది. దీనిని తగ్గించాలంటూ ఏపీ లారీ యజమానుల సంఘం డిమాండ్ చేస్తోంది. దీనిపై ఆ సంఘ నేతలతో ఇటీవల రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హా చర్చించారు. రాష్ట్రంలోని షిప్‌యార్డులు, రైల్వేయార్డుల్లో సరకు రవాణా చేసే 12 ఏళ్లు దాటిన వాహనాలను బుధవారం నుంచి నిలిపేస్తున్నట్లు లారీ యజమానుల సంఘం ప్రకటించింది. దీంతో మంగళవారం ఆ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి వైవీ ఈశ్వరరావు, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, కోశాధికారి కృష్ణ, కృష్ణాజిల్లా లారీ యజమానుల సంఘం అధ్యక్షులు రాజాతో.. రవాణా కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హా మరోసారి చర్చించారు. పెంచిన ఫీజులు తగ్గించేలా కేంద్రానికి లేఖ రాశామని, ఎన్ఐసీ ద్వారా పోర్టల్‌లో ఫీజుల తగ్గింపునకు నాలుగైదు రోజులు పడుతుందని పేర్కొన్నారు. దీంతో సానుకూలంగా స్పందించిన లారీ యజమానుల సంఘం.. సమ్మెను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.

మన వరి రైతుకూ ట్రంప్ దెబ్బ

- సుంకాల ప్రతిపాదనతో ఆందోళన
- 2024-25లో.. అమెరికాకు రూ.3,311 కోట్ల బియ్యం ఎగుమతి
- బాస్మతి బియ్యం ఎగుమతులే అధికం

ఈనాడు, అమరావతి: అదనపు సుంకాలతో రొయ్య రైతుల్ని బాదేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఇప్పుడు వరి రైతునూ వదలట్లేదు. భారీ సుంకాల బాంబు పేల్చేందుకు సిద్ధమయ్యారు. భారత్ నుంచి పెద్దఎత్తున దిగుమతులు జరుగుతున్నాయని.. వాటిని నియంత్రించేందుకు సుంకాలు పెంచుతామని సంకేతాలిచ్చారు. భారతదేశం నుంచి వివిధ దేశాలకు గతేడాది 2 కోట్ల టన్నుల బాస్మతి, బాస్మతియేతర బియ్యం ఎగుమతులు జరిగాయి. అందులో అమెరికాకు వెళ్లింది 3.36 లక్షల టన్నులే. 2014తో పోలిస్తే 2024 నాటికి అమెరికాకు బియ్యం ఎగుమతులు డాలర్ విలువలో 151%, పరిమాణంలో 187% పెరిగాయి. ఇప్పుడు మన బియ్యంపై సుంకాలు పెంచితే అది అమెరికాలోని భారతీయ, వినియోగదారులకు భారంగా పరిణమించనుంది.

◆ 2024-25లో మొత్తం రూ.55,407 కోట్ల విలువైన బియ్యం ఎగుమతి కాగా.. అందులో అమెరికాకు రూ.3,311 కోట్ల విలువైన బియ్యం వెళ్లాయి. ఎగుమతుల పరిమాణం తక్కువే అయినా.. విలువ ఎక్కువ. సగటున టన్నుకు రూ.98,523 లభిస్తోంది.

◆ భారత్ నుంచి బియ్యం దిగుమతుల్లో పరిమాణంలో బెనిన్ ప్రథమస్థానంలో నిలుస్తుంది. గతేడాది రూ.8,730 కోట్ల విలువైన 22.54 లక్షల టన్నుల బియ్యం దిగుమతి చేసుకుంది. అంటే టన్ను ధర రూ.38,723 మాత్రమే.

◆ రూ.11,209 కోట్ల విలువైన 13.83 లక్షల టన్నుల దిగుమతులతో సౌదీ రెండోస్థానంలో ఉంది. అంటే టన్ను ధర రూ.81,062 ఉంది.

బాస్మతి బియ్యమే అధికం

అమెరికాకు ఎగుమతి చేసే బియ్యంలో బాస్మతి రకమే అధికం. గతేడాది ఈ రకం 2.74లక్షల టన్నులు, బాస్మతియేతర బియ్యం 62వేల టన్నులు ఎగుమతి అయ్యాయి. 2025-26లో అక్టోబరు వరకు 2.11లక్షల టన్నులు అమెరికాకు ఎగుమతి కాగా అందులో 1.75 లక్షలు బాస్మతి బియ్యమే.

◆ భారత్ నుంచి బాస్మతి ఎగుమతుల్లో సౌదీ, ఇరాన్, ఇరాక్, యూఏఈ తర్వాత స్థానం అమెరికాదే. 2024-25లో అమెరికాకు బాస్మతి బియ్యం ఎగుమతుల విలువ రూ.2,849 కోట్లు, బాస్మతియేతర బియ్యం రూ.462 కోట్లు ఉంది. ఈ ఏడాది కూడా అక్టోబరు వరకు రూ.1,538 కోట్ల విలువైన బాస్మతి రకం ఎగుమతి అయింది.

◆ ఇతర దేశాలతో పోలిస్తే అమెరికా ఇచ్చే ధరలు ఎక్కువగా ఉంటాయి. సగటున టన్ను రూ.1,03,903 వరకు ఉంది. యూఏఈ రూ.79,390, యూకే రూ.89,158 మాత్రమే ఇస్తున్నాయి.

భారత ఎగుమతులపై తీవ్రప్రభావం

మన బాస్మతి, సోనామసూరి రకాల బియ్యానికి అమెరికాలో గిరాకీ ఉంది. 50% అదనపు సుంకాలతో గతంతో పోలిస్తే వాటి ధరలు పెరిగాయి. ప్రస్తుతం బాస్మతి రకం కిలో రూ.250, సాధారణ రకాలు రూ.140 ఉన్నాయి. 'పాకిస్థాన్‌పై 19% సుంకాలే. భారత్ బియ్యంపై 50% సుంకాలున్నాయి. ఇప్పటికే అదనపు సుంకాలు, రవాణా ఖర్చులతో భారం పడింది. మళ్లీ సుంకాలు వేస్తామంటున్నారు. దీంతో భారత్ నుంచి బియ్యం ఎగుమతులపై తీవ్ర ప్రభావం ఉంటుంది' అని డెక్కన్ ఫుడ్స్ (యూఎస్‌ఏ) డైరెక్టర్ కిరణ్‌కుమార్ పోల తెలిపారు.

దేశం నుంచి బియ్యం ఎగుమతులు, అమెరికాకు పంపే పరిమాణం, విలువ

సంవత్సరం	మొత్తం ఎగుమతి (లక్షల టన్నుల్లో)	అమెరికాకు (టన్నుల్లో)	విలువ (రూ.కోట్లలో)
2019-20	94.91	1.88	1,507
2020-21	177.19	2.43	1,783
2021-22	212.08	1.99	1,597
2022-23	223.47	2.57	2,248
2023-24	163.59	2.88	2,900
2024-25	201.94	3.36	3,311
2025-26 (ఏప్రిల్-అక్టోబరు)	118.67	2.12	1,790

ఏడాదిలోగా రెవెన్యూ ప్రక్షాళన

(మొదటి పేజీ తరువాయి)

బాగా పనిచేసే వారికి ప్రోత్సాహం ఇవ్వాలన్నారు. చిక్కుముడులకు తావు లేకుండా రెవెన్యూ సేవలు సులభతరం చేయాలని సీఎం ఆదేశించారు. ఇక నుంచి ప్రతి నెలా సమీక్షిస్తానని చెప్పారు. రెవెన్యూలో రియల్‌టైమ్‌లో సమస్యలు పరిష్కరించాలని, రిజిస్ట్రేషన్ పూర్తవగానే ఆటో మ్యుటేషన్ జరగాలని, పట్టాదారు పాసుపుస్తకాల కోసం తిరిగే పరిస్థితి ఉండకూడదని స్పష్టం చేశారు. పాస్‌పోర్టు కార్యాలయాల తరహాలోనే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ఏర్పాటుపై అధ్యయనం చేయాలని ఆదేశించారు.

నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించండి

◆ 1999 వరకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు తాకట్టు పెట్టిన ఎసైన్డ్ భూముల్ని 22ఎ నిషేధిత జాబితా నుంచి తొలగించాలి. 1954 కంటే ముందు సేల్ డీడ్స్, రిజిస్టర్ ఆఫ్ హోల్డింగ్స్ కూడా 22ఎ జాబితా నుంచి తొలగించాలి. .◆ ఫ్రీహోల్డ్ భూముల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి. ◆ దస్త్రావేజుల్ని ట్యాంపరింగ్ చేయకుండా బ్లాక్‌చెయిన్‌లాంటి పటిష్ఠ వ్యవస్థ తేవాలి. ◆ వివాదాస్పద భూములుగా పరిగణించడం, వాటిని తొలగించే అధికారాన్ని జేసీల నుంచి ఆర్డీవోలకు అప్పగించాలి. ఇలాంటి భూముల పరిష్కారం వేగవంతం కావాలి.◆ 2026 డిసెంబరు నాటికి రీసర్వే పూర్తి చేయాలి. పురోగతిపై ప్రతి నెలా నివేదిక ఇవ్వాలి. ◆ జాయింట్ ఎల్పీఎం వివాదాల్ని త్వరితగతిన పరిష్కరించాలి.

పట్టణాల్లో 250 గజాల్లోపు భూముల్ని క్రమబద్ధీకరించాలి: మున్సిపాలిటీల పరిధిలోని 250 చదరపు గజాల్లోపు స్థలాన్ని 50% బేస్ విలువతో క్రమబద్ధీకరించాలి. ఆక్వా సాగు చేసే ఎసైన్డ్ భూముల్ని సబ్‌రిజిస్ట్రార్ విలువ ప్రకారం క్రమబద్ధీకరించాలి' అని సీఎం ఆదేశించారు.

అధికారులు చెప్పిన గణాంకాలివే: ◆ 2024 జూన్ నుంచి 2025 డిసెంబరు 1 వరకు రెవెన్యూశాఖకు 5,28,217 అర్జీలు వచ్చాయి. 86% పరిష్కరించాం. 73 వేలు పరిశీలనలో ఉన్నాయి. అర్జీల పరిష్కారంపై అసంతృప్తి ఉంటే రీఓపెన్ చేసుకునే విధానం ఉంది. ◆ 6,693 గ్రామాల్లో రీసర్వే పూర్తయింది. ఇంకా 10,123 గ్రామాల్లో పూర్తి చేయాలి ◆ 22ఎ నిషేధ జాబితా నుంచి భూముల్ని తప్పించాలని 6,846 దరఖాస్తులొచ్చాయి. 1954 కంటే ముందు ఎసైన్డ్ భూములు కలిగిన మాజీ సైనికులు, రాజకీయ బాధితులు, స్వాతంత్ర్య సమరయోధులు తదితరుల భూముల్ని 22ఎ జాబితా నుంచి తొలగించే చర్యలు చేపట్టాం.

భారత బియ్యంపై అదనపు సుంకాలు!

(మొదటి పేజీ తరువాయి)

భారత్, థాయ్‌లాండ్, చైనా ప్రధానంగా ఉన్నాయని తెలిపారు. ట్రంప్ స్పందిస్తూ.. ఈ అంశాన్ని తమ ప్రభుత్వం పరిశీలిస్తుందన్నారు. బియ్యాన్ని డంప్ చేస్తున్న దేశాల విషయంలో అదనపు సుంకాల విధింపు మార్గాన్ని అనుసరించవచ్చని వ్యాఖ్యానించారు. అమెరికా ఉత్పత్తిదారుల ప్రయోజనాలను దెబ్బతీసేలా ఉన్న దేశాల జాబితాను సమర్పించాలని ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్‌ను ఆదేశించారు. స్వదేశీ రైతుల కోసం 12 బిలియన్ డాలర్ల బెయిల్ అవుట్‌ప్యాకేజీని ట్రంప్ ప్రకటించారు. ద్వైపాక్షిక వాణిజ్యం ఒప్పందంపై చర్చల కోసం భారత్, అమెరికా ప్రతినిధులు దిల్లీలో బుధవారం నుంచి భేటీ కానున్నారు. ఈ తరుణంలో ట్రంప్ భారత బియ్యంపై అదనపు సుంకాల దిశగా సంకేతాలివ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది.

లేత మనసులపై చదువుల ఒత్తిడి

(మొదటి పేజీ తరువాయి)

పరిశోధకులు తోడ్పాటు అందించారు. ఈ నేపథ్యంలో సురేష్‌చంద్ర 'ఈనాడు'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

అనేక రెట్లు అధికం

జనరలైజ్డ్ యాంగ్జైటీ డిజార్డర్ (జీఏడీ) స్కేల్ పద్ధతిలో మానసిక స్థితిని అంచనా వేయగా.. ఇంటర్ విద్యార్థుల్లో ఆ స్కోర్ 20.67, డిగ్రీ విద్యార్థుల్లో 16.43గా నమోదైంది. నిజానికి ఈ స్కోర్ 4లోపే ఉండాలి. 5 నుంచి 9 వరకు ఉంటే మానసిక ఆందోళనలు ఉత్పన్నమవుతున్నాయని అర్థం. తాజా సర్వేలో అనేక రెట్లు ఎక్కువగా 15-21 రావడంతో ఆందోళనలు తీవ్రస్థాయిలో ఉన్నట్లు తేలింది. డిగ్రీ విద్యార్థులతో పోల్చితే ఇంటర్ విద్యార్థుల మానసిక పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని బయటపడింది. ఇక ప్రత్యక్షంగా ఇన్నీ విద్యార్థుల నుంచి సమాచారం సేకరించినప్పుడు.. 36 శాతం మంది ఇంటర్ విద్యార్థులు 'నిరంతరం' అధిక ఒత్తిడిలోనే ఉంటున్నామని చెప్పారు, 31 శాతం మంది డిగ్రీ విద్యార్థులు 'తరచూ' ఒత్తిడికి గురవుతున్నామని సమాధానమిచ్చారు.

జుట్టు రాలే వరకు..

తరగతి సమయాలు పెరగడం, అదనంగా పోటీ పరీక్షలకు శిక్షణ వల్ల విద్యార్థుల్లో ఆందోళన చెందడం, కంగారుపడటం, ప్రశాంతత లేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. ఇంటర్‌స్థాయి విద్యార్థుల్లో ఇది తీవ్రంగా ఉంటోంది. రోజులో మిగిలిన కాస్త సమయాన్ని ఫోన్ల మీద వెచ్చిస్తున్నారు. ఫలితంగా వారి మానసిక స్థితి ఇబ్బందికరంగా మారుతోందని పరిశోధకులు పేర్కొన్నారు. నిద్ర పట్టకపోవడం వంటి సమస్య జుట్టు రాలేదాకా వెళ్తోందని చెబుతున్నారు. అరవడం, కోప్పడటం, ఆత్మహత్య ధోరణి ఆలోచనలు రావడం వంటి లక్షణాలు వారిలో కనిపిస్తున్నాయన్నారు.

వ్యాయామానికి దూరం

విద్యార్థుల్లో విశ్రాంతి కరవైంది. మానసిక శారీరక సాంత్వన పొందేలా పాఠ్యేతర కార్యకలాపాల్లో పాల్గొనే అవకాశాలు లేవని సర్వేలో తేలింది. నృత్యం, పాటలు పాడడం వంటి అలవాటున్నవారు 33 శాతం, వ్యాయామం చేస్తున్నవారు కేవలం 22 శాతమందే ఉన్నట్లు తేలారు.

కౌన్సెలర్లు లేరు

జాతీయ విద్యా విధానం మేరకు అన్ని విద్యాసంస్థలు మానసిక ఆరోగ్య విభాగం ఏర్పాటుచేయాలి. కానీ 5-10 శాతం సంస్థలు కూడా ఈ దిశగా కృషి చేయడంలేదని పరిశోధకుల సర్వేలో తేలింది. కనీసం 5 శాతం సంస్థల్లో కూడా కౌన్సెలర్లు లేరనే వాస్తవాన్ని వారు గ్రహించారు.

క్యాంపస్ ప్రణాళికలు అవసరం

విద్యార్థులకు సాంత్వన కలిగించే కార్యక్రమాలతో ఒత్తిడి తగ్గించాలి. వర్క్‌షాప్‌లు నిర్వహించాలి. క్యాంపస్‌లో ఒకరికొకరు సాయపడే స్నేహబంధాలు వృద్ధి చెందేలా చూడాలి. ఒత్తిడిని ఎలా అధిగమించాలో నేర్పాలి. మానసిక ఇబ్బందులతో ఉన్న పేద విద్యార్థులకు ప్రభుత్వ పథకాల్లో అన్వయించి వారికి సాయం చేయాలి. మొబైల్ వాడకం తగ్గించి వ్యాయామంపై దృష్టి సారించేలా ప్రోత్సాహించాలి. విద్యార్థులకు కోసం ఇ-మానస్, టెలిమెడిసిన్ విధానాల్ని అవలంబిస్తే ఎంతోమేలు. పాఠశాల, కళాశాలల్లో కౌన్సెలర్ల పాత్ర ఉండేలా చూడాలి. విద్యార్థుల ఆరోగ్య రక్షణపై విద్యార్థుల్లో, వారి తల్లిదండ్రుల్లో అవగాహన పెంచాలి. క్యాంపస్‌లో ఆటల పోటీలు, సాంత్వన కార్యక్రమాలు చేపట్టాలి.

– సిహెచ్.సురేష్‌చంద్ర, ప్రధాన పరిశోధకులు

'సర్' నిరాటంకంగా కొనసాగాలి

(మొదటి పేజీ తరువాయి)

వారికి రక్షణ కల్పించేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ 'సనాతని సంసద్' సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిగింది. ఓటర్ల జాబితా ప్రచురితమయ్యే వరకూ రాష్ట్ర పోలీస్ అధికారులను డిప్యుటేషన్‌పై ఈసీ నియంత్రణలోనే ఉంచాలని, కేంద్ర బలగాలను రంగంలోకి దించాలని ఆ సంస్థ విజ్ఞప్తి చేసింది. దీనికి సమాధానం ఇవ్వాల్సిందిగా ఈసీ, కేంద్రం, పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వాలను ధర్మాసనం ఆదేశించింది. పిటిషన్‌లో 'సర్'కు సంబంధించి ఒకేఒక ఎఫ్ఐఆర్ ప్రస్తావన ఉందని, మిగతా ఉదంతాలన్నీ గతంలోనివని జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి తెలిపారు. కేవలం ఒక ఘటన ఆధారంగా ప్రత్యేక ఆదేశాలివ్వాలని కోరడం తగదంటూ పిటిషనర్ తరపు న్యాయవాదిని ప్రశ్నించారు. రాజకీయ పార్టీల పరస్పరారోపణల క్రీడలో భాగస్వామి కావాలని కోర్టు కోరుకోవడం లేదని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. బీఎల్‌వోలను అడ్డుకుంటున్న ఘటనలు ఏవైనా ఉంటే ధర్మాసనం దృష్టికి తీసుకురావాలన్నారు.

పౌరసత్వంపై సందేహం వస్తే ఈసీ పరిశీలించకూడదా?: బిహార్ సహా వివిధ రాష్ట్రాల్లో 'సర్' కసరత్తు నిర్వహణకు ఎన్నికల సంఘం (ఈసీ) అధికారాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణలో భాగంగా మంగళవారం సుప్రీంకోర్టులో గట్టి వాదనలు జరిగాయి. ఓటరు నమోదు సమయంలో పౌరుడి పౌరసత్వంపై సందేహం కలిగితే దానిని పరిశీలించే అధికారం ఈసీకి ఉండదా? అలా చేయడం రాజ్యాంగ పరిధిని అతిక్రమించినట్లు అవుతుందా? అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మల్యా బాగ్చి ధర్మాసనం.. . పిటిషనర్ల తరపు న్యాయవాదులను ప్రశ్నించింది. పౌరసత్వం అంశాన్ని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'ఫారినర్స్ ట్రైబ్యునల్' మాత్రమే తేల్చాలని పిటిషనర్ల తరపు న్యాయవాదులు పేర్కొన్నారు. ఓటరు పౌరసత్వంపై సందేహం ఉంటే ఈసీ ఈ విషయాన్ని తొలుత జిల్లా కలెక్టర్‌కు, తద్వారా కేంద్ర ప్రభుత్వ విభాగాలకు తెలపాలన్నారు. దేశ పౌరులో కాదో నిరూపించుకునే భారాన్ని ఓటర్లపై మోపడం తగదని వాదించారు. గురువారం తిరిగి విచారణ కొనసాగనుంది.

ఆవు కడుపులో 52 కిలోల ప్లాస్టిక్

శస్త్రచికిత్స చేసి తొలగింపు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా కేంద్రం మచిలీపట్నంలో ఓ ఆవుకు 3 గంటల పాటు శస్త్రచికిత్స చేసి కడుపులోంచి 52 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలు బయటకు తీశారు. నగరంలో రోడ్లపై తిరుగుతున్న ఆవులు మేత దొరక్క పోస్టర్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు తిని చాలా రోజులుగా ఇబ్బందిపడుతున్నాయి. ఈ క్రమంలో కొన్ని చనిపోతున్నాయి. ఓ ఆవు అవస్థ చూసి జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి చిన నరసింహులు పర్యవేక్షణలో వైద్యులు దీపక్, హేమంత్‌ల బృందం శస్త్రచికిత్స చేసి.. ప్లాస్టిక్‌ను బయటికి తీసింది. ప్రస్తుతం ఆవు కోలుకుంటోంది. ఇలాంటి వాటిని గుర్తించి విడతల వారీగా శస్త్రచికిత్సలు చేయించాలని నిర్ణయించామని పాడి రైతుల సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు జన్ను వెంకటగణేష్ తెలిపారు.



శస్త్రచికిత్స అనంతరం ఆవును పర్యవేక్షిస్తున్న నరసింహులు, వైద్యులు



ఆవు పొట్ట నుంచి తీసిన ప్లాస్టిక్ వ్యర్థాలు

డిప్యూటీ కలెక్టర్‌గా మైనేని సాకేత్‌సాయి

ఈనాడు, అమరావతి: అంతర్జాతీయ టెన్నిస్ క్రీడాకారుడు, అర్జున అవార్డు గ్రహీత మైనేని సాకేత్ సాయిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డిప్యూటీ కలెక్టర్ (కేటగిరీ-2)గా నియమించింది. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కోటాలో క్రీడల విభాగం కింద ఆయనకు అవకాశం కల్పించింది. నియామక ఉత్తర్వులు జారీ అయిన 30 రోజుల్లోగా ఆయన విధుల్లో చేరాలని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన సీసీఎల్ఏ వద్ద రిపోర్టు చేయాలని పేర్కొన్నారు.

అవి చంద్రబాబు మార్గదర్శకంలో వండిన గణాంకాలే

- జీఎస్‌డీపీ అంచనాలపై మాజీ ముఖ్యమంత్రి జగన్

ఈనాడు, అమరావతి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో జీఎస్‌డీపీ అంచనాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు విడుదల చేసిన గణాంకాల్లో వాస్తవం లేదని మాజీ ముఖ్యమంత్రి జగన్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ''ప్రజలను వంచించేందుకే చంద్రబాబు మార్గదర్శకంలో ప్రభుత్వం ఈ లెక్కలు తయారు చేసింది. ఇలాంటి గణాంకాలతో వాస్తవాలను వక్రీకరించగలరేమోగానీ, కాగ్ ఆడిట్ గణాంకాలు మాత్రం నిజాలను బయట పెడతాయి'' అని తెలిపారు. ''కాగ్ గణాంకాలు వెల్లడిస్తున్న వాస్తవాల ప్రకారం చూస్తే. . రాష్ట్ర ప్రభుత్వ ఆదాయంలో వృద్ధి తగ్గింది, అప్పులు పెరిగాయి. మూలధన వ్యయం ఆందోళనకరంగా ఉంది. పెట్టుబడి స్థాయిలు తక్కువగా ఉండడంతో పాటు ఆర్థికలోటు స్థాయిలు ఆందోళనకరంగా ఉన్నాయి. పెరిగిపోయిన అవినీతి కారణంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదాయాలు దోపిడీకి గురవుతున్నాయని అర్థమవుతోంది'' అని ఆరోపించారు.

ఆపరేషన్లు చేసి బ్లేడ్లు వదిలేస్తారా?
వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆగ్రహం

ఈనాడు, అమరావతి: 'ఆపరేషన్లు చేసి శరీరంలో బ్లేడ్లు వదిలేయడం, రోగికి పడని ఇంజక్షన్లు ఇవ్వడం, గంటల తరబడి వారిని పట్టించుకోకపోవడం, రోగుల పట్ల దురుసుగా ప్రవర్తించడం లాంటి చర్యలు ఉపేక్షించం. ఇలాంటి నిర్లక్ష్యం వల్లనే ప్రభుత్వాసుపత్రులపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లుతోంది' అని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళగిరిలోని వైద్యారోగ్యశాఖ ప్రధాన కార్యాలయంలో ఉన్నతాధికారులతో మంగళవారం సమీక్షించారు. కూటమి ప్రభుత్వం చర్యలతో ఏడాదిన్నరలో సిబ్బంది హాజరు, ఓపీ, ఐపీ సేవలు, రోగనిర్ధారణ పరీక్షలు, ఇతర సేవల్లో నాణ్యత పెరిగినా కొందరి నిర్లక్ష్యం ఇబ్బందిగా మారుతోందన్నారు. ప్రాథమిక, సెకండరీ, బోధనాసుపత్రుల సూపరింటెండెంట్లు, డీఎంహెచ్‌వోలు, డీసీహెచ్‌ల పనితీరు మెరుగుపడాలని మంత్రి ఆదేశించారు.

పాడేరు వైద్యకళాశాలకు 100 ఎంబీబీఎస్ సీట్లు

పాడేరులోని ప్రభుత్వ వైద్యకళాశాలకు 2026- 27 విద్యాసంవత్సరంలో 100 ఎంబీబీఎస్ ప్రవేశాలకు ఎన్ఎంసీ ముందస్తు అనుమతి ఇచ్చిందని మంత్రి వెల్లడించారు. కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డాకు సమస్య వివరించడంతో ముందస్తు అనుమతి దక్కిందన్నారు. అధికారుల సమన్వయలోపంతో ఈ ఏడాది 50 సీట్లు కోల్పోయామని గుర్తుచేశారు. పిడుగురాళ్ల వైద్యకళాశాల తోపాటు.. పీపీపీ పద్ధతిలో నిర్మిస్తున్న నాలుగు వైద్యకళాశాలల్లో 2026- 27 ఎంబీబీఎస్ ప్రవేశాలకు చర్యలు చేపట్టాలని డీఎంఈకి సూచించారు.

దేశంలో మైక్రోసాఫ్ట్ పెట్టుబడులు రూ.1.58 లక్షల కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

'వచ్చే నాలుగేళ్ల (2026-29)లో భారత్‌లో 17.5 బి.డా. పెట్టుబడులు పెట్టడం ద్వారా, ఏఐని భారీ స్థాయిలో అందిపుచ్చుకునేలా చేస్తామ'ని మైక్రోసాఫ్ట్ తెలిపింది. ఈ ఏడాది జనవరిలో ప్రకటించిన 3 బిలియన్ డాలర్ల (సుమారు రూ.27,000 కోట్ల)కు అదనంగా ఈ పెట్టుబడులు ఉంటాయని స్పష్టం చేసింది కూడా. 2026 క్యాలెండర్ సంవత్సరం చివరి కల్లా 3. బి.డా.ను ఖర్చు చేసే క్రమంలో కంపెనీ ఉంది. ప్రధాని మోదీతో సత్య నాదెళ్ల సమావేశంపై మైక్రోసాఫ్ట్ స్పందిస్తూ 'దేశ ఏఐ ప్రణాళిక, వృద్ధి ప్రాధాన్యతలను ఈ సమావేశంలో చర్చించినట్లు' తెలిపింది.

హైదరాబాద్‌లో ఇండియా సౌత్ సెంట్రల్ క్లౌడ్ రీజియన్

హైదరాబాద్‌లో 2026 మధ్య కల్లా ఇండియా సౌత్ సెంట్రల్ క్లౌడ్ రీజియన్ కార్యకలాపాలను ప్రారంభిస్తామని మైక్రోసాఫ్ట్ తెలిపింది. రెండు ఈడెన్ గార్డెన్లకు సమానమైన మూడు అవైలబులిటీ జోన్లు, ఈ అతిపెద్ద హైపర్‌స్కేల్ రీజియన్‌లో ఉంటాయని వివరించింది. 2030 కల్లా 2 కోట్ల మంది భారతీయులకు అవసరమైన ఏఐ నైపుణ్యాలు నేర్పించాలని 2025 జనవరిలో నిర్దేశించుకున్న మా లక్ష్యాన్ని, రెండింతలు చేస్తున్నామని తెలిపింది.

వినూత్నతకు భారత్ కట్టుబడి ఉంది: వైష్ణవ్


'విశ్వసనీయ సాంకేతిక భాగస్వామిగా ప్రపంచంలో భారత్ స్థానాన్ని మైక్రోసాఫ్ట్ పెట్టుబడులు పదిలం చేస్తున్నాయ'ని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. మైక్రోసాఫ్ట్ ఇండియా-దక్షిణాసియా ప్రెసిడెంట్ పునీత్ చందోక్ మాట్లాడుతూ 'ఈ పెట్టుబడులతో క్లౌడ్, ఏఐ మౌలిక వసతులు, నైపుణ్యాలు పెంచుతాం. బెంగళూరు, హైదరాబాద్, పుణె, గురుగ్రాం, నోయిడా తదితర ప్రాంతాల్లో మాకు 22,000 మంది ఉద్యోగులున్నారు. మైక్రోసాఫ్ట్ వ్యాపార వైవిధ్యానికి ఈ నగరాలు ప్రతీక' అని అన్నారు.

రెండు నెలల్లో మూడో భారీ ఏఐ పెట్టుబడి

గత రెండు నెలల వ్యవధిలో, మన దేశానికి వస్తున్న మూడో అతిపెద్ద ఏఐ ఆధారిత పెట్టుబడి మైక్రోసాఫ్ట్‌దే. అయిదేళ్లలో భారత్‌లో ఏఐ హబ్ ఏర్పాటు నిమిత్తం 15 బి. డాలర్ల (సుమారు రూ.1.35 లక్షల కోట్ల) పెట్టుబడులు పెడుతున్నట్లు అక్టోబరు 14న గూగుల్ ప్రకటించింది. ఆ తర్వాత బ్రూక్‌ఫీల్డ్, రిలయన్స్ ఇండస్ట్రీస్, డిజిటల్ రియాల్టీల సంయుక్త సంస్థ డిజిటల్ కనెక్షన్ సైతం 11 బి. డాలర్ల (సుమారు రూ.99,000 కోట్ల) పెట్టుబడులను ప్రకటించింది. 2030 కల్లా తెలంగాణ, మహారాష్ట్రల్లో 12.7 బి. డాలర్ల (సుమారు రూ.1.14 లక్షల కోట్ల) పెట్టుబడులు పెట్టనున్నట్లు 2023 మేలో అమెజాన్ ప్రకటించింది. ఈ కంపెనీ 2016-22 మధ్య 3.7 బి. డాలర్ల (సుమారు రూ.33,300 కోట్ల) పెట్టుబడులు పెట్టడం గమనార్హం.

వసుంధర

vasundhara@eenadu.in



ప్రేమ భాష మారుతోంది...

స్నేహం, పెళ్లి, ప్రేమ ఏ బంధమైనా ఓ స్పష్టతతో మొదలవ్వాలి. అది జీవితాంతం కొనసాగాలి. ఇద్దరూ ఆ రిలేషన్‌ని కాపాడుకోవడానికి సమానంగా కృషి చేయాలి. వీటిల్లో ఏ ఒక్కటి లోపించినా... ఇద్దరిలో ఏ ఒక్కరు బంధాన్ని చులకనగా చూసినా అశాంతి ఛాయలు అలుముకుంటాయి. పైగా, ఈ బంధంలో ఉన్న ఇద్దరు వ్యక్తులు కష్టనష్టాల్లో ఒకరికి ఒకరు తోడుగా నిలవాలి. అపజయాలు ఎదురైనప్పుడు వెన్నుతట్టాలి. విజయాలు వరించినప్పుడు శభాష్ అంటూ ప్రోత్సహించాలి. బంధమేదైనా ఇలాంటి భావోద్వేగపరమైన మద్దతునే ఎక్కువగా కోరుకుంటారు అమ్మాయిలు. కానీ అదే లోపిస్తే... మొదట్లో ఉన్న ఆదరణ కాలక్రమేణ తగ్గితే, ఆ బంధం బీటలు వారుతుంది. అలా జరగకూడదనే ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నారు జెన్ జీ అమ్మాయిలు. 'క్లియర్ కోడింగ్' కూడా అందులో భాగమే. రిలేషన్‌ని మొదలు పెట్టే ముందే దీనిలో కంటిన్యూటీ ఉంటుందా, లేదా? భావోద్వేగపరమైన మద్దతు దొరుకుతుందా, లేదా? అనే స్పష్టతను తెచ్చుకుంటున్నారట. ప్రేమ అయితే పెళ్లి వరకూ వెళుతుందా, పెళ్లి అయితే జీవితాంతం ఈ బంధాన్ని కొనసాగించే శక్తిసామర్థ్యాలు ఎదుటి వ్యక్తిలో ఉన్నాయా, లేవా? వంటివన్నీ చెక్ చేసుకుంటున్నారట. ఎదుటి వ్యక్తి నడవడిక వీటికి భిన్నంగా ఉంది అనుకుంటే అక్కడికక్కడే 'నో' చెప్పేసి వెళ్లిపోతున్నారు. 'కాలక్షేపానికి మొదలయ్యే బంధాలకు అడ్డుకట్ట వేయడమే క్లియర్ కోడింగ్ ప్రధాన ఉద్దేశం. అది నచ్చే మేము దీన్ని ఫాలో అవుతున్నాం' అంటున్నారీ అమ్మాయిలు. దాంతో జెన్ జీల తెలివిని మెచ్చుకుంటూ... ప్రేమ భావన మారుస్తున్నారు అమ్మాయిలు అంటూ పొగడ్తల వర్షం కురిపిస్తున్నారు నెటిజన్లు. మీరేం అంటారు మరి మీకూ ఉందా ఈ స్పష్టత...!

బంగారం - వెండి

9న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,32,230	1,19,650	1,85,748
విజయవాడ	1,28,040	1,19,250	1,83,600
ప్రొద్దుటూరు	1,27,300	1,17,120	1,76,000
రాజమహేంద్రవరం	1,30,090	1,19,250	1,99,000
విశాఖపట్నం	1,29,600	1,19,250	1,85,000
తమిళనాడు	-----	1,20,000	1,99,000

> తమ ఆలోచనల్ని సందేహించకుండా, ధైర్యంగా ముందుకు అడుగు వేసినప్పుడే మహిళల జీవితాల్లో మార్పు వస్తుంది. వాళ్లు కంఫర్ట్ జోన్ వదిలినప్పుడే ఆవిష్కరణలు సాధ్యమవుతాయి.
> - భావినీ ఖఖర్, ఆంత్రప్రెన్యూర్



ఆ ధైర్యం మీరివ్వాల్సిందే!

ఏడాది చివరికి వచ్చేస్తున్నాం. పాఠశాలలన్నీ వార్షికోత్సవాలను నిర్వహిస్తుంటాయి. పిల్లలు స్టేజీ మీదకి ఎక్కి తమ ప్రతిభను ప్రదర్శిస్తోంటే మురిసిపోని తల్లిదండ్రులు ఉండరు. ఆ క్షణం కోసం ప్రతి ఒక్కరూ ఎదురుచూస్తుంటారు కూడా! తీరా వాళ్లు వేదిక ఎక్కి భయంతో నిలబడిపోతే? కంగారుతో మాట పెగల్చకపోతే? మనకి నిరాశే... కానీ పిల్లలపై అది చూపే దుష్ప్రభావం చాలానే! అలా కావొద్దంటే...

సాధనే మార్గం

'ఛ... నోర్మూయ్', 'అందరి ముందూ అలా మాట్లాడొద్దా?'... ప్రతి చిన్నదానికీ ఇలా పిల్లల్ని కట్టడి చేస్తోంటే వాళ్లలో పేరుకునేది భయమే. అందుకే నోరు తెరవడానికి భయపడుతుంటారు. ముందు దాన్ని పక్కకి పెట్టేయండి. తరవాత సాధన మీద దృష్టిపెట్టండి. అంటే ఏమిటంటే. ఇప్పటికే మీ పిల్లలు ఏదో ఒకదానిలో పాల్గొంటుంటే దాన్ని ఇంట్లోనూ ప్రాక్టీసు చేయించండి. ఇంట్లో వాళ్లు, బొమ్మల్నే ప్రేక్షకులని చెప్పి, ప్రదర్శన ఇప్పించండి. భయం చాలావరకూ తగ్గుతుంది. సాధన ఎంత ఎక్కువ చేస్తే అంతగా ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

మాట్లాడండి

ఇంట్లో చక్కగా మాట్లాడేస్తారు, డ్యాన్స్ చేస్తారు. వేదిక మీదకి ఎక్కగానే బిగుసుకుపోతారు. మీ పిల్లలూ అంతేనా? అయితే వాళ్లకి అక్కడ భయపెడుతున్న అంశమేంటో కనుక్కోండి. ఏం చెప్పినా కొట్టిపారేయకుండా జాగ్రత్తగా వినండి. అది వాళ్ల మనసు తేలికపడేలా చేస్తుంది. ఆపై నెమ్మదిగా ఇది అందరికీ ఉండే సమస్యే అని చెప్పండి. 'నేను నీ పక్కనే ఉన్నా అనుకుని మాట్లాడు' అంటూ ధైర్యాన్నివ్వండి. చక్కగా మాట్లాడితే వచ్చే చప్పట్లు, మెప్పు వంటివి వివరించినా వాళ్ల మనసు మళ్లుతుంది. అయితే ఓపిగ్గా మనం చెప్పగలగాలి మరి.

సరిచేయండి

మనకి చిన్నవి అనిపించే చాలా విషయాలు పిల్లలకు పెద్దవే! నాలుగు లైన్లే, చిన్న డ్యాన్స్ స్టెప్పే, డైలాగే అని మనకి అనిపించొచ్చు. కానీ వాళ్లకది కొత్తే! కాబట్టి, సమయం పడుతుంది. ఆ మాత్రం దానికే ఇది కూడా రావట్లేదా అంటూ అరవకండి. తప్పు చెబితే అమ్మ కొడుతుందేమో, నాన్న కోప్పడతారేమోననే భయంతోనూ బిగుసుకుపోతారు. కాబట్టి, నెమ్మదిగానే ప్రయత్నించనీయండి. అవసరమైతే సలహాలివ్వండి. వీటన్నింటినీ గుర్తుంచుకోవడంపైనే దృష్టిపెడతారు. అప్పుడు భయమూ పక్కకు వెళ్తుంది.

కలిసి చేయండి

అమ్మో డ్యాన్స్ నా వల్ల కాదు, పాట నాకు రాదు... అంటూ మనమే పిల్లల ముందు మొహమాట పడతాం. ఎంతైనా చిన్నవాళ్లు... తెలియని వాళ్లని చూసి భయపడరా? కాబట్టి, ముందు నుంచే సిద్ధం చేయండి. మీ ఫ్రెండ్స్ అమ్మానాన్నలంతా వస్తారు. నువ్వు బాగా చేస్తే పొగుడుతారంటూ సానుకూలంగా చెప్పండి. మన మాటలే వాళ్ల ధైర్యం. మనం కంగారుపడి, వాళ్లనీ పెడితే బెంబేలెత్తిపోతారు. వీలైతే వాళ్లతోపాటు మీరూ పాడండి, సరదాగా పాదం కదపండి. ఆనందిస్తారు, తమదైన రోజున మరింత ఉత్సాహంగా ప్రదర్శిస్తారు.

తోడు ఉండండి

పిల్లలకు రోల్‌మోడలంటే అమ్మానాన్నలే. వాళ్ల మెప్పు పొందాలనుకునేదీ మీ నుంచే! కాబట్టి, వాళ్ల కార్యక్రమాలకి తప్పక హాజరవ్వండి. వీలుంటే బ్యాక్ స్టేజ్‌కి వెళ్లి వాళ్లని కలవండి. తన ప్రోగ్రామ్ కోసం ఎదురుచూస్తున్నానని చెప్పండి. అంతమందిలో తనకోసం చూసేవాళ్లు ఉన్నారన్న సంతోషం వాళ్లని మరింత బాగా చేసేలా చేస్తుంది. కాబట్టి, మీరు చీర్‌లీడర్ అవ్వాల్సిందే. అప్పుడు భయం వాళ్ల ఛాయల్లోకే వెళ్లదు.

అయినా ఏడాదంతా పుస్తకం, చదువు, మార్కులంటూ తరుముతూ... ఏదో ఒక రోజు కొత్తగా ప్రయత్నించమంటే ఏ పిల్లలైనా కంగారు పడతారు. చదువు ముఖ్యమే! అయితే దాంతోపాటు కొన్ని నైపుణ్యాలూ కావాలి. నలుగురితో మాట్లాడటం, నచ్చిన కళలు ప్రయత్నించడం, ఆటలు వంటివాటితోనే నేర్చుకోగలుగుతారు. వాళ్ల ఎదుగుదలలో వీటికీ ప్రాధాన్యమివ్వండి... అప్పుడు ఏ వేదికా వాళ్లని భయపెట్టదు.

చలికి... చెక్ పెడదాం!

రోజు రోజుకీ చలి పెరుగుతోంది. దాంతో పాటే జలుబు, దగ్గు, అలసట... వంటివీ వేధిస్తున్నాయి. మరి వాటిని ఎదుర్కోవాలంటే... ఒంట్లో తగినంత వ్యాధినిరోధకశక్తి కావాలి. అందుకోసమే ఇవి తీసుకోవాలి.



ఆకుకూరలు: పాలకూర, బచ్చలికూర, తోటకూర, గోంగూర, మెంతికూర... ఇలా ఈ కాలంలో వచ్చే తాజా ఆకుకూరలు అన్నింటినీ తప్పక తినండి. దీనివల్ల రోగనిరోధకశక్తి పెరుగుతుంది. ఎముకలు బలపడతాయి. చర్మానికి తేమ అందుతుంది. ఈ ఆకుకూరల్లో విటమిన్ ఎ, సి, కె విటమిన్లతో పాటు ఫోలేట్, ఐరన్, ఫైబర్ సమృద్ధిగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. శరీరాన్ని ఇన్ఫెక్షన్ల బారిన పడకుండా చేస్తాయి. శక్తినిస్తాయి. పేగు ఆరోగ్యాన్నీ కాపాడతాయి.



సిట్రస్ పండ్లు: ఈ కాలంలో విరివిగా దొరికే నారింజ, నిమ్మ, జామ, ఉసిరి... వంటి పండ్లలో విటమిన్ సి పుష్కలంగా దొరుకుతుంది. ఇది శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్. తెల్లరక్తకణాల ఉత్పత్తిని పెంచుతుంది. వాటి పనితీరుని మెరుగుపరుస్తుంది. అంతేకాదు, సిట్రస్ అధికంగా ఉండే పండ్లలో నీటిశాతం, ఫైబర్ ఎక్కువ. దీంతో అతి ఆకలిని అదుపులో ఉంచి... బరువు తగ్గడానికీ సాయపడతాయి. ఒంట్లోని వ్యర్థాలనూ బయటకు పంపిస్తాయి.



దుంప కూరలు: చలి కాలంలో దుంప కూరల్ని తినడం వల్ల ఫైబర్, పొటాషియం, విటమిన్ సి వంటి పోషకాలు లభిస్తాయి. ముఖ్యంగా చిలగడదుంప, బీట్‌రూట్, క్యారెట్ వంటి వాటి నుంచి బీటాకెరొటిన్ అందుతుంది. అల్లం, వెల్లుల్లిలో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు ఎక్కువ. ఇవన్నీ వ్యాధికారక క్రిములకు వ్యతిరేకంగా పోరాడేశక్తిని శరీరానికి అందిస్తాయి.

సీడ్స్-నట్స్: ఇవి ఇ-విటమిన్‌తో పాటు ఆరోగ్యకరమైన కొవ్వులు, జింక్, సెలీనియం వంటి ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లతో సమృద్ధిగా ఉంటాయి. ఇవన్నీ రోగనిరోధకశక్తి పనితీరుని మెరుగుపరిచేవే.



అనుమతి లేకుండా చాట్‌జీపీటీ?

ఈమధ్య నా బృంద సభ్యుల్లో ఒకరు చాట్‌జీపీటీ ఎక్కువగా వాడుతుండటం గమనించా. ఈమెయిల్స్, ప్రాజెక్టు రిపోర్టులు రూపొందించడానికీ, ముఖ్యమైన ప్రాజెక్టుకు సంబంధించిన ఆలోచనలు పంచుకోవడానికీ ఏఐని వినియోగిస్తున్నారు. దీనిపై ఎలా స్పందించాలో అర్థం కావడంలేదు. సమయాన్ని తగ్గించుకునేందుకు ఏఐ వాడటాన్ని అభినందించాలా? లేకపోతే భద్రత, గోప్యత పరంగా వాటిని నిరోధించాలా? వాళ్లకు ఏం చెప్పాలి?

– ప్రియాంక, హైదరాబాద్

డియర్ వసుంధర



కవితా గూడపాటి
ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్

ఇలాంటి పరిస్థితుల్ని ఎదుర్కోవడం నాయకత్వ స్థానాల్లో ఉన్న ఎవరికైనా సవాలే. కానీ, చాట్‌జీపీటీ, జెమినైల వినియోగం పెరిగే కొద్దీ పనిప్రదేశాల్లో ఈ తరహా అనుభవాలు ఎక్కువవుతాయి. అయితే, దీన్నో ముప్పుగా కాకుండా, ఆధునికతకు అవకాశంగా చూడటమే మేలు. దీనిపై మీరు సందర్భాన్నిబట్టి స్పందించాలి. ఉద్యోగులు బద్ధకంతో ఈ పనులు చేస్తున్నారా లేక మెరుగైన పనికి టూల్‌గా ఉపయోగించుకుంటున్నారా? ఉద్యోగి ఏ స్థాయి పనికోసం దీన్ని వాడుతున్నారో చూసి ఒక నిర్ణయానికి రావాలి. చాట్‌జీపీటీ ఉచిత వెర్షన్‌ని గోప్యతను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి చేయలేదు. కాబట్టి కంపెనీకి సంబంధించి ఏదైనా ముఖ్యమైన డేటాని ఉపయోగిస్తున్నారేమో గమనించాలి. ఈ విషయంమీద ఎలాంటి నిర్ణయమైనా తీసుకునే ముందు బృందంలోని సభ్యులతో ఒకసారి మాట్లాడాలి. ఉద్యోగిని ప్రశ్నిస్తున్నట్టుగా కాకుండా, ఎలా వినియోగిస్తున్నారో తెలుసుకోవాలనే కుతూహలంతో అడగండి. వాళ్లకు ఎదురవుతున్న అనుభవాలనుబట్టి మీరు ఒక నిర్ణయానికి రావొచ్చు. ఏఐతో ఉండే ఉపయోగాలూ, తలెత్తే సమస్యలపైనా ఉద్యోగులకు అవగాహన కలిగించాల్సిన అవసరం ఉంది. ఏఐని పనిలో భాగం చేయడం మీకు సమ్మతమైతే, దానికి సంబంధించి ఒక పాలసీని తయారుచేసి ఉద్యోగులకు ఇవ్వాలి. దానిలో ఏ టూల్స్ వాడొచ్చు, ఎలాంటి డేటాని షేర్ చేయొచ్చు, ఎలాంటి పనులకు ఏఐ వాడాలి... వీటిపైన స్పష్టత ఇవ్వాలి. ఖాతాదారుల పేర్లు, అంతరంగిక నివేదికలను గోప్యతలేని ఏఐ సాధనాల్లో వాడకుండా చూడాలి. ఏఐ వినియోగాన్ని అడ్డుకుంటే పనిలో, పోటీలో వెనకబడే ప్రమాదం ఉంది. అదే సమయంలో ఏఐతో రూపొందించిన పనిని మరోసారి సమీక్షించి, మెరుగుపరచమని ఉద్యోగులకు చెప్పాలి. అప్పుడే ఆ పనికి నాణ్యత, ప్రత్యేకత వచ్చేది.

వాళ్లకోసమే... ఈ వ్యాపారం!



దేవి

ఉన్నత కుటుంబంలో పుట్టి పెరిగారు దేవనీ దేవి. అలాంటి ఇంటికే కోడలిగానూ వెళ్లారు. చుట్టూ పనివాళ్లు, విలాసవంతమైన జీవితం. అయినా ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేశారు. దీనికి కారణం వైద్య విద్యార్థుల పరిస్థితులే అంటారామె. ఈమె గురించి తెలియాలంటే...

పట్నాలో హాతీదహ మాది. సంపన్న కుటుంబం. అయితే పిల్లల చదువుల కోసం పట్నాకు మకాం మార్చాం. ఆయన జీతం కుటుంబ పోషణకు సరిపడేది కాదు. ఇంటి నుంచి డబ్బు అడగడం ఇష్టం లేక, నేనూ సాయం చేయాలనుకున్నా. ఈ క్రమంలోనే ఓరోజు వైద్య విద్యార్థి లంచ్ బాక్సును చూశాను. నాసిరకం ఆహారంతో విద్యార్థులు పడుతున్న కష్టాలు అర్థమయ్యాయి. వాళ్లకి మంచి భోజనం పెట్టాలని రూ.20కే డబ్బా సర్వీస్ ప్రారంభించా.

అడ్డంకుల్ని దాటి...

క్రమేణా మాదగ్గర భోజనం తీసుకు వెళుతున్న వారి సంఖ్య పెరిగింది. దీంతో ఇంటి నుంచి వండటం కష్టమైంది. హోటల్‌లా పెడితే బాగుణ్ను అనిపించింది. కానీ ఇంట్లోవాళ్లు వద్దన్నారు. పరువు పోతుంది మా ఇంటి కోడలు ఇలాంటి పనులు చేస్తే అని తిట్టారు. నేను మాత్రం ఎంత మంది ఎన్ని మాటలు అన్నా... వంట చేయడం ఆపలేదు. దీనివల్ల నా భర్త నాతో 6నెలలు మాట్లాడలేదు. నా పెద్ద కొడుకు కూడా నన్ను విసుక్కునేవాడు. అయినా పట్టు వదల్లేదు. ఓ పెద్దింటి కోడలు అన్న గుర్తింపు కన్నా... తన కాళ్ల మీద తాను నిలబడిన మహిళగా వచ్చిన గుర్తింపే నాకు నచ్చింది. అందుకే వెనకడుగు వేయలేదు. క్రమంగా ఆదాయం పెరగడం మొదలైంది. దాన్ని వివిధ వ్యాపారాల్లో పెట్టా. రూ.80వేలతో రిక్షాలు కొని, వాటిని అద్దెకు ఇచ్చేదాన్ని. తర్వాత 2009లో 'సమృద్ధి గర్ల్స్ హాస్టల్'ను ప్రారంభించా. ఈలోపు కరోనా బారిన పడ్డాను. హాస్టళ్లు మూతపడి, వ్యాపారం దెబ్బతింది. అయినా వైద్య విద్యార్థులకు భోజనం అందించడం ఆపలేదు. కరోనా బారిన పడిన నాకు వాళ్లు ఎన్ని సేవలు చేశారో. ఇంట్లో వాళ్లు దగ్గరికి రావడానికి కూడా వీలులేకపోతే... ఈ విద్యార్థులే నాకు సపర్యలు చేసేవారు. నేను కోలుకునే దాకా నాతోనే ఉన్నారు. వాళ్ల సేవలు ఎప్పటికీ మరచిపోలేను.

అమ్మ కిచెన్...

కరోనా తర్వాత నా చిన్న కొడుకు క్లౌడ్ కిచెన్ ప్రారంభించమంటూ సలహా ఇచ్చాడు. దాంతో 2022లో 'అమ్మ కిచెన్' ప్రారంభించా. ఇప్పుడు ఆన్‌లైన్‌లోనూ మా సేవలు అందుబాటులో ఉన్నాయి. రూ.20తో మొదలైన నా వ్యాపార ప్రయాణం ఇప్పుడు రూ.2.5 కోట్ల టర్నోవర్‌కు చేరుకుంది. ఏ పనీ చిన్నది కాదు. సంకల్ప బలం ఉంటే మనం సాధించలేనిదంటూ ఏదీ ఉండదు. అందుకు నా ప్రయాణమే నిదర్శనం.

ఒంటి చేత్తో సాధించింది!



పావని

ఒంటి చేత్తో ఏం చేయలేవు... చాలామంది ఆమెతో ఈ మాట అన్నవారే! కానీ తను... దాంతోనే సాధించింది. దేశానికి అంతర్జాతీయ పతకాల్ని తెస్తోంది. తాజాగా థాయ్‌లాండ్‌లో జరిగిన వరల్డ్ ఎబిలిటీ స్పోర్ట్స్ గేమ్స్‌లోనూ కాంస్యాన్ని గెలుచుకుంది బానోత్ పావని.



మాది ఖమ్మం జిల్లాలోని రాములు తండా. నాన్న మోహన్, సుతారీ పని చేస్తారు. అమ్మ హిరాణి, రోజువారీ కూలీ. నాకో తమ్ముడు. నాకు పుట్టుకతోనే చేయి లేదు. అది చూసి కొందరు జాలిపడేవారు. మరికొందరు గేలి చేసేవారు. అమ్మానాన్నలు మాత్రం నాకు ఎప్పుడూ దన్నుగా నిలిచేవారు. వాళ్ల కోసం ఏదైనా సాధించాలి అనుకునేదాన్ని. ఖమ్మం జవహర్ నవోదయ స్కూల్లో పదో తరగతి చదువుతున్నప్పుడు హైదరాబాద్‌లోని ఆదిత్య మెహతా సంస్థ వాళ్లు నేషనల్ టాలెంట్ ఐడెంటిఫికేషన్ క్యాంప్ ఏర్పాటుచేశారు. ఇక్కడ భిన్న ఆటలు ఆడిస్తారు. చివరగా ఎక్కువ ప్రతిభ చూపిన దానిలో శిక్షణ ఇస్తారు. షూటింగ్ బాగా చేయడంతో నన్ను ఎయిర్ రైఫిల్ షూటింగ్‌కి ఎంపికచేశారు. నిజానికి తొలిసారి తుపాకీ పేలిన శబ్దం విన్నప్పుడు భయపడ్డా. కానీ దాన్ని చేతుల్లోకి తీసుకున్నాక మాత్రం తెలియని ధైర్యం వచ్చింది.

2023లో విజయ్ మోహన్ సింగం ఆధ్వర్యంలో శిక్షణ ప్రారంభించా. సరిగ్గా వారంరోజుల్లో దిల్లీలో జోనల్ పారా షూటింగ్ పోటీలు. భయపడుతూనే ప్రయత్నించా. రజత పతకంతో తిరిగొచ్చా. అది నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ఆపై జాతీయ స్థాయిలో జూనియర్స్ విభాగంలో బంగారు పతకాన్ని సాధించా. అప్పుడు అమ్మానాన్నలు 'చదువుకు దూరం అవుతావు. ఆటలొద్దు, ఆపేయ'మన్నారు. తెలిసినవాళ్లూ 'ఆడపిల్లవి... ఇవన్నీ వద్దు' అనే సలహానిచ్చారు. నేను మాత్రం చదువుతోపాటే ఆటలోనూ రాణిస్తా. అందరికీ నేనొక ఉదాహరణగా ఉండాలి అనుకుంటున్నానని చెప్పి అమ్మానాన్నల్ని ఒప్పించా. నిజానికి నాకు డాక్టర్ కావాలని ఆశ. సీటు రాలేదు. ప్రస్తుతం బేగంపేటలో డిగ్రీ చదువుతున్నా. 2024 ప్రపంచ షూటింగ్ పారా స్పోర్ట్స్‌లో కాంస్యంతోపాటు తొమ్మిది జాతీయస్థాయి పతకాలు సాధించా. ఈ ఏడాది పారా ఖేలో ఇండియాలో కాంస్యం అందుకున్నా. తాజాగా థాయ్‌లాండ్‌లో జరిగిన వరల్డ్ ఎబిలిటీ స్పోర్ట్స్‌లో 10మీ. ఎయిర్ రైఫిల్ విభాగంలో కాంస్యం సాధించా. అంతర్జాతీయ వేదికలపై పోటీ అన్నప్పుడు కంగారు మామూలే. అలాంటప్పుడు నాకు నేనే ధైర్యం చెప్పుకొంటూ సిద్ధమవుతా. తొలిసారి వరల్డ్ షూటింగ్ పోటీల్లో గెలిచి, పతకంతో ఇంటికి వెళ్లినప్పుడు అమ్మానాన్నల కళ్లల్లో ఆనందం చూశా. నాకు అండగా నిలిచిన వాళ్లని సంతోషపెట్టడం కన్నా ఏం కావాలి అనిపిస్తుంది. అయితే నా లక్ష్యం మాత్రం ఒలింపిక్స్ పతకం. దానికోసమే మరింత కష్టపడుతున్నా.

– రామాంజనేయులు చింతలపాటి, హైదరాబాద్

ఎక్కడివక్కడ ఉంటేనే అందం..!

స్మార్ట్ కిచెన్

ఎంత చేసినా పూర్తవని పనుల జాబితాలో వంటింటి పనులు తప్పక ఉంటాయి కదూ! కారణం ఓ క్రమ పద్ధతిలో సామాన్లని సర్దుకునే అవకాశం లేకపోవడమే. ఈ లోపాన్ని పూరిస్తాయి ఈ ఆర్గనైజర్లు.

వండిన పాత్రలన్నీ ఒకే చోట...



వంటయ్యాక పాత్రలన్నీ వంటగట్టు మీదే. వాటిని ఇంకెక్కడా పెట్టే అవకాశం ఉండదు. వీటి వల్ల కిచెన్‌ని ఎంత సర్దినా, ఆ తృప్తే ఉండదు. పైగా, పని చేస్తున్నప్పుడు చేతులు తగిలి పదార్థాలు ఒలికిపోతుంటాయి. అలాకాకుండా అన్నీ ఓ చోట ఉంచేందుకు ఉపయోగపడుతుందీ 'మల్టీ-టైర్ ఆర్గనైజర్ ర్యాక్'. ఇది మూడు లేదా ఐదు అరలతో వస్తుంది. వండటం పూర్తయిన వెంటనే ర్యాక్‌లో పాత్రల్ని పెట్టేస్తే సరి. చెక్క, ఇనుము, అల్యూమినియం వంటి వాటితో ఈ ఆర్గనైజర్లన్ను తయారుచేస్తున్నారు. వీటిల్లో ఎక్కడికైనా జరుపుకొనే వీలుండేవీ అందుబాటులో ఉన్నాయి.



మూలల్నీ అలంకరించొచ్చు...

కిచెన్ అంతా అందంగా సర్దుకుంటాం. కానీ మూలల విషయానికి వచ్చేటప్పటికి నిర్లక్ష్యం చేస్తాం. దాంతో నిస్తేజంగా కనిపిస్తుందా ప్రాంతం. ఈ 'కార్నర్, కౌంటర్ టాప్ ఆర్గనైజర్ల'ను వాడితే మూలల్ని కూడా అందంగా తీర్చిదిద్దొచ్చు. ర్యాకుల్లో సర్దగా మిగిలిపోయిన సామాన్లని వీటిపై పేర్చేస్తే సరి. రెండు ర్యాక్స్ వస్తాయి దీనిలో. 180 డిగ్రీ యాంగిల్‌లో మూయడానికీ తెరవడానికీ అనుకూలంగా ఉంటుందీ ఆర్గనైజర్.





కాస్త స్థలమున్నా...



నిల్వ చేసే సరకులన్నీ ఓ చోట... వాడే వస్తువులన్నీ ఓ చోట ఉంటే గందరగోళం ఉండదు కదా. కానీ అపార్ట్‌మెంట్ కల్చర్‌లో కిచెన్‌కి అంత స్థలం కేటాయించే అవకాశం ఉందా? ఉన్న కొంత స్థలాన్నే మనకు నచ్చినట్లుగా సర్దుకోవాలి. ఈ 'త్రీ లేయర్ స్లిమ్ స్టోరేజ్ ర్యాక్' అందుకు ఉపయోగపడుతుంది. మనం వాడే పప్పులు, ఉప్పులు, కారాలు, మసాలా డబ్బాలన్నీ దీనిలో పెట్టుకోవచ్చు. వంటగట్టుకు, ఫ్రిజ్‌కు మధ్య ఉన్న చిన్న గ్యాప్‌లో కూడా పట్టేస్తుంది ఇది. అన్నట్లు ఇది మూవబుల్ కూడా. వంటచేస్తున్నప్పుడు బయటికి తీసి వినియోగించుకుని, అయ్యాక లోపలికి పెట్టేయొచ్చు.



'స్కిన్ ఫాస్టింగ్'... తెలుసా?



మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా ఉపవాసం ఉండి శరీరాన్ని డీటాక్స్ చేస్తున్నాం సరే. మరి చర్మం మాటేంటి? దానికి కూడా ఉపవాసం అవసరమట. దాన్నే 'స్కిన్ ఫాస్టింగ్' అంటున్నారు నిపుణులు. పేరులో ఉన్నట్లే ముఖానికి, శరీరానికి ఎటువంటి సౌందర్య ఉత్పత్తులు వాడకుండా ఉండటమే స్కిన్ ఫాస్టింగ్. చర్మ తత్వాన్ని బట్టి ఈ ఫాస్టింగ్ రెండు రోజుల నుంచి ఏడు రోజుల వరకూ చేయొచ్చు. దీనివల్ల చర్మం డీటాక్స్ అయ్యి లోతుగా శుభ్రం అవుతుంది. అయితే దీన్ని దశల వారీగా చేయాలట. స్కిన్‌కేర్ రొటీన్‌లో భాగంగా టోనర్, సీరమ్ అంటూ ఒకదాని తర్వాత ఒక ఉత్పత్తి రాస్తూ వెళ్తున్నాం. వీటివల్ల చర్మమూ ఉక్కిరిబిక్కిరి అవుతుంది. అందుకే ఎంతమంచివైనా అప్పుడప్పుడూ గ్యాప్ ఇవ్వాలి. అలాగని ఉత్పత్తుల్ని ఒక్కసారిగా ఆపేస్తే చర్మంలో తేమ తగ్గిపోతుంది. కాబట్టి, క్రమంగా చేసుకుంటూ వెళ్లాలి. అంటే మొదట క్లెన్సర్, మాయిశ్చరైజర్, సన్‌స్క్రీన్ మాత్రమే వాడాలి. అప్పుడు తగినంత తేమ అందుతూనే యూవీ కిరణాల నుంచి రక్షణనీ పొందొచ్చు. తర్వాత వీటి వాడకాన్నీ ఒక్కొక్కటిగా పూర్తిగా ఆపేయాలి. ఇలా ఒకటి నుంచి వారం రోజులు చేస్తే సరి. ఇది చర్మాన్ని ఎక్స్‌ఫోలియేట్ చేస్తుంది. రసాయన ఉత్పత్తుల వాడకంతో దెబ్బతిన్న చర్మాన్ని రిపేరు చేస్తుంది.

ఛాంపియన్



సుదీర్ఘ ఫార్మాట్లో దక్షిణాఫ్రికా ధాటికి నిలవలేకపోయిన టీమ్‌ఇండియా.. పరిమిత ఓవర్ల క్రికెట్లో మాత్రం అదరగొడుతోంది. వన్డే సిరీస్‌ను కొంచెం కష్టపడి చేజిక్కించుకున్న భారత్.. టీ20 సిరీస్‌ను భారీ విజయంతో మొదలుపెట్టింది. హోరాహోరీ ఖాయమనుకున్న తొలి టీ20లో సూర్యకుమార్ సేన ఏకంగా 101 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ఓ మోస్తరు స్కోరుకే పరిమితమయ్యేలా కనిపించిన జట్టుకు హార్దిక్ పాండ్య మెరుగైన స్కోరు సాధించి పెడితే.. తర్వాత బౌలర్లు సమష్టిగా సత్తా చాటి దక్షిణాఫ్రికాను కేవలం 74 పరుగులకే కుప్పకూల్చేశారు.

హార్దిక్ పాండ్య మెరుపు ఇన్నింగ్స్

వచ్చాడు.. గెలిపించాడు

- తొలి టీ20లో దక్షిణాఫ్రికా చిత్తు చిత్తు
- విజృంభించిన బౌలర్లు..

101 పరుగుల తేడాతో భారత్ ఘనవిజయం

కటక్: భారత పర్యటనలో ముందుకు సాగేకొద్దీ దక్షిణాఫ్రికా బలహీన పడుతోంది. టెస్టుల్లో సంపూర్ణ ఆధిపత్యం చలాయించి.. వన్డేల్లో గట్టి పోటీ ఇచ్చిన ఆ జట్టు.. టీ20 సిరీస్‌ను పేలవంగా ఆరంభించింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన టీమ్‌ఇండియా.. తొలి టీ20లో 101 పరుగుల తేడాతో సఫారీ జట్టును మట్టికరిపించింది. హార్దిక్ పాండ్య (59 నాటౌట్; 28 బంతుల్లో 6×4, 4×6) పునరాగమనంలో విధ్వంసక ఇన్నింగ్స్ ఆడడంతో మొదట భారత్ 6 వికెట్లకు 175 పరుగులు చేసింది. దక్షిణాఫ్రికా బౌలర్లలో ఎంగిడి (3/31) మెరిశాడు. అనంతరం అర్ష్‌దీప్ సింగ్ (2/14), జస్‌ప్రీత్ బుమ్రా (2/17), వరుణ్ చక్రవర్తి (2/19), అక్షర్ పటేల్ (2/7)ల ధాటికి దక్షిణాఫ్రికా 12.3 ఓవర్లలో 74 పరుగులకే కుప్పకూలింది. డెవాల్డ్ బ్రెవిస్ (22) టాప్‌స్కోరర్. భారత జట్టులో బౌలింగ్ చేసిన ఆరుగురికీ వికెట్ దక్కింది.

టపటపా..: 176.. టీ20ల్లో మరీ కష్టమైన లక్ష్యమేమీ కాదు. కొన్ని రోజుల ముందు దక్షిణాఫ్రికా తొలి వన్డేలో 350 లక్ష్యానికి చేరువగా వచ్చి, రెండో మ్యాచ్‌లో 359 లక్ష్యాన్ని ఛేదించిన నేపథ్యంలో ఈ స్కోరును జట్టు కాపాడుకోగలదా అన్న సందేహాలు కలిగాయి. కానీ పేసర్లు, స్పిన్నర్లు అని తేడా లేకుండా భారత బౌలర్లందరూ కట్టుదిట్టంగా బంతులేయడంతో సఫారీ జట్టు కుదేలైంది. ఆ జట్టు ఏ దశలోనూ లక్ష్యం దిశగా సాగలేదు. తొలి ఓవర్లో మొదలైన వికెట్ల పతనం ఏ దశలోనూ ఆగలేదు. ఆ జట్టులో అత్యధిక భాగస్వామ్యం 24 పరుగులే. వరుస ఓవర్లలో డికాక్ (0), స్టబ్స్ (14)లను ఔట్ చేసిన అర్ష్‌దీప్.. ఆరంభంలోనే దక్షిణాఫ్రికాను గట్టి దెబ్బ తీశాడు. అయితే ప్రమాదకర మార్‌క్రమ్ (14), బ్రెవిస్ కాస్త నిలవడంతో దక్షిణాఫ్రికా పుంజుకున్నట్లే కనిపించింది. కానీ ఆరో ఓవర్లో బౌలింగ్‌కు వచ్చిన అక్షర్ పటేల్.. తొలి బంతికే మార్‌క్రమ్‌ను బోల్డ్ చేయడంతో దక్షిణాఫ్రికా నిలదొక్కుకోలేకపోయింది. మిల్లర్ (1), డొనోవన్ ఫెరీరా (5) ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. యాన్సెన్ (12) కూడా ఎక్కువసేపు నిలవలేదు. 11వ ఓవర్లో బుమ్రా.. బ్రెవిస్, కేశవ్ (0)లను ఔట్ చేయడంతో దక్షిణాఫ్రికాకు పరాభవాన్ని ఖాయం చేశాడు. కాసేపటికే ఇన్నింగ్స్ ముగిసిపోయింది.


వరుణ్ 2/19

హార్దిక్ అదరహో..: మొదట టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన భారత్.. ఇన్నింగ్స్‌ను ఆరంభించిన తీరు చూస్తే 150 అయినా చేస్తుందా అనిపించింది. ఆసియా కప్‌లో గాయపడి రెండు నెలలకు పైగా విరామం తీసుకుని, పునరాగమనం చేసిన ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య మెరుపు ఇన్నింగ్స్‌తో భారత్‌కు పెద్ద స్కోరే సాధించి పెట్టాడు. పేసర్ ఎంగిడి తన తొలి స్పెల్‌లో భారత్‌ను గట్టి దెబ్బే తీశాడు. ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (4), కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (12).. అతడి బంతులను తప్పుగా అంచనా వేసి పేలవ షాట్లతో వలయం లోపలే బంతిని గాల్లోకి లేపి పెవిలియన్ చేరిపోయారు. ఈ దశలో ఆశలన్నీ ఓపెనర్ అభిషేక్ శర్మ (17)పై నిలవగా అతడి మెరుపులు రెండు ఫోర్లు, ఓ సిక్సర్‌కు పరిమితమయ్యాయి. ప్రమాదకర అభిషేక్‌ను యువ పేసర్ సిపమ్లా (2/38) ఔట్ చేసి దక్షిణాఫ్రికాను సంబరాల్లో ముంచెత్తాడు. దీంతో 7 ఓవర్లకు భారత్ 50/3తో నిలిచింది. ఈ దశలో బ్యాటింగ్ ఆర్డర్లో ముందుకు వచ్చిన అక్షర్ పటేల్ (23)తో కలిసి తిలక్ వర్మ (26) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. కానీ స్కోరు వేగం పెద్దగా పెరగలేదు. భారీ షాట్ ఆడే ప్రయత్నంలో తిలక్ ఔటైపోవడంతో 12 ఓవర్లకు భారత్ 80/4తో నిలిచింది. కానీ క్రీజులోకి వచ్చీ రాగానే హార్దిక్ బ్యాటుకు పని చెప్పడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. తాను ఎదుర్కొన్న రెండో బంతినే అతను సిక్సర్‌గా మలిచాడు. స్పిన్నర్ కేశవ్ మహరాజ్ వేసిన ఈ ఓవర్లోనే మరో సిక్సర్ అందుకున్నాడు. హార్దిక్ చివరి వరకు క్రీజులో నిలవడంతో.. కేశవ్ మళ్లీ బౌలింగ్‌కే రాలేదు. అవతలి ఎండ్‌లో అక్షర్, దూబె (11) ఔటైనా.. హార్దిక్ మాత్రం ఆఖరు వరకు మెరుపులు కొనసాగించాడు. చివరి ఓవర్లో నోకియా బౌలింగ్‌లో సిక్సర్‌తో అతడి అర్ధ శతకం పూర్తయింది. అందుకతను 25 బంతులే తీసుకున్నాడు. హార్దిక్‌తో పాటు జితేశ్ (10 నాటౌట్) అజేయంగా నిలిచాడు.

భారత్ ఇన్నింగ్స్: అభిషేక్ (సి) యాన్సెన్ (బి) సిపమ్లా 17; శుభ్‌మన్ (సి) యాన్సెన్ (బి) ఎంగిడి 4; సూర్యకుమార్ (సి) మార్‌క్రమ్ (బి) ఎంగిడి 12; తిలక్ (సి) యాన్సెన్ (బి) ఎంగిడి 26; అక్షర్ (సి) ఫెరీరా (బి) సిపమ్లా 23; హార్దిక్ నాటౌట్ 59; దూబె (బి) ఫెరీరా 11; జితేశ్ నాటౌట్ 10; ఎక్స్‌ట్రాలు 13 **మొత్తం:** (20 ఓవర్లలో 6 వికెట్లకు) **175; వికెట్ల పతనం:** 1-5, 2-17, 3-48, 4-78, 5-104, 6-137; **బౌలింగ్:** ఎంగిడి 4-0-31-3; యాన్సెన్ 4-0-23-0; సిపమ్లా 4-0-38-2; నోకియా 4-0-41-0; కేశవ్ మహరాజ్ 2-0-25-0; డొనోవన్ ఫెరీరా 2-0-13-1

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ (సి) అభిషేక్ (బి) అర్ష్‌దీప్ 0; మార్‌క్రమ్ (బి) అక్షర్ 14; స్టబ్స్ (సి) జితేశ్ (బి) అర్ష్‌దీప్ 14; బ్రెవిస్ (సి) సూర్యకుమార్ (బి) బుమ్రా 22; మిల్లర్ (సి) జితేశ్ (బి) హార్దిక్ 1; ఫెరీరా (సి) జితేశ్ (బి) వరుణ్ 5; యాన్సెన్ (బి) వరుణ్ 12; కేశవ్ (సి) జితేశ్ (బి) బుమ్రా 0; నోకియా (బి) అక్షర్ 1; సిపమ్లా (సి) అభిషేక్ (బి) దూబె 2; ఎంగిడి నాటౌట్ 2; ఎక్స్‌ట్రాలు 1 **మొత్తం:** (12.3 ఓవర్లలో ఆలౌట్) **74; వికెట్ల పతనం:** 1-0, 2-16, 3-40, 4-45, 5-50, 6-68, 7-68, 8-70, 9-72; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 2-0-14-2; బుమ్రా 3-0-17-2; వరుణ్ చక్రవర్తి 3-1-19-2; అక్షర్ పటేల్ 2-0-7-2; హార్దిక్ 2-0-16-1; శివమ్ దూబె 0.3-0-1-1


బుమ్రా 2/17

ఒకే ఒక్కడు బుమ్రా

అంతర్జాతీయ క్రికెట్లో మూడు ఫార్మాట్లలోనూ కనీసం వంద వికెట్లు తీసిన తొలి భారత బౌలర్‌గా జస్‌ప్రీత్ బుమ్రా రికార్డు నెలకొల్పాడు. ఇప్పటికే టెస్టులు, వన్డేల్లో ఈ ఘనత సాధించిన ఈ ఫాస్ట్‌బౌలర్.. మంగళవారం టీ20ల్లోనూ సెంచరీ క్లబ్బులో అడుగు పెట్టాడు. దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ 11వ ఓవర్లో బ్రెవిస్‌ను ఔట్ చేయడం ద్వారా బుమ్రా 100 వికెట్ల మైలురాయిని అందుకున్నాడు. అదే ఓవర్లో అతను మరో వికెట్ కూడా తీశాడు. బుమ్రాకిది 81వ టీ20 మ్యాచ్. 52 టెస్టులాడి 234 వికెట్లు తీసిన బుమ్రా.. 89 వన్డేల్లో 149 వికెట్లు పడగొట్టాడు. అర్ష్‌దీప్ సింగ్ (69 మ్యాచ్‌ల్లో 107 వికెట్లు) టీ20ల్లో వంద వికెట్లు తీసిన తొలి భారత బౌలర్.

350 మందితో తుది జాబితా

భారత ఆటగాళ్లు 240 మంది ● 16న అబుదాబిలో ఐపీఎల్ వేలం

ముంబయి: వచ్చే ఐపీఎల్ సీజన్ కోసం ఈ నెల 16న అబుదాబిలో జరగబోయే వేలం కోసం ఆటగాళ్ల తుది జాబితా ఖరారైంది. ప్రపంచవ్యాప్తంగా మొత్తం 1,390 మంది క్రికెటర్లు తమ పేర్లను నమోదు చేసుకోగా.. ఫ్రాంఛైజీల ఆసక్తి మేరకు అందులోంచి 350 మందిని వేలానికి ఎంపిక చేశారు. ఇందులో భారత ఆటగాళ్ల సంఖ్య 240. ఆటగాళ్ల రిటెన్షన్ ప్రక్రియ తర్వాత పది ఫ్రాంఛైజీల్లో కలిపి 77 ఖాళీలున్నాయి. చివరి దశలో దక్షిణాఫ్రికా వికెట్ కీపర్ బ్యాటర్ క్వింటన్ డికాక్ వేలం జాబితాలోకి వచ్చాడు. అతను రూ.కోటి బేస్ ధరతో తన పేరును నమోదు చేసుకున్నాడు. చివరగా 2021లో ఐపీఎల్ ఆడిన ఆస్ట్రేలియా సీనియర్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ కూడా వేలంలోకి రానున్నాడు. అతడి కనీస ధర రూ.2 కోట్లు. ఫ్రాంఛైజీలన్నీ కలిసి 46 మంది భారత ఆటగాళ్లను, 31 మంది విదేశీయులను ఎంచుకోవాల్సి ఉంది. వెంకటేశ్ అయ్యర్, పృథ్వీ షా, సర్ఫరాజ్ ఖాన్ లాంటి భారత ఆటగాళ్ల కోసం పోటీ ఉండొచ్చు. విదేశీయుల్లో ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్ అత్యంత ఆకర్షణీయ ఆటగాడు. ఇంకా రచిన్ రవీంద్ర, డెవాన్ కాన్వే, జోష్ ఇంగ్లిస్, డేవిడ్ మిల్లర్, జేక్ ఫ్రేజర్, హసరంగ లాంటి క్రికెటర్లకు గట్టి డిమాండ్ ఉండొచ్చు.

శ్రీలంకతో సిరీస్‌కు శ్రీచరణి, అరుంధతి


శ్రీచరణి

దిల్లీ: శ్రీలంకతో ఐదు టీ20ల సిరీస్‌లో తలపడే భారత మహిళల జట్టులో తెలుగమ్మాయిలు శ్రీచరణి, అరుంధతి రెడ్డి ఆడనున్నారు. ఈ నెల 21న ఆరంభమయ్యే ఈ సిరీస్‌లో బరిలో దిగే జట్టును సెలక్టర్లు మంగళవారం ప్రకటించారు. భారత జట్టుకు హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్ కాగా.. స్మృతి మంధాన వైస్ కెప్టెన్. ముంబయి వికెట్‌కీపర్ బ్యాటర్ కమలిని, మధ్యప్రదేశ్ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ వైష్ణవి శర్మ జట్టులో కొత్త ముఖాలు. షెఫాలి వర్మ కూడా ఈ టీమ్‌లో ఉంది. ఈ సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌లు విశాఖపట్నంలో.. తర్వాతి మూడు తిరువనంతపురంలో జరుగుతాయి.

భారత జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), దీప్తి శర్మ, స్నేహ్ రాణా, జెమీమా, షెఫాలి, హర్లీన్ డియోల్, అమన్‌జోత్, అరుంధతి రెడ్డి, శ్రీచరణి, క్రాంతి గౌడ్, రేణుక సింగ్, రిచా ఘోష్, కమలిని, వైష్ణవి శర్మ.

కాంస్యమైనా దక్కేనా!

సాయంత్రం 5.30 నుంచి

- నేడు అర్జెంటీనాతో భారత్ పోరు
- ఫైనల్లో జర్మనీ, స్పెయిన్ ఢీ

చెన్నై: జూనియర్ హాకీ ప్రపంచ కప్‌లో టైటిల్ కల చెదిరిన ఆతిథ్య భారత్ మరో పోరుకు సిద్ధమైంది. బుధవారం కాంస్య పతక మ్యాచ్‌లో అర్జెంటీనాతో తలపడబోతోంది. సెమీ ఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ జర్మనీ చేతిలో 1-5తో ఓడిన భారత్.. కనీసం కాంస్య పతకంతోనైనా ఈ టోర్నీని ముగిస్తుందేమో చూడాలి. కంచు గెలవడం భారత్‌కు తేలికేం కాదు. రెండుసార్లు ఛాంపియన్ అర్జెంటీనాతో హోరాహోరీ పోరు తప్పదు. జర్మనీతో మ్యాచ్‌లో ఒత్తిడికి గురై భారత్ గోల్స్ ఇచ్చేసింది. అర్జెంటీనాతో పోరులో ఆ తప్పులు దిద్దుకోవాలి. కెప్టెన్ రోహిత్, దిల్‌రాజ్ సింగ్, అర్ష్‌దీప్, అంకిత్ పాల్, సౌరభ్ ఆనంద్, గుర్‌జ్యోత్ రాణించాల్సి ఉంటుంది. పెనాల్టీ కార్నర్లను సద్వినియోగం చేసుకోవడంపై జట్టు దృష్టి సారించాలి. "జర్మనీతో మ్యాచ్‌లో భారత్ చాలా తప్పులు చేసింది. తేలిగ్గా గోల్స్ ఇచ్చేసింది. ప్రణాళికలను అమలు చేయకపోవడం వల్లే జట్టు ఓడింది. అర్జెంటీనాపై భారత్ పుంజుకోవాలి" అని కోచ్ పీఆర్ శ్రీజేశ్ అన్నాడు. బుధవారమే జరిగే ఫైనల్లో స్పెయిన్‌తో జర్మనీ తలపడబోతోంది. ఈ మ్యాచ్ రాత్రి 8 గంటల నుంచి ఆరంభం కానుంది.

ముంబయిలో మెస్సి ర్యాంప్‌వాక్


మెస్సి

కోల్‌కతా: భారత పర్యటనకు రానున్న అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సి ముంబయిలో ర్యాంప్ వాక్ చేయనున్నాడు. డిసెంబరు 14న జరిగే ఈ ర్యాంప్‌వాక్‌లో ఉరుగ్వే మేటి ఆటగాడు లూయిస్ సువారెజ్ (ఉరుగ్వే), అర్జెంటీనా స్టార్ స్ట్రైకర్ రోడ్రిగో డి పాల్ కూడా పాల్గొంటారని 'గోట్ ఇండియా టూర్ 2025' ప్రమోటర్ శతద్రు దత్తా తెలిపాడు. ధార్మిక కార్యక్రమం కోసం ఈ ఫ్యాషన్ షోను నిర్వహిస్తున్నారని చెప్పాడు. ముంబయిలో వేలం కోసం 2022 ప్రపంచకప్‌నకు సంబంధించి ఏదైనా జ్ఞాపికను తీసుకురావాలని నిర్వాహకులు మెస్సిని కోరారు. ముంబయి ఈవెంట్ 14న సాయంత్రం 5 గంటలకు వాంఖడే స్టేడియంలో ఆరంభమవుతుంది. మరోవైపు కోల్‌కతాలో ఈ నెల 13న మెస్సి అతి పెద్ద విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. భద్రత కారణాల రీత్యా పోలీసుల అనుమతి రాకపోవడంతో హోటల్ గది నుంచే మెస్సి వర్చువల్‌గా విగ్రహావిష్కరణ చేయనున్నట్లు తెలుస్తోంది. ఆ కార్యక్రమం తర్వాత అతడు.. సాల్ట్‌లేక్ స్టేడియంలో జరిగే ఈవెంట్‌కు హాజరవుతాడు. దీనికి 70 వేల మందికిపైగా ప్రేక్షకులు హాజరవుతారని భావిస్తున్నారు. మెస్సి బృందం అదే రోజు హైదరాబాద్‌కు వస్తుంది. ఉప్పల్ స్టేడియంలో మెస్సి ఫుట్‌బాల్ మ్యాచ్ ఆడతాడు. మెస్సి జట్టుకు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని జట్టుకు మధ్య ఎగ్జిబిషన్ మ్యాచ్ జరుగుతుంది. మెస్సి తన పర్యటనలో చివరి అంచెలో సోమవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని దిల్లీలోని ఆయన నివాసంలో కలుస్తాడు.

క్యాండిడేట్స్ టోర్నీలో బాగా ఆడాలని..



దిల్లీ: క్యాండిడేట్స్ టోర్నమెంట్లో మెరుగ్గా రాణించడం కోసం సన్నద్ధమవుతున్నానని భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద అన్నాడు. 'నేను 2025 ఫిడే సర్క్యూట్ గెలిచినట్లు ఫిడే అధికారికంగా ప్రకటించింది. చాలా సంతోషంగా ఉంది. ఈ ఏడాది ఆసాంతం నా ప్రదర్శన పట్ల సంతృప్తిగా ఉన్నా. నాణ్యమైన చెస్ ఆడానని అనుకుంటున్నా. నా జట్టు మొత్తానికి కృతజ్ఞతలు. నేను పేలవ ప్రదర్శన చేసినప్పుడు కూడా వాళ్లు నాపై నమ్మకముంచారు' అని అతడు చెప్పాడు. "నాకు, భారత చెస్‌కు మద్దతుగా నిలిచినందుకు అభిమానులకు కృతజ్ఞతలు. ఇక క్యాండిడేట్స్ టోర్నమెంట్ దిశగా పని చేయాలి. బాగా కష్టపడుతూనే ఉంటా. ఆ టోర్నీలో అత్యుత్తమ ప్రదర్శన చేయడానికి ప్రయత్నిస్తా" అని ప్రజ్ఞానంద అన్నాడు. ఇటీవల లండన్ చెస్ క్లాసిక్ ఈవెంట్లో విజయం తర్వాత ప్రజ్ఞానంద.. వచ్చే ఏడాది జరిగే క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించాడు.

టీపీఎల్‌లో బెంగళూరు శుభారంభం

అహ్మదాబాద్: టెన్నిస్ ప్రీమియర్ లీగ్ సీజన్-7లో సీఎస్‌జీ ఫైకర్స్ బెంగళూరు, రాజస్థాన్ రేంజర్స్ శుభారంభం చేశాయి. మంగళవారం మొదలైన ఈ టోర్నీలో బెంగళూరు 56-44తో గుర్‌గ్రామ్ గ్రాండ్‌స్లామర్స్‌ను ఓడించింది. మొదట శ్రీవల్లి 18-7తో సహజ యమలపల్లిపై నెగ్గగా.. మిక్స్‌డ్ డబుల్స్‌లో శ్రీవల్లి-రోహన్ బోపన్న జంట 14-11తో సహజ-శ్రీరామ్ బాలాజీ జోడీపై గెలవడంతో బెంగళూరు 2-0 ఆధిక్యంలో నిలిచింది. సింగిల్స్‌లో గుర్‌గ్రామ్ ఆటగాడు ఇవాన్స్ 16-9తో రామ్‌కుమార్‌పై నెగ్గినా.. పురుషుల డబుల్స్‌లో బోపన్న-రామ్‌కుమార్ జంట 15-10తో బాలాజీ-ఇవాన్స్ ద్వయాన్ని ఓడించి బెంగళూరును గెలిపించింది. డిఫెండింగ్ ఛాంపియన్ హైదరాబాద్ స్ట్రైకర్స్ 48-52తో రాజస్థాన్ చేతిలో ఓడింది. మహిళల సింగిల్స్‌లో కరోల్ 18-7తో ఎక్తరీనాను ఓడించి హైదరాబాద్‌కు శుభారంభం అందించింది. అక్కడ నుంచి రాజస్థాన్‌దే పైచేయి. మిక్స్‌డ్ డబుల్స్‌లో దక్షిణేశ్వర్-కజినోవా జంట 23-12తో కరోల్-విష్ణు జోడీపై గెలవగా.. పురుషుల సింగిల్స్‌లో దార్దెరి 15-0తో పెడ్రో మార్టినెజ్‌ను ఓడించి రాజస్థాన్ ఆధిక్యాన్ని 2-1కి పెంచాడు. తర్వాత పురుషుల డబుల్స్‌లో దక్షిణేశ్వర్-దార్దెరి ద్వయం 17-8తో విష్ణు-మార్టినెజ్ జంటను ఓడించడంతో రాజస్థాన్ విజయాన్ని అందుకుంది.

రోమ్ చెస్ టైటిల్ ప్రణీత్ సొంతం


ప్రణీత్

రోమ్: తెలంగాణ యువ చెస్ కెరటం ప్రణీత్ ఉప్పాల సత్తా చాటాడు. రోమ్ ఇంటర్నేషనల్ టోర్నీలో విజేతగా నిలిచాడు. 9 రౌండ్లలో 8 పాయింట్లతో అతడు అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ టోర్నీలో ఏడు విజయాలు సాధించిన ఈ భారత గ్రాండ్‌మాస్టర్... రెండు గేమ్‌లను డ్రాగా ముగించాడు. మార్టినోవిచ్ (7 పాయింట్లు), కపిలోవ్ డానియల్ (7 పాయింట్లు) రెండు, మూడో స్థానాలు దక్కించుకున్నారు. 17 ఏళ్ల ప్రణీత్.. నెదర్లాండ్స్, స్పెయిన్‌లో వివిధ టోర్నీల్లో బరిలో దిగనున్నాడు.

సచిన్ సెంచరీ కోసం..


సచిన్

ముంబయి: అప్పట్లో ఇరానీ కప్‌లో తన సెంచరీ పూర్తి కావడం కోసం టీమ్‌ఇండియా మాజీ ఆటగాడు గురుశరణ్ సింగ్ విరిగిన చేతితోనే బ్యాటింగ్‌కు దిగిన విషయాన్ని భారత క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్ గుర్తు చేసుకున్నాడు. 1989-90లో రెస్టాఫ్ ఇండియా తరఫున దిల్లీతో ఆడిన ఆ మ్యాచ్‌లో సచిన్ గొప్పగా పోరాడి 103 పరుగులు చేశాడు. ఆ పోరులో దిల్లీ 309 పరుగులు తేడాతో రెస్ట్‌ను చిత్తు చేసింది. 554 పరుగుల లక్ష్య ఛేదనలో రెస్ట్ 209/9తో నిలవగా.. పంజాబ్‌కు చెందిన గురుశరణ్ సింగ్ ఆఖరి బ్యాటర్‌గా వచ్చాడు. చేయి విరిగినా సచిన్‌కు మద్దతివ్వడం కోసం అతడు బరిలోకి దిగాడు. అతడు, సచిన్ ఆఖరి వికెట్‌కు 36 పరుగులు జోడించారు. '1989లో నేను ఇరానీ ట్రోఫీలో ఆడుతున్నా. టీమ్‌ఇండియా సెలక్షన్‌కు అది ట్రయల్ మ్యాచ్. నేను 90ల్లో ఉన్నా. గురుశరణ్ సింగ్ చేయి విరిగింది. బ్యాటింగ్ చేసే స్థితిలో లేడు. కానీ బ్యాటింగ్‌కు వెళ్లి సహచరుడికి అండగా నిలవాలని సెలక్షన్ కమిటీ ఛైర్మన్ రాజ్‌సింగ్ దుంగార్పూర్ అతణ్ని ఆదేశించాడు. గురుశరణ్ క్రీజులోకి వచ్చి నా శతకానికి సహకరించాడు. ఆ మ్యాచ్ తర్వాత నేను భారత జట్టుకు ఎంపికయ్యా. ఆపై అతను కూడా జట్టులో భాగమయ్యాడు'' అని ఓ కార్యక్రమం సందర్భంగా సచిన్ చెప్పాడు. గురుశరణ్ టీమ్‌ఇండియా తరఫున ఒక టెస్టు, వన్డే మ్యాచ్ ఆడాడు.

యాషెస్‌కు వుడ్, హేజిల్‌వుడ్ దూరం


మార్క్‌వుడ్

బ్రిస్బేన్: యాషెస్ సిరీస్‌లో ఇప్పటికే ఆస్ట్రేలియా చేతిలో తొలి రెండు టెస్టులు ఓడిన ఇంగ్లాండ్‌కు ఎదురు దెబ్బ. ఆ జట్టు ప్రధాన పేసర్ మార్క్ వుడ్ గాయంతో ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. తొలి టెస్టులో 11 ఓవర్లే బౌలింగ్ చేసిన వుడ్.. ఒకే వికెట్ తీశాడు. మోకాలి గాయంతో రెండో టెస్టులో ఆడలేకపోయాడు. 2023 యాషెస్‌లో వుడ్ అత్యధిక వికెట్లు పడగొట్టాడు. వుడ్ స్థానంలో మ్యాట్ ఫిషర్ జట్టులోకి రానున్నాడు. అతడు ఇప్పటిదాకా ఒకే టెస్టు ఆడాడు. ఈ సిరీస్‌కు ఆస్ట్రేలియా పేసర్ హేజిల్‌వుడ్ కూడా దూరమయ్యాడు. చీలమండ గాయంతో బాధపడుతున్న ఈ పేసర్.. తొలి రెండు టెస్టుల్లో ఆడలేదు. మూడో టెస్టుకు వస్తాడని అనుకున్నా.. అతడు సిరీస్ నుంచి పూర్తిగా వైదొలిగాడు. మరోవైపు కెప్టెన్ కమిన్స్ పునరాగమనం చేయబోతుండడం కంగారూ జట్టుకు ఉత్సాహాన్నిచ్చేదే. వెన్ను నొప్పితో తొలి రెండు టెస్టుల్లో కమిన్స్ ఆడలేకపోయాడు. అయిదు టెస్టుల సిరీస్‌లో నిలవాలంటే ఇంగ్లాండ్ ఈనెల 17న అడిలైడ్‌లో ఆరంభమయ్యే మూడో టెస్టును కనీసం డ్రా చేసుకోవాలి.

కోల్‌కతా అథ్లెటిక్ మీట్‌లో చెప్తెగి


చెప్తెగి

కోల్‌కతా: కోల్‌కతా ఆతిథ్యమిచ్చే ప్రపంచ 25కే అథ్లెటిక్ మీట్‌లో.. 10 వేల మీటర్ల పరుగులో రెండుసార్లు ఒలింపిక్, మూడుసార్లు ప్రపంచ ఛాంపియన్ జోషువా చెప్తెగి (ఉగాండా) పాల్గొనబోతున్నాడు. డిసెంబర్ 21న జరిగే ఈ రేసులో 23 వేల మందికి పైగా అథ్లెట్లు పోటీలో ఉండడం విశేషం. విజేతకు రూ.13.47 లక్షలు, రన్నరప్‌కు రూ. 8.98 లక్షలు దక్కుతాయి. మూడో స్థానంలో నిలిచిన అథ్లెట్ 6.29 లక్షలు అందుకుంటాడు. పురుషులు, మహిళలకు ప్రైజ్‌మనీ సమానంగా లభిస్తుంది. 10 వేల పరుగులో చెప్తెగె వరుసగా మూడు ప్రపంచ టైటిళ్లు గెలిచాడు. గతేడాది దిల్లీ హాఫ్ మారథాన్‌లోనూ విజేతగా నిలిచాడు. 5 వేలు, 10 వేల మీటర్ల పరుగులో ప్రపంచ రికార్డులు అతడి ఖాతాలోనే ఉన్నాయి. ఈ ఏడాది ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో మారథాన్‌లో పసిడి గెలిచిన అల్ఫాన్స్ సింబు (టాంజానియా) నుంచి చెప్తెగెకి పోటీ ఎదురు కానుంది. మహిళల విభాగంలో సుటుమె అసెఫా బరిలో ఉంది. ఆమె డిఫెండింగ్ ఛాంపియన్‌గా పోటీపడనుంది. 2023 కోల్‌కతా 25కే పరుగులో సుటుమె విజేతగా నిలిచింది.

జగన్మాత సేవకు.. సర్వం సిద్ధం

భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లు పూర్తి

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నిర్వహించనున్న భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లు మంగళవారం తుది దశకు చేరుకున్నాయి. రెండు రోజుల్లో దీక్షల విరమణ ప్రారంభం కానుంది. సుమారు ఆరు లక్షల మంది దీక్షాధారులు ఈనెల 11 నుంచి 15 వరకు గిరి ప్రదక్షిణ చేస్తారని అంచనా. దుర్గమ్మకు ఇరుముడి సమర్పించిన అనంతరం మాల విరమణ చేస్తారు. ✦ మూడు చోట్ల హోమగుండాలను ఏర్పాటు చేశారు. సీతమ్మ వారి పాదాల సెంటరు సమీపంలోని ఘాట్ల వద్ద జల్లు స్నానాలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ✦ కెనాల్ రోడ్డు వినాయకుడి గుడి నుంచి క్యూలైన్ల ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. గిరిప్రదక్షిణ మార్గంలో రోడ్లపై గోతులకు కార్పొరేషన్ సిబ్బంది తాత్కాలిక మరమ్మతు పనులు ముమ్మరం చేశారు. ✦ దేవస్థానం అధికారులు నూతన ప్రసాదాల పోటు, కౌంటర్ల ఏర్పాటు, అన్నప్రసాద తయారీ కేంద్రం వినియోగంలోకి తీసుకొచ్చారు. అర్జున వీధిలోని రేకుల షెడ్డులో తయారు చేసిన లడ్డు ప్రసాదాలను ఆరబెట్టిన తరువాత కౌంటర్లకు పంపేందుకు ఏర్పాట్లు చేశారు. ✦ సీతమ్మవారి పాదాల సెంటరు వద్ద తాత్కాలిక కేశఖండన శాల పనులు జరుగుతున్నాయి. ఇక్కడ ఘాట్ వద్ద స్నానం చేసి భక్తులు గిరిప్రదక్షిణ ప్రారంభిస్తారు. భక్తుల కోసం తాత్కాలిక మరుగుదొడ్లను గిరిప్రదక్షిణ మార్గంలో ఏర్పాటు చేశారు. ✦ పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్, కలెక్టర్ లక్ష్మీశ, మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, సీపీ రాజశేఖరబాబు అధికారులకు పలు సూచనలు చేశారు.


మల్లికార్జున మండపం సమీపంలో ఏర్పాట్లు

✦ నగరానికి భవానీ దీక్షల విరమణ శోభను తీసుకొచ్చే స్వాగత ద్వారాలను ఇంతవరకు ఏర్పాటు చేయలేదు. ఈ విషయమై ఛైర్మన్ రాధాకృష్ణను సంప్రదించగా.. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థానం, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో దసరా ఉత్సవాల తరహాలో విజయవంతం చేస్తారని తెలిపారు. ఉత్సవాలు ప్రారంభించే నాటికి స్వాగత ద్వారాలు కూడా ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు.

బాల గోపాలం.. భావి దీపాలం!

ఉత్సాహంగా బాలోత్సవం
వెల్లివిరిసిన చిన్నారుల సృజన


భళారే.. కళా వైభవం


ఉట్టిపడిన చిత్రరాజం


ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్యం


ప్రకృతికి ప్రణామం... మట్టి ప్రతిమల తయారీ..

చిట్టి గుండెలు సందడి చేసే సంబరమొచ్చింది.. చిన్నారుల్లో కళ, సృజన, నైపుణ్యాలు కనువిందు చేసే పండగొచ్చింది. శాస్త్రీయ నాట్య కళారూపాలు, హస్తాకృతిలోని జానపద నృత్య రీతులు ప్రదర్శించే వేడుక కొలువుదీరింది. వైవిధ్య కళారూపాలకు జవసత్వాలు తెచ్చే జాతర వెలుగులీనింది. దేశభక్తిని పసి మనసుల్లో పదిలం చేసే పర్వదినం వచ్చేసింది. మొత్తమ్మీద బడికెళ్లే బుడుగులను పిడుగులుగా మార్చే బాలోత్సవం వచ్చేసింది. వీపీ సిద్ధార్థ కళాశాలలో మంగళవారం మొదలైన ఈ సంబరం గురువారం వరకు కొనసాగనుంది. మొదటి రోజు కళలు, సృజన మేళవింపుగా సాగిన చిన్నారుల ప్రదర్శనలు ఔరా అనిపించాయి. మట్టిప్రతిమల తయారీ పోటీ ప్రకృతిని ప్రేమించాలనే ప్రేరణ కల్పించేలా సాగింది. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అనే నినాదాన్ని ప్రతిబింబించింది. రచన, వ్యక్తీకరణ సామర్థ్యం పెంచే వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో చిన్నారులు భళా అనిపించారు. లఘు నాటికల ప్రదర్శనల్లో చిన్నారులు హావభావాలతో కట్టి పడేశారు. దేశ భక్తి, అభ్యుదయ గీతాలాపనలు, ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచే పత్రికా పఠనంతో వైవిధ్య పోటీలకు స్థానం కల్పించారు. దేశ చరిత్ర, వారసత్వ సంపదలు ప్రతిబింబించేలా వినూత్న వేషధారణలతో చేసిన ప్రదర్శన (ఫ్యాన్సీ షో) కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఈనాడు, అమరావతి
- విజయవాడ సిటీ, న్యూస్‌టుడే



మరిన్ని చిత్రాలు.. www.eenadu.net లో చూడవచ్చు

ఓటేయొచ్చు..

మీ ఇంటి సమీపంలోనే..!

ఉమ్మడి కృష్ణాలో కొత్తగా 202 పోలింగ్ కేంద్రాలు

ప్రజల్లో చైతన్యం పెరగడంతో గతం కంటే ఎక్కువగా ఓటేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఎన్నికలు జరిగిన ప్రతిసారి పోలింగ్ కేంద్రాల వద్ద బారులే బారులు. ఎక్కువ మంది ఓటర్లకు... తక్కువ పోలింగ్ కేంద్రాలు ఉండటమే.. కారణమని గుర్తించిన ఎన్నికల సంఘం వాటి సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తోంది. ఆ దిశగా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.



పోలింగ్ కేంద్రాలు

	పాతవి	కొత్తవి
తూర్పు	298	23
మధ్య (నగరం)	267	51
పశ్చిమ	253	01
మైలవరం	296	27
తిరువూరు	234	12
నందిగామ	222	12
జగ్గయ్యపేట	222	03

కేంద్రానికి 1,200 మందే..

గతంలో ఒక్కో కేంద్రానికి సుమారు 1,400 మంది ఓటర్లు ఉండగా.. ఆ సంఖ్యను ఇప్పుడు 1200లకు పరిమితం చేయనుంది. ఈమేరకు కృష్ణా జిల్లాలో 73, ఎన్టీఆర్‌లో 129 పోలింగ్ కేంద్రాలు అదనంగా ఏర్పాటు కానున్నాయి. కృష్ణాలో 1,769 ఉండగా.. ఆ సంఖ్య 1,842కు పెరగనుంది. ఎన్టీఆర్‌లో 1,792 ఉండగా 1,921కి పెరగనున్నాయి.

ఏ జిల్లాలో ఎంతమంది ఓటర్లు...

కృష్ణాలో ప్రస్తుతం 15,45,357 మంది ఓటర్లు ఉన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో 17,06,983 మంది ఓటర్లు ఉన్నారు. కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ జరుగుతుండటంతో ఈ సంఖ్య మరింత పెరగనుంది.

- ఈనాడు డిజిటల్, మచిలీపట్నం

న్యాయపీఠంపై స్నేహసౌరభం

జిల్లా న్యాయమూర్తిగా ఎంపికైన బండ్ల స్నేహ

ఘంటసాల, న్యూస్‌టుడే

"విద్య ద్వారా మహిళలు అన్ని రంగాలలో ప్రతిభ చాటుతూ సమాజంలో గుర్తింపు పొందుతున్నారు. ఆ కోవకే చెందుతారు ఘంటసాల మండలం చిట్టూర్పునకు చెందిన సీనియర్ న్యాయవాది బండ్ల సాంబశివరావు-లక్ష్మీకాంతమ్మ దంపతుల కుమార్తె బండ్ల స్నేహ.."

ఉన్నత విద్యను అభ్యసించి ఓ పక్క అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వర్తిస్తూ మరోపక్క పోటీ పరీక్షలకు ఇంటి వద్ద సన్నద్ధమై అనుకున్న లక్ష్యాన్ని సాధించారు. జిల్లా జడ్జిగా ఆమె ఎంపికై ఆదర్శంగా నిలిచారు. ఈమె.. ఘంటసాల ప్రముఖులు వేమూరి ప్రసాద్-ఎంపీపీ రజనీకుమారి కోడలు. స్నేహ, ఆమె భర్త నవీన్ న్యాయవాద వృత్తిలోనే ఉన్నారు. స్నేహ తండ్రి సాంబశివరావు వద్ద జూనియర్ లాయర్లుగా ఆరేళ్లు పనిచేశారు. స్నేహ ఐదేళ్లుగా బందరు కోర్టులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ● ఇంతింతై... ఆమె విజయవాడలోని 'సంవిధ విద్యాపీఠ్' పాఠశాలలో పదో తరగతి వరకు చదివారు. ఇంటర్, డిగ్రీ కూడా విజయవాడలోనే అభ్యసించారు. చెన్నైలో ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ పూర్తిచేశారు. ● ఆపై 2014లో విజయవాడ సిద్ధార్థ లా కళాశాలలో బ్యాచిలర్ ఆఫ్ లా డిగ్రీలో కృష్ణా విశ్వవిద్యాలయం పరిధిలో అత్యుత్తమ మార్కులు సాధించి బంగారు పతకం సాధించారు. ● 2017లో జూనియర్ సివిల్ జడ్జి పోటీ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించి మౌఖిక పరీక్షలకు హాజరైనా ఎంపిక కాలేదు. ● అప్పటి నుంచి న్యాయమూర్తి కావాలనే ఆకాంక్షతో పోటీ పరీక్షలకు ఇంటి వద్దే శ్రమించారు. ● 2020లో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఏపీపీ)గా ఎంపికయ్యారు. ● ఇటీవల జిల్లా జడ్జీల రాత పరీక్షలు రాసి.. జిల్లా న్యాయమూర్తిగా ఎంపికయ్యారు. ఆమెను ప్రముఖులు అభినందించారు. ● జిల్లా న్యాయమూర్తిగా... చట్టపరమైన అంశాలపై హుందాగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా విధులను నిర్వర్తిస్తానని స్నేహ 'న్యూస్‌టుడే'తో పేర్కొన్నారు.


ఘంటసాలలో బండ్ల స్నేహకు సత్కారం

పల్లె ప్రగతికి.. రాచబాట!

ఉమ్మడి జిల్లాకు రూ.129.62 కోట్లు

ఈనాడు, అమరావతి



కూటమి సర్కారు పల్లె ప్రగతికి రాచబాట వేయనుంది. వైకాపా ఐదేళ్ల పాలనలో తట్టెడు మట్టి పోయక అధ్వానంగా తయారైన గ్రామీణ దారులకు పునరుత్తేజం తెచ్చేందుకు పచ్చజెండా ఊపింది. సాస్కి పథకంలో భాగంగా ఉమ్మడి జిల్లాలో 80 రహదారులను అభివృద్ధి చేయనున్నారు. 240.5 కిలోమీటర్లకు రూ.129.62 కోట్ల నిధులు కేటాయిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ రహదారుల జాబితా ప్రభుత్వ ఆమోదం రాగానే టెండర్ల ప్రక్రియ మొదలవుతుంది.

★ **బందరులోనే అధికం:** ఉమ్మడి జిల్లాలో గ్రామీణ ప్రాంత 11 నియోజకవర్గాలకు నిధులు కేటాయించారు. అత్యధికంగా బందరు నియోజకవర్గంలో 11 రహదారులు 29 కిలోమీటర్ల మేర నిర్మించేందుకు రూ.19.27 కోట్లు కేటాయించారు. అత్యల్పంగా నందిగామలో 16 కిమీ మేర నాలుగు దారులు వేసేందుకు రూ.9.25 కోట్లు కేటాయించారు.

జిల్లా	పనులు	కి.మీ	రూ.కోట్లు
కృష్ణా	57	165.2	87.25
ఎన్టీఆర్	23	80.3	42.37

కేటాయింపుల వివరాలు ఇలా...

నియోజకవర్గం	పనులు	కి.మీ	రూ.కోట్లు
జగ్గయ్యపేట	6	23.000	11.47
మైలవరం	6	20.149	11.22
నందిగామ	4	16.259	9.25
తిరువూరు	7	18.042	10.43

ఎంపీ బాలశౌరి హర్షం

జిల్లాలో గ్రామీణ రహదారులను బాగుచేసేందుకు నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకు బందరు ఎంపీ బాలశౌరి కృతజ్ఞతలు తెలిపారు.

లయోలా.. సంబరాల హేల







విజయవాడ ఆంధ్ర లయోలా కళాశాల 72వ వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన శాస్త్రీయ, సంప్రదాయ నృత్యాలు అలరించాయి. ఫ్యాషన్ షో, డప్పు వాయిద్యాలు, వివిధ సంస్కృత అంశాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

- విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

బాలల సంరక్షణ కేంద్రాల్లో వైద్య శిబిరాలు


రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ ఇలక్కియా

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో ఉన్న 16 బాలల సంరక్షణ కేంద్రాల్లో తనిఖీ చేయడంతో పాటు, వైద్య శిబిరాలు నిర్వహించాలని ఇన్‌ఛార్జి కలెక్టర్, జేసీ ఎస్.ఇలక్కియా సంబంధిత అధికారులను ఆదేశించారు. జువైనల్ జస్టిస్ నిబంధనల మేరకు ఏర్పాటైన జిల్లా స్థాయి తనిఖీ కమిటీ సమావేశాన్ని మంగళవారం నగరంలోని కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఆధార్ లేని బాలలకు వాటిని కల్పించడం, చిన్నారులను పాఠశాలల్లో చేర్పించడం తదితరాలపై చర్చించారు. ఆయా సంరక్షణ కేంద్రాలకు తుది రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. డీసీపీవో ఎం.రాజేశ్వరరావు, కమిటీ సభ్యులు జ్యోతి, మాధవి, రాఘవరావు, ఫ్రాన్సిస్ తంబి, జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారిణి రుక్సానా సుల్తానా బేగం తదితరులు పాల్గొన్నారు.


స్మార్ట్ కార్డులు ఇంకా తీసుకోలేదా?

మిగిలిపోయిన 40 వేల కార్డులు

చిట్టినగర్, న్యూస్‌టుడే

✧ ఎన్టీఆర్ జిల్లా కార్డులు: 5,87,046
✧ పంపిణీ చేసినవి: 5,46,716
✧ పంపిణీ చేయాల్సినవి: 40,330

రేషన్ పంపిణీలో అక్రమాల కట్టడికి కూటమి ప్రభుత్వం మూడు నెలల క్రితం స్మార్ట్ రేషన్ కార్డులను అందుబాటులోకి తీసుకొచ్చింది. తొలుత సచివాలయాల ద్వారా ప్రజలకు ఇచ్చేలా ఏర్పాట్లు చేసినా, అనంతరం వాటిని చౌకధరల దుకాణదారులు అందిస్తున్నారు. అయినప్పటికీ ఇంకా చాలా మంది స్మార్ట్ కార్డులు తీసుకోలేదు. మిగిలిపోయిన కార్డులన్నీ త్వరలోనే ప్రభుత్వానికి సరెండర్ చేయనున్నారు. కార్డులపై సెల్‌ఫోన్ నంబర్లు లేకపోవడం, ప్రస్తుతం కార్డుల్లో ఉన్న చిరునామాల్లో వారు లేకపోవడంతో లబ్ధిదారులను గుర్తించడం కష్టమవుతోంది.



పాత వాటితోనూ అందడంతో.. వైకాపా హయాంలో ఇచ్చిన రేషన్‌కార్డు నంబరు, కూటమి ప్రభుత్వం ఇచ్చిన స్మార్ట్ కార్డు నంబరు ఒక్కటే. పాతకార్డు నంబరు, ఆధార్ కార్డు నంబరుతో ప్రస్తుతం వారు నివసిస్తున్న ప్రాంతంలో బియ్యం, పంచదార తీసుకుంటున్నారు. అందుకే స్మార్ట్ కార్డు తీసుకోవడంలో అశ్రద్ధ వహిస్తున్నారనే అభిప్రాయం వినిపిస్తోంది.

డీలర్ల వద్ద అందుబాటులో ఉంచాం

- పాపారావు, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి


లబ్ధిదారులు ఎక్కడ ఉన్నప్పటికీ రేషన్ కార్డులో ఉన్న చిరునామాకు వచ్చి ఆయా ప్రాంతంలోని డీలరు వద్ద స్మార్ట్ కార్డు తీసుకోవాలి. కార్డుల పంపిణీలో ఎన్టీఆర్ జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉంది. వీలైనంత వరకు మిగిలిన కార్డులను పూర్తిస్థాయిలో అందజేసేలా కసరత్తు చేస్తున్నాం.

తొలి బడి.. తడబడి!

★ తుది దశలో ఆగిన అంగన్వాడీ భవనాలు

'మేమండీ.. అసంపూర్తిగా మిగిలిన అంగన్వాడీ కేంద్రాలం. బడికెళ్లేలా చిన్నారులను తీర్చిదిద్దే తొలి బడులం.. బుడుగులకు బువ్వపెట్టి పోషకాహారం అందించే పోషక ఆలయాలం.. ఇంత ప్రాధాన్యం ఉన్న మమ్మల్ని చివరి దాకా తీసుకొచ్చి ఇలా అనాథల్లా వదిలేస్తారా.. కాస్త మా వైపు చూడరూ.. కాసింత నిధులిస్తే మెరుగులద్దుకుంటాం.. దశాబ్దాలు సేవలందిస్తాం. ప్రస్తుతం చెల్లిస్తున్న అద్దె భారాన్నీ తగ్గిస్తాం..'

ఇదీ... ఏ.కొండూరు మండలం రామచంద్రపురం.. వాటర్‌ట్యాంకు బజార్‌లో అసంపూర్తి అంగన్వాడీ కేంద్రం. 2018-19లో నిర్మాణం చేపట్టగా.. అప్పుడే దాదాపు కొలిక్కి వచ్చింది. కిటికీలు, తలుపులు, ప్లాస్టింగ్, ఫ్లోరింగ్ చేస్తే సమకూరుతుంది. ఏడేళ్లలో ఈ చిన్న పనులనూ చేయలేదు. ఇదే ఊళ్లో బీసీ కాలనీలో ఒక, కోమటికుంటలో మరో భవనం దుస్థితి ఇంతే.



ప్రభుత్వం	భవనాల మంజూరు	మొదలు కానివి	అసంపూర్తి	పూర్తి
2014-19 (తెదేపా)	113	54	40	18
2019-24(వైకాపా)	83	00	82	01

కాస్త ఖర్చు పెడితే చాలు..

తెదేపా, వైకాపా పాలనలో 196 అంగన్‌వాడీ భవనాలు మంజూరవగా... కేవలం 19 భవనాలే కట్టారు. ★ 122 భవనాలు అసంపూర్తిగానే ఉన్నాయి. దాదాపు 70 శాతం భవనాలకు శ్లాబ్, గోడలు కట్టేశారు. తలుపులు, కిటికీలు, ప్లాస్టింగ్, ఫ్లోరింగ్ వంటి తుది దశ పనులే ఉన్నాయి. ★ ఒక్కో భవనానికి రూ.2-5 లక్షలు వెచ్చిస్తే చాలు. ★ ప్రస్తుతం ఇరుకు, రేకుల షెడ్లలో మగ్గుతున్న చిన్నారులు గాలి పీల్చుకుంటున్నారు. ★ 2014-19 మధ్యలో కట్టిన భవనాలను వైకాపా గాలికొదిలేసింది. ★ వైకాపా ఏలుబడిలో చేపట్టినవీ... గత పాలనలో కొలిక్కి రాని వాటిని.. చక్కదిద్దే బాధ్యత కూటమి సర్కారు తీసుకోవాలి. ★ భవనాల పూర్తికి నిధుల కోసం ప్రతిపాదనలు పంపాం.. మంజూరవగానే పనులు చేపడతామని ఐసీడీఎస్ పీడీ రుక్సానా తెలిపారు.

- ఈనాడు, అమరావతి

తుది దశలో..

కంచికచర్లలో వైకాపా ప్రభుత్వ పాలనలో చేపట్టిన అంగన్వాడీ భవనం తుది దశ వరకూ వచ్చి ఆగింది. ఇదే ఆవరణలో మరో భవనమూ ఇలానే నిలిచింది. తలుపులు, కిటికీలు, ఫ్లోరింగ్, ప్లాస్టింగ్ చేస్తే భవనం సిద్ధమవుతుంది. అవేవీ చేయకుండా గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసింది. ఈ ప్రభుత్వమూ కొలిక్కి తేలేదు.

డీఈవోగా చంద్రకళ

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : ఎన్టీఆర్ జిల్లా డీఈవోగా ఉన్న యు.వి.సుబ్బారావును కృష్ణా జిల్లాకు డీఈవోగా బదిలీ చేశారు. ఈ స్థానంలో గుంటూరు జిల్లా బోయపాలెం డైట్ కళాశాల ప్రిన్సిపల్, పల్నాడు డీఈవో ఎల్.చంద్రకళ బదిలీపై రానున్నారు. ఈ మేరకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. చంద్రకళకు కృష్ణా జిల్లా అంగలూరు డైట్ కళాశాల ప్రిన్సిపల్‌గా, ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారిణిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.




భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లు ప్రభుత్వ ప్రతిష్ఠ పెంచాలి



మాట్లాడుతున్న మంత్రి అనిత. పక్కన ఛైర్మన్ రాధాకృష్ణ, సీపీ రాజశేఖరబాబు, కమిషనర్ ధ్యానచంద్ర, ఈవో శీనానాయక్, ఇన్‌ఛార్జి కలెక్టర్ ఇలక్కియా

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లు ప్రభుత్వ ప్రతిష్ఠ పెంచేలా ఉండాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. భవానీ దీక్షల విరమణ ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా మంత్రి అనిత ఇరిగేషన్ గెస్ట్ హౌస్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో అధికారులతో సమావేశం అయ్యారు. సీసీ కెమెరాలతో క్షేత్రస్థాయిలో పోలీసు సిబ్బంది ఏవిధంగా పర్యవేక్షిస్తున్నారో సీపీ రాజశేఖరబాబు మంత్రికి వివరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా గిరిప్రదక్షిణ మార్గం, ఘాట్లు, క్యూలైన్లలో ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. దసరా వేడుకలు నిర్వహించిన విధంగా భవానీ దీక్షల విరమణ కూడా విజయవంతానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. అనంతరం ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను మంత్రి అనిత దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో దర్శనం చేయించారు. దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి కలెక్టర్ ఇలక్కియా, మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, డీసీపీ షిరీన్ బేగం, ఏడీసీపీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బ్రాయిలర్ ధరలు (కిలో ₹ రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.


అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 149, 158, 169 చికెన్ విత్ స్కిన్ - 284 చికెన్ స్కిన్‌లెస్ - 294.

భక్తుల భద్రతకు ప్రాధాన్యం

విద్యాధరపురం, న్యూస్‌టుడే: భవానీ దీక్షల విరమణకు రాష్ట్ర వ్యాప్తంగా వేలాది దీక్షాధారులు తరలి వచ్చే అవకాశాన్ని దృష్టిలో పెట్టుకొని భద్రతా ఏర్పాట్లు చేస్తామని సీపీ రాజశేఖరబాబు తెలిపారు. ఈనెల 11 నుంచి 15 వరకు శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నిర్వహించే భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లను ఈవో శీనానాయక్, డీసీపీ షిరీన్ బేగంతో కలిసి సీపీ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఇరుముడి పాయింట్లు, హోమగుండాలు, ప్రసాదం కౌంటర్ల వద్ద, గిరి ప్రదక్షిణ మార్గంలో తొక్కిసలాటకు తావు లేకుండా భద్రతా ఏర్పాట్లు చేస్తామన్నారు. ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాలకు తావు లేకుండా అధికారుల సూచనలను వాహన చోదకులు పాటించాలని సూచించారు. మోడల్ గెస్ట్ హౌస్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి క్షేత్రస్థాయి పరిస్థితిని సీసీ కెమెరాల్లో వీక్షించడంతో పాటు సమస్యలను నియంత్రించేందుకు సంబంధిత అధికారులను అప్రమత్తం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏడీసీపీ రామకృష్ణ, ఏసీపీలు దుర్గారావు, పవన్‌కుమార్, రామచంద్రరావు పాల్గొన్నారు.

ఆలోచింపజేసేలా... ఆకట్టుకునేలా

వినూత్నంగా ఫ్యాషన్ షో



జిరాఫీ వేషధారణలో..



పుష్పగుచ్ఛంలా వస్త్రాలు ధరించిన బాలిక



చిన్నారి నృత్యం



కాగిత పూలతో..



మయూరంలా..



చిరుధాన్యాలతో..



కాంతారా..



రాణి రుద్రమదేవి..

ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు అనగానే వివిధ రకాల ఆధునిక వస్త్రాలు ధరించి పోటీల్లో పాల్గొంటారు. కానీ విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన అమరావతి బాలోత్సవంలో మాత్రం.. విద్యార్థులు వినూత్నంగా ప్రదర్శనలు చేసి ఆహూతులను, తోటి విద్యార్థులు, న్యాయనిర్ణేతలను ఆకట్టుకున్నారు. జాతీయ చిహ్నాలు, నెమలి, కలువపువ్వులు, రాజ ముద్ర అయిన మూడు సింహాలు ధరించి ఓ విద్యార్థిని దేశభక్తి చాటుకుంది. ఝాన్సీ లక్ష్మీబాయి వేషధారణలో ధరించి వీరత్వాన్ని చాటుకుంది. వివిధ రకాల చిరుధాన్యాలనే వస్త్రంగా ధరించి ఓ విద్యార్థి ఆకట్టుకున్నారు. ఆకుపచ్చని రంగుల కాగితాలను ధరించి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఓ చిన్నారి సూచించింది. వివిధ శుభ కార్యాలకు ఇచ్చే పుష్పులనే వస్త్రంగా ధరించి ప్రదర్శించింది ఓ బాలిక. శ్రీకృష్ణుడు, వ్యోమగామి, అన్నదాత, జిరాఫీ ఇలా వివిధ రకాల ప్రదర్శనలిస్తూ ఆకట్టుకున్నారు.
- విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

బాలల పండగ.. తాతయ్యకు కనుల పండగ



నృత్య ప్రదర్శనలు తిలకిస్తున్న బీమవరపు సుబ్బారెడ్డి

పిల్లల్లో దాగిఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు చక్కని వేదిక బాలోత్సవం. ఇది నిజంగానే పిల్లలకే కాదు.. వృద్ధులకూ పండగే. విజయవాడ మొగల్‌రాజపురం వీబీ సిద్ధార్థ కళాశాల ప్రాంగణంలో ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, ఏలూరు జిల్లాలకు చెందిన 18 మండలాల నుంచి 200కు పైగా పాఠశాలల్లో ఉన్న 12 వేలమందికి పైగా చిన్నారులు తమ ఆటపాటలు, ప్రతిభ, చిత్రలేఖనంలో సృజన చాటేందుకు బాలోత్సవ్ నిర్వహిస్తున్నారు. డిసెంబర్ 9, 10, 11 మూడు రోజులు నిర్వహించే బాలోత్సవంలో చిన్నారుల ప్రదర్శనలు ఆటలు, పాటలు చూసి ఆనందించాలని కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం తేలప్రోలు నుంచి భీమవరపు సుబ్బారెడ్డి వచ్చారు. 88 ఏళ్ల వయసులో కూడా ఆయన వ్యవసాయం చేస్తున్నారు. 6వ తరగతి వరకు చదివారు. అయినా దాదాపు 3 వేలకు పైగా పుస్తకాలు చదివానని.. రైతు సమస్యలు, సైన్స్ సంబంధించి ఎక్కువ పుస్తకాలు చదివానని, ఇంట్లో 1300కు పైగా పుస్తకాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఉంగుటూరులో నిర్మిస్తున్న మానుకొండ సూర్యావతి స్మారక భవనానికి బీరువా కొని, తన వద్ద ఉన్న పుస్తకాలు ఇవ్వాలని అనుకుంటున్నానని చెప్పారు. చిన్నారుల మధ్యలో మూడు రోజులు గడపడం ఆనందాన్ని అందిస్తుందని భావోద్వేగంతో తెలిపారు. - ఈనాడు, అమరావతి

పారిశ్రామికాభివృద్ధి.. ఉపాధి అవకాశాలే లక్ష్యం



మాట్లాడుతున్న పొట్లూరి భాస్కరరావు పక్కన రాజశేఖర్, సుబ్బారావు తదితరులు

లబ్బీపేట (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు పరచడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ (ఏపీ ఛాంబర్స్) అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు అన్నారు. విజయవాడ ఎంజీరోడ్డులోని కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 12 నుంచి 14 వరకు ఏపీ ఛాంబర్స్ ఆధ్వర్యంలో విజయవాడ నగరంలోని ఎస్.ఎస్.కన్వెన్షన్‌లో బిజినెస్ ఎక్స్‌పో- 2025 నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వివిధ రంగాలకు చెందిన 160 స్టాళ్లను ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. కేవలం వ్యాపారాత్మక ప్రదర్శనే కాకుండా ఆరు కీలక రంగాల్లో సదస్సులు నిర్వహిస్తూ, ఇందులో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన నిపుణులను ఆహ్వానించినట్లు తెలిపారు. రాష్ట్రంలో తయారీ రంగం వృద్ధికి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సంఖ్యను పెంచేందుకు సమగ్రమైన విధానాల అములపై సదస్సులో చర్చ ఉంటుందని పేర్కొన్నారు. 2024- 2029 కాలానికి రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధి పాలసీ 4.0, ఎంఎస్ఎంఈ వ్యవస్థాపక అభివృద్ధి పాలసీ 4.0పై ఔత్సాహికుల్లో మరింత అవగాహన కలిగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏపీ ఛాంబర్స్ ఉపాధ్యక్షుడు బి.రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి రావూరి సుబ్బారావు, సంయుక్త కార్యదర్శి గుర్జీత్ సింగ్ సాహ్నీ, మహిళా విభాగం ఛైర్‌పర్సన్ డాక్టర్ మమత రాయపాటి, రాధిక, డి.అపర్ణ, కె.లక్ష్మీనారాయణ, ఎ.సత్యనారాయణ, బి.ఫణిచంద్ర, సుమ అట్లూరి పాల్గొన్నారు.

ఫిబ్రవరి 5న ఏపీ ఐకాస అమరావతి మహాసభ



కమిషనర్ ధ్యానచంద్రకు మొక్క అందజేస్తున్న బొప్పరాజు, పక్కన పరిశెట్టి, నాగేశ్వరరావు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఏపీ ఐకాస అమరావతి రాష్ట్ర మహాసభ 2026, ఫిబ్రవరి 5వ తేదీన విజయవాడలోని తుమ్మలపల్లి వారి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నారు. ఈమేరకు అనుమతి కోరుతూ వీఎంసీ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్రకు ఏపీ ఐకాస అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పరిశెట్టి దామోదరరావు, ఏపీ మున్సిపల్ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తిమ్మస్వర్థ నాగేశ్వరరావు తదితరులు మంగళవారం విన్నవించారు. మున్సిపల్ ఉద్యోగులు తమ అవసరాల కోసం ప్రావిడెంట్ ఫండ్ రుణాలను త్వరితగతిన మంజూరు చేయాలని, ఉద్యోగోన్నతుల ప్రక్రియ చేపట్టాలని, బదిలీలను కౌన్సెలింగ్ విధానంలో నిర్వహించి అందరికీ న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఏపీ మున్సిపల్ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ సహాధ్యక్షుడు శివరామప్రసాద్, ఉపాధ్యక్షుడు కృష్ణదేవరాయలు, ఏపీ డ్రైవర్ల [illegible] మూర్తి, బి.సీత, టి.అరుణ, ఎ.ఎస్.కరుణ, వీఎంసీ అసోసియేషన్ అధ్యక్షుడు శ్యామ్ సుందరరావు, ... సంఘం రాష్ట్ర కోశాధికారి రమణ తదితరులు పాల్గొన్నారు.

14న జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ఎన్నిక

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఈ నెల 14వ తేదీ ఆదివారం నగరంలోని రెవెన్యూ భవన్‌లో జిల్లా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి బి.పుల్లయ్య తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ప్రక్రియ ప్రారంభమవుతుంది. పోటీ అనివార్యమైతే సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు ఎన్నికలు నిర్వహిస్తారు. అదే రోజున ఫలితాల ప్రకటన, ప్రమాణ స్వీకారం ఉంటాయని ఆయన వివరించారు.

గుండెలు పిండే వేదన..!

గంటల వ్యవధిలోనే దంపతుల మృత్యువాత



అజయ్ కుమార్, నాగలక్ష్మి (పాత చిత్రం)



అనాథలుగా మిగిలిన చిన్నారులు

విజయవాడ (అజిత్‌సింగ్‌నగర్), న్యూస్‌టుడే : భర్త చనిపోయిన గంటల వ్యవధిలోనే.. భార్య మృత్యువాత పడిన ఘటన విజయవాడలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికుల వివరాల మేరకు.. దోనేపూడి అజయ్ కుమార్ (40), నాగలక్ష్మి (35) దంపతులు విజయవాడ, వాంబే కాలనీలోని ఏ-బ్లాక్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి 9వ తరగతి చదువుతున్న సంపత్ కుమార్, ఆరో తరగతి చదువుతున్న శంకర్ అనే పిల్లలు ఉన్నారు. భర్త క్యాటరింగ్ పనులు, వంట మేస్త్రిగాను పని చేస్తుంటారు. నాగలక్ష్మి పెరాలసిస్‌తో బాధపడుతూ ఇంటి వద్దే ఉంటున్నారు. మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో తనకు ఛాతిలో నొప్పి ఉందని భార్యకు చెప్పారు. వెంటనే 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో ప్రాణాలు కోల్పోయారు. కుటుంబ యజమాని మృత్యువాత పడడంతో భార్య ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. విషాదంలో మునిగిపోయారు. సాయంత్రం అంత్యక్రియలు పూర్తి చేశారు. శ్మశాన వాటిక నుంచి బంధువులు సాయంత్రం 5.30 గంటల సమయంలో ఇంటికి వచ్చేలోపు నాగలక్ష్మి విగత జీవిగా కనిపించారు. 108 వాహనానికి సమాచారం ఇవ్వగా.. సిబ్బంది వచ్చి పరిశీలించారు. తీవ్ర దుఃఖం.. బీపీ స్థాయిలు పడిపోవడంతో.. గుండెపోటు వచ్చి ఆమె మృతి చెందినట్లు ధ్రువీకరించారు. గంటల వ్యవధిలో భార్యభర్తలు గుండెపోటుతో మృతిచెందడంతో వాంబే కాలనీలో విషాదఛాయలు అలముకున్నాయి. బంధువులు శోకసంద్రంలో మునిగారు. ఇద్దరు పిల్లలు అనాథలుగా మిగలడం.. స్థానికులను కలచివేసింది. దిక్కుతోచని స్థితిలో ఉన్న చిన్నారుల ఆర్తనాదాలు కంటతడి పెట్టించింది. ప్రభుత్వం వారిని ఆదుకోవాలని ప్రజలు, బంధువులు వేడుకుంటున్నారు. మట్టి ఖర్చుల నిమిత్తం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు రూ.20 వేలు ఆర్థికసాయం అందించారు.

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

పటమట, న్యూస్‌టుడే : పెళ్లి చేసుకుంటానని మభ్యపెట్టి 16 ఏళ్ల బాలికపై అత్యాచారం చేసిన నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ విజయవాడ పోక్సో కోర్టు జడ్జి వేల్పుల భవానీ మంగళవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. మాచవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని విజయనగర్ కాలనీకి చెందిన ఓ బాలిక (16) ఇంటి వద్దే ఉండేది. ఈ క్రమంలో మారుతీనగర్‌కు చెందిన మెడేపల్లి సాయికుమార్ ఆమెను పెళ్లి చేసుకుంటానని మభ్య పెట్టాడు. 2021 జూలై 23న బాలిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుణదల సమీపంలోని ఓ హోటల్ రూమ్‌కు తీసుకువెళ్లి అత్యాచారం చేశాడు. బాలిక నీరసంగా ఉండటంతో కుటుంబ సభ్యులు ప్రశ్నించగా జరిగిన విషయం తెలిపింది. దీంతో వారు మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో సాయిపై నేరం రుజువు కావడంతో పోక్సో చట్ట ప్రకారం 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు జడ్జి తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గడ్డం రాజేశ్వరరావు వాదించారు.

ఓపెన్ డ్రెయిన్‌లో పడి యువకుడి మృతి

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : ఓపెన్ డ్రెయిన్‌లో పడి ఓ యువకుడు మృతి చెందినట్లు సూర్యారావుపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. శిఖామణి సెంటర్‌కు చెందిన దర్శినపు రమేష్ (34) గత 5 సంవత్సరాలుగా ఫిట్స్, లివర్ సమస్యతో బాధపడుతున్నారు. సోమవారం రాత్రి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. మంగళవారం సూర్యారావుపేట గోపాలరెడ్డిలోని బస్టాపు వెనుక ఓపెన్‌డ్రెయిన్‌లో రమేష్ మృతదేహం ఉందని లాజర్ అనే వ్యక్తి గుర్తించారు. ఈ విషయాన్ని మృతుడి సోదరుడు రాజేష్‌కు సమాచారం అందించారు. ఆయన హుటాహుటీన వచ్చి.. సోదరుడిని గుర్తించి, సూర్యారావుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు అనుమానాస్పదమృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంజయ్ బెయిల్ పిటిషన్‌పై విచారణ 11కు వాయిదా

ఈనాడు - అమరావతి: అగ్నిమాపక శాఖ, సీఐడీలో పనిచేసిన సమయంలో నిధుల దుర్వినియోగానికి పాల్పడిన కేసులో ఐపీఎస్ అధికారి సంజయ్ బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. ఈ పిటిషన్ మంగళవారం విచారణకు వచ్చింది. తదుపరి విచారణ నిమిత్తం ఈనెల 11వ తేదీకి వాయిదా వేశారు. ఇదే కేసులో నిందితుడు కొండలరావు (ఏ4) దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణను బుధవారానికి కోర్టు వాయిదా వేసింది.

మద్యం కేసులో అనిల్ చోఖ్రా, చాణక్య..

ఈనాడు - అమరావతి: మద్యం కేసులో నిందితులు అనిల్ చోఖ్రా, చాణక్యలు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై ఏసీబీ కోర్టు విచారణ జరిపింది. సిట్‌ను కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను న్యాయాధికారి ఈనెల 11కు వాయిదా వేశారు. ★ తమకు జైలులో అదనపు వసతుల కల్పనకు అనుమతించాలని అనిల్ చోఖ్రా, వెంకటేష్ నాయుడు వేసిన పిటిషన్లపై మంగళవారం కోర్టు విచారణ జరిపింది. తదుపరి విచారణ కోసం గురువారానికి వాయిదా వేశారు. ★ సిట్ అధికారులు సీజ్ చేసిన తమ కారును విడుదల చేయాలని ఇస్పాత్ సంస్థ వేసిన పిటిషన్‌పై ఇరువర్గాల వాదనలు ముగిశాయి. తీర్పును ఈనెల 16న వెల్లడించనున్నట్లు న్యాయాధికారి వెల్లడించారు. ★ తన బెయిల్ ఆంక్షలను సడలించాలని బాలాజీ గోవిందప్ప దాఖలు చేసిన పిటిషన్‌పై సిట్ కౌంటర్ వేసేందుకు 11కి వాయిదా పడింది.

నిందితులకు రిమాండ్ పొడిగింపు

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో నిందితులకు కోర్టు రిమాండ్‌ను పొడిగించింది. మంగళవారంతో నిందితులకు రిమాండ్ గడువు ముగియనున్న నేపథ్యంలో విజయవాడ, నెల్లూరు కారాగారాల నుంచి వర్చువల్ విధానంలో న్యాయాధికారి ఎదుట హాజరుపర్చారు. అద్దేపల్లి జనార్దనరావు, జగన్మోహన్‌రావు, వైకాపా నేత జోగి రమేష్, రాము సహా మొత్తం 18 మంది నిందితులకు ఈనెల 18 వరకు రిమాండ్‌ను న్యాయాధికారి పొడిగించారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : అవినీతి లేని భవిష్యత్తు కోసం విద్యార్థి దశ నుంచే ప్రణాళికలు అలవర్చుకోవాలని రెడ్డిగూడెం ఎంఈవో ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం.నా శ్వరరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నాగులూరు జడ్పీ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ సమాఖ్య ప్రత్యేకంగా రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం వర లక్ష్మి, ప్రకాష్, సుబ్బారెడ్డి, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

నూతన దుస్తుల పంపిణీ

విస్సన్నపేట, న్యూస్‌టుడే : మండలంలోని కొండ పర్వ(హెచ్.వి.వి) మండల పరిషత్ పాఠశాలలోని 70 మంది విద్యార్థులకు గుంటూరు జిల్లా విశ్రాంత ప్రధానోపాధ్యాయులు వేమూరి ఆనందజ్యోతి నూతన దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం టి.యశోకర్, ఉపాధ్యాయులు కె. నరసింహరావు, డి.బాలు, పి.సుదారాణి పాల్గొన్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుక

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు, గంపలగూడెం కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల్లో మంగళవారం ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు, ఎంపీ సోనియా గాంధీ జన్మదిన వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కోసి పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. నాయకులు వై.రామకృష్ణ, బి.ప్రకాశరావు, పి.శ్రీనివాసరావు, జీవన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



గంపలగూడెంలో కేకు కోస్తున్న కాంగ్రెస్ నాయకులు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందనకు వందనం

★ మూలపాడు క్యాటిల్ పాస్‌వేకు ఇరువైపుల చెత్త చెదారంతో దుర్వాసన వస్తోందని స్థానికులు సమస్యను 'మేమున్నాం...మీకు తోడుగా' ద్వారా గ్రామ పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్‌కు తెలిపారు. స్పందించిన ఆయన పారిశుద్ధ్య కార్మికులతో సమస్యను పరిష్కరించారు. సమస్య పరిష్కరించారు. – న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం

★ తిరువూరు 1వ వార్డులోని మురుగు కాలువల్లో మట్టి, చెత్త పేరుకున్నాయని స్థానికుడు శ్రీధర్‌బాబు అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన శానిటరీ అధికారి పారిశుద్ధ్య కార్మికులను పంపించి కాలువలను శుభ్రం చేయించారు. ★ తిరువూరు 5వ వార్డులోని డ్రెయిన్లలో వ్యర్థాలు పేరుకున్నాయని, దీంతో మురుగు పారుదలకు ఆటంకంగా మారిందని స్థానికుడు దిలీప్ 'ఈనాడు' మేమున్నాం..మీకు తోడుగా ద్వారా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మున్సిపల్ శానిటరీ అధికారి సంతోష్ స్పందించారు. పారిశుద్ధ్య కార్మికులను పంపించి డ్రెయిన్లను శుభ్రం చేయించారు. ★ తిరువూరు 2వ వార్డులోని డ్రెయిన్లలో మురుగు పేరుకుందని, దీనికి తోడు దోమలతో ఇబ్బంది పడుతున్నామని స్థానికుడు మస్తాన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన మున్సిపల్ శానిటరీ అధికారి సంతోష్ పారిశుద్ధ్య కార్మికులను పంపి దోమల మందు పిచికారీ చేయించారు. – న్యూస్‌టుడే, తిరువూరు టౌన్

★నరసాపురం గ్రామంలోని ప్రధాన రహదారిపై గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందిగా ఉందని గ్రామస్థులు పంచాయతీ అధికారులకు తెలిపారు. ఈవో జి.స్వాతి స్పందించి యంత్రం సహాయంతో గోతులను సరి చేయించి పూడ్పించి సమస్య పరిష్కరించారు. – విస్సన్నపేట

★ జి.కొండూరు- గొల్లగూడెం వెళ్లే ప్రధాన రహదారి వెంబడి ఉన్న విద్యుత్తు నియంత్రిక తక్కువ ఎత్తులో ఉందని స్థానికులు 'ఈనాడు' మేమున్నాం..మీకు తోడుగా ద్వారా సమస్యను అధికారులకు తెలిపారు. దీనిపై విద్యుత్తు శాఖ సహాయక ఇంజినీర్ షఫీ స్పందించారు. లైన్‌మెన్ వెంకటేశ్వర్లు, సిబ్బందితో నియంత్రికను వేరే స్థలంలోకి మార్చి ఎత్తు పెంచడంతో సమస్య పరిష్కారమైంది. – న్యూస్‌టుడే, జి.కొండూరు

నిబంధనలకు తూట్లు.. కొనుగోలుదారులకు పాట్లు

జి.కొండూరు, న్యూస్‌టుడే

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్థిరాస్తి వ్యాపారం ఊపందుకుంది. ఇదే అదనుగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు, మధ్యవర్తులు ప్రభుత్వాదాయానికి గండి కొడుతున్నారు. గతేడాది మండలంలో 15 వెంచర్లు ఉండగా ప్రస్తుతం 40కి పైగా పెరిగాయి. వీటిలో ఏ ఒక్క లేఅవుట్‌కు సీఆర్‌డీఏ అనుమతులు లేవని స్థానికులు వాపోతున్నారు. నిబంధనలు తుంగలో తొక్కి లేఅవుట్లు ఏర్పాటు చేసి అమాయకులను మోసం చేసి అందిన కాడికి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఒక వెంచరు ప్లాన్ మార్చి ఒకే ప్లాట్‌ను ఇద్దరికి విక్రయించడం, అగ్రిమెంట్లతో వేరొకరికి అమ్మి నగదు తీసుకుంటున్నారని స్థానికులు చెబుతున్నారు.



జి.కొండూరు శివారులో వివాదంలో నిలిచిన వెంచరు

అగ్రిమెంట్లతోనే సరి..

రియల్ ఎస్టేట్ వ్యాపారులు రైతుల నుంచి భూమి కొనుగోలు చేసి అడ్డదారుల్లో వాటిని వ్యవసాయేతర భూమిగా మార్చి గజాల్లో రాళ్లు పాతేసి అమ్ముకోవడం ఒక మార్గం. ఇది కాక రైతు నుంచి అగ్రిమెంటు చేసుకుని భూమిని లాభం చూసుకుని తాను రిజిస్ట్రేషన్ చేసుకోకుండా ఎక్కువ మొత్తానికి వేరేవారికి విక్రయించి లాభం పొందుతున్నారు. అసలైతే ముందుగా అగ్రిమెంటు చేసుకున్న వ్యక్తి రిజిస్ట్రేషన్ చేసుకుని, వేరొకరికి రిజిస్ట్రేషన్ చేయాలి కానీ అగ్రిమెంటు చేసుకున్న వ్యక్తి ఆ పని చేయకుండా నేరుగా కొనుగోలుదారుకు రిజిస్ట్రేషన్ చేయడంతో ప్రభుత్వాదాయానికి గండి పడుతోంది.

రెండు సార్లు రిజిస్ట్రేషన్ చేస్తూ..

వెంచర్ నిర్మాణం చేపట్టిన తర్వాత అభివృద్ధికి నోచుకోక పోవడంతో దాని ప్లాన్ మార్చి మరో సారి అమ్మకం చేపట్టడంతో కొనుగోలుదారులు నష్టపోతున్నారు. గతంలో పంచాయతీ అనుమతితో ప్లాట్లను నిర్మించిన చోట విక్రయించిన అనంతరం ఏళ్ల తరబడి ఆ ప్రదేశం అభివృద్ధి నోచుకోక పోవడంతో మరలా ప్లాన్ మార్చి వెంచర్ నిర్మాణం చేపట్టి ఒకే ప్లాట్‌ను ఇరువురికి అమ్మి మోసానికి పాల్పడుతున్నారు. దీంతో ఒకే ప్లాట్‌ను కొనుగోలు చేసిన ఇరువురు వ్యక్తులు కోర్టులు, స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్న సీఆర్‌డీఏ అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టక పోవడంతో కొనుగోలుదారులు నష్టపోతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం

రెండు రిజిస్ట్రేషన్లు చేసిన ఫిర్యాదులు తమ దృష్టికి రాలేదు. అలా వస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. అక్రమ వెంచర్ల విషయం గురించి సీఆర్‌డీఏ అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. తక్షణమే చర్యలు చేపడతామని కోరతాం.

- చాట్ల వెంకటేశ్వర్లు, స్థానిక తహసీల్దార్

పారిశుద్ధ్యం మెరుగుపరచండి

కొండపల్లి, న్యూస్‌టుడే : కొండపల్లి షాబుఖారీ దర్గాకు వెళ్లే రహదారి, దర్గా పరిసరాలు శుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఛైర్మన్ చిట్టిబాబు, ఇన్‌ఛార్జి కమిషనర్ వెంకటరత్నంను కోరారు. ఈ నెల 29 నుంచి ప్రారంభంకానున్న దర్గా ఉరుసు నేపథ్యంలో దర్గా, మసీదు ప్రాంతాలను చిట్టిబాబు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ నెలకొన్న అపరిశుభ్ర పరిస్థితులను గమనించారు. శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఏఈ మౌస్మీకి తెలిపారు. దర్గా అభివృద్ధి కమిటీ సభ్యులు, పురపాలిక అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అదనపు ఎస్సైగా బాధ్యతల స్వీకరణ

జి.కొండూరు, న్యూస్‌టుడే : జి.కొండూరు పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఎస్సై- 2గా ఆర్.గిరిజామణి బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ ఎస్సై కె.సతీష్ కుమార్ విధులు నిర్వహిస్తుండగా ఆమె అదనపు ఎస్సైగా బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెకు సిబ్బంది పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.



గిరిజామణి

దివ్యాంగులను ప్రోత్సహించడం మనందరి బాధ్యత

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంద్రధనస్సు పేరుతో ఏడు వరాలను ప్రకటించారని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పలు సేవా సంస్థలు వివిధ కార్యక్రమాలను ఇబ్రహీంపట్నంలో మంగళవారం నిర్వహించాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శారీరకంగా, మానసికంగా పరిమితులు ఎదుర్కొంటున్న దివ్యాంగుల ప్రతిభ, పట్టుదల, నిబద్ధత అసాధారణంగా ఉంటుందని చెప్పారు. వారిని ప్రోత్సహించడం మనందరి బాధ్యత అన్నారు. అందుకే ప్రభుత్వం ఏడు రకాల ప్రోత్సాహకాలను వీరికి ప్రకటించిందన్నారు. అనంతరం కేకు కోసి వారికి పంపిణీ చేశారు. వికలాంగ పోరాట సమితి, ది అక్షర వికలాంగుల సేవా సంఘ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



కేకు కోస్తున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు కృషి అభినందనీయం

గంపలగూడెం, న్యూస్‌టుడే : ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డి పెట్టుబడులు తెచ్చేందుకు, యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు కొత్త కంపెనీలు ఏర్పాటుకు చేస్తున్న కృషి అభినందనీయమని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. అలాగే ప్రధాని మోదీ చేపట్టిన వికసిత్ భారత్- 2047 నాటికి భారత ఆర్థిక వ్యవస్థను ప్రపంచంలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు తెలుగు రాష్ట్రాలు, ప్రజలు కీలకంగా ఉంటారన్నారు. తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలో మంగళవారం జరిగిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్'లో కొలికపూడి పాల్గొన్నారు. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, మధిర ఎమ్మెల్యే మల్లు భట్టివిక్రమార్కతో మాట్లాడారు.



భట్టివిక్రమార్కతో తిరువూరు శాసనసభ్యుడు శ్రీనివాసరావు

సమన్వయంతో మండలాభివృద్ధికి చర్యలు

జి.కొండూరు, న్యూస్‌టుడే : అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో మండలాభివృద్ధికి పాటు పడుదామని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. గతంలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల నిమిత్తం రూ.32 లక్షలు మండల పరిషత్ నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. అనంతరం మండలంలో పూర్తి అయిన పనులు, ఇంకా చేపట్టాల్సిన అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ పి.నవ్యశ్రీ, ఎంపీడీవో టీవీ.రామకృష్ణ నాయక్, తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న లక్ష్మీతిరుపతమ్మ, పక్కన అధికారులు వెంకటేశ్వర్లు, రామకృష్ణ నాయక్



సదస్సులో మాట్లాడుతున్న హనుమంతరావు

పాడి పశువుల పెంపకంపై అవగాహన

గొల్లపూడి, న్యూస్‌టుడే : పాడి పశువుల పెంపకంపై రైతులు అవగాహన పెంచుకోవడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకుడు ఎం.హనుమంతరావు పేర్కొన్నారు. కొత్తూరు తాడేపల్లిలో లాభసాటి పాడి పశువుల పెంపకంపై మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విజయవాడ డివిజన్ డీడీ కె.చంద్రశేఖర్, ఏడీలు సునంద, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కొట్టేస్తున్నారు... తరలిస్తున్నారు

గ్రామాల్లో కనుమరుగవుతున్న పచ్చదనం

విస్సన్నపేట, న్యూస్‌టుడే

పచ్చని చెట్లను కొందరు నిలువునా నరుకుతున్నారు. టన్నుల కొద్దీ కలపను లారీల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విస్సన్నపేట- సత్తుపల్లి రోడ్డులో ఏళ్ల తరబడి ప్రజలకు నీడనిస్తున్న భారీ వృక్షాలను లాభాపేక్షతో కొంతమంది గుత్తేదారులు, మిల్లర్లు కొట్టేశారు. వాల్టా చట్టాలను తుంగలో తొక్కి పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నారని పలువురు మండిపడుతున్నారు. యథేచ్ఛగా చెట్లను కూల్చి లారీల్లో విస్సన్నపేట, చాట్రాయి మండలాల నుంచి సుదూర ప్రాంతాలకు, సరిహద్దు రాష్ట్రాలకు తరలిస్తున్నారని, దీంతో రహదారులపై గుంతలు పడి అధ్వానంగా మారుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు ఈ రోడ్ల వెంబడి ప్రయాణించాలంటే భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పర్యావరణాన్ని కాపాడే చెట్లను కాపాడాలని, చట్టాలను ఉల్లంఘిస్తూ వీటిని నరికే వారిపై చర్యలు తీసుకోవాలని పౌరులు కోరుతున్నారు.



విస్సన్నపేట- సత్తుపల్లి రోడ్డు వెంట కలప దుంగలు

బాధ్యులపై చర్యలు తీసుకోండి

మానవాళి నేడు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య భూమి మీద పచ్చదనం తగ్గిపోవడం. పచ్చని చెట్లను నరకడంతో పర్యావరణ సమతుల్యం దెబ్బతినడంతో పాటు ప్రజలు కాలుష్య కోరల్లో చిక్కుకోవాల్సి వస్తోంది. అనధికారికంగా చెట్లు నరుకుతున్న అక్రమదారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి.

- బోట్ల శివ సత్యనారాయణ, సామాజికవేత్త

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



బస్తా కాటా వేస్తున్న మురళీ, వెంకటేశ్వర్లు తదితరులు

జి.కొండూరు: రైతులు దళారుల మోసానికి గురికాకుండా కూటమి ప్రభుత్వం చేపట్టిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెవుటూరు పీఏసీఎస్ అధ్యక్షుడు మురళీ కోరారు. మంగళవారం చెవుటూరు రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రంను ఆయన ప్రారంభించి మాట్లాడారు. తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు, సూరిబాబు, వీఆర్వో కృపారావు, రైతులు పాల్గొన్నారు.

నిబంధనలు సడలించాలని వినతి

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : ధాన్యం తేమ శాతం నిబంధనలను సడలించి, మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు యలమందరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వీరు మంగళవారం మూలపాడు, కొటికలపూడి గ్రామాల్లో పర్యటించి ధాన్యం విక్రయాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతు సంఘం ప్రధాన కార్యదర్శి జమలయ్య, కౌలు రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.



మూలపాడులో ధాన్యం పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

బంగారం దుకాణాల్లో తనిఖీలు

మైలవరం: స్థానిక నూజివీడు రోడ్డులోని పలు బంగారం విక్రయ దుకాణాల్లో సెంట్రల్ జీఎస్టీ అధికారులు మంగళవారం తనిఖీలు చేశారు. పన్నుల చెల్లింపులు, లావాదేవీలకు సంబంధించి పలు దుకాణాలపై ఫిర్యాదుల నేపథ్యంలో సూపరింటెండెంట్ స్థాయి అధికారుల బృందం రెండు దుకాణాల్లో పరిశీలించారు. వారి లావాదేవీలు, జీఎస్టీ చెల్లింపులపై ప్రశ్నించి, పలు రికార్డులను వారితో పాటు తీసుకెళ్లారు. గుర్తించిన లోపాలకు సంబంధించి పూర్తి వివరాలను సమర్పించాలని, గుంటూరులోని తమ కార్యాలయానికి రావాలని సూచించినట్లు తెలిసింది.

రబీ పంటల్లో సస్యరక్షణ చర్యలు అవసరం



మాట్లాడుతున్న ఏడీఏ మోనీష

మైలవరం, న్యూస్‌టుడే : రబీలో సాగు చేస్తున్న మొక్కజొన్న, వరి పంటల్లో సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడులు సాధించవచ్చని రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ పి.మోనీష సూచించారు. మంగళవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన రైతు శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మొక్కజొన్నలో వచ్చే కత్తెర పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలను తెలిపారు. స్థానిక ఏడీఏ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం అందని రైతులకు త్వరలోనే ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు వివరించారు. ఏవో సంధ్యారాణి, పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకట నారాయణ, రైతులు పాల్గొన్నారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : పంట వ్యర్థాలను పొలంలో తగలపెట్టరాదని మండల ఏవో డి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం నరుకుళ్లపాడు, రాఘవాపురం గ్రామ సచివాలయాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పొలంలో వ్యర్థాలను కలియ దున్నడం వల్ల ఎరువుగా ఉపయోగ పడుతుందని చెప్పారు. రైతులు రబీలో ఆరు తడి పంటలు సాగు చేయాలని సూచించారు. వ్యవసాయ, ఉద్యాన, ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయంలో అన్నసంతర్పణ ప్రారంభం

గొల్లపూడి: గొల్లపూడిలోని అయ్యప్ప స్వామి ఆలయంలో మాల ధారణ చేసిన భక్తులకు అన్నసంతర్పణ చేయడం అభినందనీయమని ఆధ్యాత్మికవేత్త వేముల హజరత్తయ్య గుప్తా పేర్కొన్నారు. గొల్లపూడిలోని అయ్యప్ప ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న అన్న సంతర్పణను హజరత్తయ్య గుప్తా దంపతులు మంగళవారం ప్రారంభించారు. ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేష్, నాయకులు రామకృష్ణ, సత్యప్రసాద్, రమేష్, దిలీప్ పాల్గొన్నారు.

క్రీడల్లో ఎల్బీఆర్‌సీఈ విద్యార్థులకు పతకాలు

మైలవరం, న్యూస్‌టుడే : కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆదేశాలతో నిర్వహించిన జిల్లా స్థాయి ఆటల పోటీల్లో స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు, సత్తా చాటి పతకాలు సాధించారు. విజయవాడలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాలలో జరిగిన పోటీల్లో పురుషుల విభాగంలో వాలీబాల్, షాట్‌పుట్‌లో ప్రథమ స్థానం, 100 మీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ కె.అప్పారావు తెలిపారు. స్త్రీల విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం, కబడ్డీ, షాట్‌పుట్‌లో ద్వితీయ స్థానం పొందారని వివరించారు. ఈ మేరకు ప్రతిభ చాటిన విద్యార్థులను ఆయన మంగళవారం అభినందించారు.



విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపల్ అప్పారావు

ముగిసిన ఆటల పోటీలు



త్రోబాల్ ఆడుతున్న ఉపాధ్యాయినులు

విస్సన్నపేట: నరసాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో రెండ్రోజులుగా జరుగుతున్న మండల స్థాయి ప్రభుత్వ ఉపాధ్యాయుల ఆటల పోటీలు మంగళవారం ముగిశాయి. త్వరలో డివిజన్ స్థాయి క్రీడలను ఇదే పాఠశాలలో నిర్వహించడం జరుగుతుందని ఎంఈవో- 1, 2లు శంకరరావు, సుధాకర్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు ఎం.రమేష్, హెచ్.ఎం. శోభాలత తెలిపారు.

ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించండి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : డీఎస్సీ- 2025 ఉపాధ్యాయులకు జీతాలు త్వరగా చెల్లించాలని, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారించాలని కోరుతూ యూటీఎఫ్ నాయకులు మంగళవారం రెడ్డిగూడెం మండల ఎంఈవో-1, 2 పీవీ.నరసింహరావు, పి.రమేష్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. నాగలక్ష్మి, ప్రకాష్, శ్రీనివాసరావు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



నరసింహరావు, రమేష్ బాబులకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పారిశుద్ధ్య కార్మికులకు భరోసా ఇవ్వాలి

కొండపల్లి, న్యూస్‌టుడే : పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్ వెంకటరత్నంకు మంగళవారం వినతిపత్రం అందించారు. సీఐటీయూ నాయకుడు మహేష్ మాట్లాడుతూ పురపాలికలో 12 మంది కార్మికులు రిటైర్ అవ్వగా, ముగ్గురు మరణించారని తెలిపారు. వీరి స్థానంలో ఆయా కుటుంబ సభ్యులకు పని కల్పించాలని కోరారు. మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ విరమణ వయస్సును 62 ఏళ్లు చేయాలన్నారు. నవీన్, అప్పారావు, దేవుళ్లు, నాగు, నాని, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



వెంకటరత్నంకు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

గ్రామాల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం

ఆర్లపాడు(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని ఆర్లపాడు గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో టి.సరస్వతి మంగళవారం తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరు, దస్త్రాలను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది ప్రతిరోజు సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఇంటింటా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని సూచించారు. గ్రామంలో మురుగు, వ్యర్థాలు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.



గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న సరస్వతి

విత్తన, విద్యుత్తు బిల్లులతో రైతాంగానికి అన్యాయం

మైలవరం, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న విత్తన, విద్యుత్తు బిల్లులతో రైతాంగానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శి రావుల సుబ్బారావు, వజ్రాల వెంకటరెడ్డి పేర్కొన్నారు. దీనికి వ్యతిరేకంగా మంగళవారం మండలంలోని పాత చంద్రగూడెంలో ఆయా బిల్లుల ప్రతులను దహనం చేశారు. కొత్త బిల్లులతో కార్పొరేట్, ప్రైవేటు వారికే అనుకూలమన్నారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బారెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

చూసుకోకుండా పూసుకున్నారో..!?



పొద్దున్నే లేస్తే పొగమంచు...
రాత్రయితే దుప్పటి కప్పుకోవాలనిపించేంత చలి...
పొడిబారిన చర్మం.. పగిలిన పెదాలు!
వాటికి సొబగులు అద్దడానికి
ఉపయోగించే క్రీములు అన్నీఇన్నీ కావు...
మరి ఈ మాయిశ్చరైజర్లన్నీ
మన చర్మానికి మేలు చేస్తాయా..?
చూసుకోకుండా పూసుకుంటే
చేటే అంటున్నారు నిపుణులు.

శీతాకాలంలో చలికి చర్మం పొడిబారుతుంది. ఈ సమస్య నుంచి ఉపశమనం పొందడానికి చాలామంది దొరికిన మాయిశ్చరైజర్ క్రీములు వాడుతుంటారు. అయితే వాటిని ఇష్టానుసారంగా వినియోగిస్తే పలు చర్మ సంబంధిత వ్యాధులు తప్పవని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మార్కెట్‌లో లభించే క్రీములు చర్మానికి రక్షణకోసమే కాకుండా మంచి సువాసన, రంగు, మెరుపుదనం ఉండేలా తయారు చేస్తున్నారు. నిజానికి వీటి కోసమే ఎక్కువ మంది కొనుగోలు చేసి ఉదయం లేచిన వెంటనే, నిద్రకి ముందు శరీరానికి రాస్తుంటారు. కానీ ఇవి ఇలా ఉండడానికి కారణం వివిధ రకాల హానికర రసాయన పదార్థాల సమ్మేళనాలే. ఈకాలంలో ఉండే చల్లటి, తక్కువ తేమ కలిగిన గాలి కారణంగా చర్మంలోని నీటి శాతం తగ్గిపోతుంది. రూమ్ హీటర్ల వాడకం ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేస్తుంది. దాంతో చర్మకణాలు అసాధారణంగా తొలగిపోతాయి. అయితే వాతావరణంతో పాటు మన రోజువారీ అలవాట్లు సైతం ఈ సమస్యకు దారితీస్తాయి. ప్రధానంగా చలికి తట్టుకోలేక ఎక్కువసేపు వేడినీటితో స్నానం చేస్తారు. దీనివల్ల చర్మం సహజత్వాన్ని కోల్పోయి పొడిబారుతుంది.

- ఈనాడు డిజిటల్, శ్రీకాకుళం

ఇక్కడ ప్రభావం చూపిస్తాయి..

శరీరంలో తక్కువ నూనె గ్రంథులు ఉండే ప్రదేశాల్లో పొడిబారడం ఎక్కువగా కనిపిస్తుంది. ఇవి కాళ్లు, చేతుల్లో అధికంగా ఉంటాయి.

లక్షణాలు:
చర్మం గరుగ్గా మారడం, పొట్టు రాలడం, పగుళ్లు, మృదుత్వం కోల్పోవడం వంటివి కనిపిస్తాయి. ఎగ్జిమా, సొరియాసిస్ ఉన్న వారికి దీనివల్ల ఎక్కువ ఇబ్బంది కలుగుతుంది.

వాటిలో ఉండే రసాయనాలు అనేక రకాల సమస్యలకు కారణమవుతాయి. ఈ సమయంలో వాటి గురించి అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

దీనికి కారణం చర్మ సహజ తేమ కారకాలైన హైడ్రోలిపిడ్స్ లోపించడమే. దాంతో శరీరానికి కృత్రిమ తేమను అందించి మృదువుగా మార్చడానికి వివిధ లోషన్లు వాడుతుంటారు.



ఆ రసాయనాలు హానికరం!

- **పాలీసైక్లిక్ ఆరోమాటిక్ హైడ్రోకార్బన్లు (పీఏహెచ్ఎస్):** పెట్రోలియం జెల్లీలో ఉంటాయి. వీటిలో కొన్నిటిని క్యాన్సర్ కారకాలుగా గుర్తించారు.
- **మినరల్ ఆయిల్:** చర్మ రంధ్రాలను మూసుకుపోయేలా చేసి గాలి ప్రసరణను అడ్డుకుంటుంది. దీని వల్ల దురద వస్తుంది.
- **బెంజాల్కోనియం క్లోరైడ్, పారాఫిన్ వ్యాక్స్:** చికాకు, ఎలర్జీ వంటివి వస్తాయి.
- **ఫ్రాగ్రెన్స్:** శ్వాసకోస సమస్యలు
- **సోడియం లారిల్ సల్ఫేట్:** చర్మంలోని సహజ నూనెలను తొలగించి పొడిబారడం, చికాకును పెంచుతుంది.
- **ఇతర రసాయనాలు:** యూరియా, లాక్టిక్ యాసిడ్, లానోలిన్, ప్రొపైలిన్ గ్లైకాల్, చమోమిలే నూనె వంటివి కాంటాక్ట్ డెర్మటైటిస్‌కు దారితీస్తాయి.
- **ఇతర సమస్యలు:** చర్మం ఎర్రబడడం, దద్దుర్లు, రంధ్రాలు మూసుకుపోయి మొటిమలు, పొట్టు రాలడం.

సహజమైనవే మేలు...



- మార్కెట్‌లో దొరికే వాటి ద్వారా ఇన్ని సమస్యలు వస్తే చర్మాన్ని కాపాడుకోవడం ఎలా అని ఆలోచిస్తున్నారా? దీనికోసం ప్రకృతి హితమైన చిట్కాలూ లేకపోలేదు.
- సహజసిద్ధంగా లభించే వాటిలో కొబ్బరి నూనె, ఆలివ్, ఆల్మండ్ ఆయిల్, లిక్విడ్ పారాఫిన్, వైట్ పారాఫిన్ వంటివి వినియోగించవచ్చు.
- కృత్రిమంగా తయారు చేసినవాటిలో ప్యారాబిన్, ఎలర్జనిక్ ఫ్రాగ్రెన్స్, కామెడో జనిక్ వంటి రసాయనాలు లేకుండా చూసుకోవాలి. వాటి లేబుళ్లను పరిశీలించి నిర్ధారించుకుంటే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

చర్మాన్ని కాపాడుకోండిలా..

- వేడి నీటితో ఎక్కువగా స్నానం చేయొద్దు. గోరువెచ్చని నీరు ఉత్తమం.
- చర్మం తడిగా ఉన్నప్పుడే సహజమైన మాయిశ్చరైజర్లు రాసుకోవాలి.
- రూం హ్యుమిడిఫయర్లు వినియోగించుకోవాలి.
- చర్మం పీహెచ్‌కి దగ్గరగా ఉండే సబ్బులు వాడాలి.
- చర్మంపై ఎలాంటి ఇబ్బందికర లక్షణాలు కనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించాలి.

3,250 సార్లు కాలినడకనే తిరుమలకు..



తిరుమల శ్రీవారిని ఒకసారి దర్శించుకుంటేనే జన్మ ధన్యమైందని భక్తులు ఆనంద సాగరంలో తేలిపోతారు. అలాంటిది రెండుసార్లు కాదు.. ఇరవై సార్లు కాదు.. ఇప్పటి వరకు ఏకంగా 3,460 సార్లు ఆ దేవదేవుణ్ని దర్శించుకున్నారు 71 ఏళ్ల ఓ భక్తాగ్రేసరుడు. అందులో 3,250 సార్లు కాలినడకనే తిరుమల వెళ్లడం మరో విశేషం. తిరుపతికి చెందిన వెంకట రమణమూర్తి ఎస్‌బీఐలో మేనేజర్‌గా చేసి 2014లో రిటైరయ్యారు. తర్వాత శేష జీవితాన్ని స్వామి సేవకే అంకితం చేశారు ఆయన.. వరుసగా కాలినడకన తిరుమల వెళుతూ దర్శనాలు చేసుకుంటున్నారు. 'ఉద్యోగంలో ఉన్నప్పుడూ శ్రీవారి దర్శనానికి వెళ్లేవాణ్ని. పదవీ విరమణ తర్వాత మాత్రం ఎక్కువగా వెళుతున్నా. వారంలో కనీసం నాలుగు రోజులు శ్రీవారిని దర్శించుకుంటాను' అని రమణమూర్తి వివరించారు. ఎక్కువగా శ్రీవారి మెట్ల మార్గంలోనే వెళతానని, గోవిందనామాన్ని జపిస్తూ, నిలకడగా నడిస్తే 2,388 మెట్లను గంటన్నరలోనే ఎక్కి కొండపైకి చేరుకుంటానని చెబుతున్నారు. ఈ వయసులో ఇంతటి శక్తి ఎలా వస్తోందని అడిగితే 'అదంతా వేంకటేశ్వరస్వామి దయే.. ఆరోగ్యం కాపాడుకోవడం మాత్రమే మన చేతుల్లో ఉంది' అని వినమ్రంగా చెప్పారాయన.

- ఈనాడు డిజిటల్, తిరుపతి

రబ్బరు ట్యూబే ఆనకట్ట!

లోతైన పునాదులు లేవు. భారీ కాంక్రీటు కట్టడాలు అంతకంటే లేవు. కేవలం మూడంటే మూడు మీటర్ల ఎత్తున్న ఓ సిమెంటు గట్టు. దానిపై ఓ రబ్బరు ట్యూబు. సుమారు 20 ఏళ్లుగా 25 వేల ఎకరాలను సస్యశ్యామలం చేస్తోంది. అదే జంఝావతి నదిపై ఉన్న రబ్బరు డ్యాం. పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం రాజ్యలక్ష్మీపురం సమీపంలో ఉంది ఇంజినీరింగ్ అద్భుతం.

పనితీరు ఇలా..

నదికి అడ్డంగా కట్టిన సిమెంటు గట్టుపై ప్రత్యేకమైన రబ్బరు ట్యూబు అమర్చారు. సాధారణ ప్రవాహం ఉన్నప్పుడు ట్యూబులోకి పంపు ద్వారా నీరు చేరుతుంది. ట్యూబ్ 3.5 మీటర్ల ఎత్తు పొంగి.. అడ్డుకట్టలా మారి నీటిని ఆపుతుంది. ఒకవేళ ప్రవాహ ఉద్ధృతి ఎక్కువగా ఉంటే 'ఓవర్‌ఫ్లో సెన్సర్' ఆన్ అయ్యి స్వయంచాలిత వ్యవస్థ పని చేసి ట్యూబు మూసుకుపోతుంది. నీటిని సాఫీగా దిగువకు వెళ్లేలా చేస్తుంది. ఉద్ధృతి తగ్గితే మళ్లీ ట్యూబ్ కట్టలా మారి నీటిని నిల్వ చేస్తుంది. ఈ జలాలే కాలువల ద్వారా పొలాలకు చేరుతాయి. ఆటోమెటిక్‌గా పని చేసే డ్యాంలో కంట్రోల్, పంప్, ఫిల్లింగ్ పాయింట్లు, వాల్వులు ఉంటాయి. కానీ, ప్రస్తుతం ఆపరేటరుతో ఒకరు ఆపరేట్ చేస్తున్నారు.

ఇదీ నేపథ్యం

మన్యంలోని పొలాలకు సాగునీరివ్వాలని 1976లో జంఝావతిపై ప్రాజెక్టు నిర్మించాలని అప్పటి ప్రభుత్వం భావించింది. ప్రాజెక్టు కడితే మా భూమి మునుగుతుందని పక్కనున్న ఒడిశా ప్రభుత్వం అడ్డు చెప్పింది. ఆ తర్వాత అందుబాటులోకి వచ్చిన ఆలోచనే ఈ రబ్బరు డ్యాం. 2005లో రూ.124 కోట్లతో ఆస్ట్రియా సాంకేతిక పరిజ్ఞానంతో ఏడాదిలోనే రూపొందిస్తే.. ఆసియాలోనే తొలిసారి రబ్బరు డ్యాంగా రికార్డులకెక్కింది.

- న్యూస్‌టుడే, కొమరాడ



అమ్మ కట్టిన తాజ్‌మహల్!





అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు పదమూడున్నరేళ్ల ప్రాయంలో అనారోగ్యంతో దూరమయ్యాడు. ఆ వేదన నుంచి తల్లిదండ్రులు కోలుకోలేకపోయారు. బిడ్డపై వారి ప్రేమనంతా ఓ గుడిలా మార్చారు. కుమారుడి విగ్రహానికి నిత్యం ధూప దీప నైవేద్యాలు సమర్పిస్తున్నారు. రాజమహేంద్రవరానికి చెందిన కందిమళ్ల వేణుగోపాల్, శ్రీదేవి దంపతులకు ఇద్దరు సంతానం. కుమార్తె సాయి తేజస్విని, కుమారుడు వేదసాయిదత్త. కుమారుడు అనారోగ్యానికి గురై, 2016లో కన్నుమూశాడు. కుమారుడి మరణాన్ని తల్లి శ్రీదేవి తట్టుకోలేకపోయింది. దీంతో తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం కణుపూరు సమీపంలో తమ పొలంలో కుమారుడిని సమాధి చేసిన చోట గుడి కట్టించారు. రూ.45 లక్షలతో టైల్స్, మార్బుల్స్, విలువైన వస్తు సామగ్రితో సుందరంగా తీర్చిదిద్దారు. చుట్టూ ఉద్యానాన్ని పెంచారు. కుమారుడి స్మృతిలో ఓంకారేశ్వర్ అనే ట్రస్టు పేరిట ఇప్పటి వరకు రూ.50 లక్షల విలువైన సేవా కార్యక్రమాలు చేపట్టారు. నెలనెలా 5, 19 తేదీల్లో అన్న సమారాధన నిర్వహిస్తున్నారు. 'గుడి కట్టాలని బాబు చెప్పినట్లు అనిపించింది. అందుకే సమాధిపైనే బాబు పాలరాతి విగ్రహం ఏర్పాటు చేసి ఆలయానికి వేదసాయి దత్త మందిరం అని పేరు పెట్టాం' అని తల్లి శ్రీదేవి తెలిపారు.



- న్యూస్‌టుడే, కోరుకొండ

కొమ్ములు తిరిగిన బైక్!



తమ బైక్ వినూత్నంగా ఉండాలని యువత ఆరాటపడుతుంది. అలాంటి ఓ ఔత్సాహికుడు తన బైక్‌కు పొట్టేలు కొమ్ములు అమర్చుకున్నాడు. చూడటానికి వైవిధ్యంగా కనిపిస్తున్నా.. ఇలాంటి అదనపు ఆకర్షణలు ప్రమాదకరమని మెకానికల్‌లు హెచ్చరిస్తున్నారు. పొరపాటున ప్రమాదం జరిగితే తీవ్ర పెరుగుతుందంటున్నారు. నిపుణుల సూచనల మేరకే వాహనాల్లో మార్పులు చేసుకోవాలని సూచిస్తున్నారు. అన్నట్లు.. కొమ్ములు తిరిగిన ఈ బైక్ బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం మేదరమెట్ల బస్టాండ్ సెంటర్‌లో కనిపించింది.

- న్యూస్‌టుడే, మేదరమెట్ల



తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబుతో సమావేశమైన చిరంజీవి, టీజీఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు

హైదరాబాద్‌ను గ్లోబల్ సినీహబ్‌గా మార్చేందుకు సహకరిస్తాం

సినీనటుడు చిరంజీవి

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌ను గ్లోబల్ సినీహబ్‌గా మార్చాలని సంకల్పించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. గ్లోబల్ సమిట్‌లో సినీ పరిశ్రమను కూడా భాగస్వామ్యం చేసి ఆ దిశగా అడుగులు వేయడం సంతోషకరంగా ఉందని సినీనటుడు చిరంజీవి అన్నారు. ఈ విషయంలో సినీ పరిశ్రమ అంతా ముందుకొచ్చి సహకరిస్తుందన్నారు. సమిట్ ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'బాలీవుడ్ నుంచి సల్మాన్‌ఖాన్, అజయ్ దేవగన్ లాంటి వారు వచ్చి ఇక్కడ అత్యాధునిక స్టూడియోలు నిర్మిస్తామనడం శుభారంభం. నేను, నాగార్జున, వెంకటేశ్ ఇతర నిర్మాతలు పరిశ్రమను ఎంతో ఎత్తుకు తీసుకెళ్లాలన్న కుతూహలంతో ఉన్నాం. దేశ జీడీపీ సినీరంగంతో కూడా వృద్ధి జరుగుతుందని కేంద్ర ప్రభుత్వం కూడా గ్రహించింది. 'వేవ్స్' అనే కార్యక్రమం ప్రారంభించి అందులో మా అందరినీ భాగస్వాములను చేసింది. కొరియా, జపాన్ లాంటి దేశాలు యువత పక్కదారి పట్టకుండా సినీ, వినోద రంగాలకు అత్యంత ప్రాధాన్యమిస్తాయి. సినీ పరిశ్రమ అవసరాలను చెప్పాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అడుగగా.. నటన, దర్శకత్వం, మేకప్ లాంటి అనేక విభాగాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరాను. వర్టికల్ సినిమాలు కేవలం 10 నిమిషాల నిడివితో తీసినా.. ఎంతో మందికి వినోదాన్ని పంచుతాయని ఆనంద్ మహీంద్రా వంటి వారు సూచించారు. సినిమాను ఎవరూ తేలిగ్గా చూడొద్దు. దీనివల్ల ఆర్థిక వనరులను సృష్టించవచ్చు' అని చిరంజీవి పేర్కొన్నారు.

తెలంగాణకు రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులు!

- రెండో రోజున రూ.1,77,500 కోట్లకు ఎంవోయూలు
- రూ.70 వేల కోట్లతో ఇన్‌ఫ్రాకీ డీసీ పార్క్స్ ఒప్పందం
- గ్లోబల్ సమిట్‌లో వెల్లువెత్తిన పెట్టుబడులు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణకు భారీగా పెట్టుబడులు వెల్లువెత్తాయి. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌లో రూ.5,75,000 కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఎంవోయూలు కుదిరాయి. మొదటి రోజు సదస్సులో రూ.3,97,500 కోట్లకు ఒప్పందాలు కుదరగా.. రెండోరోజు మంగళవారం రూ.1,77,500 కోట్లకు ప్రభుత్వంతో వివిధ కంపెనీలు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఇన్‌ఫ్రాకీ డీసీ పార్క్స్ ఏకంగా రూ.70 వేల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూ చేసుకుంది. 150 ఎకరాల్లో ఒక గిగావాట్ సామర్థ్యం కలిగిన ఏఐ రెడీ డేటా పార్క్ ఏర్పాటు చేస్తుంది. అలాగే రూ.9 వేల కోట్లతో జేసీకే ఇన్‌ఫ్రా ముందుకు వచ్చింది. డేటా సెంటర్స్ సదుపాయాలను విస్తరించడానికి రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. దీనివల్ల 2,000 మందికి ఉద్యోగాలు వస్తాయి.

తెలంగాణ పర్యాటక రంగంలో మంగళవారం ఏకంగా రూ.7,045 కోట్ల పెట్టుబడులపై ఒప్పందాలు జరిగాయి. ప్రత్యక్షంగా 10వేల మందికి, పరోక్షంగా 30 వేల మందికి ఉపాధి లభించనుంది. ఇవి కాకుండా.. ప్రధానంగా ఐటీ, విద్యుత్, క్రీడలు, పర్యాటకం, అటవీ తదితర శాఖల్లోనూ పెట్టుబడులకు కంపెనీలు ఆసక్తి చూపాయి. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ అభివృద్ధి చెందాలనే సంకల్పంతో. . నిర్వహించిన రెండు రోజుల గ్లోబల్ సదస్సులో పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా లక్ష్యం విజయవంతమైందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

సీఎంతో పలు కంపెనీల ప్రతినిధుల భేటీ

గ్లోబల్ సదస్సు ప్రాంగణంలో పలువురు దిగ్గజ పారిశ్రామికవేత్తలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మంగళవారం సమావేశమయ్యారు. తాజ్ జీవీకే మేనేజింగ్ డైరెక్టర్ శాలిని భూపాల్, అనలాగ్ ఏఐ ప్రతినిధులు, డ్రీమ్ వాలీ గోల్ఫ్ అండ్ రిసార్ట్స్, సెంబ్ కార్ప్(సింగపూర్), టీసీసీఏ(తైవాన్ గ్రూప్), ఐఐఎఫ్ఏ, అట్మాస్పియర్ కోర్ ఇండియా, శ్రీ హవీషా హాస్పిటాలిటీ, సారస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పోలిన్ గ్రూప్, మల్టీవర్స్, కారవాన్, కేఈఐ గ్రూప్, క్రిస్టల్ లాగూన్స్(యూఎస్ఏ), గ్రీన్ పాంథర్స్ ప్రాపర్టీస్ ప్రతినిధులు, గోద్రెజ్ జెర్సీ గ్రూప్ సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ పిరోజ్షా గోద్రెజ్, గ్రూప్ ప్రెసిడెంట్ రాకేశ్ స్వామి తదితరులు సీఎంతో సమావేశమయ్యారు. తమ సంస్థల విస్తరణపై మాట్లాడారు. మిల్క్, ఎఫ్ఎంసీజీ, రియల్‌ఎస్టేట్, ఆయిల్ పామ్ విభాగాల్లో పెట్టుబడులకు ఆసక్తి కనబర్చారు. హైదరాబాద్‌లో జీసీసీని ప్రారంభించాలని భావిస్తున్నట్లు కెనడియన్ ఇంపీరియల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు ముఖ్యమంత్రిని కలిసిన సందర్భంలో తెలియజేశారు.



ఒప్పంద పత్రాలు ప్రదర్శిస్తున్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, సీఎస్ రామకృష్ణారావు, గ్రాన్యూల్స్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రియాంకా చిగురుపాటి

పలు ఎంవోయూలు ఇలా...

- ✦ ఏజీపీ గ్రూప్.. రాష్ట్రంలో 125 ఎకరాల్లో ఒక గిగావాట్ హైపర్ స్కేల్ డీసీ క్యాంపస్ ఏర్పాటు చేస్తుంది. ఇక్కడే బెస్(బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టం) సదుపాయాన్ని అభివృద్ధి చేస్తుంది. రూ.6,750 కోట్ల పెట్టుబడి పెట్టనుంది.
- ✦ బయలాజికల్ ఈ లిమిటెడ్.. సీడీఎంవో(కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్, మాన్యుఫ్యాక్చరింగ్ ఆర్గనైజేషన్) యూనిట్ ఏర్పాటు చేయడానికి రూ.3,500 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఇంతకుముందు ప్రకటించిన రూ.500 కోట్ల పెట్టుబడికి ఇది అదనం. దీనికి గ్రీన్ ఫార్మా సిటీలో ప్రభుత్వం 150 ఎకరాల స్థలం కేటాయిస్తుంది. దీని ద్వారా 3,000 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి.
- ✦ భారత్ బయోటెక్.. రూ.1,000 కోట్ల పెట్టుబడితో సీఆర్‌డీఎంవో(కాంట్రాక్ట్ రీసెర్చ్, డెవలప్‌మెంట్, మాన్యుఫ్యాక్చరింగ్ ఆర్గనైజేషన్) యూనిట్ ఏర్పాటు చేయనుంది. దీనివల్ల వచ్చే మూడు నుంచి నాలుగేళ్లలో 200 మందికి ఉద్యోగాలు లభిస్తాయి.
- ✦ గ్రాన్యూల్స్ ఇండియా.. క్యాన్సర్ ఔషధాల ఉత్పత్తికి రూ.1,200 కోట్ల పెట్టుబడితో సీడీఎంవో(కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్, మాన్యుఫ్యాక్టరింగ్ ఆర్గనైజేషన్) యూనిట్ ఏర్పాటు చేయనుంది. దీనివల్ల సుమారు 3,000 మందికి ఉద్యోగాలు లభిస్తాయి.
- ✦ రాష్ట్రంలో ఉన్న అపారమైన వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌కు హాజరైన యూఏఈ, ఇతర దేశాల ప్రతినిధులను కోరారు. ఇందులో యూఏఈ రాజకుటుంబానికి చెందిన షేక్ అల్ తారిఖ్ ఖాసిమి, రిపబ్లిక్ ఆఫ్ గినియా ప్రధాన మంత్రికి ప్రత్యేక సలహాదారు రాజేశ్వర్ ప్రసాద్, ఈఎస్ గ్లోబల్ సీఈవో సుమంత్ నాయక్, కెన్యా మాజీ ఎంపీ డాక్టర్ స్వరూప్‌రంజన్‌మిశ్రా, క్రాప్ 360 ఫౌండర్ అశ్విన్ శ్రీవాత్సవ తదితరులున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భారత్ ఫ్యూచర్‌సిటీ, పర్యాటక జోన్లు, లాజిస్టిక్‌పార్కులు, హాస్పిటాలిటీ కేంద్రాల వివరాలను వారికి సీఎం వివరించారు. ఈ విభాగాల్లో ప్రాజెక్టులు చేపట్టాలని, ఆ మేరకు ఎంవోయూ కుదుర్చుకోవాలని కోరారు.

> రాష్ట్రంలో పేదరికం, జాతి వివక్షను దూరం చేసేందుకు, అందరికీ విద్య, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించాం. ఈ దార్శనిక పత్రం రాష్ట్ర భవిష్యత్తుకు రోడ్‌మ్యాప్
>
> - తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

శ్రీవారి ట్రస్టులకు రూ.కోటి విరాళం



విరాళం చెక్కులను అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేస్తున్న దాతలు

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: శ్రీవారి ట్రస్టులకు చెన్నై ఈరోడ్‌కు చెందిన సౌమ్య మంగళవారం రూ.కోటి విరాళం అందజేశారు. తితిదే అదనపు ఈఓ వెంకయ్య చౌదరిని తిరుపతిలోని పద్మావతి అతిథిగృహంలో కలిసిన ఆమె నిత్యాన్న ప్రసాదం ట్రస్టుకు రూ.50 లక్షలు, ప్రాణదానం ట్రస్టుకు రూ.50 లక్షల చొప్పున చెక్కులు అందించారు. కార్యక్రమంలో తెదేపా నేత కోడూరు బాలసుబ్రహ్మణ్యం, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేడు మంత్రులు, కార్యదర్శులు, విభాగాధిపతులతో సీఎం సమావేశం

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన బుధవారం మంత్రులు, కార్యదర్శులు, విభాగాధిపతుల సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) వృద్ధి రేటు పెంచేందుకు వచ్చే 4 నెలల్లో చేపట్టాల్సిన ప్రణాళికపై చర్చిస్తారు. 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి రెండు త్రైమాసికాల్లో సాధించిన ఆర్థిక ఫలితాలపై సమీక్షిస్తారు.

విశాఖలో 9 ఇండిగో విమానాల రద్దు

విశాఖపట్నం(ఎన్ఏడీకూడలి), న్యూస్‌టుడే: ఇండిగో విమాన సంస్థ సంక్షోభం నేపథ్యంలో విశాఖ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించాల్సిన 9 ఇండిగో విమానాలు మంగళవారం రద్దయినట్లు విశాఖ ఎయిర్‌పోర్టు డైరెక్టర్ పురుషోత్తం తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన జారీ చేశారు.

నిరాధార ఆరోపణలు చేయడం తగదు

కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి శ్రీకాంత్

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: కొడాలి పిచ్చేశ్వరరావు తనపై నిరాధారమైన ఆరోపణలు చేయడాన్ని ఖండిస్తున్నానని ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ పేర్కొన్నారు. ఆ ఆరోపణలపై ఎటువంటి విచారణకైనా సిద్ధంగా ఉన్నానని, తనపై అభియోగాలు చేసిన వారిపై న్యాయపరంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. విజయవాడలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తాను కోర్టు ఆదేశాల మేరకు కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి అయ్యానన్నారు. తనపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో పటమట పోలీసులు పిలిచి విచారించారని, ఆరోపణలన్నీ అసత్యాలనడానికి ఆధారాలను చూపించడంతో తనను పంపించేశారని వివరించారు. తమది అమెచ్యూర్ తరపున గుర్తింపు పొందిన కబడ్డీ సంఘం అని, అందుకే టోర్నమెంట్లు నిర్వహిస్తున్నారని వివరించారు. ఓర్వలేక నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో కబడ్డీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

షిర్డీసాయి అనుబంధ సంస్థకు రూ.12.19 కోట్ల స్టాంపు రుసుము మినహాయింపు

ఈనాడు, అమరావతి: ఇంటిగ్రేటెడ్ సోలార్ పీవీ ఉత్పత్తి ప్లాంట్‌కు స్టాంపు రుసుము మినహాయింపు ఇస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం కరేడులో ఇండోసోల్ సోలార్, షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ సోలార్ పీవీ మాడ్యూల్ పరిశ్రమ ఏర్పాటుకు కరేడులో 8,348 ఎకరాలు, గుడ్లూరు మండలం చేవూరులో 114.5 ఎకరాల్ని ప్రభుత్వం కేటాయించింది. ఇందులోభాగంగా షిర్డీసాయి అనుబంధ సంస్థ సూర్యచక్ర డెవలపర్స్‌కు కేటాయించిన 798.98 ఎకరాల భూమికి రూ.12.19 కోట్ల స్టాంపు రుసుము మినహాయింపు ఇచ్చారు.

రైజింగ్ ప్రణాళిక విజయవంతమవుతుంది



- మహీంద్రా అండ్ మహీంద్రా ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా

ఈనాడు, హైదరాబాద్: 'పెద్ద లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఓడిపోవడం కంటే చిన్న లక్ష్యాన్ని పెట్టుకుని గెలవటమే అతి పెద్ద ప్రమాదమని మైఖెలాంజెలో అన్నారు. దీన్ని తెలంగాణ బాగా అర్థం చేసుకుంది. అందుకే 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరుకోవాలనే అతిపెద్ద లక్ష్యాన్ని నిర్దేశించుకుంది' అని మహీంద్రా అండ్ మహీంద్రా ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా చెప్పారు. గ్లోబల్ రైజింగ్ ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. "ఒక్కరు నిర్దేశించిన ప్రణాళిక ఎప్పటికీ సాధ్యం కాకపోవచ్చు. ప్రజలందరి భాగస్వామ్యంతో రూపొందిన కార్యాచరణ తప్పకుండా విజయవంతమవుతుంది. తెలంగాణ రైజింగ్ విజన్ అలాంటిదే. ఈ ప్రణాళికలో యువకులు, మహిళల ప్రయోజనాలకు పెద్దపీట వేశారు. సుస్థిరాభివృద్ధి దిశగా ముందుకు సాగాలని నిర్దేశించుకున్నారు. యంగ్ ఇండియా నైపుణ్య విశ్వవిద్యాలయం తెలంగాణ సమాజంలో నైపుణ్యాల విస్తరణకు, సత్వర అభివృద్ధికి తోడ్పతుంది. ఇది తెలంగాణకే కాకుండా దేశం మొత్తానికి మేలు చేస్తుంది. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి ఛైర్మన్ హోదాలో రాష్ట్ర ప్రగతిలో నాకూ భాగం లభిస్తుంది. ఛైర్మన్ పదవి చేపట్టాలని ముఖ్యమంత్రి కోరినప్పుడు...నాకు వ్యాపారంతో పాటు మహీంద్రా యూనివర్సిటీ, మరికొన్ని ఇతర విద్యాసంస్థల బాధ్యతలున్నాయి. ఇన్ని పనులు చేయలేననుకొని.. అదే విషయాన్ని సీఎంకు చెప్పా. ఆయనతో నాలుగు గంటలు కూర్చుని మాట్లాడిన తర్వాత నన్ను ఒప్పించారు. ఆయన మాటని కాదనలేని వాదన వినిపించారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా తెలంగాణలో పెద్ద సంఖ్యలో బ్లూకాలర్ ఉద్యోగాలు రాబోతున్నాయి. వీటికి ఏఐ ముప్పు లేదు. అభివృద్ధి చెందిన దేశాలకు పెట్టుబడి, టెక్నాలజీ లేక కాదు.. నైపుణ్యాల కొరతే ప్రధాన సమస్య. వాళ్లకు మేనేజర్లు ఉన్నారు కానీ మేకర్లు లేరు. పని తెలిసిన వాళ్లకు ప్రత్యామ్నాయం లేదనేది దీనర్థం. ఈ సమస్యను మన దేశంలో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిష్కరిస్తుంది' అని వివరించారు. తెలంగాణ అభివృద్ధిని కేవలం పక్కనుంచి మాత్రమే చూడాలనుకోవడం లేదని, అందులో మహీంద్రా గ్రూపు కీలకమైన భాగస్వామిగా ఉంటుందని స్పష్టం చేశారు.

రేణిగుంటకు స్పైస్‌జెట్ టాటా

15 ఏళ్ల అనుబంధానికి తెర

రేణిగుంట, న్యూస్‌టుడే: విమానయాన సంస్థ స్పైస్‌జెట్ తిరుపతి జిల్లా రేణిగుంట నుంచి సర్వీసులను నిలిపివేయనుంది. సంస్థాగత కారణాలతో ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు సమాచారం. ప్రస్తుతం హైదరాబాద్-రేణిగుంట మధ్య రోజూ రెండు సర్వీసులు నడుపుతున్న ఈ సంస్థ బుధవారం నుంచి పూర్తిగా తన సేవలను నిలిపివేయనుంది. సుమారు 15 ఏళ్ల పాటు సేవలు అందించిన ఈ సంస్థ ఇక ఇప్పట్లో సర్వీసు పునరుద్ధరించే అవకాశం లేనట్లేనని తెలిసింది. రేణిగుంటకు వివిధ ప్రాంతాల నుంచి స్పైస్‌జెట్ సంస్థకు చెందిన విమాన సర్వీసులే అధికంగా ఉండేవి. విమానయాన రంగంలో ఏర్పడిన పోటీ కారణంగా ఇక్కడ ఈ సంస్థ సర్వీసులు క్రమంగా తగ్గుముఖం పట్టాయని కొందరు విశ్లేషకులు తెలిపారు.

ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకున్నాం

- ఏపీలో ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్‌ల ఏర్పాటు
- ఆయా రంగాల్లో పెట్టుబడులకు ఎన్నో అవకాశాలు
- వివిధ సంస్థల ప్రతినిధులతో మంత్రి లోకేశ్ చర్చ





రిగెట్టి కంప్యూటింగ్ సంస్థ చీఫ్ టెక్నాలజీ అధికారి డేవిడ్ రివాస్‌తో భేటీ అయిన మంత్రి లోకేశ్ ◆ విశాఖలో సైబర్ సెక్యూరిటీ పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని జడ్ స్కాలర్ సంస్థ సీఈవో జే చౌదరి బృందంతో చర్చిస్తున్న మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: అంతర్జాతీయంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి అత్యాధునిక సాంకేతికతను ఆంధ్రప్రదేశ్ అందిపుచ్చుకుంటోందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఈ రంగాల్లో యువతకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శాన్‌ఫ్రాన్సిస్కోలోని కాన్సుల్ జనరల్ ఆఫ్ ఇండియా శ్రీకర్‌రెడ్డిని లోకేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ.. "పెట్టుబడిదారులతో సుహృద్భావ వాతావరణం, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, పరిశ్రమలకు చెల్లించే ప్రోత్సాహకాల వల్ల గత 18 నెలల్లో రూ.20 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులకు ఒప్పందాలు కుదుర్చుకున్నాం. వివిధ రంగాల్లో పెట్టుబడులకు ఏపీలో విస్తృత అవకాశాలు ఉన్నాయి. పారిశ్రామికవృద్ధికి సహకరించాలి" అని కోరారు. ఆయా సంస్థల ప్రతినిధులతో ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై లోకేశ్ చర్చించారు.

ఏఐ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు సహకరించండి

● ఏపీలో ఏఐ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని ఓపెన్ ఏఐ సంస్థ చీఫ్ టెక్నాలజీ అధికారి శ్రీనివాస్ నారాయణన్‌ను లోకేశ్ ప్రతిపాదించారు. 'ఏపీలో ప్రతి కుటుంబంలో ఒకరు ఏఐ ఆధారితంగా ఉండాలనేది ప్రభుత్వ లక్ష్యం. దానికి అవసరమైన నైపుణ్యాభివృద్ధి అందించండి. తొలిదశలో అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, పాఠశాల విద్యార్థులకు ఉచిత చాట్ జీపీటీ అందించాలని నిర్ణయించాం. డేటా సెంటర్ హబ్‌గా మారుతున్న ఏపీని ఓపెన్ ఏఐ డేటా సెంటర్ కార్యకలాపాలకు ఎంపిక చేసుకోవాలి' అని కోరారు.

● రాష్ట్రంలో డీప్ టెక్ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు ప్రతిపాదన పరిశీలించాలని అంతర్జాతీయ వెంచర్ క్యాపిటల్ సంస్థ సెలెస్టా వీసీ మేనేజింగ్ పార్ట్‌నర్ అరుణ్ కుమార్‌కు మంత్రి లోకేశ్ సూచించారు.

● విశాఖలో జీసీసీ, పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సేల్స్ ఫోర్స్ సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ రమేష్ రాగినేనిని కోరారు.

● విశాఖలో సైబర్ సెక్యూరిటీలో పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని జడ్ స్కాలర్ సంస్థ సీఈవో జే చౌదరిని కోరారు.

● ఏపీలోని ఎలక్ట్రానిక్స్ తయారీ క్లస్టర్లలో (శ్రీసిటీ, కొప్పర్తి) అసెంబ్లింగ్, టెస్టింగ్, ప్యాకేజింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని ఏఎండీ సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వంశీ బొప్పనను అభ్యర్థించారు.

● ఏపీలో స్మార్ట్ సిటీలు, డిజిటల్ గవర్నెన్స్, ఎలక్ట్రానిక్స్ తయారీ క్లస్టర్ల కోసం ఐటీ మౌలిక సదుపాయాలు కల్పించడంలో సహకరించాలని వర్చస్ ఓప్స్ ల్యాబ్ సీఈవో కూనపనేని వర్మను లోకేశ్ కోరారు.

● ఇండస్ట్రియల్ జోన్లలో ఎలక్ట్రోలైజర్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఓమియం సంస్థ చీఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ అధికారి చొక్కలింగం కరుప్పయ్య వద్ద మంత్రి లోకేశ్ ప్రతిపాదించారు.

పోలీసులతో సావాసం.. వసూళ్ల సామ్రాజ్యం

- కార్లు అపహరించి.. తక్కువ ధరకే అమ్మకం
- పల్నాడులో సీఐలు, ఎస్సైలకు కార్లతో ఎర



ప్రధాన నిందితుడు, ఏఎస్సై కుమారుడు వెంకటనాయుడు

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే, చిలకలూరిపేట గ్రామీణం: చిలకలూరిపేట బైపాస్‌లో కారు ప్రమాదానికి కారకుడు, ఏఎస్సై కుమారుడి నేరాలకు, వసూళ్ల సామ్రాజ్య విస్తరణకు కొందరు పోలీసులే అండగా నిలిచారని తెలుస్తోంది. సీఐలు, ఎస్సైలకు కార్లను ఎరగా వేసి... జాతీయ రహదారుల వెంట అక్రమ వసూళ్ల దందా నడిపించాడని విచారణలో వెల్లడైంది. కార్ల దొంగతనం విషయం బయటకు రాకుండా చూడాలని ఇప్పటికే పోలీసు ఉన్నతాధికారులతో బేరసారాలు జరుగుతున్నట్లు తెలిసింది.

ఘటన స్థలానికి వచ్చిన ఎస్సై?

విశ్వసనీయ సమాచారం మేరకు.. చిలకలూరిపేట ఎస్సై రహ్మతుల్లాకు ప్రధాన నిందితుడు (ఏఎస్సై కుమారుడు) వెంకటనాయుడు ముఠాతో సంబంధం ఉందని పోలీసుల విచారణలో తేలింది. నిందితుడి కాల్ డేటాను పరిశీలించగా వెంకటనాయుడితో పాటు ముఠాలోని మరో ఇద్దరితో ఎస్సై రహ్మతుల్లా మాట్లాడినట్లు గుర్తించారు. రోడ్డుప్రమాదం జరిగిన వెంటనే తన పరిధి కాకపోయినా రహ్మతుల్లా ఘటనాస్థలానికి వచ్చినట్లు ఫోన్ లొకేషన్ ఆధారంగా నిర్ధారించారు.

తక్కువ ధరకే అమ్మకం: వెంకటనాయుడి ముఠా సభ్యుల ప్రధాన నేరవృత్తి ఖరీదైన కార్లను మాయం చేసి, తక్కువ ధరకే అమ్మడం. పల్నాడు పోలీసులకు ఇలాంటి కార్లను అమ్మినట్లు నిందితులు అంగీకరించినట్లు తెలిసింది. గురజాల సబ్‌డివిజన్ పరిధిలోని ఓ సీఐకి రెండు, ఎస్పీ కార్యాలయంలో పనిచేసే ఓ సీఐకి ఒకటి, చిలకలూరిపేట ఎస్సై రహ్మతుల్లాకు రెండు కార్లు తక్కువధరకు అమ్మినట్లు సమాచారం. ఏఎస్సై కుమారుడి ఇంటివద్ద ఐదు కార్లు కనిపించేవి. ఘటన తర్వాత అవి మాయమయ్యాయి.

మద్యం పార్టీ వేసుకుని..

వెంకటనాయుడి ముఠాలోని సాయి అనే యువకుడి పుట్టిన రోజు వేడుకలు గురువారం యడ్లపాడు మండలం బోయపాలెంలోని ఓ తోటలో చేసుకున్నారు. అక్కడ మద్యం తాగి రెండు ముఠాలుగా విడిపోయి ఒక ముఠా చిలకలూరిపేట వైపు వచ్చింది. దాన్ని ఆపి ట్రాక్టర్‌తో వెళ్తున్న రైతు వీరి కంటపడింది. దాన్ని ఆపి బుర్రిపాలెం వాహనాలు చేద్దాం లేదా ట్రాక్టర్ మాయం చేద్దామని తమలో తాము చర్చించుకుని లారీని ఢీకొని ప్రమాదానికి కారకులయ్యారు.

◆ డీఎస్పీ కార్యాలయంలో ఏఎస్సైగా పనిచేస్తున్న శ్రీను(ప్రధాన నిందితుడి తండ్రి)ను వెల్దుర్తి ఠాణాకు బదిలీ చేశారు.



నిందితులు ఉపయోగించిన కారు

ఎస్ఐఆర్‌ను ఆహ్వానిస్తున్నాం

లోక్‌సభలో జరిగిన చర్చలో లావు శ్రీకృష్ణదేవరాయలు



ఈనాడు, దిల్లీ: "ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న ప్రాంతీయపార్టీగా మేం ఎస్ఐఆర్‌ను ఆహ్వానిస్తున్నాం. మా రాష్ట్రంలో ఆ కార్యక్రమాన్ని చేపట్టాలని కోరుతున్నాం. ఈ ప్రక్రియలో అన్ని పార్టీలనూ భాగస్వాములను చేయాలి. అన్ని పార్టీలూ తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలి" అని తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు. ఎస్ఐఆర్ అంశంపై మంగళవారం లోక్‌సభలో ప్రారంభమైన చర్చలో ఆయన తెలుగుదేశం పార్టీ తరఫున మాట్లాడారు. ఆవిర్భవించిన 9 నెలల్లోనే అధికారంలోకి వచ్చి ఎన్నికల్లో రికార్డు సృష్టించిన తెలుగుదేశాన్ని గెలిపించి ఓటర్లు తమ విజ్ఞతను చాటి చెప్పారని పేర్కొన్నారు.

సార్వత్రిక ఓటుహక్కులో ముందున్న భారత్

ప్రతిపక్షాలు భారతీయ ఎన్నికల వ్యవస్థను విదేశాలతో పోల్చిచెబుతున్నాయి. కానీ భారతదేశం ప్రసాదించిన సార్వత్రిక ఓటుహక్కు గురించి ప్రస్తావించడం లేదు. ఇతర దేశాల్లో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పురుషులు, మహిళలకు సమానంగా ఇలా ఓటుహక్కు ఇవ్వలేదు. ఇలాంటి హక్కు ఇవ్వడానికి అమెరికా 176 ఏళ్లు, యూకే 96 ఏళ్లు, కెనడా 93, ఫ్రాన్స్ 152 ఏళ్లు తీసుకుంటే భారత్ తొలి ఎన్నిక నుంచే అందరికీ సమానంగా ఓటుహక్కు కల్పించింది.

వందలసార్లు ప్రభుత్వాలు మారాయి: స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జరిగిన వివిధ రాష్ట్రాల అసెంబ్లీల్లో 385సార్లు ఎన్నికలు జరిగాయి. 1951-86 మధ్య రాష్ట్రాల్లో 56 సార్లు ప్రభుత్వాలు మారితే 1987-2022 మధ్య 133 సార్లు మారాయి. ఇది ఓటర్ల పరిపక్వతను చాటుతోంది. ఓట్ల చోరీ, ఈవీఎం హ్యాక్ గురించి అడుగుతున్న ప్రతిపక్షం తెలంగాణ, కర్ణాటకల్లో కాంగ్రెస్ గెలిచినప్పుడు వాటి గురించి మాట్లాడలేదు. బిహార్‌లో 2024 లోక్‌సభ ఫలితాలు, తాజా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై హిందూపత్రిక ఒక విశ్లేషణ ప్రచురించింది. ఎస్ఐఆర్ ఓ ఒక్కరికో ప్రయోజనకరంగానో, ప్రతికూలంగానో కనిపించలేదని చెప్పింది.

చేపట్టాల్సిన సంస్కరణలు చాలా ఉన్నాయి: ప్రస్తుతం అన్నీ సరిగా ఉన్నాయి, ఇక ఎలాంటి సంస్కరణలూ అవసరంలేదని మేం చెప్పడం లేదు. ఇంకా చేపట్టాల్సిన సంస్కరణలు చాలా ఉన్నాయి. అందుకే ఎన్నికల సంఘాన్ని కలిసి పలు సూచనలు చేశాం'' అని లావు తెలిపారు.

మిరపలో 'నల్లతామర' ప్రభావంపై నివేదిక ఇవ్వండి

- ఉద్యాన అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం



ఈనాడు, అమరావతి: మిరపలో నల్లతామర పురుగు ప్రభావంపై నివేదిక ఇవ్వాలని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఉద్యాన అధికారుల్ని ఆదేశించారు. 'మిరప రైతుకు నిద్ర కరవే' శీర్షికన మంగళవారం 'ఈనాడు'లో వచ్చిన కథనంపై మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో మాట్లాడారు. పురుగు ప్రభావం అధికంగా ఉన్న ప్రాంతాలకు శాస్త్రవేత్తలను పంపాలని సూచించారు. మందుల పిచికారీపై సలహాలు ఇచ్చేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలన్నారు. 2021 నుంచి పురుగు దాడి చేస్తోందని, గ్రామస్థాయిలో అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నామని ఉద్యానశాఖ డైరెక్టర్ శ్రీనివాసులు మంత్రికి వివరించారు.

వాడిన మందులు మళ్లీ వాడొద్దు: శాస్త్రవేత్తలు

నల్లతామర పురుగు నివారణకు రైతులు సామూహికంగా జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవాలని వైఎస్సార్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు సూచించారు. 'వాడిన పురుగు మందుల్ని మళ్లీ వాడొద్దు. తక్కువ వ్యవధిలో విచక్షణారహితంగా పిచికారీ చేయొద్దు' అని పేర్కొన్నారు. ◆ లీటరు నీటికి 1 మి.లీ. 10 వేల పీపీఎం గాఢత ఉన్న వేపనూనె లేదా 2 మి.లీ. '1,500/3,000 పీపీఎం వేపనూనె' కలిపి పిచికారీ చేయాలి. ◆ 34 మి.లీ. బ్రోఫ్లనిలైడ్ 20ఎస్సీ, 160 మి.లీ. ఫ్లుక్సామెటమైడ్ 20ఈసీ, 40 గ్రాములు ఫిప్రానిల్ 80% డబ్ల్యూ.జి., 200 మి.లీ. స్పైరో టెట్రామాట్ 15.30% ఓడీలలో ఏదో ఒకటి ఎకరానికి సరిపోయేలా నీటిలో కలిపి పిచికారీ చేయాలి' అని తెలిపారు.

హైకోర్టులో సీఐడీ అదనపు నివేదిక దాఖలు

- రెండు ప్రతులను సీజే ధర్మాసనం ముందు ఉంచండి
- 'పరకామణిలో చోరీ' కేసులో రిజిస్ట్రార్ జ్యుడీషియల్‌కు సింగిల్ జడ్జి ఆదేశం
- అదనపు నివేదికను తన ముందు ఉంచాలని స్పష్టీకరణ

ఈనాడు, అమరావతి: శ్రీవారి పరకామణిలో చోరీ కేసు రాజీ వ్యవహారంపై సీఐడీ డీజీ హైకోర్టులో అదనపు నివేదిక దాఖలు చేశారు. ఈ నివేదిక రెండు ప్రతులను లోక్ అదాలత్ ఉత్తర్వుల చట్టబద్ధతను తేల్చేందుకు విచారణ జరుపుతున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ ఆర్. రఘునందన్‌రావుతో కూడిన ధర్మాసనం ముందు సీల్డ్ కవర్లో ఉంచాలని రిజిస్ట్రార్ (జ్యుడీషియల్)ను హైకోర్టు సింగిల్ జడ్జి ఆదేశించారు. పరిశీలన నిమిత్తం అదనపు నివేదికను తనముందు ఉంచాలని స్పష్టంచేశారు. విచారణను బుధవారానికి వాయిదా వేశారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు.

ఈ వ్యాజ్యంలో మీరు వాదనలు వినిపించడం సరికాదు

మంగళవారం ఈ కేసులో విచారణ ప్రారంభం కాగానే న్యాయవాది ఉన్నం అఖిల్ చౌదరి స్పందిస్తూ.. తాను సీఐడీ తరఫున హాజరైనట్లు తెలిపారు. న్యాయమూర్తి స్పందిస్తూ.. ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద సరస్వతిని ప్రతివాదిగా చేర్చుకోవాలని ఇదే వ్యాజ్యంలో గతంలో ఇంప్లీడ్ పిటిషన్ వేసి.. తర్వాత వకాలత్‌ను వేరే వారికి ఇచ్చారని గుర్తుచేశారు. ప్రస్తుత వ్యాజ్యంలో సీఐడీ తరఫున వాదనలు వినిపించడం.. పరస్పర ప్రయోజనాలకు విరుద్ధం అవుతుందన్నారు. ఇతర అన్ని వ్యాజ్యాలలో సీఐడీ తరఫున హాజరుకావచ్చని చెప్పారు. ఈ వ్యాజ్యంలో సీఐడీ తరఫున వాదనలు వినిపించడం సరికాదన్నారు. దీంతో సీఐడీ తరఫున ఈ కేసు విచారణ నుంచి వైదొలుగుతున్నట్లు న్యాయవాది అఖిల్ చౌదరి కోర్టుకు తెలిపారు.

ఫ్రీహోల్డ్ భూముల సమస్యకు త్వరలో పరిష్కారం

- రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్



ఈనాడు, అమరావతి: ఫ్రీహోల్డ్ భూములపై ఈ నెల 11న జరిగే మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని.. 2నెలల్లో పరిష్కారం చూపిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. వైకాపా ప్రభుత్వ పాపాలే రెవెన్యూ శాఖలో సమస్యలకు కారణమని ధ్వజమెత్తారు. మంగళవారం సచివాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇనాం భూముల సమస్యపై దేవాదాయ శాఖ, రెవెన్యూ శాఖలు నివేదిక ఇవ్వనున్నట్లు చెప్పారు. రిజిస్ట్రేషన్ శాఖలో డబుల్ రిజిస్ట్రేషన్లు, అవినీతి ఉండకూడదని ముఖ్యమంత్రి ఆదేశించారని వివరించారు. పట్టాదారు పాసుపుస్తకాల టెండర్లలో సమస్య కారణంగా ముద్రణ ఆలస్యమవుతోందని.. ఎప్పటికప్పుడు ముద్రించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో స్థలాలు పొందిన వారికి వాటిని రద్దు చేసి.. ఇంకోచోట ఇంటిస్థలం కేటాయిస్తామని చెప్పారు. రాష్ట్రంలో 36 లక్షల ఎకరాల ఎసైన్డ్ భూములకు ప్రస్తుతం 11 లక్షల ఎకరాలు మాత్రమే లెక్క తేలుతున్నాయని వివరించారు. ఇప్పటి వరకు 2.77 కోట్ల కులధ్రువీకరణ పత్రాలు జారీ చేశామని సత్యప్రసాద్ తెలిపారు.

జీఎస్‌డీపీలో ఏటా 15 శాతం వృద్ధితో 2047కి రూ.66 లక్షల తలసరి ఆదాయం

స్వర్ణాంధ్ర పీ-4 ఫౌండేషన్ వైస్ ఛైర్మన్ సి.కుటుంబరావు వెల్లడి



ఈనాడు, అమరావతి: జగన్ ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసం వల్ల 2019-24 మధ్య ఐదేళ్లలో రాష్ట్రం రూ.7 లక్షల కోట్ల జీఎస్‌డీపీని నష్టపోయిందని, ప్రభుత్వం రూ.72 వేల కోట్ల ఆదాయం కోల్పోయిందని స్వర్ణాంధ్ర పీ-4 ఫౌండేషన్ వైస్ ఛైర్మన్ సి.కుటుంబరావు తెలిపారు. ఈ 18 నెలల్లో చంద్రబాబు ప్రభుత్వం చేపట్టిన చర్యల వల్ల ఆర్థిక వ్యవస్థ మళ్లీ గాడినపడి, వేగంగా పురోగమిస్తోందని ఆయన మంగళవారం తెదేపా కేంద్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో తెలిపారు. "2014-19 మధ్య తెదేపా ప్రభుత్వ హయాంలో రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధి రేటు 13.21 శాతం కాగా, తెలంగాణ వృద్ధి రేటు 13.5 శాతంగా ఉంది. జగన్ హయాంలో 2019-24 మధ్య రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధి రేటు 9.1 శాతానికి పడిపోతే, తెలంగాణ 11 శాతం వృద్ధితో దూసుకెళ్లింది. ఫలితంగా తెలంగాణ తలసరి ఆదాయం రూ.3.87 లక్షలకు చేరగా, ఏపీ తలసరి ఆదాయం రూ.2.66 లక్షల దగ్గరే ఉండిపోయింది" అని ఆయన పేర్కొన్నారు. "తెదేపా ప్రభుత్వం రూపొందించిన స్వర్ణాంధ్ర విజన్- 2047 ప్రకారం 2047 నాటికి రాష్ట్ర జీఎస్‌డీపీ 18 రెట్లు పెరిగి రూ.292 లక్షల కోట్లకు, తలసరి ఆదాయం రూ.49 లక్షలకు చేరాల్సి ఉండగా, ఐదేళ్ల జగన్ దుర్మార్గ పాలన వల్ల ఆ కల నెరవేరే అవకాశం లేకుండా పోయింది'' అని తెలిపారు.

◆ కూటమి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం ప్రకారం ఏటా జీఎస్‌డీపీలో 15 శాతం వృద్ధి రేటు సాధిస్తే 2047-48కి తలసరి ఆదాయం రూ.66 లక్షలకు చేరుతుందని కుటుంబరావు తెలిపారు. కొవిడ్ వంటి ఊహించని పరిస్థితులు తలెత్తి ఆర్థిక వ్యవస్థ మందగించినా... 10.3 శాతం వృద్ధి రేటు కచ్చితంగా ఉంటుందని, తలసరి ఆదాయం కనీసం రూ.25 లక్షలకు చేరడం ఖాయమని తెలిపారు. కేంద్ర గణాంక, కార్యక్రమాల అమలు శాఖ నివేదిక ప్రకారం.. దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో తమిళనాడు తర్వాత ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉందని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయరంగంలో 34-35 శాతం వృద్ధి సాధించాలని లక్ష్యం పెట్టుకోగా, దానిలో 65 శాతం ఇప్పటికే చేరుకున్నామని చెప్పారు.

రద్దీ నేపథ్యంలో ప్రత్యేక రైళ్లు: ద.మ.రైల్వే

ఈనాడు, హైదరాబాద్: క్రిస్మస్‌తోపాటు నూతన సంవత్సరం సందర్భంగా ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో ప్రత్యేక రైళ్లు నడిపించనున్నట్లు ద.మ.రైల్వే తెలిపింది. చర్లపల్లి నుంచి కాకినాడకు డిసెంబరు 24 నుంచి 30 వరకు బుధ, మంగళవారాల్లో రాత్రి 7.30 గంటలకు బయల్దేరే ప్రత్యేక రైలు (నం.07196) మరుసటిరోజు ఉదయం 9 గంటలకు గమ్యస్థానం చేరుకుంటుంది. కాకినాడ నుంచి చర్లపల్లికి డిసెంబరు 28 నుంచి 31 వరకు ఆది, బుధవారాల్లో రాత్రి 7.50కి బయల్దేరే రైలు (నం.07195) మరుసటిరోజు ఉదయం 8.30కి గమ్యం చేరుకుంటుంది. నల్గొండ, మిర్యాలగూడ, గుంటూరు, విజయవాడ మీదుగా ఈ రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. మరోవైపు ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో డిసెంబరు 16 నుంచి జనవరి 4వ తేదీ వరకు వీక్లీ ప్రత్యేక రైళ్లు నడిపించనున్నట్లు ద.మ.రైల్వే పేర్కొంది. ◆ తిరుపతి-చర్లపల్లి రైలు (నం.07000) డిసెంబరు 16-30 వరకు ప్రతి మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు బయల్దేరుతుంది. ◆ చర్లపల్లి-తిరుపతి రైలు (నం.07031) డిసెంబరు 19 నుంచి జనవరి 2 వరకు ప్రతి శుక్రవారం సాయంత్రం 3.35కి బయల్దేరుతుంది. ఈ రైలు నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, వినుకొండ, దొనకొండ, గిద్దలూరు, నంద్యాల, కడప మీదుగా రాకపోకలు సాగిస్తుంది.

◆ పంఢార్‌పూర్-తిరుపతి రైలు (నం.07032) డిసెంబరు 21 నుంచి జనవరి 4 వరకు ప్రతి ఆదివారం రాత్రి 8 గంటలకు బయల్దేరుతుంది.

సేవలెలా ఉన్నాయి గోవిందా?

- భక్తుల నుంచి అభిప్రాయాల సేకరణ

తిరుమల, న్యూస్‌టుడే: తితిదే సేవల నాణ్యతను మెరుగుపరచడానికి భక్తుల నుంచి అభిప్రాయ సేకరణ, సర్వేలను ప్రారంభించినట్లు తితిదే మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో భక్తులకు అందిస్తున్న సేవలపై ఎప్పటికప్పుడు అభిప్రాయాలు సేకరించి వాటిని మరింత మెరుగుపరిచేందుకు కృషిచేయాలన్న సీఎం చంద్రబాబు పిలుపు మేరకు ఈ చర్యలు చేపట్టినట్లు వెల్లడించింది. భక్తుల అభిప్రాయాలు, సూచనల ఆధారంగా సేవలను మరింత నాణ్యంగా అందించేందుకు తితిదే కృషిచేస్తుందని చెప్పింది.

◆ ఐవీఆర్ఎస్ సర్వే ద్వారా భక్తుల తిరుమల యాత్ర పూర్తి అనుభవం, అన్నప్రసాదం, కల్యాణకట్ట, శ్రీవారి ఆలయం, వసతి, లగేజి కౌంటర్, ప్రైవేటు హోటళ్ల ధరలపై 17 ప్రశ్నలు వేసి వివరాలు సేకరిస్తున్నారు.

◆ వాట్సప్ ద్వారా అభిప్రాయాలు సేకరించేందుకు భాగంగా తిరుమల, తిరుపతిలో పలు ప్రాంతాల్లో క్యూఆర్ కోడ్‌లు ఏర్పాటుచేశారు. మొబైల్‌తో వాటిని స్కాన్ చేసి లేదా వాట్సప్ నం. 93993 99399కు భక్తులు తమ దర్శన అనుభవాలు తెలియజేయవచ్చు. ఇందుకోసం టెక్స్ట్ లేదా వీడియో ఫార్మాట్ ఎంచుకోవాలి.

◆ తిరుమల, తిరుపతిలోని వివిధ ప్రాంతాల్లో శ్రీవారి సేవకులు ప్రత్యక్షంగా అభిప్రాయ సేకరణ చేస్తున్నారు. సేవకులు ప్రశ్నావళితో కూడిన పత్రాలు అందిస్తారు. అందులో భక్తులు తమ వ్యక్తిగత వివరాలు నమోదు చేసి అభిప్రాయాలు తెలియజేయవచ్చు.

◆ డయల్ యువర్ ఈవో ద్వారా ప్రతినెలా మొదటి శుక్రవారం నిర్వహించే కార్యక్రమం ద్వారా తితిదే ఈవో భక్తులతో మాట్లాడి సలహాలు, సూచనలు స్వీకరిస్తారు. ఇందుకోసం భక్తులు ఫోన్ నం.0877-2263261కు కాల్ చేయాలి. ఈ-మెయిల్ ద్వారానూ తితిదే ఉన్నతాధికారులకు అభిప్రాయాలు తెలియజేయవచ్చు.



భక్తుల అభిప్రాయాలు సేకరిస్తున్న శ్రీవారి సేవకురాలు

గోరంట్ల మాధవ్‌కు పోక్సో కోర్టు సమన్లు

18న విచారణకు హాజరుకావాలని ఆదేశం

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: పోక్సో కేసులో బాధితురాలి పేరు బయటపెట్టారంటూ విజయవాడ సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో వైకాపా మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ విచారణకు హాజరుకావాలని విజయవాడ పోక్సో న్యాయస్థానం మంగళవారం సమన్లు జారీచేసింది. విలేకరుల సమావేశంలో అత్యాచార బాధితురాలి పేరు చెప్పారంటూ మహిళా కమిషన్ మాజీ ఛైర్మన్ వాసిరెడ్డి పద్మ విజయవాడ సీపీని కలిసి ఫిర్యాదుచేశారు. దీనిపై విజయవాడ సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా ఈ కేసు పోక్సో కోర్టులో విచారణకు రాగా.. ఈ నెల 18న హాజరుకావాలంటూ పోక్సో కోర్టు న్యాయమూర్తి భవాని మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

రూ.133 కోట్లు నీళ్లపాలు!

- 'వైఎస్సార్ జలకళ'లో వైకాపా ప్రభుత్వ నిర్వాకం
- 13,332 బోర్లకు మోటార్లే బిగించలేదు
- 'కూటమి' పరిశీలనలో వెలుగులోకి

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో వైఎస్సార్ జలకళ పథకంలో రూ.133.32 కోట్లు వృథా అయ్యాయి. ఈ పథకంలో భాగంగా తీయించిన బోర్లకు మోటార్లు బిగించకపోవడంతో చాలాచోట్ల అవి నిరుపయోగమయ్యాయి. కొన్నిచోట్ల పూడిపోతున్నాయి. కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పథకం పరిస్థితిని పరిశీలించగా ఇలాంటి అనేక లోపాలు వెలుగుచూశాయి. పథకం కింద 4 లక్షల వ్యవసాయ బోర్లు తీయించడంతోపాటు ఐదెకరాల్లోపు రైతులకు మోటార్లూ ఉచితంగా బిగిస్తామని గత ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించి చివరకు తుస్సుమనిపించింది. తీయించిన కొద్దిపాటి బోర్లతో రైతులకు ప్రయోజనం లేకపోగా.. నిధులు మంచినీళ్లప్రాయంగా ఖర్చయ్యాయి.



విద్యుత్తు సౌకర్యం లేక కోనసీమ జిల్లా కొత్తపేటలో రైతు వెంకట్రామయ్య పొలంలో నిరుపయోగంగా మారిన బోరు

రాష్ట్రవ్యాప్తంగా గత ప్రభుత్వంలో 24,400 బోర్లు తీయించారు. ఒక్కో బోరుపై రూ.లక్ష వరకు ఖర్చుచేశారు. బోర్లు తీయించుకున్న రైతుల్లో 16 వేల మందికి 2.5-5 ఎకరాల భూమి ఉన్నట్లు గుర్తించారు. వీరికి నిబంధనల ప్రకారం విద్యుత్తు సౌకర్యం కల్పించి, ఉచితంగా మోటారు సమకూర్చాలి. కానీ, 2,668 బోర్లకే మోటార్లు బిగించారు. మిగిలిన 13,323 బోర్లకు కేటాయించలేదు. దీంతో ఒక్కో బోరు తవ్వకానికి రూ.లక్ష చొప్పున ఖర్చుచేసిన మొత్తం రూ.133.32 కోట్లు బూడిదలో పోసినట్లైంది. ఉమ్మడి తూర్పుగోదావరి, చిత్తూరు, గుంటూరు, శ్రీకాకుళం, విశాఖపట్నం, ప్రకాశం తదితర జిల్లాల్లో బోర్లు పూడిపోతున్నాయి. పశ్చిమగోదావరి, కృష్ణా, నెల్లూరు జిల్లాల్లో రైతుల పొలాల్లో అలంకారప్రాయంగా మిగిలాయి.

రూ.42 కోట్ల బిల్లులు పెండింగ్

పథకం ద్వారా రైతులకు ప్రయోజనం లేకపోగా... రూ.42 కోట్ల బిల్లులు గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింది. బోర్లు తవ్విన కంపెనీలకు రూ.40 కోట్లు, మోటార్లు సరఫరా చేసిన సంస్థకు రూ.2 కోట్లు చెల్లించాలి. వీటికోసం ఆయా సంస్థలు కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాయి. వీరి తరఫున కొందరు ఎమ్మెల్యేలూ పైరవీలు చేస్తున్నారు.

◆ గ్రామాల్లో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ప్రైవేటు ఆపరేటర్లు బోర్లు వేసి, వెంటనే మోటార్లు అమర్చుతారు. గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో ఏళ్లుగా ఈ విధానం అమలులో ఉంది. వ్యవసాయ బోర్లలోనూ ఇదే పద్ధతి అమలు చేస్తుంటారు. వైకాపా ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా వ్యవహరించింది. ముందుగా ప్రైవేటు ఆపరేటర్లతో బోర్లు వేయించి, ఎన్నికలకు ముందు మోటార్ల కాంట్రాక్టును అస్మదీయ సంస్థలకు అప్పగించింది. ఆ సంస్థలు సకాలంలో మోటార్లు సరఫరా చేయలేదు.

పుదుచ్చేరికి రాష్ట్ర హోదా.. కేంద్రానికి పట్టదా?

- టీవీకే అధ్యక్షుడు విజయ్ ధ్వజం



అభివాదం చేస్తున్న విజయ్

చెన్నై (ఆర్కేనగర్), న్యూస్‌టుడే: పుదుచ్చేరికి ఇప్పటివరకు కేంద్రప్రభుత్వం రాష్ట్ర హోదా ఇవ్వలేదని టీవీకే అధ్యక్షుడు విజయ్ మండిపడ్డారు. పుదుచ్చేరిలోని ఉప్పలం మైదానంలో మంగళవారం నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. "పుదుచ్చేరిలోని ఎన్నార్ కాంగ్రెస్ భాజపాతో కూటమిలో ఉన్నా ఈ ప్రాంతాన్ని కేంద్రం పట్టించుకోవట్లేదు. రాష్ట్రహోదా కావాలనే డిమాండ్‌ను అంగీకరించకపోవడంతో పాటు.. అభివృద్ధికీ సహకరించట్లేదు. పుదుచ్చేరికి రాష్ట్ర హోదా కావాలని డిమాండ్ చేస్తు శాసనసభలో 16 సార్లు తీర్మానాలు ఆమోదించి దిల్లీకి పంపినా ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదు. పుదుచ్చేరి, కరైకల్‌లలో మూతపడిన ఐదు మిల్లులు, పరిశ్రమలను తెరిపించకపోవడంతో ఇక్కడి యువతకు ఉద్యోగావకాశాలు దక్కట్లేదు. ఇక్కడ కనీసం ఒక ఐటీ పరిశ్రమ పెట్టాలనే ఆలోచన కూడా చేయడం లేదు. 20 లక్షల జనాభా ఉన్న పుదుచ్చేరిని ఆర్థికసంఘం పరిధిలో చేర్చలేదు. పర్యాటక ప్రాంతమైన పుదుచ్చేరిలో మరుగుదొడ్లు, పార్కింగ్ సౌకర్యం లాంటివి సరిగా లేవు. ఇక్కడ ఒక మంత్రిని అవినీతి ఆరోపణలతో తొలగించి, వేరే మంత్రిని నియమించి 200 రోజులైనా, ఆయనకు ఇంకా శాఖ అప్పగించలేదు. పుదుచ్చేరి ప్రజలు డీఎంకేని నమ్మొద్దు.. నమ్మించి మోసం చేయడమే వాళ్ల పని. కేంద్రానికి మాత్రమే పుదుచ్చేరి, తమిళనాడు వేర్వేరు. మేమంతా కలిసే ఉన్నాం. సీఎం రంగసామి ప్రభుత్వం డీఎంకే ప్రభుత్వం లాంటిది కాదు. ప్రతిపక్ష పార్టీలతోనూ నిష్పక్షపాతంగా వ్యవహరిస్తుంది'' అని పేర్కొన్నారు.

హ్యాండ్‌గన్ కలకలం

విజయ్ సభా ప్రాంగణంలోకి ఒక వ్యక్తి హ్యాండ్‌గన్‌తో ప్రవేశించడానికి ప్రయత్నించడం కలకలం రేపింది. శివగంగ జిల్లాకు చెందిన ఆ వ్యక్తి తాను వ్యక్తిగత భద్రతాధికారినని చెప్పుకోవడంతో పాటు, తన గన్‌కు లైసెన్సు కూడా ఉందన్నాడు. అయితే, ప్రాంగణంలోకి వచ్చేవారందరినీ పోలీసులు నిశితంగా తనిఖీ చేయడంతో అతడు లోపలకు రాలేకపోయాడు.

మాకు భారత పౌరసత్వం అందించండి

ప్రధానికి 50 వేల లేఖలు పంపిన శ్రీలంక తమిళులు

చెన్నై, న్యూస్‌టుడే: తమకు భారత దేశ పౌరసత్వాన్ని అందించాలని కోరుతూ తమిళనాడులోని శ్రీలంక తమిళులు ప్రధాని నరేంద్ర మోదీకి 50 వేల లేఖలు పంపారు. 2015 జనవరి 9కి ముందు తగిన పత్రాలు లేకుండా భారత్‌లోకి ప్రవేశించి, ప్రభుత్వం వద్ద నమోదు చేసుకుని చట్టపరంగా నివసిస్తున్న వారికి ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారిన్ యాక్ట్ కింద అక్రమ వలసదారులకు విధించాల్సిన శిక్ష నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు సెప్టెంబరు 2న కేంద్రం ప్రకటించింది. ఈ నిర్ణయానికి కృతజ్ఞతలు తెలుపుతూ తిరుచ్చి, నామక్కల్, రామనాథపురం, మండపం తదితర ప్రాంతాల్లోని శరణార్థుల శిబిరాల్లో ఉంటున్న సుమారు 50 వేల మంది శ్రీలంక తమిళులు ఏకకాలంలో ప్రధాని మోదీకి తపాలా ద్వారా లేఖలు పంపారు. వాటిల్లో.. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వసుధైక కుటుంబ భావనను ప్రతిబింబిస్తోందని, తాము చట్టపరమైన పౌరసత్వం పొందడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని విన్నవించారు.



ప్రధానికి పంపే లేఖలను తపాలా పెట్టెలో వేస్తున్న శ్రీలంక తమిళులు

గోవా వ్యాపారి బాలాజీకే అధిక చెల్లింపులు

- నకిలీ మద్యం తయారీకి స్పిరిట్ సరఫరాదారు అతనే
- ప్రధాన నిందితుల ఖాతాల్లో భారీగా లావాదేవీలు
- సిట్, ఎక్సైజ్ అధికారుల పరిశీలనలో వెలుగులోకి

ఈనాడు, అమరావతి: ఇబ్రహీంపట్నం, ములకలచెరువులో వెలుగు చూసిన నకిలీ మద్యం వ్యవహారంలో.. సహ నిందితుల మధ్య పెద్దఎత్తున నగదు లావాదేవీలు జరిగినట్లు తేలింది. ఒకరి నుంచి మరొకరికి బ్యాంకు ఖాతాలు, యూపీఐ ఐడీల ద్వారా సొమ్ము బదిలీ అయినట్లు సిట్, ఎక్సైజ్ అధికారులు దర్యాప్తులో గుర్తించారు. నిందితులకు సంబంధించిన కొన్నేళ్ల బ్యాంకు స్టేట్‌మెంట్లను అధికారులు వడపోశారు. నకిలీ మద్యం తయారీకి ముడిసరకు, ఇతర వస్తువుల కోసం వీరు అధిక మొత్తం వెచ్చించినట్లు వెల్లడైంది. గోవాలో పరిచయమైన బాలాజీ ద్వారా రెక్టిఫైడ్ స్పిరిట్‌ను అద్దేపల్లి జనార్దన్‌రావు (ఏ-1) కొనుగోలు చేశాడు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం, అన్నమయ్య జిల్లాలోని నకిలీ మద్యం తయారీ కేంద్రాలకు బాలాజీ స్వయంగా వచ్చి.. స్పిరిట్, నీటిని 1:1/4 నిష్పత్తిలో కలిపేవాడు. తొలుత 2023 మార్చిలో ఇబ్రహీంపట్నంలో 1,200 లీటర్ల మేర నకిలీ మద్యం తయారు చేశాడు. సీసాల్లోకి నింపి కేరళ మాల్ట్ విస్కీ, మంజీరా విస్కీ, ఓల్డ్ అడ్మిరల్ బ్రాందీ, రాయల్ ల్యాన్సర్, ట్రాపికానా, ఆంధ్రా గోల్డ్, క్లాసిక్ బ్లూ విస్కీ వంటి బ్రాండ్ల పేర్లతో లేబుళ్లు అతికించి, విక్రయాలు సాగించాడు. లీటరుకు రూ.350-450 చొప్పున బాలాజీ తీసుకున్నాడు. అడ్వాన్స్ కింద జనార్దన్‌రావు రూ.20 లక్షలు చెల్లించాడు. బాలాజీతో పాటు అతని కుమారుడు సుదర్శన్‌కు దాదాపు రూ.2.50 కోట్ల వరకు ముట్టింది. ఈ మొత్తాన్ని పలుమార్లు ములకలచెరువులో అందజేశారు.

అద్దేపల్లి సోదరులకు చెందిన ఏఎన్ఆర్ బార్ అండ్ రెస్టారెంట్ ఖాతా నుంచి పెద్ద మొత్తంలో నగదు బదిలీలు జరిగాయి. 2019 నుంచి 2025 అక్టోబరు వరకు ఏఎన్ఆర్ బార్‌కు చెందిన యూనియన్ బ్యాంకు ఖాతా నుంచి జనార్దన్‌రావుకు రూ.31 లక్షలు, జగన్మోహన్‌రావుకు రూ.80 లక్షలు బదిలీ అయ్యాయి. గతేడాది జనవరి నుంచి 2025 సెప్టెంబరు వరకు రవికి రూ.9.50 లక్షలు, 2024 అక్టోబరు నుంచి 2025 సెప్టెంబరు వరకు కల్యాణ్ (ఏ12)కు రూ.6.50 లక్షలు ట్రాన్స్‌ఫర్ అయ్యాయి. కల్యాణ్ ఖాతాలో రూ.1.24 కోట్ల మేర లావాదేవీలను సిట్ అధికారులు గుర్తించారు.

లేబుళ్లు, మూతల సరఫరాకు..

లేబుళ్ల డిజైన్, ముద్రణకు నకిరికంటి రవి(ఏ4) ద్వారా హైదరాబాద్‌లోని పలువురికి రూ.20 లక్షల వరకు అద్దేపల్లి సోదరులు చెల్లించారు. ఎక్కువగా యూపీఐ ద్వారా సొమ్ము బదిలీ చేశారు. కోయంబత్తూరుకు చెందిన వ్యాపారి ఓల్డ్ అడ్మిరల్ బ్రాందీ సీసాలు తయారుచేసి పంపినందుకు అతనికి ఒక్కో సీసాపై రూ.4.50 చొప్పున చెల్లించారు. కొన్ని సీసాలను సూరంపల్లిలో శ్రీనివాస్‌రెడ్డికి చెందిన పరిశ్రమలో తయారుచేశారు. వీటికి కూడా రెట్టింపు ధరను జగన్మోహన్‌రావు చెల్లించాడు. మూతల సరఫరా విషయంలోనూ ఇదేవిధంగా అధిక ధర ఇచ్చాడు. వీటిని సరఫరా చేసిన మనోజ్‌కుమార్ జైన్‌కు ఒక్కో మూతకు రూ.1.50 చొప్పున చెల్లించాడు. దారబోయిన ప్రసాద్‌కు సాధారణ రేట్ల కంటే ఎక్కువ మొత్తమే చెల్లించినట్లు లావాదేవీల ఆధారంగా గుర్తించారు.

బెదిరింపు సందేశాలు ఎవరివి?

అద్దేపల్లి సోదరుల అరెస్టు తర్వాత, అక్టోబరు 15న ఇబ్రహీంపట్నంలోని వారి ఇంటిని ఎక్సైజ్ అధికారులు తనిఖీ చేశారు. వారికి కప్‌బోర్డులో దొరికిన ఓ కవర్‌లో మూడు ప్రింటెడ్, ఓ చేతి రాత ఉన్న కాగితం కనిపించింది. కాగితంలో అద్దేపల్లి జనార్దన్‌రావు కుటుంబ సభ్యులను ఉద్దేశించి బెదిరింపు సందేశం ఉంది. జనార్దన్‌రావును రక్షించుకోవాలంటే క్రిప్టో కరెన్సీని జమ చేయాలని రాసి ఉంది. ప్రింటెడ్ షీట్‌లో బిట్ కాయిన్ అడ్రస్ ఉంది. మరో కాగితంలో క్యూఆర్ కోడ్ ముద్రించి ఉంది. వీటి గురించి నిందితుడి కుటుంబ సభ్యులను విచారించగా, అంతకు మూడు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తి అందజేసి వెళ్లాడని చెప్పారు. ఈ కవర్ ఎవరి నుంచి వచ్చింది? ఎందుకు పంపించారు? అన్నది తేలాల్సి ఉంది.

అతి చిన్న సారెకు గిన్నిస్ రికార్డు



యంత్రాన్ని తయారుచేస్తున్న తిరుమలనీడి సాయి

అతి చిన్న కుమ్మరి సారెను తయారు చేసి గిన్నిస్ రికార్డు సాధించారు...కాకినాడ జిల్లా తుని పట్టణానికి చెందిన తిరుమలనీడి సాయి. అతిచిన్న మోటారుతో నడిచే ఈ చక్రం (67 మి.మీ. పొడవు, 50 మి.మీ. వెడల్పు, 47 మి.మీ. ఎత్తు) బరువు 91 గ్రాములే. ప్లాస్టిక్ షీటు, డీసీ మోటారు, ఇనుప చక్రం, చిన్న బ్యాటరీతో గంటలో దీన్ని సిద్ధం చేశారు. దీంతో ఓ చిట్టి కుండనూ తయారుచేశారు. ఆ వీడియోను జూన్ 10న గిన్నిస్ నిర్వాహకులకు పంపగా.. పలు పరిశీలనల తర్వాత ఆయన ప్రయత్నం రికార్డులోకెక్కిందని మంగళవారం ధ్రువపత్రం పంపించారు. సాయి 2023లో 33 గ్రాముల అతి చిన్న వాషింగ్ మెషిన్ చేసి గిన్నిస్ రికార్డులోకి ఎక్కారు.

– న్యూస్‌టుడే, తుని పట్టణం



యంత్రంపై బంకమట్టితో అతిచిన్న కుండను తయారుచేస్తూ..

ప్రతి జిల్లాలో మాక్ అసెంబ్లీ!

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : నేటి విద్యార్థులే దేశ భవిష్యత్తుకు పునాదులని, వారి నడవడికను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు గమనించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ప్రభుత్వంతో చర్చించి రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఒక మాక్ అసెంబ్లీ నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో ఈ నెల 11 వరకు నిర్వహించే అమరావతి బాలోత్సవం- పిల్లల పండగ మంగళవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ మంచి గాలి కోసం, మంచి జీవితం కోసం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అనే నినాదంతో ఈ ఏడాది అమరావతి బాలోత్సవం.. 8వ పిల్లల పండగ నిర్వహించడం శుభ పరిణామమని తెలిపారు. పిల్లల ఆకాంక్షలకు ఆంక్షలు విధిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో చిన్నారుల్లో సృజనాత్మకత, వ్యక్తిత్వ వికాసానికి, విద్యా ప్రగతికి, ప్రతిభా పాటవాలు వెలికి తీసేందుకు, నైతికత పెంపొందించేందుకు బాలోత్సవాలు దోహద పడతాయని తెలిపారు. పిల్లల్లోని ఆసక్తిని తల్లిదండ్రులు గుర్తించి ప్రోత్సహించాలని కోరారు. కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ తెలుగు జాతి ముద్దుబిడ్డలైన బాలలను ప్రపంచం గర్వించదగ్గ విధంగా తీర్చిదిద్దాలని కోరారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ అధికారి సూర్యప్రకాశ్ మాట్లాడుతూ విద్యార్థులకు తల్లిదండ్రులు మార్గదర్శకంగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో అమరావతి బాలోత్సవం ప్రతినిధులు ఎస్పీ రామరాజు, మురళీకృష్ణ, నాగళ్ల విద్యాకన్నా, కె.యతిరాజు నాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్

మహిళలకు నెలసరి సెలవుపై కర్ణాటక హైకోర్టు స్టే

ఈనాడు, బెంగళూరు: ప్రతి నెలా రుతుస్రావం సమయంలో మహిళలకు వేతనంతో కూడిన ఒక సెలవు ఇవ్వాలని కర్ణాటక ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలపై హైకోర్టు స్టే విధించింది. బెంగళూరు హోటళ్ల సమాఖ్య, అవిరత కనెక్టివిటీ సిస్టమ్స్ సంస్థ వేసిన పిటిషన్లపై విచారణ చేపట్టిన హైకోర్టు మంగళవారం మధ్యంతర స్టే విధించింది. 'రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల్లో స్పష్టత లేదు. పైగా రాష్ట్ర ప్రభుత్వమే అమలు చేస్తున్న చట్టాల ప్రకారం కార్మికులు, వారి కుటుంబ సభ్యుల భద్రతకు సంబంధించిన విధానాలు పాటిస్తున్నాం. సర్కారు ఆదేశించిన ఒక్క రోజు సెలవును మహిళలు సద్వినియోగం చేసుకునే అవకాశం పాత చట్టాల్లో ఉంది' అని పిటిషనర్లు వాదించారు. వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ జ్యోతి పిటిషనర్ల వాదనలు కనీసం పరిగణించకుండానే సర్కారు ఆదేశాలు జారీ చేసినట్లుందని అభిప్రాయపడ్డారు. నేడు (బుధవారం) చేపట్టే విచారణలో ప్రభుత్వ వివరణకు అవకాశం కల్పించారు.

తిరుపతిలో విద్యార్థినిపై లైంగిక దాడి కేసు..

ఇద్దరు ఆచార్యుల అరెస్టు

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన ఆచార్యుడు.. అతడికి సహకరించిన మరో ఆచార్యుడిని పోలీసులు అరెస్టు చేశారు. తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం ఆ వివరాలు వెల్లడించారు. తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఒడిశా రాష్ట్రానికి చెందిన యువతి (27) బీఈడీ ప్రథమ సంవత్సరం చదువుతోంది. వర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.లక్ష్మణ్ కుమార్ తన ఉద్యోగం అడ్డుపెట్టుకుని విద్యార్థినిని ప్రలోభపెట్టారు. తన కార్యాలయ గదిలో లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను అదే విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.ఎ.శేఖర్‌రెడ్డి కార్యాలయ కిటికీ నుంచి తీశారు. అనంతరం వాటిని సామాజిక మాధ్యమాల్లో పెడతామంటూ విద్యార్థినిని శారీరకంగా, మానసికంగా వేధించారు. విద్యార్థిని వర్సిటీ అధికారులకు ఫిర్యాదు చేయగా అంతర్గత విచారణ కమిటీని నియమించి డా.లక్ష్మణ్‌కుమార్‌ను సస్పెండ్ చేశారు. అనంతరం వర్సిటీ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ రజనీకాంత్ శుక్లా ఫిర్యాదు చేయడంతో తిరుపతి పడమర పోలీసులు కేసు నమోదు చేశారు. డీఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలతో దర్యాప్తు జరిపారు. సీఐ మురళీమోహన్ ఆధ్వర్యంలోని బృందం బాధితురాలి స్వగ్రామానికి వెళ్లి ఆమె వాంగ్మూలాన్ని రికార్డు చేసింది. మంగళవారం నిందితులైన లక్ష్మణ్‌కుమార్, శేఖర్‌రెడ్డిలను అరెస్టు చేసింది.



లక్ష్మణ్‌కుమార్



శేఖర్‌రెడ్డి

సంస్కృత వర్సిటీలో ఘటనపై రాష్ట్ర మహిళా కమిషన్ సీరియస్

తిరుపతి ఎస్పీతో మాట్లాడి వివరాల సేకరణ

ఈనాడు, అమరావతి: తిరుపతి సంస్కృత వర్సిటీలో ఓ విద్యార్థినిపై ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు అఘాయిత్యానికి పాల్పడిన ఘటనపై రాష్ట్ర మహిళా కమిషన్ సీరియస్ అయింది. కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ మంగళవారం తిరుపతి జిల్లా ఎస్పీతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని ఆదేశించారు. బాధితురాలి ఫిర్యాదు, తదుపరి తీసుకున్న చర్యలు, వర్సిటీలో అంతర్గత ఫిర్యాదుల కమిటీపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నివేదిక అందించాలని కమిషన్ సభ్యురాలు రుకియాబేగంను శైలజ ఆదేశించారు.

సిమెంట్‌లో బూడిద..

- కల్తీ చేసి అమ్ముతున్న కస్తూరి సిమెంట్ యజమానిపై కేసు నమోదు

గోరంట్ల, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండల సరిహద్దున ఎవరికీ అంతుచిక్కని రీతిలో బూడిద కలిపిన సిమెంట్ విక్రయిస్తూ మోసాలకు పాల్పడుతున్న కస్తూరి సిమెంట్‌పై విజిలెన్స్ అధికారుల బృందం ఫిర్యాదుతో పలురకాల కేసులు నమోదు చేశారు. విజిలెన్స్ శాఖ జిల్లా అధికారి ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం కస్తూరి సిమెంట్‌పై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా విస్తుపోయే విషయాలను గుర్తించారు. ఆ వివరాలను మంగళవారం అధికారులు వెల్లడించారు. కస్తూరి సిమెంట్‌కు పీపీసీ (పోర్ట్‌ల్యాండ్ పొజోలానా సిమెంట్) విక్రయాలకు జీఎస్టీ రిజిస్ట్రేషన్ ఉంది. అయితే అందులో మోతాదుకు మించి బూడిద(ఫ్లైయాష్)ను కలపడంతో పాటు నకిలీ అల్ట్రాటెక్ కంపెనీ సంచుల్లో నింపి కర్ణాటకకు తరలించి విక్రయాలు చేస్తున్నట్లు తనిఖీల్లో గుర్తించారు. ఈ క్రమంలో తరలించడానికి లారీలో సిద్ధం చేసిన సిమెంట్ బస్తాలను తనిఖీ చేయగా అవి నకిలీగా తేలాయి. దీంతో కస్తూరి సిమెంట్ యజమాని మహేష్‌పై క్రిమినల్ కేసు నమోదు చేశారు. లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు ఏడు కేసులు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. నిబంధనలు అతిక్రమించడంపై యాజమాన్యంపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు కమర్షియల్ ట్యాక్స్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు శాఖల అధికారులు పేర్కొన్నారు. వీటన్నింటికీ మించి నకిలీ సిమెంట్ విక్రయాలతో ప్రభుత్వాలకు రూ.కోట్లలో పన్ను కట్టకుండా మోసం చేసిందని వివరించారు.



నకిలీ సిమెంటు బస్తాలను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారుల బృందం

నేడు ఓబుళాపురానికి సుప్రీంకోర్టు కమిటీ రాక

ఈనాడు, అమరావతి: ఏపీ, కర్ణాటక సరిహద్దులోని ఓబుళాపురం మైనింగ్ కంపెనీకి చెందిన లీజులతోపాటు, అక్కడున్న మొత్తం ఆరు లీజుల హద్దులు, రక్షిత అటవీ ప్రాంతం హద్దులను ఖరారు చేసేందుకు సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన కమిటీ.. బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించనుంది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుధాంశు ధులియా ఛైర్మన్‌గా, మరికొందరు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులను సభ్యులుగాను, రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి తరఫున సర్వే సెటిల్‌మెంట్స్ అండ్ ల్యాండ్ రికార్డ్స్‌శాఖ డైరెక్టర్‌ను ఈ కమిటీకి కన్వీనర్/కార్యదర్శిగా గతంలో నియమించారు. ఇప్పటికే సర్వే ల్యాండ్ రికార్డ్స్, అటవీ, గనులశాఖ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో లీజుల హద్దులను గుర్తించారు. బుధవారం కమిటీ ఛైర్మన్ సహా, సభ్యులంతా లీజుల హద్దులను పరిశీలించనున్నారు. తర్వాత బళ్లారిలో సమావేశం నిర్వహిస్తారు. తుది నివేదికను కమిటీ ఈ నెల 19లోపు సుప్రీంకోర్టుకు అందజేయనుంది.

EENADU Vol: 52, Issue: 120 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

ఈనాడు బిజినెస్

ఖాతాదారులకు రుణరేట్లు తగ్గించండి

బ్యాంకులను కోరిన ఆర్‌బీఐ గవర్నర్

ముంబయి: ప్రభుత్వ రంగ బ్యాంకులు, కొన్ని ప్రైవేట్ రంగ బ్యాంకుల ఎండీ, సీఈఓలతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా మంగళవారం సమావేశమయ్యారు. స్థిరమైన వృద్ధికి తోడ్పాటు ఇచ్చేందుకు రేట్ల కోత ప్రయోజనాలను ఖాతాదారులకు బదిలీ చేయాల్సిందిగా ఆయన కోరారు. 2025 ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకు ఆర్‌బీఐ కీలక రెపో రేటును 125 బేసిస్ పాయింట్ల మేర తగ్గించింది. ఈ ప్రయోజనాన్ని బ్యాంకులు తమ ఖాతాదార్లకు బదిలీ చేయాలని గవర్నర్ సూచించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధం (ఏప్రిల్-సెప్టెంబరు)లో దేశ వృద్ధిరేటు 8 శాతంగా నమోదైందని గుర్తు చేశారు.

కార్వీ మదుపర్లకు మార్చి వరకు అవకాశం

కార్వీ స్టాక్ బ్రోకింగ్ లిమిటెడ్ (కేఎస్‌బీఎల్) మదుపర్లు తమ క్లెయిమ్‌లు దాఖలు చేసేందుకు 2026 మార్చి వరకు సెబీ గడువు పొడిగించింది. ఇంతకు ముందు ఈ గడువు 2025 డిసెంబరు 31గా ఉంది. తమ ఖాతాదార్ల నిధులు దుర్వినియోగం చేసి, చెల్లించలేకపోయినందున కేఎస్‌బీఎల్ డిఫాల్ట్ అయినట్లు 2020 నవంబరు 23న ఎన్‌ఎస్‌ఈ ప్రకటించింది. సహాయం కోసం మదుపర్లు ఎన్‌ఎస్‌ఈ టోల్‌ఫ్రీ నంబరు 1800 266 0050 (ఐవీఆర్ ఆప్షన్ 5)లో కాల్ చేయొచ్చు. లేదా defaultisc@nse.co.in కు మెయిల్ చేయొచ్చు.

సెబీతో కేసు పరిష్కరించుకున్న బ్రైట్‌కామ్ మాజీ అధికారులు

నిబంధనల ఉల్లంఘన వ్యవహారంలో మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి రూ.12.35 లక్షల చొప్పున చెల్లించి బ్రైట్‌కామ్ గ్రూపు లిమిటెడ్ (బీజీఎల్)కు చెందిన ఇద్దరు మాజీ అధికారులు కేసు పరిష్కరించుకున్నారు. సెటిల్‌మెంట్ షరతుల్లో భాగంగా బీజీఎల్ లేదా ఆ గ్రూపు కంపెనీలకు ఒక సంవత్సరం పాటు దూరంగా ఉండేందుకు అప్పట్లో బీజీఎల్‌కు కాంప్లియెన్స్ అధికారిగా ఉన్న ఎం.మనోహర్ అంగీకరించారు. నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరుగా బాధ్యతలు నిర్వహించిన విజయ భాస్కర్ రెడ్డి కూడా రెండేళ్ల పాటు కంపెనీకి దూరంగా ఉండేందుకు అంగీకరించారు. హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగించే బీజీఎల్ కంపెనీ వ్యవహారాలను తనిఖీ చేసిన సెబీ, 2024 సెప్టెంబరులో షోకాజ్ జారీ చేసిన సంగతి విదితమే..

అనిల్ అంబానీ తనయుడిపై సీబీఐ కేసు

దిల్లీ: అనిల్ ధీరూభాయ్ అంబానీ (ఏడీఏ) గ్రూపు కంపెనీలైన రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ (ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్), రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌సీఎఫ్‌ఎల్)పై రెండు వేర్వేరు బ్యాంకు మోసం కేసులను కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) నమోదు చేసింది. ఒక కేసులో అనిల్ అంబానీ తనయుడు జై అన్మోల్ అంబానీ పేరునూ చేర్చింది. ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్, ఆర్‌సీఎఫ్‌ఎల్ కలిపి మొత్తంగా రూ.14,852 కోట్ల మేర రుణాలను ఎగ్గొట్టిన ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు నిర్వహిస్తున్న సంగతి విదితమే. తాజా కేసు నమోదు అనంతరం ముంబయిలోని కఫ్ పరేడ్‌లో ఉన్న అనిల్ అంబానీ నివాసం సీ విండ్ బిల్డింగ్ ఏడో అంతస్తులో సీబీఐ బృందాలు సోదాలు నిర్వహించాయి.

కోడి గుడ్డు

10న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్)
(100కు రూపాయలలో)

హైదరాబాద్	651
వరంగల్	653
విజయవాడ	670
తూ/ప గోదావరి	650
విశాఖపట్నం	640
చిత్తూరు	663

ఐపీఓల వర్షమే ఇక

● ఏటా రూ.1.80 లక్షల కోట్ల సమీకరణ !



భారత్‌లో ఇకపై ఏటా దాదాపు 20 బిలియన్ డాలర్ల (రూ.1.8 లక్షల కోట్ల) విలువైన పబ్లిక్ ఇష్యూలు వస్తాయని జేపీ మోర్గాన్ అంచనా వేస్తోంది. కొన్నేళ్ల పాటు ఐపీఓలు ఇదే తరహాలో సాగొచ్చని పేర్కొంది. 2025లో ఇప్పటికే 21 బి.డాలర్ల (రూ.1.89 లక్షల కోట్ల)కు పైగా ఇష్యూలు వచ్చాయని.. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎమ్‌సీ రూ.10,000 కోట్ల ఇష్యూ ఉన్నందున ఈ నెలాఖరుకు కంపెనీలు సమీకరిస్తున్న మొత్తం 23 బి.డాలర్ల (రూ.2.07 లక్షల కోట్ల)కు చేరే అవకాశం ఉందంటోంది. గతేడాది 21 బి.డాలర్ల విలువైన ఇష్యూలు వచ్చినట్లు గుర్తు చేసింది. 'ఏటా 20 బి.డాలర్ల ఐపీఓలు భారత్‌కు సర్వసాధారణం కానున్నాయి. ఈ స్థాయి.. ఇక్కడి నుంచి కొనసాగనుంద'ని జేపీ మోర్గాన్ ఈక్విటీ క్యాపిటల్ మార్కెట్స్ హెడ్ అభినవ్ భార్తి పేర్కొన్నారు.

10 లక్షల కోట్ల డాలర్లకు

వచ్చే అయిదేళ్లలో భారత మార్కెట్ విలువ 10 లక్షల కోట్ల డాలర్ల (రూ.900 లక్షల కోట్ల)కు చేరొచ్చు. అమెరికా, చైనా తర్వాత ఈ స్థాయికి చేరిన మూడో దేశంగా మారనుందని జేపీ మోర్గాన్ అంటోంది.

గిరాకీలో అయిదో వంతు వాటా వినియోగదారు టెక్నాలజీ, కొత్త తరం వ్యాపారాలకే ఉంటోంది. వచ్చే అయిదేళ్లలో ఇది 30 శాతానికి పైగా చేరొచ్చు. ప్రైవేటు మార్కెట్లో వందలకొద్దీ మిలియన్ డాలర్ల విలువ చేసే కనీసం 20 అంకురాలు ప్రస్తుతం ఐపీఓకు రావాలనుకుంటున్నాయి. 4-5 కంపెనీలు రూ.9000 కోట్ల ఇష్యూకు రానున్నాయి. అన్ని అంకురాలు కలిసి రూ.72,000 కోట్లు సమీకరించొచ్చని భార్తి అంటున్నారు.

65 బి.డాలర్ల ఇష్యూలు: మొత్తం మీద ఈక్విటీ క్యాపిటల్ మార్కెట్లో (సంస్థాగత ప్లేస్‌మెంట్లు, ఫాలో ఆన్ ఇష్యూలు కలిపి) 2025లో 65 బి.డాలర్ల (రూ.5.85 లక్షల కోట్ల) ఇష్యూలు నమోదుకానున్నాయి. ఏడాది కిందట ఇవి 72 బి.డాలర్లు (రూ.6.48 లక్షల కోట్లు)గా ఉన్నాయి. క్యూఐపీలు గతేడాది 22 బి.డాలర్ల ఇష్యూలతో రాగా, ఈ ఏడాది 10 బి.డాలర్ల ఇష్యూలే నమోదు చేశాయి.

స్టాక్ మార్కెట్లో సందడే సందడి

భారత స్టాక్ మార్కెట్లలో రాబోయే కొన్నేళ్ల పాటు సందడి నెలకొననుంది. ఓ వైపు కంపెనీలు కోట్ల కొద్దీ నిధుల సమీకరణ కోసం ఐపీఓల బాట పడుతుంటే.. మరో వైపు మ్యూచువల్ ఫండ్‌లోకి మదుపర్లు భారీ స్థాయిలో డబ్బులు కుమ్మరించనున్నారు.

ఫండ్‌లపై ఎంత ప్రేమో

● 2034-35 కల్లా రూ.300 లక్షల కోట్లకు మ్యూచువల్ ఫండ్‌ల ఏయూఎమ్!



మ్యూచువల్ ఫండ్ (ఎమ్‌ఎఫ్) సంస్థల నిర్వహణ లోని ఆస్తుల మొత్తం (ఏయూఎమ్) 2034-35 కల్లా రూ.300 లక్షల కోట్లకు చేరొచ్చని కన్సల్టింగ్ సంస్థ బెయిన్ అండ్ కంపెనీ, ఇన్వెస్ట్‌మెంట్ ప్లాట్‌ఫాం గ్రో తమ సంయుక్త నివేదిక 'హౌ ఇండియా ఇన్వెస్ట్స్'లో అంచనా వేశాయి. ఇందులో ఈక్విటీ హోల్డింగ్‌ల విలువే రూ.250 లక్షల కోట్లకుపైగా ఉండొచ్చని ఆ నివేదిక తెలిపింది. అందులోని ముఖ్యాంశాలు..

✦ రిటెయిల్ మదుపర్ల ఆసక్తి, డిజిటల్ సేవలను అందిపుచ్చుకోవడం వంటివి ఈ వృద్ధికి దోహదం చేయనున్నాయి. ఫండ్‌లలో పెట్టుబడులు పెట్టే భారతీయ కుటుంబాలు ప్రస్తుతం 10% కాగా, దశాబ్ద కాలంలో 20 శాతానికి చేరొచ్చని అంచనా వేసింది.

✦ ఒడుదొడుకుల ట్రేడింగ్ నుంచి దీర్ఘకాల పెట్టుబడులకు మారే ధోరణి కనిపిస్తుండడంతో, ఈక్విటీల్లోకి పెట్టుబడులు అధికంగా రావచ్చు. స్పెక్యులేషన్‌ను అరికట్టేందుకు సెబీ చేపడుతున్న చర్యలు ఇందుకు మద్దతిస్తాయి. ఎఫ్ అండ్ ఓలకు రిటెయిల్ మదుపర్లు దూరం జరగొచ్చు. 2021-22 నుంచి 2023-24 మధ్య ఎఫ్ అండ్ ఓలో 93% మంది వ్యక్తిగత ట్రేడర్లు నష్టపోయారని సెబీ ఇటీవల చెప్పింది.

✦ జెన్ జీ, మిలీనియల్స్ నుంచి 9 కోట్ల మంది రిటెయిల్ మదుపర్లు రావొచ్చు. తొలిసారిగా పెట్టుబడులు పెట్టేవారిలో ఎక్కువమంది, అగ్రగామి 30 నగరాలకు వెలుపల నుంచే ఉంటున్నారు.

✦ అయిదేళ్లకు పైగా ఫండ్‌లను కొనసాగించే వారి వాటా 7% నుంచి 16 శాతానికి, అయిదేళ్లకు పైగా క్రమానుగత పెట్టుబడుల ప్రణాళిక (సిప్)ను కొనసాగించే వారు 12% నుంచి 21 శాతానికి పెరిగారు.

✦ గత అయిదేళ్లలో ఫండ్ ఫోలియోలు 2.5 రెట్లు పెరిగినా, వ్యక్తుల పెట్టుబడులు 7 శాతమే పెరిగాయి. అంటే కొత్త మదుపర్లు చిన్న పాటి పెట్టుబడులతో ఎక్కువ సంఖ్యలో వచ్చారు.

✦ సిప్ పెట్టుబడులు గత దశాబ్దంలో 25% పెరిగాయి. ఎన్‌ఎస్‌ఈ వద్ద నమోదైన మదుపర్లలో 30 ఏళ్లలోపు వారి వాటా 40%. 2018-19లో వీరు 23 శాతంగా ఉన్నారు.

✦ అగ్రగామి 110 నగరాల వెలుపల నుంచి మొత్తం ఫండ్ ఏయూఎమ్‌లో 19% వచ్చాయి. 2018-19లో ఇది 10 శాతమే.

✦ మొత్తం మదుపర్ల సంఖ్యలో మహిళల వాటా 25 శాతంగా ఉంది. 80% ఈక్విటీ మదుపర్లు, 35% ఫండ్ మదుపర్లు డిజిటల్ పద్ధతిలోనే మార్కెట్లోకి ప్రవేశించారు.

రూ.1,000 కోట్లతో విస్తరణ

- డెంగీ, కేఎఫ్‌డీ టీకాలు అభివృద్ధి చేస్తున్నాం
- దక్షిణ అమెరికా మార్కెట్‌పై దృష్టి
- ఐఐఎల్ ఎండీ డాక్టర్ ఆనంద్ కుమార్



ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఇండియన్ ఇమ్యునలాజికల్స్ లిమిటెడ్ (ఐఐఎల్) తన పరిశోధన, ఉత్పత్తి కార్యకలాపాలను విస్తరించనుంది. దీంతో పాటు కొత్త మార్కెట్లలో అడుగుపెట్టే ప్రయత్నాలు చేస్తోంది. దక్షిణ అమెరికా దేశాలకు టీకాలు, ఔషధ ఉత్పత్తులు అందించేందుకు అవసరమైన రిజిస్ట్రేషన్ ప్రక్రియను మొదలు పెట్టినట్లు ఐఐఎల్ ఎండీ డాక్టర్ ఆనంద్ కుమార్ మంగళవారం ఇక్కడ 'ఈనాడు'కు వెల్లడించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ఎక్కువ సమయం పడుతుందన్నారు. మూడేళ్లలో ఈ దశను అధిగమించి, దక్షిణ అమెరికా దేశాల్లో అడుగుపెట్టాలనేది తమ లక్ష్యమని పేర్కొన్నారు.

ఐసీఎంఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్) మంజూరు చేసిన నిధులతో 2 కొత్త టీకాలు అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఇందులో ఒకటి డెంగీ టీకా కాగా, మరొకటి కేఎఫ్‌డీ వైరస్ టీకా. డెంగీ టీకాపై మొదటి దశ క్లినికల్ పరీక్షలు పూర్తి చేశామని, రెండో దశ పరీక్షలు త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. కేఎఫ్‌డీ వైరస్ కర్ణాటకలోని అటవీ ప్రాంతాలకు దగ్గరగా ఉండే ప్రజలకు ప్రాణాంతకంగా మారుతోందని, దీని వల్ల టిక్ బార్న్ హెమరేజిక్ ఫీవర్ వస్తుందని అన్నారు. దీన్ని అదుపు చేసే లక్ష్యంతో కేఎఫ్‌డీ టీకా ఆవిష్కరించే యత్నాల్లో ఉన్నామని.. దీనిపై మొదటి దశ క్లినికల్ పరీక్షలు త్వరలో ప్రారంభిస్తామన్నారు.

ఫార్మా, బయోటెక్ పరిశ్రమకు అవసరమైన మానవ వనరులకు హైదరాబాద్‌లో కొరత లేదని ఆనంద్ కుమార్ అభిప్రాయపడ్డారు. 'మనదేశంలో 8 టీకా కంపెనీలుండగా, అందులో 4 హైదరాబాద్‌లోనే ఉన్నాయి. కాబట్టి కొంతమంది ఉద్యోగులు అటూ, ఇటూ వెళ్లినా పెద్ద ఇబ్బంది ఏమీ ఉండదు, ఖాళీలు వెంటనే భర్తీ అవుతాయి' అని ఆయన వివరించారు.

హక్కుదార్లకు రూ.2,000 కోట్లు అందించాం

అన్‌క్లెయిమ్డ్ ఆర్థిక ఆస్తులపై ప్రభుత్వం

దిల్లీ: ఎప్పటినుంచో బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల్లో ఉండిపోయిన (అన్‌క్లెయిమ్డ్) రూ.2,000 కోట్ల విలువైన ఆర్థిక ఆస్తులను ఈ ఏడాది అక్టోబరు, నవంబరుల్లో అర్హులైన హక్కుదార్లకు అందించామని ప్రభుత్వం తెలిపింది. అనేక కారణాల వల్ల క్లెయిమ్ చేసుకోకుండా ఉన్న బ్యాంకు డిపాజిట్లు, బీమా, డివిడెండ్లు, షేర్లు, మ్యూచువల్ ఫండ్లు, పింఛన్ లాంటి ఆర్థిక ఆస్తులను సంబంధిత హక్కుదార్లకు, చట్టబద్ధ వారసులకు అందించాలనే లక్ష్యంతో 'యువర్ మనీ, యువర్ రైట్' కార్యక్రమాన్ని అక్టోబరు 4న దేశ వ్యాప్తంగా ప్రభుత్వం ప్రారంభించింది. ఇందులో భాగంగా ప్రజా ప్రతినిధులు, జిల్లా పాలనా అధికారులు, ఆర్థిక సేవల అధికారులతో అక్టోబరు నుంచి డిసెంబరు 5 వరకు 477 జిల్లాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి.. ప్రజలకు అవగాహన కల్పించినట్లు రాజ్యసభలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధ్రి తెలిపారు. ఆర్థిక సంస్థల్లో ఉండిపోయిన తమ ఆర్థిక ఆస్తులను పొందేందుకు అనుసరించాల్సిన విధి విధానాలను తెలిపి, సందేహాలను పరిష్కరించడంతో పాటు పలు అంశాలపై అవగాహన కల్పించే విషయాలను ప్రధాన ప్రాంతీయ భాషల్లోనే అందించామని వెల్లడించారు. తక్కువ సమయం నిడివితో వీడియో సందేశాల ద్వారా విస్తృతంగా ప్రచారం కల్పించామని మంత్రి తెలిపారు. ఆర్‌బీఐ, సెబీ, ఐఆర్‌డీఏఐ, పీఎఫ్‌ఆర్‌డీఏ, ఐఈపీఎఫ్‌ఏ లాంటి ఆర్థిక రంగ నియంత్రణ సంస్థలు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నాయని వివరించారు. ప్రజలు తమ అన్‌క్లెయిమ్డ్ ఆర్థిక ఆస్తులను కనుగొనడంలో ఆర్‌బీఐ 'ఉద్గమ్', ఐఆర్‌డీఏఐ 'బీమా భరోసా', సెబీ 'మిత్రా' సమర్థంగా ఉపయోగపడుతున్నాయని మంత్రి తెలిపారు.



✦ 2025 సెప్టెంబరు వరకు ప్రభుత్వ రంగ బ్యాంకుల నికర నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏలు) రూ.2,64,170 కోట్లు కాగా.. ప్రైవేట్ రంగ బ్యాంకులకు రూ.1,36,270 కోట్లుగా ఉన్నాయని మంత్రి తెలిపారు.

✦ 2024 అక్టోబరు నుంచి 2025 అక్టోబరు వరకు తరుణ్ ప్లస్ పథకం (రూ.10- 20 లక్షలు) కింద 75,105 రుణాలను అందించామని చెప్పారు.

✦ చిన్న సంస్థలకు రూ.20 లక్షల వరకు రుణం అందించే క్రెడిట్ గ్యారెంటీ ఫండ్‌కు సంబంధించి ఎగవేతల రేటు 2025 అక్టోబరు వరకు 6.88 శాతంగా ఉందన్నారు.

ఫోర్బ్స్ అండర్-30 అచీవర్స్‌లో అర్కిన్



దిల్లీ: ఫోర్బ్స్ అండర్-30 అచీవర్స్ జాబితాలో భారత సంతతికి చెందిన అర్కిన్ గుప్తా చోటు దక్కించుకున్నారు. 30 ఏళ్ల వయసులోపే ఆర్థిక రంగంలో విజయాలు సాధించిన వారితో ఈ జాబితాను ఫోర్బ్స్ రూపొందించింది. ఆర్థిక రంగంలో ఆవిష్కరణలు, ప్రారంభ స్థాయి పెట్టుబడుల వ్యూహాలకు గుప్తా కృషి చేశారని ఫోర్బ్స్ తెలిపింది. డేటా ఆధారిత పెట్టుబడుల మార్గాలను అభివృద్ధి చేయడం, ఆర్థిక ఉత్పత్తులను సృష్టించడంలో గుప్తా విశేషంగా రాణించారని, ఈ జాబితాలో ఆయన చోటు పొందడానికి ఇవే ముఖ్య కారణాలని ఫోర్బ్స్ వివరించింది. మెరుగైన ఆర్థిక ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావడంలో ప్రాముఖ్యతకు ఇది గుర్తింపని గుప్తా పేర్కొన్నారు. పారదర్శకతను పెంచే ఆర్థిక సొల్యూషన్లను అభివృద్ధి చేయడం కొనసాగించడంతో పాటు, తొలిసారి మదుపు చేసే వారికీ సాధికారత అందించడమే లక్ష్యమని తెలిపారు.

24 లక్షల ఇళ్లకు సౌర విద్యుత్తు

దిల్లీ: పీఎం సూర్యఘర్ పథకం కింద 23,96,497 ఇళ్లకు సౌర విద్యుత్తు సదుపాయం కల్పించినట్లు కేంద్ర కొత్త పునరుత్పాదక ఇంధన శాఖ సహాయ మంత్రి శ్రీపాద్ యెస్సో నాయక్ రాజ్యసభలో తెలిపారు. 2026-27 కల్లా కోటి ఇళ్ల పైకప్పులపై సౌర విద్యుత్తు వ్యవస్థలు అమర్చాలనేది ప్రభుత్వ లక్ష్యం కాగా, ఇప్పటివరకు 23.96% పూర్తిచేసినట్లు వివరించారు. ఈ పథకం కింద లబ్ధి పొందేందుకు నేషనల్ పోర్టల్ ద్వారా 53,54,099 దరఖాస్తులు అందాయని.. ఈ నెల 3 వరకు 23,96,497 ఇళ్లను కవర్ చేస్తూ 19,17,698 రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలను అమర్చినట్లు పేర్కొన్నారు. 2026-27 కల్లా కోటి ఇళ్లకు ఈ సదుపాయం కల్పించేందుకు రూ.75,021 కోట్లు కేటాయించినట్లు వివరించారు. దేశంలో ఈ నెల 2 నాటికి మొత్తం 7075.78 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రూఫ్‌టాప్ సౌర విద్యుత్తు వ్యవస్థలు అమర్చినట్లు తెలిపారు.

సంక్షిప్తంగా..

✦ ముందస్తు సమాచారంతో, మోసపూరిత లావాదేవీలు జరిపిన కేసులో మాజీ న్యూస్ యాంకర్ హేమంత్ ఘయ్ రూ.1.45 కోట్లు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి చెల్లించి సెటిల్‌మెంట్ చేసుకున్నారు.

✦ నొయిడాలో అయిదో విక్రయశాలను ప్రారంభించడం ద్వారా **యాపిల్** మన దేశంలో తన విస్తరణను వేగవంతం చేస్తోంది. గతంలో ముంబయి, దిల్లీ, బెంగళూరు, పుణెల్లో యాపిల్ తన స్టోర్లను తెరిచిన సంగతి తెలిసిందే.

5,300 విమానాల డెలివరీలో జాప్యం

మరో 8 ఏళ్లు ఈ ఇబ్బందులు తప్పవు: ఐటా



విమాన ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా, విమానయాన కంపెనీలు కొత్త విమానాలకు భారీగా ఆర్డర్లు ఇస్తున్నాయి. అయితే వీటి డెలివరీలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇప్పటివరకు చూస్తే, కనీసం 5,300 విమానాల డెలివరీలో జాప్యం నెలకొందని, విమానయాన సంస్థలకు ఖర్చులు కూడా అధికమవుతున్నాయని ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐటా) పేర్కొంది.

సరఫరా వ్యవస్థ ఇబ్బందులు మరో 8 ఏళ్ల పాటు కొనసాగొచ్చని అంచనా వేసింది. విమాన ఇంజిన్ తయారీ సంస్థలు భారీ లాభాలు ఆర్జిస్తున్నా, ప్రయాణికులకు సేవలందిస్తున్న విమానయాన సంస్థలు తక్కువ మార్జిన్‌లకే పరిమితం అవుతున్నాయని ఐటా డైరెక్టర్ జనరల్ విల్లీ వాల్ష్ పేర్కొన్నారు. సరఫరా వ్యవస్థ సమస్యలపై చట్టపరమైన చర్యలకు విమానయాన సంస్థలు ప్రయత్నిస్తున్నాయని వివరించారు. ప్రస్తుతం ఒక విమానయాన సంస్థ, కొత్త విమానం కోసం ఆర్డర్ చేస్తే.. అది అందుకోవడానికి సగటున 6.8 సంవత్సరాలు పడుతోందని, తయారీ సంస్థల వద్ద 17,000 కంటే ఎక్కువ విమాన ఆర్డర్లు పెండింగ్‌లో ఉన్నట్లు ఐటా వివరించింది. అంతర్జాతీయ విమాన రద్దీలో 80 శాతానికి పైగా వాటా కలిగిన 360 కంపెనీలకు ఐటా ప్రాతినిధ్యం వహిస్తోంది.

12 ఏళ్లకు సరిపడా తయారీ ఆర్డర్లు

'2025 చివర్లో కొత్త విమానాల డెలివరీలు పుంజుకున్నాయి. 2026లో విమానాల ఉత్పత్తి మరింత పెరిగే అవకాశం ఉంది. అయితే విమానాలు, ఇంజిన్లకు ఉన్న గిరాకీ కంటే, లభ్యత తక్కువగానే ఉండొచ్చ'ని ఐటా అంచనా వేసింది. విమానయాన సంస్థల అవసరాలు, తయారీ సంస్థల ఉత్పత్తి సామర్థ్యాల మధ్య పొంతన లేకపోవడంతో 2031-34 వరకు సాధారణ పరిస్థితులు నెలకొనడం అసాధ్యమని పేర్కొంది. ప్రస్తుతం తయారీ సంస్థల వద్ద 17,000 విమానాలకు ఆర్డర్లు పెండింగ్‌లో ఉన్నాయని, 12 ఏళ్ల ప్రస్తుత ఉత్పత్తి సామర్థ్యాలకు ఇవి సమానమని ఐటా పేర్కొంది.

కార్యకలాపాల సగటు 15.1 ఏళ్లు

ప్రస్తుతం ఒక విమానం సగటున 15.1 సంవత్సరాలు కార్యకలాపాలు సాగిస్తోంది. ప్రయాణికుల విమానాలు 12.8 ఏళ్లు, కార్గో విమానాలు 19.6 ఏళ్లు, వైడ్ బాడీ విమానాలు 14.5 ఏళ్లు వినియోగంలో ఉంటున్నాయి.

✦ విమాన విడిభాగాలు, ఇంజిన్లు, సీట్ల కొరత కారణంగా అంతర్జాతీయంగా దాదాపు 5000 విమానాలను సంస్థలు పక్కన పెట్టాయని ఐటా తెలిపింది.

2026లో పరిశ్రమకు రూ.3.69 లక్షల కోట్ల లాభం!

2026లో అంతర్జాతీయ విమానయాన పరిశ్రమ రికార్డు స్థాయిలో 41 బి.డాలర్ల (రూ.3.69 లక్షల కోట్ల) లాభాన్ని నమోదు చేయొచ్చని ఐటా అంచనా. 2025లో అంచనా వేసిన 39.5 బి.డాలర్ల (రూ.3.56 లక్షల కోట్ల) లాభం కంటే ఇది అధికం. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో భారత్, చైనాలు విమాన ప్రయాణికుల గిరాకీని ముందుకు తీసుకెళ్తాయని, 2026లో ఇక్కడ లాభం 6.6 బి.డాలర్లు (రూ.59,400 కోట్లు)గా, ఒక్కో ప్రయాణికుడిపై నికర లాభం 3.20 డాలర్లు (రూ.288)గా ఉండొచ్చని పేర్కొంది. ప్రయాణికుల సీట్ల భర్తీ రికార్డు స్థాయిలో 83.8% ఉండొచ్చని, నికర లాభం మార్జిన్ 3.9 శాతమని అంచనా వేసింది. అంతర్జాతీయంగా విమానయాన కంపెనీల ఇంధన వ్యయాలు 2025లో 253 బి.డాలర్లు (రూ.22.77 లక్షల కోట్లు) కాగా, 2026లో స్వల్పంగా తగ్గి 252 బి.డా. (రూ.22.68 లక్షల కోట్ల)కు పరిమితం కావచ్చని పేర్కొంది.

కొత్త సంవత్సరంలో కొలువుల జోరు

మ్యాన్‌పవర్ నివేదిక



కొత్త ఏడాది తొలి త్రైమాసికం (జనవరి-మార్చి)లో నియామకాలు పెరగొచ్చని దేశంలో అత్యధిక కంపెనీల నిర్వాహకులు అభిప్రాయపడ్డారని మ్యాన్‌పవర్ గ్రూపు నివేదిక తెలిపింది. ఈ విషయంలో ప్రపంచంలో రెండో స్థానంలో భారత్ నిలిచిందని వెల్లడించింది. నియామకాలు పెరగొచ్చని అనుకుంటున్న కంపెనీలకు, తగ్గొచ్చని భావిస్తున్న కంపెనీల మధ్య నిష్పత్తిని ఎన్ఈఓగా (నెట్ ఎంప్లాయిమెంట్ అవుట్‌లుక్) వ్యవహరిస్తారు. 2026 జనవరి-మార్చి త్రైమాసికానికి భారత్ ఎన్ఈఓ 52 శాతంగా ఉంది. 2025 అక్టోబరు-డిసెంబరుతో పోలిస్తే ఇది 27% ఎక్కువ. 2025 జనవరి మార్చి కంటే 30% అధికమని నివేదిక తెలిపింది. 2025 అక్టోబరులో దేశవ్యాప్తంగా 3,051 కంపెనీల నిర్వాహకుల నుంచి సేకరించిన అభిప్రాయాల ఆధారంగా ఈ నివేదిక రూపొందించినట్లు మ్యాన్‌పవర్ వెల్లడించింది.

అంతర్జాతీయంగా చూస్తే: 52% ఎన్ఈఓతో ప్రపంచవ్యాప్తంగా భారత్ రెండో స్థానంలో నిలవగా, బ్రెజిల్ (54%) అగ్రస్థానంలో ఉంది. తొలి 10 స్థానాల్లో నిలిచిన దేశాల్లో యూఈఏ (46%), నెదర్లాండ్స్ (36%), ఐర్లండ్ (31%), స్వీడన్ (30%), గ్వాటెమాలా (28%), స్విట్జర్లాండ్ (27%), అమెరికా (27%), ఇజ్రాయెల్ (25%) ఉన్నాయి.

వేగవంత వృద్ధే కారణం..: ఆర్థిక వ్యవస్థ అంచనాకు మించి వేగవంత వృద్ధిని నమోదుచేసే అవకాశం ఉండటంతో నియామకాలకు సానుకూల పరిస్థితులు ఉన్నాయని నివేదిక తెలిపింది. సానుకూల వర్షపాతం, గ్రామీణ ప్రాంత గిరాకీ, తక్కువ స్థాయిల్లో చమురు ధరలు లాంటివి ద్రవ్యోల్బణం అదుపులో ఉండేందుకు దోహదం చేస్తుండటం భారత ఆర్థిక వ్యవస్థకు కలిసి వస్తోందని వివరించింది. నియామకాలపై సానుకూల అంచనాలే ఉన్నప్పటికీ.. గత ఏడాది వ్యవధిలో నియామకాల సంఖ్య తగ్గింది. 1,000-4,999 మంది పనిచేసే పెద్ద కంపెనీలు 2025 రెండో త్రైమాసికం నుంచి తమ నియామకాలను వ్యూహాత్మక కారణాల రీత్యా 81% తగ్గించుకున్నాయని, భవిష్యత్‌పై ఆందోళనతో కాదని మ్యాన్‌పవర్ గ్రూపు (భారత్, పశ్చిమాసియా) మేనేజింగ్ డైరెక్టరు సందీప్ గులేటి తెలిపారు.

ఈ రంగాల్లో అధికం..: ఆర్థిక, బీమా రంగంలో నియామకాలు ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉంది. ఈ రంగానికి ఎన్ఈఓ 61 శాతంగా ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో ప్రొఫెషనల్, సైంటిఫిక్ సాంకేతిక సేవలు (57%), నిర్మాణం, స్థిరాస్తి (54%) ఉన్నాయి. కార్యకలాపాల విస్తరణ, అధునాతన సాంకేతికతలను అందిపుచ్చుకోవడం లాంటివే నియామకాల పెంపునకు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. నియామకాలు తగ్గించుకునేందుకు దోహదం చేస్తున్న అంశాల్లో ఆటోమేషన్ మొదటి స్థానంలో ఉంది.

ఐపీఓ సమాచారం

✦ లీప్ ఇండియా, ఎల్డోర్యాడో అగ్రిటెక్, మొల్‌బయో డయాగ్నోస్టిక్స్, ఫుడ్‌లింక్ ఎఫ్ అండ్ బీ హోల్డింగ్స్ (ఇండియా), టెక్నోక్రాఫ్ట్ వెంచర్స్ పబ్లిక్ ఇష్యూలకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ అనుమతి లభించింది.

✦ రూ.50.9 కోట్ల సమీకరణ కోసం హెచ్‌ఆర్‌ఎస్ అలుగ్లేజ్ ఎస్ఎంఈ ఐపీఓ ఈ నెల 11-15 తేదీల్లో రాబోతోంది. యాంకర్ మదుపర్లు 10న బిడ్లు దాఖలు చేయాలి. ధరల శ్రేణి రూ.94-96. ఈ నెల 18న బీఎస్ఈ ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్‌పై ఈ షేర్లు నమోదు కానున్నాయి. రూ.50.92 కోట్ల విలువైన 53.04 లక్షల తాజా ఈక్విటీ షేర్లను కంపెనీ జారీ చేయనుంది.

✦ సిటియస్ ట్రాన్స్‌నెట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టు రూ.1,340 కోట్ల నిధుల్ని ఐపీఓ ద్వారా సమీకరించేందుకు, ముసాయిదా పత్రాలను సెబీ వద్ద దాఖలు చేసింది.

✦ స్టీమ్‌హౌస్ ఇండియా రూ.425 కోట్ల నిధుల్ని సమీకరించేందుకు ఐపీఓకు రాబోతోంది. రూ.345 కోట్ల తాజా ఈక్విటీ షేర్లతో పాటు ఓఎఫ్ఎస్‌లో రూ.80 కోట్ల షేర్లను విక్రయించనుంది.

రెండో రోజూ నష్టాలే

సెన్సెక్స్ ▼436 **84666** | నిఫ్టీ ▼121 **25840**

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.3,760.08 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు: రూ.6,224.89 కోట్లు



సమీక్ష

అమెరికా ఫెడరల్ రిజర్వ్ విధాన నిర్ణయానికి ముందు మదుపర్లు లాభాల స్వీకరణను కొనసాగించడంతో, వరుసగా రెండో రోజూ సూచీలు డీలాపడ్డాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 18 పైసలు పెరిగి 89.87 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు 0.27% తగ్గి 62.33 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో హాంకాంగ్, షాంఘై, దక్షిణ కొరియా ప్రతికూలంగా ముగియగా జపాన్ సూచీ లాభాల్లో ముగిసింది. ఐరోపా మార్కెట్లు సానుకూలంగా ట్రేడయ్యాయి.

✦ సూచీలు నష్టపోయినా, బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.72,000 కోట్లు పెరిగి, రూ.464.91 లక్షల కోట్ల (5.17 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

✦ సెన్సెక్స్ ఉదయం 84,742.87 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 85,102.69) ప్రతికూలంగా ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగిన సూచీ ఒక దశలో 84,382.96 పాయింట్ల కనిష్ఠాన్ని తాకింది. చివరకు 436.41 పాయింట్ల నష్టంతో 84,666.28 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సైతం 120.90 పాయింట్లు కోల్పోయి 25,839.65 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,923.65-25,728.00 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 20 నష్టపోయాయి. ఏషియన్ పెయింట్స్ 4.47%, టెక్ మహీంద్రా 1.87%, హెచ్‌సీఎల్ టెక్ 1.80%, టాటా స్టీల్ 1.74%, ఎం అండ్ ఎం 1.13%, సన్ ఫార్మా 1.06%, అల్ట్రాటెక్ సిమెంట్ 1.06%, మారుతీ సుజుకీ 1.05%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.04% చొప్పున తగ్గాయి. ఎటర్నల్ 2.26%, టైటన్ 2.13%, అదానీ పోర్ట్స్ 1.13%, బీఈఎల్ 0.82%, బజాజ్ ఫిన్‌సర్వ్ 0.50% చొప్పున పెరిగాయి.

✦ బీఎస్ఈలో 2,550 షేర్లు సానుకూలంగా, 1,625 షేర్లు ప్రతికూలంగా ముగిశాయి. 156 షేర్లలో ఎలాంటి మార్పు లేదు.

✦ ఆదిత్య బిర్లా గ్రూప్‌నకు చెందిన **ఆదిత్య బిర్లా రెన్యూవబుల్స్‌**లో మైనారిటీ వాటా కోసం రూ.3000 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టనున్నట్లు అంతర్జాతీయ పెట్టుబడుల సంస్థ బ్లాక్‌రాక్ ప్రకటించింది. ఈ లావాదేవీ కోసం ఆదిత్య బిర్లా రెన్యూవబుల్స్ విలువను రూ.14,600 కోట్లుగా లెక్కకట్టారు.

✦ **కరోనా రెమిడీస్** రూ.655 కోట్ల ఐపీఓ రెండో రోజుకు 9.33 రెట్ల స్పందన లభించింది. కంపెనీ 45,71,882 షేర్లను ఆఫర్ చేయగా, 4,26,66,148 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. సంస్థాగతేతర మదుపర్ల విభాగంలో 26.80 రెట్లు, రిటెయిల్ మదుపర్ల విభాగంలో 6.37 రెట్లు, అర్హులైన సంస్థాగత మదుపర్ల విభాగంలో 1.67 రెట్ల స్పందన దక్కింది.

✦ రూ.1,289 కోట్ల **వేక్‌ఫిట్ ఇన్నోవేషన్స్** ఐపీఓ రెండు రోజుకు 39% స్పందన దక్కింది. కంపెనీ 3,63,53,276 షేర్లను ఆఫర్ చేయగా 1,41,81,448 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. రిటెయిల్ మదుపర్ల విభాగంలో 1.77 రెట్లు, సంస్థాగతేతర విభాగంలో 25% స్పందన లభించింది. అర్హులైన సంస్థాగత మదుపర్ల విభాగంలో 1,98,29,061 షేర్లను ఆఫర్ చేయగా, 12,616 షేర్లకే బిడ్లు దాఖలయ్యాయి.


విడుదల ఖరారు



సాక్షి వైద్య, శర్వానంద్, సంయుక్తా మేనన్

'నారీ నారీ నడుమ మురారి' చిత్రంతో సంక్రాంతి బరిలో సందడి చేయనున్నారు శర్వానంద్. ఆయన.. సంయుక్తా మేనన్, సాక్షి వైద్య నాయకానాయికలుగా నటించిన ఈ సినిమాని రామ్ అబ్బరాజు తెరకెక్కించారు. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించారు. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది జనవరి 14న థియేటర్లలోకి తీసుకొస్తున్నట్లు మంగళవారం ప్రకటించారు. ఈ మేరకు ఓ కొత్త పోస్టర్‌ను అభిమానులతో పంచుకున్నారు. వినోదాత్మకంగా సాగే ఈ కుటుంబ కథా చిత్రం ప్రేక్షకుల్ని తప్పక అలరిస్తుందని చిత్ర వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

నువ్వు ఎక్కడున్నా.. వెతుక్కుంటూ వస్తా!



ఆది పినిశెట్టి

ఆది పినిశెట్టి హీరోగా జెనూస్ మొహమద్ తెరకెక్కించిన చిత్రం 'డ్రైవ్'. వి.ఆనంద్ ప్రసాద్ నిర్మించారు. మడోన్నా సెబాస్టియన్ కథానాయిక. కమల్ కామరాజు, రాజా చెంబోలు తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈనెల 12న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం ఈ చిత్ర ట్రైలర్‌ని విడుదల చేశారు. "నువ్వు ఎక్కడున్నా.. నిన్ను వెతుక్కుంటూ వస్తా" అంటూ ఆఖర్లో ఆది చెప్పిన డైలాగ్ ట్రైలర్‌కు ఆకర్షణగా నిలిచింది.

ఈనాడు సినిమా

ఈ నెల 12న అఖండ 2



నందమూరి బాలకృష్ణ 'అఖండ 2: తాండవం' చిత్ర విడుదలకు చిక్కులన్నీ తొలగాయి. 14రీల్స్ ప్లస్, ఈరోస్ సంస్థల మధ్య ఉన్న ఆర్థిక సమస్యలు పరిష్కారమవడంతో ఈ చిత్ర విడుదలకు మార్గం సుగమం అయింది. దీంతో ఈ సినిమాని ఈ నెల 12న ప్రేక్షకుల ముందుకు తీసుకు రానున్నట్లు చిత్ర బృందం మంగళవారం రాత్రి ప్రకటించింది. 11న ప్రీమియర్ ప్రదర్శనలతోనే ఈ చిత్ర సందడి మొదలు కానుంది. ఈ మేరకు విడుదల తేదీతో కూడిన కొత్త పోస్టర్‌ను సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది. విజయవంతమైన 'అఖండ' సినిమాకి కొనసాగింపుగా బోయపాటి శ్రీను తెరకెక్కించిన పాన్ ఇండియా చిత్రమిది. రామ్ ఆచంట, గోపీ ఆచంట సంయుక్తంగా నిర్మించారు. సంయుక్తా మేనన్ కథానాయిక. ఆది పినిశెట్టి ప్రతినాయకుడిగా నటించారు. ఈ సినిమా ఈనెల 5నే విడుదల కావాల్సి ఉన్నప్పటికీ.. ఈరోస్ సంస్థతో ఉన్న ఆర్థిక వివాదాలతో ఆఖరి నిమిషంలో వాయిదా పడిన విషయం తెలిసిందే. వారంలోపే చిక్కులన్నీ తొలగిపోయి మళ్లీ సినిమా విడుదల కానుండటంతో అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రంగులకు భయపడే కథతో...

రఘురామ్, శృతి శెట్టి, నైనా పారెక్ నాయకానాయికలుగా నటించిన చిత్రం 'ఓహ్!'. సత్యనారాయణ ఏకారి స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ సినిమా ఈనెల 19న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా దర్శక నిర్మాత సత్యనారాయణ మాట్లాడుతూ.. "క్రోమో ఫోబియా(రంగులంటే భయం) అనే అంశం ఆధారంగా ఓ కొత్త జానర్ సినిమాగా దీన్ని రూపొందించా" అన్నారు. "నా తొలి సినిమా కోసం ఎంతో పరిశోధన చేసి ఈ కథని సిద్ధం చేశాను. ఆ పరమశివుడు కొలువైన హిమాలయాలంత స్వచ్ఛమైన చిత్రమిది. కచ్చితంగా అందరితో ఓహ్ అనిపించేలా ఉంటుంది" అన్నారు హీరో రఘురామ్.

సినిమా వినోదం మాత్రమే కాదు... అంతకంటే శక్తిమంతమైనది!

● తెలంగాణ గ్లోబల్ సమిట్ 2025లో 'సినిమా రైజింగ్ - 2047' అంశంపై ఆసక్తికరంగా సాగిన చర్చ

● హాజరైన వివిధ భాషలకు చెందిన సినీ ప్రముఖులు



అర్జున్ కపూర్, ఆసిఫ్ అలీ, రితేశ్ దేశ్‌ముఖ్, జోయా అక్తర్, జెనీలియా, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాకేశ్ ఓం ప్రకాశ్ మెహ్రా, అల్లు అరవింద్, శ్యాం ప్రసాద్‌రెడ్డి, డి.సురేశ్‌బాబు

సినిమా శక్తి వినోదానికి మించినదని, ఆర్థిక వృద్ధితోపాటు గొప్ప సంస్కృతికీ, కథల ఆవిష్కరణకీ మూలస్తంభంగా నిలుస్తోందన్నారు తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి. అంతటి కీలకమైన చలన చిత్ర రంగ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని, ఫ్యూచర్ సిటీని ప్రపంచ స్థాయి సృజనాత్మక కేంద్రంగా మార్చడంలో భాగంగా హైదరాబాద్ నగరాన్ని సినిమాకి జాతీయ రాజధానిగా నిలపాలన్నదే లక్ష్యం అన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ - 2025లో రెండో రోజైన మంగళవారం 'సినిమా రైజింగ్ - 2047' పేరుతో చర్చా వేదికని నిర్వహించారు. బాలీవుడ్ కథానాయకుడు అర్జున్ కపూర్ నిర్వహించిన ఈ చర్చలో తెలుగు సినీ ప్రముఖులు అల్లు అరవింద్, డి.సురేశ్‌బాబు, శ్యాం ప్రసాద్ రెడ్డి, జెనీలియా, హిందీ దర్శకులు రాకేశ్ ఓంప్రకాశ్ మెహ్రా, జోయా అక్తర్, మరాఠీ చిత్ర పరిశ్రమ నుంచి కథానాయకుడు, దర్శకనిర్మాత రితేశ్ దేశ్‌ముఖ్, మలయాళ చిత్ర పరిశ్రమ నుంచి నటుడు, నిర్మాత ఆసిఫ్ అలీ, బెంగాలీ చిత్ర పరిశ్రమ నుంచి దర్శకుడు అనిరుద్ధ రాయ్ చౌదరి పాల్గొన్నారు. ఈ వేదికనుద్దేశించి మంత్రి కోమటిరెడ్డి ప్రారంభోపన్యాసం చేశారు. 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ సాధనలో, సాంస్కృతిక, పర్యటకం, మీడియా రంగాల్నే ప్రధానంగా చేసుకుని తెలంగాణ రైజింగ్ విజన్‌కి ముఖ్యమంత్రి రూపకల్పన చేశారని చెప్పారు. మద్రాస్ నుంచి హైదరాబాద్‌కు చలన చిత్ర పరిశ్రమ తరలిరావడంలో కె.వి.రంగారెడ్డి చొరవ తీసుకున్నారని, ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వాలు హైదరాబాద్‌లో స్టూడియోల ఏర్పాటుకు పూర్తి సహాయ సహకారాలు అందించి చిత్ర పరిశ్రమ అభివృద్ధిలో ప్రముఖ పాత్ర పోషించాయన్నారు. అజయ్ దేవగణ్ ఇటీవల హైదరాబాద్‌లో సినీ స్టూడియో ఏర్పాటుకు ముందుకొచ్చారని, మరిన్ని స్టూడియోల అభివృద్ధికి, సినీ నిర్మాణాల్ని ప్రోత్సహించేందుకు, కలిసి పనిచేయడంపైనా ప్రభుత్వం చిత్ర పరిశ్రమను ఆహ్వానిస్తుందని చెప్పారు. నిర్మాత డి.సురేశ్‌బాబు మాట్లాడుతూ దక్షిణ కొరియా చిత్ర పరిశ్రమకు గ్లోబల్ హబ్‌గా కొరియాని తీర్చిదిద్దినట్టుగా.. . మన దేశంలోనూ సినిమాకి ప్రపంచస్థాయి కేంద్రంగా ఓ నగరాన్ని మలిచేందుకు అవకాశాలున్నాయన్నారు. తొలినాళ్లల్లో ఎక్కువగా రీమేక్ సినిమాలపై ఆధారపడిన తెలుగు చిత్రసీమ క్రమంగా ఎదుగుతూ ప్రస్తుతం ప్రపంచస్థాయి సినిమాల్ని రూపొందిస్తోందన్నారు. ఈ దశలో మనం మరింతగా నైపుణ్యాభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్‌లో సినిమా రంగానికి రామోజీ ఫిల్మ్‌సిటీ ప్రపంచ స్థాయి సౌకర్యాల్ని పరిచయం చేసిందని చెప్పారు.

◆ దర్శకుడు రాకేశ్ ఓం ప్రకాశ్ మెహ్రా మాట్లాడుతూ భారతీయ చిత్ర పరిశ్రమ భవిష్యత్తు కథకుల్ని అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. వేదవ్యాసుడు రచించిన మహాభారతం, వాల్మీకి రచించిన రామాయణం అందిస్తున్న ఫలాల్ని మనం ఇప్పటికీ అనుభవిస్తున్నామని, భవిష్యత్ తరాలూ ఇలా చెప్పుకునేలా సాహితీసంపదపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. అందుకోసం చిత్ర పరిశ్రమలన్నీ కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఆసిఫ్ అలీ మాట్లాడుతూ "తెలుగు చిత్ర పరిశ్రమ మలయాళ చిత్ర పరిశ్రమ కంటే ఇరవయ్యేళ్లు ముందుంది. ఆధునిక కెమెరా కోసం ఇప్పటికీ మేం హైదరాబాద్‌పైనే ఆధారపడుతున్నాం. రెండు పరిశ్రమలు కలిసి పనిచేయడం కోసం ఉత్సాహంగా ఎదురు చూస్తుంటాం" అన్నారు.

◆ నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ మన మట్టి కథలతోనే ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల్ని ఆకట్టుకోవచ్చని మన 'పుష్ప', 'కాంతార' సినిమాలు చాటి చెప్పాయన్నారు. చెన్నారెడ్డి ప్రభుత్వం నుంచి రేవంత్ రెడ్డి ప్రభుత్వం వరకూ అన్నీ చిత్ర పరిశ్రమతో స్నేహ పూర్వకంగా మెలగడంతోనే, ఇతర దేశాలు కూడా ఇక్కడికి వచ్చి సినిమాల నిర్మాణం చేసుకొనేంతగా పురోగతి సాధించామన్నారు. కొరియా చిత్ర పరిశ్రమను స్ఫూర్తిగా తీసుకొని ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. నిర్మాత శ్యాం ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ "సినిమా అంటే వినోదం మాత్రమే కాదు. రాజకీయ శక్తి, ఆర్థిక శక్తి కంటే బలమైనది. 1985లో జపనీస్ వంటకమైన రామెన్ నేపథ్యంలో తీసిన ఒక సినిమా ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందడంతో, ఇతర దేశాలన్నీ ఆ వంటకంపై ఆసక్తిని ప్రదర్శించాయి. ప్రస్తుతం దాని మార్కెట్ విలువ 58 బిలియన్ డాలర్లు. అదీ సినిమా శక్తి. సాంస్కృతిక రాయబారిలా బాషల మధ్య, దేశాల మధ్య హద్దుల్ని చెరిపేస్తుంది. మన కథల్ని ప్రపంచ స్థాయిలో చెప్పాలనే తపన ప్రతి ఒక్కరిలో ఉండాలి. రాజమౌళి, సుకుమార్, రిషబ్‌శెట్టి తదితర దర్శకులు అంతర్జాతీయ స్థాయికి మన సినిమాని తీసుకెళ్లార"న్నారు.

◆ హైదరాబాద్ నుంచే తమ సినీ ప్రయాణం మొదలైందని, ప్రాంతీయ చిత్ర పరిశ్రమల్ని గుర్తు చేసుకున్నారు రితేశ్ దేశ్‌ముఖ్, జెనీలియా దంపతులు. ప్రాంతీయ చిత్ర పరిశ్రమలు వారసత్వంగా వస్తున్న సంస్కృతికి పెద్దపీట వేస్తూనే ఎదగాల్సిన అవసరం ఉందన్నారు రితేశ్. గతంతో పోలిస్తే సినీ నిర్మాణంలో మహిళల పాత్ర గణనీయంగా పెరిగిందని, మహిళా దర్శకులు సున్నితమైన కథల్ని తీస్తూ ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల్ని అలరిస్తున్నారన్నారు దర్శకురాలు జోయా అక్తర్. ప్రాంతీయ చిత్ర పరిశ్రమల్లో సినీ రూపకర్తలకు ప్రభుత్వాలు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు అనిరుద్ధరాయ్ చౌదరి.

◆ అర్జున్ కపూర్ మాట్లాడుతూ.. తెలుగు సినిమా ప్రపంచ సరిహద్దులను చెరిపేసిందని, బాలీవుడ్, టాలీవుడ్ తేడా లేకుండా విశ్వవ్యాప్తంగా ఇండియన్ సినిమాగా రూపొందిందని వివరించారు. తాను చిన్నప్పుడే రామోజీ ఫిల్మ్‌సిటీని సందర్శించానని, ప్రపంచంలోని అద్భుత ఫిల్మ్‌సిటీల్లో ఇది ఒకటని తెలిపారు. చర్చ అనంతరం సినీ ప్రముఖుల్ని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ ప్రియాంక పాల్గొన్నారు.

'నరసింహ'కు సీక్వెల్ 'నీలాంబరి'!



రజనీకాంత్

రజనీకాంత్ నటించిన 'నరసింహ' చిత్రాన్ని ఆయన పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 12న 4కేలో రీరిలీజ్ చేయనున్నారు. ఈ సందర్భంగా రజనీకాంత్ విడుదల చేసిన వీడియో సందేశంలో చిత్రం గురించి నాటి పలు విషయాలను పంచుకున్నారు. 'నీలాంబరి' టైటిల్‌తో చిత్రం రెండో భాగాన్ని రూపొందించడానికి చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. కథ, పాత్రలు చక్కగా కుదిరితే కచ్చితంగా చిత్రం రూపొందుతుందని వెల్లడించారు. కె.ఎస్.రవికుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన 'నరసింహ' చిత్రంలో రమ్యకృష్ణ, సౌందర్య కీలక పాత్రలు పోషించారు. - న్యూస్‌టుడే, చెన్నై


జయశ్రీ.. ఓ అందమైన నక్షత్రం

వైవిధ్యమైన పాత్రలు, కుర్రకారుని ఉర్రూతలూగించే ప్రత్యేక పాటల్ని ఎంచుకుంటూ అభిమానుల్ని అలరిస్తున్న అందాల తార తమన్నా.. ఇప్పుడు ఓ బయోపిక్‌తో మెప్పించడానికి సిద్ధమైంది. బాలీవుడ్ హీరో సిద్ధాంత్ చతుర్వేది ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'వి.శాంతారామ్: ది రెబల్ ఆఫ్ ఇండియా'. అభిజీత్ శిరీష్ దేశ్‌పాండే దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ దర్శకనిర్మాత, నటుడు వి.శాంతారామ్ జీవితాధారంగా దీన్ని తీర్చిదిద్దుతున్నారు. తాజాగా ఇందులో తమన్నా.. శాంతారామ్ సతీమణి జయశ్రీ పాత్రలో కనిపించనున్నట్లు తెలుపుతూ.. ఇన్‌స్టా వేదికగా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది చిత్రబృందం. "జయశ్రీ.. ఓ యుగపు నక్షత్రం. వారసత్వం వెనక ఉన్న బలం" అనే వ్యాఖ్యల్ని జోడించింది. ఈ పోస్టర్‌లో తమన్నా.. అందంగా మెరిసిపోతూ సినీప్రియుల దృష్టిని ఆకర్షిస్తుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. "జయశ్రీ పాత్ర మళ్లీ ప్రాణం పోసుకోవడం గౌరవంగా ఉంది. ఇందులో నేను భాగం కావడం గొప్ప బాధ్యతలా అనిపిస్తుంద"ని చెప్పుకొచ్చింది. సిద్ధాంత్ టైటిల్ పాత్రలో కనిపించనున్నారు. రాహుల్ కిరణ్ శాంతారామ్, సుభాశ్ కాలే, సరితా అశ్విన్ వర్దే నిర్మిస్తున్నారు.



తమన్నా

సల్లంగుండాలే.. పెళ్లి చేసుకుని పైలంగ ఉండాలే!



'ఛాంపియన్'

'ఛాంపియన్'గా క్రిస్మస్ బరిలో సందడి చేయనున్నారు శ్రీకాంత్ కుమారుడు రోషన్. ఆయన హీరోగా నటించిన ఈ చిత్రాన్ని ప్రదీప్ అద్వైతం తెరకెక్కించారు. ప్రియాంకాదత్, జీకే మోహన్, జెమిని కిరణ్ నిర్మించారు. అనస్వర రాజన్ కథానాయిక. నందమూరి కల్యాణ్ చక్రవర్తి కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా ఈ నెల 25న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ప్రచార పర్వంలో భాగంగా మంగళవారం ఈ చిత్ర రెండో గీతాన్ని విడుదల చేశారు. "సల్లం గుండాలే సల్లంగుండాలే హే.. పెళ్లి చేసుకుని నువ్వు పైలంగ ఉండాలే" అంటూ సాగిన ఈ పాటకు మిక్కీ జె మేయర్ స్వరాలు సమకూర్చగా.. చంద్రబోస్ సాహిత్యమందించారు. రితేశ్ జి. రావు, మనీషా ఈరబత్తిని ఆలపించారు. ఊరంతా కలిసి ఓ అమ్మాయికి పెళ్లి చేస్తున్న నేపథ్యంలో వచ్చే పాటిది. పెళ్లిలోని జోష్‌ను చూపిస్తూనే.. మరోవైపు పెళ్లి కూతురు భావోద్వేగాల్ని పాటలో హత్తుకునేలా చూపించారు.

బన్సాల్ హత్యల వెనక నిందితుడు ఎవరు?



'రాత్ అకేలి హై: ది బన్సాల్ మర్డర్స్'

"సమస్య గురించి అడిగింది నువ్వే కదా.. లేకపోతే ఈపాటికి మనతో విలేకరులు సమావేశం నిర్వహించేవారు. మీడియా మనల్ని ప్రశంసించేది. నెట్‌ఫ్లిక్స్ కూడా మనపై ఒక సినిమా తీయడానికి ప్రయత్నాలు చేసేద"ని అంటూ 'రాత్ అకేలి హై: ది బన్సాల్ మర్డర్స్' ప్రపంచాన్ని పరిచయం చేసింది చిత్ర బృందం. నవాజుద్దీన్ సిద్ధిఖీ ప్రధాన పాత్రలో నటించిన సినిమా ఇది. హనీ ట్రెహాన్ తెరకెక్కించారు. ఈ చిత్రం ఈ నెల 19న రాబోతుంది. ఈ నేపథ్యంలోనే ట్రైలర్‌ను ఇన్‌స్టా వేదికగా పంచుకుంది ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్. 'బన్సాల్ హత్యల వెనక నిందితుడు ఎవరో తెలుసుకోవడానికి ఇన్‌స్పెక్టర్ జతిల్ యాదవ్ వస్తున్నాడ'నే వ్యాఖ్యను జోడించింది. బన్సాల్ కుటుంబ హత్యల చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని ట్రైలర్‌తో స్పష్టమవుతోంది. ఈ క్రైమ్ డ్రామాలో చిత్రాంగద సింగ్, రాధికా ఆప్టే, సంజయ్ కపూర్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు.

కొత్త అనుభూతిని అందించే అన్నగారు...



శైలేష్ కొలను, సందీప్ కిషన్, బాబీ, కార్తి, కృతిశెట్టి

"అన్నగారు వస్తారు' సినిమా ఓ విభిన్నమైన కథతో రూపొందింది. ఇలాంటి చిత్రాన్ని మళ్లీ తీయడం చాలా కష్టం. ఇది ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతిని అందిస్తుంది" అన్నారు కథానాయకుడు కార్తి. ఆయన నటించిన ఈ కొత్త సినిమాని నలన్ కుమారస్వామి తెరకెక్కించారు. కె.ఇ.జ్ఞానవేల్ రాజా నిర్మించారు. కృతి శెట్టి కథానాయిక. సత్యరాజ్, మధుర్ మిట్టల్, ఆనంద రాజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 12న విడుదల కానున్న నేపథ్యంలో మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. హీరో సందీప్ కిషన్, దర్శకులు దేవ కట్టా, బాబీ తదితరులు అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో కార్తి మాట్లాడుతూ.. ' 'ఈ సినిమా అభిమానం గురించి ఉంటుంది. ఆ అభిమానం ప్రేమను దాటితే భక్తి అవుతుంది. ఈ కాన్సెప్ట్‌తోనే దర్శకుడు నలన్ ఈ చిత్రాన్ని సిద్ధం చేశారు. 1970 - 80ల దశకాల్లో ఉన్న మన మాస్ కమర్షియల్ సినిమాని తిరిగి చూపించాలని ఈ చిత్రం చేశాం. దీంట్లో హీరో ఓ సూపర్ హీరోలా ఉండాలని ప్లాన్ చేశాం" అన్నారు. "నా తొలి తెలుగు సినిమా 'ఉప్పెన' చేస్తున్న సమయంలో కార్తిని చూస్తే చాలనుకునేదాన్ని. అలాంటిది ఆయనతో కలిసి నా తొలి తమిళ చిత్రం చేయడం చాలా ఆనందంగా ఉంది" అంది నటి కృతి శెట్టి. ఈ కార్యక్రమంలో బన్నీ వాస్, రాహుల్ రవీంద్రన్, వివేక్ ఆత్రేయ, శివ నిర్వాణ, శైలేష్ కొలను, వెంకీ కుడుముల, రాకేందు మౌళి, శశిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'త్రీరోజెస్ 2'.. ఆద్యంతం వినోదాత్మకమే

"యువతరంతో పాటు కుటుంబ ప్రేక్షకులు కలిసి చూడదగ్గ వెబ్‌సిరీస్ 'త్రీ రోజెస్ సీజన్ 2'. ఇది ఆద్యంతం వినోదాత్మకంగా ఉంటుంది" అన్నారు ఈషా రెబ్బా, హర్ష చెముడు. ఈ ఇద్దరితో పాటు కుషిత కల్లపు, సత్య తదితరులు ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సిరీస్‌ను కిరణ్ కె కరవల్ల తెరకెక్కించారు. ఎస్‌కేఎన్ నిర్మించారు. ఈ సిరీస్ ఈ నెల 12న ఓటీటీ వేదిక ఆహాలో స్ట్రీమింగ్ కానున్న నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు ఈషా, వైవా హర్ష.



అతిథి పాత్రలు అలరిస్తాయి

- "త్రీరోజెస్ 1'తో పోలిస్తే ఈ రెండో సీజన్ స్కేల్ పరంగా చాలా పెద్దది. తొలి భాగంలో ఈషా నాకు చేసిన దానికి ఈ రెండో సీజన్‌లో ప్రతీకారం తీర్చుకునే ప్రయత్నం చేస్తుంటా. ఈ సిరీస్ చిన్న చిన్న ట్విస్ట్‌లతో ఆద్యంతం వినోదాత్మకంగా సాగుతుంది. దీంట్లో కొన్ని అతిథి పాత్రలు కూడా ఉన్నాయి. అవి ప్రేక్షకులకు మంచి కిక్ ఇస్తాయి". - వైవా హర్ష

మూడో సీజన్ ఉంది..


"త్రీరోజెస్'లో నేను.. వైవా హర్ష కలిసి చేసిన ట్రాక్‌కు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభించింది. మళ్లీ మేమిప్పుడు ఈ రెండో సీజన్‌లోనూ కొనసాగుతుండటం ఆనందంగా ఉంది. 'త్రీరోజెస్ 3'కి లీడ్ ఇస్తూ ఆసక్తికర ముగింపుతో ఈ రెండో భాగం ముగుస్తుంది. ఈ సీజన్‌లో లవ్, ఫ్రెండ్ షిప్, రిలేషన్‌షిప్స్.. ఇలా చాలా అంశాల్ని చర్చించాం. దీంట్లో నేను.. రాశీ.. కుషిత కలిసి ఒకే గదిలో అద్దెకు ఉంటుంటాం. మా ముగ్గురి ప్రయాణాలు ఎలా సాగాయన్నది ఆసక్తికరంగా ఉంటుంది. ఈ సిరీస్ మా కెరీర్‌లో ఓ ప్రత్యేకమైన ప్రాజెక్ట్‌గా మిగిలిపోతుంది". - ఈషా రెబ్బా

ఏఐ గురువుకు వందనం!

తరగతి గదులేవీ ఉండవు. ఉపాధ్యాయులు కనిపించరు. కానీ విద్యార్థులు పాఠాలు నేర్చుకోవచ్చు. ప్రవేశ పరీక్షలకు హాజరయ్యేవారు, పోటీ పరీక్షలకు ప్రయత్నించేవారు సమర్థంగా సన్నద్ధం కావొచ్చు. ఊహించుకోవటానికే అద్భుతంగా ఉంది కదా. భవిష్యత్ విద్యావ్యవస్థ ఇలాగే సాక్షాత్కరించొచ్చు. ఇప్పటికే అలాంటి సూచనలు కనిపిస్తున్నాయి. కృత్రిమ మేధ (ఏఐ) ట్యూటర్లు ఇది సాధ్యమనే నిరూపిస్తున్నాయి. స్కూళ్లు, కళాశాలల భవనాలు, వసతుల కల్పన రోజురోజుకీ కష్టమైన పనిగా మారుతున్న తరుణంలో ఇవి కొత్త ఆశలు రేకెత్తిస్తున్నాయి. విద్యార్థులకు చదువులను బోధించటమే కాకుండా ఉపాధ్యాయులు, అధ్యాపకులకు పని భారాన్ని తగ్గించటంలో సాయం చేస్తున్నాయి.

బడిలో చెప్పిన పాఠాలను మరింత బాగా చదువుకోవటం, అవగతం చేసుకోవటమనేది మనదేశంలో ఖర్చుతో కూడుకున్న పనే. సరైన ట్యూటర్లు అందుబాటులో ఉండటమూ అంతంతే. ఒకవేళ ఉన్నా ఇంటికి ఎక్కడో దూరంగా ఉండొచ్చు. ఇలాంటి అడ్డంకులను అధిగమించటానికి ఏఐ బోధన టూల్స్ చేదోడుగా నిలుస్తున్నాయి. ఎప్పుడంటే అప్పుడు 24 గంటలూ సాయం చేయటానికివి సిద్ధంగా ఉంటున్నాయి.

- విద్యా ప్రమాణాలు పెరగటానికీ ఏఐ ట్యూటర్లు సాయం చేయగలవు. 14-18 ఏళ్ల పిల్లల్లో కేవలం 43% మందే మూడంకెల భాగహారాలు చేయగలుగుతున్నారు. 57.3% మందే ఇంగ్లిష్ వాక్యాలను చదవగలుగుతున్నారు. ఏఐని సమర్థంగా వాడుకుంటే ఇలాంటి సమస్యలను తేలికగా పరిష్కరించే అవకాశముంది.
- సంప్రదాయ బడులు నిర్ణీత పాఠ్యక్రమానికి, సమయానికి మాత్రమే పరిమితమవుతాయి. అదే ఏఐ ట్యూటర్లను రోజులో ఎప్పుడైనా వాడుకోవచ్చు. అర్థమయ్యేంతవరకూ వివరణలను మళ్లీ మళ్లీ అడగొచ్చు. విద్యార్థి బలాలు, బలహీనతల మేరకు బోధన తీరును నిర్ణయించుకోవచ్చు.
- విద్యార్థులు మరిన్ని ఎక్కువ అంశాలను నేర్చుకోవటమే కాదు, ఇంకాస్త ఎక్కువ చొరవ చూపటానికి.. చదువుకోవటానికి కూడా ఏఐ ట్యూటర్లు తోడ్పడుతున్నాయని హార్వర్డ్ గెజిట్ అధ్యయనం పేర్కొంటోంది. ఏదో జవాబు చెప్పటం కన్నా తమను సొంతంగా ప్రయత్నించేలా చేయటం ద్వారా ఏఐ ట్యూటర్లు సంక్లిష్ట అంశాలను నేర్చుకునేలా బాగా ప్రోత్సహిస్తున్నాయని విద్యార్థులు సైతం అభిప్రాయ పడుతుండటం గమనార్హం.



కొన్ని ట్యూటర్లు ఇవీ..

చాట్‌జీపీటీ స్టడీ మోడ్: ఓపెన్ఏఐకి చెందిన చాట్‌జీపీటీ ఇటీవల స్టడీ మోడ్‌ను పరిచయం చేసింది. ఇది ప్రపంచవ్యాప్తంగా ఉచిత, ప్లస్, ప్రొ, టీమ్ ప్లాన్స్ యూజర్లందరికీ అందుబాటులో ఉంది. ఐఓఎస్, ఆండ్రాయిడ్, డెస్క్‌టాప్ పరికరాల్లో వేటిల్లోనైనా వాడుకోవచ్చు. స్టడీ మోడ్ ఫీచర్‌తో చాట్‌బాట్ ఏకంగా ఉపాధ్యాయుడిగా, గైడ్‌గా మారిపోతుంది. ముందు విద్యార్థుల లక్ష్యాలు, నైపుణ్యాలను అంచనా వేయటానికి కొన్ని ప్రశ్నలు సంధిస్తుంది. జవాబుల ఆధారంగా విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా బోధించే పద్ధతిని అనుసరిస్తుంది. సంక్లిష్టమైన అంశాలను విభాగాలుగా విడగొడుతుంది. ప్రాంప్ట్‌ల ద్వారా రీజనింగ్‌ను అవగతం చేయిస్తుంది. విద్యార్థులు నేర్చుకుంటున్నకొద్దీ కష్టమైన అంశాలను జోడిస్తుంది. అంటే విద్యార్థుల పనులను చేసిపెట్టటం కాకుండా విమర్శనాత్మకంగా ఆలోచించేలా ప్రోత్సహిస్తుందన్నమాట. చాట్‌మెమరీని యూజర్ ఆన్ చేసినట్టయితే అంతకుముందు జరిపిన చర్చలను బట్టి ఉదాహరణలు ఇస్తుంది. సముచితమైన చిట్కాలు అందజేస్తుంది. పీడీఎఫ్‌లు, ఇమేజ్‌ల రూపంలో ఎలాంటి కోర్సు మెటీరియల్‌నైనా దీనికి అప్‌లోడ్ చేయొచ్చు.

ఎంబైబ్: స్కూల్, ఎంట్రెన్స్, కాంపిటీటివ్, గవర్నమెంట్ పరీక్షలు.. ఇలాంటివేవైనా కావొచ్చు. అన్నింటికీ సిద్ధం చేసే వేదిక ఎంబైబ్ (Embibe). వెబ్‌సైట్, యాప్ రూపంలో అందుబాటులో ఉంది. నేర్చుకోవటం, సాధన చేయటం, పరీక్ష రాయటం, లక్ష్యాన్ని సాధించటం, ప్రయోగాలు చేయటం వంటి విభాగాలెన్నో ఇందులో ఉన్నాయి. ఇది ఇటీవలే జియో ప్లాట్‌ఫామ్స్‌లోనూ ఒదిగిపోయింది.

▼ టాపర్, వేదాంతు వంటివీ క్విజ్‌లు, వీడియో పాఠాలు, చాట్‌బాట్స్‌తో ప్రశ్నలకు సమాధానాలు అందిస్తూ, ఎప్పుడంటే అప్పుడు విద్యార్థుల సందేహాలను తీరుస్తున్నాయి.

ఎవాల్వ్.ఏఐ: చెన్నైకి చెందిన ఎవాల్వ్.ఏఐ (Evo11ve.AI) అనే ఎడ్యుకేషన్ టెక్నాలజీ కంపెనీ ఎవాల్వ్ ఏఐ కోచ్‌ను తీసుకొచ్చింది. ఇదో ఆన్‌లైన్ పోర్టల్. సీబీఎస్ఈ పాఠ్యప్రణాళికలో 6-12 తరగతుల విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని రూపొందించారు.


ఖాన్‌మింగో: ప్రముఖ విద్యాసంస్థ ఖాన్ అకాడమీ రూపొందించిన ఖాన్‌మింగో (Khanmigo) మరో ఉదాహరణ. విశాలమైన లైబ్రరీ కంటెంట్ గల ఇది ఏఐ ఆధారిత వ్యక్తిగత ఉపాధ్యాయుడిగా తోడుంటుంది. ఎక్సర్‌సైజులు, వీడియోలు, ఆర్టికల్స్ రూపంలో మ్యాథ్స్, హ్యుమానిటీస్, కోడింగ్, సోషల్ స్టడీస్ వంటి పలు సబ్జెక్టులను ప్రత్యక్షంగా బోధిస్తుంది. కొన్ని ఏఐ టూల్స్ మాదిరిగా ఇది కేవలం జవాబులను ఇవ్వదు. విద్యార్థులే ఓపికగా వాటిని గుర్తించేలా ప్రోత్సహిస్తుంది.

దీక్ష: ప్రభుత్వానికి చెందిన దీక్ష (DIKSHA) వెబ్‌సైట్, యాప్ రూపంలో అందుబాటులో ఉంది. ఆయా తరగతులు, ప్రాంతం, భాషలను బట్టి పాఠాలు నేర్చుకోవచ్చు. ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లో ఉండే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి విద్యార్థులు, ఉపాధ్యాయులు వీటిని యాక్సెస్ చేయొచ్చు. చదువుకోవాల్సిన అంశాలకు సంబంధించిన సూచనలు, సలహాలు తీసుకోవచ్చు. అలాగే స్వయం (SWAYAM) అనే ప్రభుత్వ వేదికలో ఉత్తమ విశ్వవిద్యాలయాల్లో అందుబాటులో ఉన్న ఉచిత కోర్సులను నేర్చుకోవచ్చు. ఎప్పుడైనా, ఎక్కడైనా, వీలున్నప్పుడే చదువుకోవచ్చు. సర్టిఫికెట్లు, యూనివర్సిటీ క్రెడిట్స్ పొందొచ్చు.

ఏఐ క్వశ్చన్ పేపర్ జనరేటర్: ఏకలవ్య అనే ఎడ్‌టెక్‌కు చెందిన ఏఐ క్వశ్చన్ పేపర్ జనరేటర్ (AI Question Paper Generator) వేదిక ఎలాంటి పరీక్షకైనా, అంతర్గత మదింపుకైనా ప్రశ్నాపత్రాన్ని రూపొందిస్తుంది. చాప్టర్ లేదా టెక్స్ట్ కంటెంట్‌ను ఫీడ్ చేస్తే చాలు నిమిషాల్లో క్వశ్చన్ పేపర్ ముందుంటుంది. మల్టిపుల్ చాయిస్, డిస్క్రిప్టివ్, కోడింగ్.. ఇలా ఎలాంటి ప్రశ్నలనైనా సిద్ధం చేయగలదు. దీంతో ఎంతో శ్రమ, సమయం ఆదా అవుతాయి.

బ్రిస్క్ టీచింగ్: ఇది క్రోమ్, ఎడ్జ్ బ్రౌజర్లలో ఒదిగిపోయే ఎక్స్‌టెన్షన్. ఏఐ ఆధారిత టూల్స్‌తో కూడిన బ్రిస్క్ టీచింగ్ (Brisk Teaching) ఉపాధ్యాయులకు ఎంతో అనువుగా ఉంటుంది. పాఠ్య ప్రణాళిక రూపకల్పన, విద్యార్థులకు ఫీడ్‌బ్యాక్, వేర్వేరు బోధన తీరులను సృష్టించుకోవటానికి తోడ్పడుతుంది. ఇలా ఎంతో సమయాన్ని ఆదా చేయగలదు.

సోక్రాటిక్: గూగుల్ రూపొందించిన ఉచిత ఏఐ ఆధారిత హోంవర్క్ హెల్పర్ ఇది. అన్ని సబ్జెక్టుల్లోనూ సోక్రాటిక్ (Socratic) విద్యార్థులకు సాయం చేస్తుంది. హోంవర్క్ ప్రాబ్లమ్‌ను ఫొటో తీసి చూపిస్తే చాలు, దీనిలోని ఏఐ అంచెలంచెలుగా వివరణలను ఇస్తుంది. మ్యాథ్స్, సైన్స్, హిస్టరీ, లిటరేచర్.. ఇలా అన్ని అంశాలనూ సరళంగా విడమరచి చెబుతుంది. ఆయా అంశాలను లోతుగా అర్థం చేసుకోవటానికి, వాటి వెనక ఉద్దేశాలను నేర్చుకోవటానికీ తోడ్పడుతుంది.



కాల్ మోసాలకు ఆండ్రాయిడ్ అడ్డుకట్ట

గూగుల్ తమ ఇన్-కాల్ స్కామ్ ప్రొటెక్షన్ ఫీచర్‌ను విస్తరిస్తోంది. మనీ లేదా ఫైనాన్షియల్ యాప్స్‌తో ముడిపడిన ఫోన్ కాల్ సమయంలో జోక్యం చేసుకోవటం దీని ప్రత్యేకత. చాలా మోసాలు అపరిచిత కాల్స్‌తోనే మొదలవుతున్న నేపథ్యంలో ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. సాధారణంగా మోసగాళ్లు తాము బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని, ఉద్యోగులమని నమ్మించి బోల్తా కొట్టిస్తుంటారు. పేమెంట్ యాప్‌ను తెరిచేలా బలవంతం చేస్తుంటారు. ఈ క్రమాన్ని విడగొట్టటమే ఇన్-కాల్ స్కామ్ ప్రొటెక్షన్ ఫీచర్ గొప్పతనం. మీ కాంటాక్ట్స్‌లో సేవ్ కాని నంబరుతో మాట్లాడుతున్న సమయంలోనే ఫైనాన్షియల్ యాప్‌నూ తెరచినప్పుడు ఇది రంగంలోకి దిగుతుంది. ఈ రెండు అంశాలూ ఒకే సమయంలో జరుగుతున్నట్టు గుర్తించిన వెంటనే తెర మీద 'ఇది ప్రమాదకరమైన పని' అంటూ హెచ్చరికను చూపిస్తుంది. అప్పుడు మీరు ఒక్క ట్యాప్‌తోనే కాల్‌ను కట్ చేయొచ్చు లేదా స్క్రీన్ షేరింగ్‌ను బ్లాక్ చేయొచ్చు. ఇలా మోసానికి గురికాకముందే తప్పించుకోవచ్చన్నమాట. ఒకవేళ లావాదేవీని అలాగే కొనసాగిస్తుంటే దాన్ని 30 సెకండ్ల పాటు ఆలస్యం చేస్తుంది కూడా. మోసగాళ్లు పెట్టే ఒత్తిడి, భయం నుంచి బయటపడటానికిది ఉపయోగపడుతుంది. మోసాలకు గురైనవారు చాలాసార్లు డబ్బును పంపించిన తర్వాతే నిజాన్ని గ్రహిస్తుంటారు. అందుకే మరోసారి ఆలోచించుకోవటానికే ఇలా అర నిమిషం సేపు ఆలస్యం చేసేలా ఫీచర్‌ను రూపొందించారు. ఇది ఆండ్రాయిడ్ 11, ఆ తర్వాతి ఓఎస్ పరికరాల మీద పనిచేస్తుంది.

వస్తోంది మోటోరోలా ఎడ్జ్ 70



మోటోరోలా సంస్థ తమ ఎడ్జ్ 70 ఫోన్‌ను మనదేశంలో డిసెంబరు 15న విడుదల చేయనుంది. ఇది స్నాప్‌డ్రాగన్ 7 జెన్ చిప్‌సెట్, ఆండ్రాయిడ్ 16 ఆధారిత హెలో యూఐతో పనిచేస్తుంది. 1.5కే రెజల్యూషన్, 4,500 నిట్స్ గరిష్ఠ ప్రకాశంతో కూడిన 6.7 అంగుళాల ఎమోలెడ్ తెర, గొరిల్లా గ్లాస్ 7ఐ రక్షణ, డాల్బీ అట్మస్ సపోర్టు.. 68డబ్ల్యూ వైర్డ్, 15డబ్ల్యూ వైర్‌లెస్ ఫాస్ట్ ఛార్జింగ్‌ను సపోర్టు చేసే 5,000ఎంఏహెచ్ సిలికాన్ కార్బన్ బ్యాటరీ కలిగుంటుంది. వెనకాల 50ఎంపీ ప్రైమరీ షూటర్, 50ఎంపీ అల్ట్రావైడ్ కెమెరా, ఎల్ఈడీ ఫ్లాష్‌తో కూడిన మూడు కెమెరాల వ్యవస్థ.. సెల్ఫీలు, వీడియో కాల్స్ కోసం ముందు 50ఎంపీ క్వాడ్ పిక్సెల్ కెమెరా మరో ఆకర్షణ. దృఢత్వంలో ఎంఐఎల్-ఎస్‌టీడీ 810హెచ్ సర్టిఫికెట్.. దుమ్ము, నీటిని తట్టుకోవటంలో ఐపీ68, ఐపీ69 రేటింగ్‌తో వస్తోంది. విమానాల స్థాయి అల్యూమినియం ఫ్రేమ్ గల దీని బరువు 159 గ్రాములు. పాంటోన్ బ్రాంజ్ గ్రీన్, గ్యాడ్జెట్ గ్రే, లిలీ ప్యాడ్ రంగుల్లో కనువిందు చేయనుంది.

పెద్ద సౌండ్‌తో పోకో సీ85 5జీ



షావోమీ సబ్ బ్రాండ్ పోకో కొత్త సీ85 5జీ ఫోన్ తీసుకొచ్చింది. ఆరుబయట పెద్దగా వినిపించటానికి తోడ్పడే 200 శాతం సూపర్ వాల్యూమ్ మోడ్ దీని ప్రత్యేకత. మీడియాటెక్ డైమెన్సిటీ 6300 చిప్‌సెట్, ఆండ్రాయిడ్ 15తో పనిచేస్తుంది. 120హెచ్‌జడ్ రిఫ్రెష్ వేగం, 810 నిట్స్ వరకూ గరిష్ఠ ప్రకాశం, హెచ్‌డీ+ రెజల్యూషన్ గల 6.9 అంగుళాల తెర.. వెనకాల 50ఎంపీ ఏఐ డ్యుయెల్ కెమెరా సెటప్, ముందు 8ఎంపీ కెమెరా, 33డబ్ల్యూ ఫాస్ట్ ఛార్జింగ్, 10డబ్ల్యూ వైర్డ్ రివర్స్ ఛార్జింగ్ సపోర్టు గల 6000ఎంఏహెచ్ బ్యాటరీ వంటి ఫీచర్లు కలిగుంది. మిస్టిక్ పర్పుల్, స్ప్రింగ్ గ్రీన్, పవర్ బ్లాక్ రంగుల్లో అందుబాటులో ఉంది. లో బ్లూ లైట్, ఫ్లికర్ ఫ్రీ, సర్కేడియన్ రక్షణ కోసం డిస్‌ప్లేకు టీయూవీ సర్టిఫికెట్లు గల దీని మందం 7.99 ఎం.ఎం. 4జీబీ+128జీబీ రకం ధర రూ.12,999. 6జీబీ+128జీబీ రకం ధర రూ.13,999. డిసెంబరు 16 నుంచి అమ్మకాలు మొదలవుతాయి.

స్మార్ట్‌ఫోనే సమస్య అయితే?

రోజురోజుకీ స్మార్ట్‌ఫోన్ల వాడకం పెరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా 400 కోట్లకు పైగా మంది చేతుల్లో ఇవి దర్శనమిస్తున్నాయంటేనే వీటి విస్తృతి అర్థమవుతుంది. సమాచారాన్ని తెలుసుకోవటానికి, పరస్పర సంభాషణలకు, ఆర్థిక సేవలకు, వినోదానికివి ఉపయోగపడుతున్నమాట నిజమే అయినా వీటి వాడకం ప్రజారోగ్య సమస్యగానూ పరిణమిస్తోంది. స్మార్ట్‌ఫోన్ల అతి వాడకం, వాటిపై ఆధారపడటం మీద నిర్వహించిన తాజా అధ్యయనం కళ్లు తెరవాలని సూచిస్తుండటమే దీనికి నిదర్శనం. ఇటీవల మైండ్‌ఫుల్‌నెస్ పత్రికలో ప్రచురితమైన దీని వివరాల్లోకి వెళ్తే..

ఏంటీ సమస్య?

స్మార్ట్‌ఫోన్ల మీద విపరీతమైన సమయాన్ని గడపటం, వాటి వాడకం మీద నియంత్రణ లేకపోవటం, ఇది రోజువారీ ముఖ్యమైన పనులకు తీవ్రంగా విఘాతం కల్పించటాన్ని 'సమస్యాత్మకం'గా పరిగణించొచ్చు. కానీ దీన్ని నిర్వచించటం, సమస్యగా గుర్తించటంలో ఇంకా కొన్ని భేదాభిప్రాయాలున్నాయి.

ఎందుకీ సమస్య?

సమాచారం, సోషల్ మీడియా, రోజువారీ వ్యవహారాలకు తోడ్పడే టూల్స్‌ను యాక్సెస్ చేయటంలో స్మార్ట్‌ఫోన్లు బాగా తోడ్పడుతున్నాయనటంలో సందేహం లేదు. కానీ వీటి వాడకం మన పనులు, సంబంధాలకు విఘాతం కలిగిస్తుండటమే సమస్య. ఇది మానసిక ఆరోగ్యాన్నీ దెబ్బతీస్తోంది. నిద్రకు భంగం కలిగించటం, నొప్పులు.. ముఖ్యంగా మెడ, భుజాల నొప్పుల వంటి శారీరక సమస్యలకూ దారితీస్తోంది. జూదం, మాదకద్రవ్యాల మాదిరిగా స్మార్ట్‌ఫోన్ల అతి వాడకాన్ని వ్యసనంగా పరిగణించటం లేదు. అయితే కొన్ని గుణాలు వ్యసనాన్నీ పోలి ఉండటం గమనార్హం. ఉదాహరణకు- కొద్దిసేపు ఫోన్ కనిపించకపోతే కొందరు తీవ్ర ఆందోళన, అసౌకర్యానికి గురవుతుంటారు. దీన్ని వ్యసనంగా గుర్తించనప్పటికీ అన్నవయసుల వారిలోనూ కొందరు ఫోన్ వాడకాన్ని తగ్గించుకోవాలనీ భావిస్తుండటం గమనిస్తుంటాం.



అధ్యయనం ఏం చెబుతోంది?

రోజువారీ పనుల పట్ల అప్రమత్తంగా, జాగరూకతతో వ్యవహరించేవారిలో స్మార్ట్‌ఫోన్ వాడకం సమస్యగా పరిణమించే అవకాశం తక్కువగా ఉంటున్నట్టు అధ్యయన ఫలితాలు చెబుతున్నాయి. మొత్తం 11 దేశాలకు చెందిన 39వేల మందిపై నిర్వహించిన 61 అధ్యయనాలను సమీక్షించి ఈ విషయాన్ని గుర్తించారు. జాగరూకతతో ఉండటమంటే? ప్రస్తుత క్షణం మీద దృష్టి సారించటం. ఎవరైనా పదే పదే ఫోన్‌ను చూస్తున్నారంటే.. అది ఆసక్తికరమైన, ఉత్తేజితమైన సమాచారాన్ని తెలుసుకోవటం కోసం కావొచ్చు. విసుగు లేదా ఒత్తిడిని తగ్గించుకోవటానికి లేదా ఇష్టంలేని పరిస్థితులను, చర్చలను తప్పించుకోవటానికీ కావొచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో జాగరూకతతో ఉండటం ద్వారా భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవచ్చు. తక్కువగా ప్రతిస్పందించటం, ఉపయోగపడని ప్రవర్తనలకు లోనుకాకుండా చూసుకోవటం వంటి ప్రయోజనాలూ ఉంటాయి. ఫోన్ వాడకం సమస్యాత్మకంగా మారుతోందా? కేవలం అలవాటు మాత్రమేనా? అనేది గుర్తించటానికీ జాగరూకత ఉపయోగపడుతుంది.

పరిష్కారమేంటి?

ప్రస్తుత క్షణం మీద దృష్టి సారించలేక పోతున్నట్టయితే ఏకాగ్రతను పెంచే యోగా, ధ్యానం, ప్రాణాయామం వంటి పద్ధతులు మేలు చేస్తున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి.

- ఫోన్‌ను చేతిలోకి తీసుకుంటున్నప్పుడు మనసులో ఓసారి ప్రశ్నించుకోవాలి. అది ఏదైనా పనికోసమా? లేకపోతే అలవాటుగా తాకుతున్నారా? అని ఆలోచించాలి. ముఖ్యంగా ఫోన్‌ను పక్కన పెట్టిన కొద్ది నిమిషాల్లోనే దాన్ని పదే పదే చెక్ చేస్తున్నట్టయితే సందేహించాల్సిందే.
- అదేపనిగా ఫోన్‌ను వాడటం కన్నా ఆరుబయటకు వెళ్లటం, ఆత్మీయులతో గడపటం వంటి ముఖ్యమైన పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- ఫోన్ వాడకానికి సమయాన్ని నిర్దేశించుకోవాలి. కావాలంటే ఉదయం, రాత్రి వేళల్లో ఓ గంటసేపు ఫోన్ వంక చూడొద్దని నిర్ణయించుకోవాలి. ఆ సమయంలో బయట నడవటం, వ్యాయామం చేయటం.. రాత్రివేళ పుస్తకం చదవటం వంటి ఆరోగ్యకరమైన పనులు చేయొచ్చు.
- బస్సులో ప్రయాణం చేస్తున్నప్పుడో, ఎవరికోసమో ఎదురు చూస్తున్నప్పుడో విసుగు పుట్టినా దాన్ని అలాగే ఆస్వాదించటం అలవాటు చేసుకోవాలి. ఫోన్ వంక చూడకుండా పరిసరాలను, చుట్టుపక్కల వ్యక్తులను గమనిస్తూ ఉంటే విసుగు దానంతటదే పోతుంది.
- అవసరం లేకపోయినా ఎప్పుడెప్పుడు, ఎలాంటి భావోద్వేగాలకు గురైనప్పుడు ఫోన్‌ను వాడుతున్నారో గుర్తించగలిగితే సగం పని అయిపోయినట్టే. ఆయా పనులకు దూరంగా ఉండగలిగితే ఫోన్ వాడకాన్నీ తగ్గించుకోవచ్చు. వీలైతే ఒకరోజు మొత్తం ఫోన్‌కు దూరంగా ఉండటానికి ప్రయత్నించొచ్చు. మరో రోజు ఫోన్‌ను ఇంట్లోనే పెట్టి బయటకు వెళ్లి రావొచ్చు. అప్పుడెలా అనిపిస్తుందో గమనించొచ్చు.

ఏఐ బుర్రకు పని!

మీకు అవసరమైనవి రాయమని ఏఐని అడుగుతున్నారా? దీనికి బదులు ఏఐ బుర్రకే పని చెప్పి చూడండి. మీరు రాసిన ఈమెయిల్, వ్యాసం, వ్యాపార ఐడియాను నచ్చిన చాట్‌బాట్‌లో పేస్ట్ చేయండి. తర్వాత దాన్ని కాచి వడపోసి, ఎందుకు విఫలమవుతుందో లేదా ఎందుకు అపార్థానికి గురవుతుందో మూడు కారణాలు చెప్పమని ప్రాంప్ట్ అందించండి. (Roast this. Tell me 3 reasons why this will fail or be misunderstood). అప్పుడు ఏఐ తనకు తానే ప్రశ్నించుకొని, కిందా మీదా పడి జవాబిస్తుంది. ఇబ్బంది కలిగించే అంశాలను తొలగించి, సమయాన్ని ఆదా చేస్తుంది.

గాలిలోంచి నీరు



గాలిలోంచి నీటిని సంగ్రహించి, దాన్ని తాగునీరుగా మార్చటానికి మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) పరిశోధకులు కొత్త మార్గాన్ని గుర్తించారు. కేవలం కొన్ని నిమిషాల్లోనే తాగు నీటిని గ్రహించటం దీని ప్రత్యేకత. నిజానికి నీటిని ఆవిరి చేసి, తాగు నీటిగా మార్చే పద్ధతులు ఇప్పటికే ఉన్నాయి. అవన్నీ తేమ గాలిని చల్లబరచటం లేదా స్పాంజి వంటి వాటితో ఆవిరిని గ్రహిస్తాయి. దాన్ని ఘనీభవింపజేసి, నీటి బిందువులుగా మారుస్తాయి. సాధారణంగా నీటిని ఆవిరి చేయటానికి ఎండ మీద ఆధారపడతాయి. ఇందుకు చాలా సమయం పడుతుంది. పొడి ప్రాంతాల్లో పనికిరావు. కొత్త విధానంలో ఇలాంటి ఇబ్బందులేవీ ఉండవు. ఇది శబ్ద తరంగాల సాయంతో స్పాంజిల నుంచి ద్రవం బయటకు వచ్చేలా చేస్తుంది. ఒక్క ఆవిరి మీదే ఆధారపడటంతో పోలిస్తే ఇది 45 రెట్లు ఎక్కువ సమర్థంగా పనిచేస్తుంది. కాకపోతే దీనికి ఇంధన వనరు అవసరం. సౌర కణాలతో పరికరాన్ని అనుసంధానం చేయటం ద్వారా ఈ సమస్యనూ పరిష్కరించొచ్చని పరిశోధకులు చెబుతున్నారు.

సెక్యూరిటీ సపోర్టు ఉందా?



ప్యాకేజీ బాగానే ఉంటుంది. హార్డ్‌వేర్ కూడా కొత్తగానే కనిపిస్తుంది. కానీ సెక్యూరిటీ సపోర్టు గడువు ముగిసిపోతే? పరికరాలు ఆన్ అయినా కూడా సెక్యూరిటీ ప్యాచెస్ అందవు. ఇలాంటివంటే హ్యాకర్లకు పండగే. మరి వేటికి, ఎంతకాలం సపోర్టు మిగిలుందో తెలుసుకోవటమెలా? దీనికి తేలికైన మార్గం లేకపోలేదు. https://endoflife.date/ వెబ్‌సైట్‌లోకి వెళ్తే ఆండ్రాయిడ్, ఐఫోన్, ఐప్యాడ్ వంటి విభాగాలెన్నో ఉంటాయి. అవసరమైన దాని మీద క్లిక్ చేస్తే ఓఎస్ ఎప్పుడు విడుదలైందో, ఇంకెంత కాలం సెక్యూరిటీ సపోర్టు లభిస్తుందో కనిపిస్తుంది.

అసలుదా? కృత్రిమమా?

ప్రస్తుతం ఏఐ ఇమేజ్ జనరేటర్స్ ఎంతో ప్రాచుర్యం పొందుతున్నాయి. వీటితో రోజూ లక్షలాది మంది అద్భుతమైన ఇమేజెస్, సృజనాత్మక దృశ్యాలు సృష్టిస్తున్నారు. ఇది మంచి సదుపాయమే కావొచ్చు, కానీ నకిలీ ఇమేజ్‌లే పెద్ద సమస్య. అసలైనవనే అనిపించే వీటిని ఎవరైనా సృష్టించొచ్చు. వీటిని గుర్తించటానికే గూగుల్‌కు చెందిన డీప్‌మైండ్ సంస్థ సింథ్‌ఐడీ (SynthID) అనే ఏఐ వాటర్‌మార్కింగ్ టెక్నాలజీని రూపొందించింది.



వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్న ప్రముఖుల వీడియో మీకు అందితే? ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్ తీసినట్టుగా తోచే ఒక వస్తువు ఇమేజ్ కనిపిస్తే? అవి పూర్తిగా ఏఐ సాయంతోనే సృష్టించినవైతే? ఎంత సునిశితంగా చూసినా మన కళ్లు అవి నకిలీవని పసిగట్టలేవు. ఇలాంటి ఇమేజెస్ వివాదాలకూ దారితీస్తున్నాయి. తమకు అందిన ఫొటో, వీడియో, ఆడియోలు నిజమైనవో, కావో అనేది తేల్చుకోవటం పెద్ద సమస్యగా మారింది. నకిలీ ఇమేజ్‌లను నిజమైనవని భావించటం వల్ల సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారం శరవేగంగా వ్యాపిస్తుండటమూ గమనిస్తున్నాం. తమ కళాఖండాలను ఏఐ కాపీల నుంచి కాపాడుకోవటం కళాకారులకూ పెద్ద సవాల్‌గా నిలుస్తోంది. ఒకరకంగా మనమిప్పుడు కనిపిస్తున్న దాన్ని విశ్వసించలేని స్థితికి చేరుకుంటున్నాం. ఏది అసలో, ఏది ఏఐ చిత్రమో తేల్చుకోలేని సందిగ్ధంలో పడిపోతున్నాం. దీన్నుంచి బయటపడేయటమే సింథ్‌ఐడీ ఉద్దేశం. ఇవి గూగుల్ ఏఐ టూల్స్‌తో సృష్టించే ఏఐ కంటెంట్‌లో మన కళ్లు గుర్తించలేని విధంగా వాటర్‌మార్క్‌ను జొప్పిస్తుంది. దాన్ని గుర్తిస్తుంది కూడా. కాబట్టి దీని సాయంతో ఎవరైనా ఇమేజ్ మూలాన్ని తెలుసుకోవచ్చు.

ఎలా సాయం చేస్తుంది?


- ఇమేజ్, వీడియోలను గూగుల్ ఏఐతో సృష్టించారా? సవరించారా? అనే దాన్ని వెంటనే నిర్ధారిస్తుంది.
- ఏఐ కంటెంట్‌ను క్రాప్, ఫిల్టర్, కంప్రెస్ చేసినా డిజిటల్ వాటర్‌మార్క్ అలాగే ఉంటుంది.

ఎలా వాడుకోవాలి?

- https://gemini.google.com/ లోకి వెళ్లాలి.
- మీ జెమినై చాట్‌లో ఇమేజ్‌ను అప్‌లోడ్ చేయాలి.
- "Was this created or altered by Google AI?" అని ప్రాంప్ట్‌ను టైప్ చేయాలి.
- వెంటనే జెమినై సింథ్‌ఐడీ వాటర్‌మార్క్ కోసం స్కాన్ చేస్తుంది. ఏఐతో సృష్టించిదో, కాదో ధ్రువీకరిస్తుంది.

వీఎల్‌సీతో యూట్యూబ్ వీడియో డౌన్‌లోడ్

యూట్యూబ్‌లో బోలెడన్ని వీడియోలు చూస్తుంటాం. కొన్నిసార్లు వాటిని డెస్క్‌టాప్ లేదా ల్యాప్‌టాప్‌లో డౌన్‌లోడ్ చేసుకుంటే బాగుంటుంది కదా అనిపిస్తుంటుంది. మీరు విండోస్ పీసీ వాడుకుంటుంటే, వీఎల్‌సీ మీడియా ప్లేయర్‌నూ ఇన్‌స్టాల్ చేసుకొని ఉంటే ఇది తేలికైన పనే.



- ముందుగా బ్రౌజర్ అడ్రస్ బార్ నుంచి యూట్యూబ్ వీడియో యూఆర్ఎల్‌ను కాపీ చేసుకోవాలి.
- పీసీలో వీఎల్‌సీ మీడియా ప్లేయర్‌ను ఓపెన్ చేయాలి.
- పై మెనూలో మీడియా మీద క్లిక్ చేసి, ఓపెన్ నెట్‌వర్క్ స్ట్రీమ్‌ను ఎంచుకోవాలి.
- బాక్సులో యూట్యూబ్ యూఆర్ఎల్‌ను పేస్ట్ చేసి, ప్లే బటన్ మీద క్లిక్ చేయాలి.
- వీడియో ప్లే అవుతుండగా టూల్స్ మీద క్లిక్ చేసి, కోడెక్ ఇన్ఫర్మేషన్ ఎంచుకోవాలి.
- అడుగున కనిపించే లొకేషన్ బాక్సులో లింక్‌ను కాపీ చేయాలి.
- ఇప్పుడు బ్రౌజర్‌ను ఓపెన్ చేసి, అడ్రస్ బార్‌లో లొకేషన్ లింక్‌ను పేస్ట్ చేసి ఎంటర్ నొక్కాలి.
- వీడియో లోడ్ అయ్యి, ప్లే అవుతున్నప్పుడు నిలువు మూడు చుక్కల మీద క్లిక్ చేసి.. డౌన్‌లోడ్ ఆప్షన్ మీద తాకి సేవ్ చేసుకోవాలి.

కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు



◆ అంతర్జాతీయ క్రికెట్‌లో అన్ని ఫార్మాట్లలో కలిపి 50 వికెట్లు ఆడిన తొలి భారత ఫాస్ట్ బౌలర్ ?
జ: జస్‌ప్రీత్ బుమ్రా

◆ అంతర్జాతీయ విపత్తు ప్రమాద తగ్గింపు దినోత్సవాన్ని ఏటా ఏ రోజున నిర్వహిస్తారు? (ఐక్యరాజ్య సమితి విపత్తు ప్రమాద తగ్గింపు కోసం రూపొందించిన సెండాయ్ ఫ్రేమ్ వర్క్ (2015–2030)కు అనుగుణంగా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.)
జ: అక్టోబరు 13

◆ భారతీయ రిజర్వు బ్యాంక్ నూతన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు?
జ: సోనాలి సేన్ గుప్తా

◆ నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ ఫ్రేమ్ వర్క్ కింద నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వశాఖ దేశంలోని ఏ మూడు ఓడరేవులను గ్రీన్ హైడ్రోజన్ హబ్‌లుగా ప్రకటించింది? (స్వచ్ఛమైన ఇంధన మౌలిక సదుపాయాలను పెంపొందించడానికి కేంద్ర ప్రభుత్వం ఈ ఓడరేవులను గ్రీన్ హైడ్రోజన్ హబ్‌లుగా ప్రకటించింది.)
జ: దీన్ దయాళ్ పోర్ట్ (గుజరాత్), వీఓ చిదంబరనార్ పోర్ట్ (తమిళనాడు), పారాదీప్ పోర్ట్ (ఒడిశా)

మరింత సమాచారం

◆ యూకే మాజీ ప్రధాన మంత్రి రిషి సునాక్ ఇటీవల ఏ రెండు సంస్థలకు సీనియర్ సలహాదారుగా నియమితులయ్యారు?
జ: మైక్రోసాఫ్ట్, ఆంత్రోపిక్

JUNIOR INTER Botany — Biological Classification

1. What is the nature of cell wall in Diatoms?
A: In Diatoms, cell walls are made up of 'silica' and forms two overlapping shells called epitheca and hypotheca. They fit together like a soap box.

2. What do the terms 'Phycobiont' and 'Mycobiont' refer to? (2 Marks)
A: A group of special plants in which an algal member and fungal member leads symbiotic life. Algal member is called 'Phycobiont' and it supplies food to the fungus. Fungal member is called 'Mycobiont' and it gives shelter to algal member.

3. What do the terms 'Algal bloom' and 'Red tides' signify?
A: The algae like cyanobacteria (BGA) shows excessive growth in polluted water due to presence of organic nutrients is called Algal bloom.
The sea appears as red due to rapid multiplication of 'red dinoflagellates' is called Red tides.
e.g.: Gonyaulax lives in Mediterranean sea and makes it red.

4. How are Viroids different from Viruses?
A: **Viruses:** 1. Viruses have nucleic acid and proteins.
2. They contain DNA or RNA.
3. High molecular weight.
4. Infects plants, animals, humans and bacteria.
Viroids: 1. Viroids have nucleic acid only.
2. They contain RNA only.
3. Low molecular weight.
4. Infects plants only.


Final Exams-2026 IMPORTANT Q & A

5. Some plants are autotrophic, can you think of some plants that are partially Heterotrophic?
A: **Partial Heterotrophic plants:** Insectivorous plants or Parasites.
e.g.: Drosera, Dionaea, Nepenthes, Cuscuta

6. Give the main criteria used for classification by Whittaker.
A: Whittaker classification is based on cell structure, thallus organization mode of nutrition, reproduction.

1. Two kingdom classification was given by (1 Mark)
1) Whittaker 2) Linnaeus
3) Aristotle
4) Theophrastus
A: 2) Linnaeus

More Imp Q & A



Writer: Dr. Madavaram Chenna Kesavulu

సమీకరణంతో సమస్యకు సమాధానం!



ఇళ్లలో, ఆఫీసుల్లో, ఇంకా ఇతర సందర్భాల్లో తరచూ వయసుల ప్రస్తావన చేస్తుంటారు. తల్లిదండ్రులు, పిల్లలు రాబోయే రోజుల్లో ఎవరెవరు ఏ వయసుల్లో ఉంటారు, బాధ్యతలు ఏవిధంగా ఉండాలో ప్రణాళికలు వేస్తుంటారు. ఉద్యోగులు తమ సర్వీసు, రిటైర్‌మెంటు, ఇతర ప్రయోజనాల కోసం వయసుల లెక్కలు కడుతుంటారు. నిత్య జీవితంలో కీలకంగా ఉండే ఈ అంశంపై పోటీ పరీక్షల అంకగణితంలో ప్రశ్నలు అడుగుతుంటారు. అవి వ్యక్తి లేదా వ్యక్తుల సమూహాల ప్రస్తుత, గత, భవిష్యత్తు వయసులు, వాటి మధ్య సంబంధాలపై ఉంటాయి. ఒకరి వయసు, మరొకరి వయసు కంటే ఎన్ని రెట్లు ఎక్కువ ఉంది, కొంత కాలం తర్వాత లేదా ముందు వ్యక్తుల వయసుల మొత్తం లేదా తేడా ఎంత ఉండవచ్చు తదితరాలపై వస్తుంటాయి. వీటికి సమాధానాలను సరిగా కనుక్కోవాలంటే బీజగణితం ప్రాథమిక భావనలను తెలుసుకోవాలి. సరళ సమీకరణాలు, నిష్పత్తులు, అనుపాతాలను నేర్చుకోవాలి. సమస్యను తప్పులు లేకుండా అర్థం చేసుకొని, గణించడం ప్రాక్టీస్ చేయాలి.

వయసు సంబంధిత ప్రశ్నలు

వివిధ పోటీపరీక్షల్లో అరిథ్‌మెటిక్‌లో భాగంగా వయసు సంబంధిత ప్రశ్నలు అడుగుతున్నారు. అవి పలు రకాలుగా ఉంటాయి. వాటికి సమాధానాలను గుర్తించేందుకు అభ్యర్థులకు బీజగణిత పరిజ్ఞానంతో పాటు, తార్కిక ఆలోచన సామర్థ్యం ఉండాలి.

మాదిరి ప్రశ్నలు

1. 1936లో నా వయసు నేను పుట్టిన సంవత్సరంలో చివరి రెండు అంకెలను సూచిస్తుంది. నా తండ్రి నా కంటే 25 ఏళ్లు పెద్దవారు. అయితే నా తండ్రి వయసు ఎంత?

వివరణ: నేను పుట్టిన సంవత్సరం 19xy అనుకుంటే

దత్తాంశం నుంచి 1936లో నా వయసు xy అవుతుంది.



$\therefore$ xy = 1936 – 19xy

= 1936 – (1900 + xy)

= 1936 – 1900 – xy

$\therefore$ xy + xy = 36 $\Rightarrow$ 2xy = 36

$\therefore$ $xy = \frac{36}{2} = 18$

$\therefore$ నేను పుట్టిన సంవత్సరం 1918 అవుతుంది.

నా తండ్రి నా కంటే 25 ఏళ్లు పెద్దవారు. కాబట్టి నా తండ్రి వయసు (పుట్టిన సంవత్సరం) = 1918 – 25 = 1893

2. ఆషా 1997, జులై 14న జన్మించింది. ఆమె సోదరుడు 2002 అక్టోబరు 21న జన్మించాడు. ఇద్దరిలో పెద్దవారి వయసు ఎంత?

వివరణ: దత్తాంశం నుంచి 1997, జులై 14 నుంచి 2002 జులై 14 వరకు 5 ఏళ్లు.



2002 జులై 14 నుంచి 2002 అక్టోబరు 21 వరకు రోజులను లెక్కిస్తే

→ 14 జులై – 13 ఆగస్టు = 31 రోజులు (జులైలో 31 రోజులు)

→ 14 ఆగస్టు – 13 సెప్టెంబరు = 31 రోజులు (ఆగస్టులో 31 రోజులు)

→ 14 సెప్టెంబరు – 13 అక్టోబరు = 30 రోజులు (సెప్టెంబరులో 30 రోజులు)

→ 14 అక్టోబరు – 21 అక్టోబరు = 7 రోజులు

$\therefore$ వీరిలో పెద్దవారైన ఆషా వయసు = 5 సంవత్సరాల 3 నెలల 7 రోజులు అవుతుంది.

3. ప్రాచీన భారతదేశంలో 0 నుంచి 25 సంవత్సరాల వరకు బ్రహ్మస్త అని, 25 నుంచి 50 సంవత్సరాల వరకు గృహస్త అని పిలిచేవారు. నేను, నా సోదరుడు ఇద్దరం గృహస్తకు చెందిన వయసు కలిగిన వారం. మా వయసుల భేదం 6 ఏళ్లు, మా వయసులు ప్రధాన సంఖ్యలు, ఇంకా నా వయసుకు 31 కలపగా వచ్చిన సంఖ్య, నా సోదరుడి వయసుకి రెండు రెట్లు సమానం. అయితే మా ఇద్దరి వయసుల మొత్తం ఎంత?

వివరణ: నా వయసు x సంవత్సరాలు

నా సోదరుడి వయసు y సంవత్సరాలు అనుకుంటే దత్తాంశం నుంచి ఇద్దరి వయసుల భేదం = 6 $\Rightarrow$ x – y = 6... (1)

నా వయసుకు 31 కలపగా వచ్చిన సంఖ్య, నా సోదరుడి వయసుకు రెండు రెట్లు సమానం.



$\Rightarrow$ 2y = x + 31 ..... (2)

సమీకరణం (1) నుంచి x = y + 6

x = y + 6 ను సమీకరణం (2) లో ప్రతిక్షేపిస్తే

$\Rightarrow$ 2y = y + 6 + 31 $\Rightarrow$ 2y = y + 37

$\Rightarrow$ 2y – y = 37 $\Rightarrow$ y = 37

$\therefore$ x = y + 6 = 37 + 6 = 43

$\therefore$ నా వయసు = 43, నా సోదరుడి వయసు = 37

$\therefore$ ఇద్దరి వయసుల మొత్తం = 43 + 37 = 80 సంవత్సరాలు

జనరల్ స్టడీస్ — అరిథ్‌మెటిక్

4. ఒక వ్యక్తి తన పూర్తి జీవితాన్ని 1800వ సంవత్సరాలలో గడిపాడు. తన జీవిత చరమాంకంలో ఒకసారి ఈ కింది విధంగా వ్యాఖ్యానించాడు. ఒకప్పుడు x^2 సంవత్సరంలో నా వయసు x సంవత్సరాలు. అయితే ఆ వ్యక్తి జన్మించిన సంవత్సరం?

వివరణ: అతడి జీవితం పూర్తిగా 1800వ సంవత్సరాలలో అంటే 19వ శతాబ్దంలో గడిచింది. దత్తాంశం నుంచి అతడు పేర్కొన్న x^2 సంవత్సరం, 1800 నుంచి 1899 మధ్యలో ఉండాలి. ఈ సంవత్సరాల్లో కచ్చిత వర్గ సంవత్సరాన్ని కనుక్కోవాలి.

$\Rightarrow$ 1800 యొక్క వర్గ మూలం సుమారుగా 42.4



$\Rightarrow$ 1899 యొక్క వర్గమూలం సుమారుగా 43.5

$\therefore$ పై వివరణ నుంచి ఈ పరిధికి సంబంధించి x కి సరిపోయే ఏకైక పూర్ణాంక విలువ 43.

$\therefore$ 43 వర్గం = 43^2 = 1849

ఆ వ్యక్తి 1849లో 43 ఏళ్లు కలిగి ఉంటాడు.

$\therefore$ దత్తాంశం నుంచి పుట్టిన సంవత్సరం + 43 = 1849

$\therefore$ ఆ వ్యక్తి పుట్టిన సంవత్సరం = 1849 – 43 = 1806 అవుతుంది.

5. ఒక తండ్రి, కొడుకుల మొత్తం వయసు 41 సంవత్సరాలు. 17 సంవత్సరాల తర్వాత తండ్రి వయసు కుమారుడి వయసుకి రెండు రెట్లు. అయితే వారి వయసుల నిష్పత్తి ఎంత?

వివరణ: కుమారుడి వయసు x అనుకుంటే తండ్రి వయసు (41 – x) అవుతుంది.

దత్తాంశం నుంచి 17 ఏళ్ల తర్వాత తండ్రి వయసు, కుమారుడి వయసులో రెండు రెట్లు. $\Rightarrow$2(x + 17) = (41 – x + 17)

$\Rightarrow$ 2x + 34 = 58 – x

$\Rightarrow$ 2x + x = 58 – 34 = 24

$\Rightarrow 3x = 24 \Rightarrow x = \frac{24}{3} = 8$

$\therefore$ కుమారుడి వయసు = 8 సంవత్సరాలు

తండ్రి వయసు = 41 – 8 = 33

$\therefore$ వారి వయసుల నిష్పత్తి = 33 : 8

సంక్షిప్త పద్ధతి: దత్తాంశం నుంచి

మొత్తం వయసు = 41

ఎన్ని సంవత్సరాల తర్వాత = 17

తండ్రి వయసు, కుమారుడి వయసుకి ఎన్ని రెట్లు = 2

కుమారుడి వయసు = $\frac{41 - 17(2-1)}{2+1}$

$= \frac{41-17}{3} = \frac{24}{3} = 8$

తండ్రి వయసు = 41 – 8 = 33 సంవత్సరాలు



రచయిత: జె.వి.ఎస్.రావు

ఆ సభలోనే అత్యధిక అవిశ్వాస తీర్మానాలు!



పార్లమెంటులో దిగువ సభ, ప్రజల సభ అయిన లోక్‌సభ భారతదేశ ప్రజాస్వామ్యానికి హృదయం లాంటిది. జనం ప్రత్యక్షంగా ఎన్నుకునే ప్రతినిధులతో ప్రజావాణిని ప్రతిబింబిస్తుంది. కొత్త చట్టాల రూపకల్పనతో పాటు పాత చట్టాలకు సవరణలు చేస్తుంది. ఈ చట్ట సభ కార్యకలాపాలను నడిపే స్పీకర్‌కు రాజ్యాంగ రీత్యా మహోన్నత స్థానం ఉంది. ఆ అత్యున్నత లోక్‌సభ విధి విధానాలు, ప్రాధాన్యం, స్పీకర్ అధికారాలు, సభ నిర్వహణలో పాటించే సంప్రదాయాలు, సంబంధిత రాజ్యాంగ నిబంధనల గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. సార్వత్రిక ఎన్నికల వారీగా లోక్‌సభలో నిలిచిన అధికార ప్రతిపక్షాలు, ప్రధాన పార్టీలు సాధించిన సీట్లు, వివిధ లోక్‌సభల కాలాలు, కీలక పరిణామాలు, స్పీకర్లుగా పనిచేసిన వ్యక్తులు, వారి విశిష్టతలను తెలుసుకోవాలి.

ఇండియన్ పాలిటీ

లోక్‌సభ

1. లోక్‌సభ స్పీకర్ జీతభత్యాలకు సంబంధించి సరైన జవాబు గుర్తించండి.
ఎ) స్పీకర్ జీతభత్యాలను పార్లమెంటు నిర్ణయిస్తుంది.
బి) కేంద్ర అసంఘటిత నిధి నుంచి జీతభత్యాలు చెల్లిస్తారు.
సి) స్పీకర్ వేతనం నెలకు రూ. 4 లక్షలు.
డి) స్పీకర్ వేతనంపై ఆదాయపు పన్ను మినహాయించారు.
1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

2. లోక్‌సభ స్పీకర్ అధికార విధులకు సంబంధించి సరైన జవాబు గుర్తించండి.
ఎ) లోక్‌సభలో ఏ బిల్లు ప్రవేశపెట్టాలన్నా స్పీకర్ అనుమతి అవసరం.
బి) లోక్‌సభ రద్దు అయినప్పటికీ కొత్త లోక్‌సభ ఏర్పడే వరకు స్పీకర్ పదవి కొనసాగుతుంది.
సి) లోక్‌సభ సమావేశాలను తాత్కాలికంగా వాయిదా వేస్తారు.
డి) లోక్‌సభ సభ్యుల హక్కుల రక్షణకు సంరక్షకుడిగా వ్యవహరిస్తారు.
1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

3. రాష్ట్రపతి రాజీనామాను అధికారికంగా ఎవరు ప్రకటిస్తారు?
1) ఉపరాష్ట్రపతి 2) లోక్‌సభ స్పీకర్
3) సుప్రీంకోర్టు 4) అటార్నీ జనరల్

4. కింద పేర్కొన్న అంశాలలో సరైన జవాబును గుర్తించండి.
ఎ) లోక్‌సభకు, రాష్ట్రపతికి మధ్య సంధానకర్తగా స్పీకర్ వ్యవహరిస్తారు.
బి) పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన లోక్‌సభ సభ్యులను అనర్హులుగా ప్రకటించేది స్పీకర్.
సి) లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఒక బిల్లు ఆర్థిక బిల్లా? కాదా? అని ధ్రువీకరించేది స్పీకర్.
డి) లోక్‌సభలోని ఏదైనా బిల్లుపై ఓటింగ్ జరిగినప్పుడు అనుకూలంగా, వ్యతిరేకంగా సమాన ఓట్లు వచ్చినపుడు స్పీకర్ తన నిర్ణాయకపు ఓటుతో బిల్లు భవితవ్యాన్ని నిర్ణయిస్తారు.
1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి


5. పార్లమెంటు ఉభయసభల సంయుక్త సమావేశానికి ఎవరు అధ్యక్షత వహిస్తారు?
1) రాష్ట్రపతి 2) ఉపరాష్ట్రపతి
3) లోక్‌సభ స్పీకర్ 4) ప్రధానమంత్రి

6. లోక్‌సభ స్పీకర్ అధికారాన్ని గుర్తించండి.
ఎ) పార్లమెంటు నుంచి ఏర్పడిన 16 స్టాండింగ్ కమిటీలకు ఛైర్మన్లను నియమిస్తారు.
బి) లోక్‌సభ సచివాలయం స్పీకర్ ఆధీనంలో ఉంటుంది.
సి) రాజకీయ పార్టీలు స్పీకర్‌కు విప్ జారీ చేయరాదు.
డి) స్పీకర్‌కు అర్ధ న్యాయాధికారాలు ఉంటాయి.
1) ఎ, బి, డి 2) ఎ, సి, డి 3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

7. లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష పార్టీగా గుర్తించాలంటే ఒక రాజకీయ పార్టీ సాధించాల్సిన కనీస స్థానాల సంఖ్య?
1) 1/10 వ వంతు 2) 1/3 వ వంతు
3) 2/3 వ వంతు 4) 1/6 వ వంతు

8. లోక్‌సభలో ఒక రాజకీయ పార్టీకి ప్రధాన ప్రతిపక్ష పార్టీ హోదాను ఎవరు ప్రకటిస్తారు?
1) ప్రధానమంత్రి 2) రాష్ట్రపతి
3) లోక్‌సభ స్పీకర్ 4) ఉపరాష్ట్రపతి

9. కింద పేర్కొన్న అంశాల్లో సరైన జవాబును గుర్తించండి.
ఎ) మొదటి లోక్‌సభకు స్పీకర్ - జి.వి. మౌలాంకర్
బి) మొదటి లోక్‌సభకు డిప్యూటీ స్పీకర్ - అనంతశయనం అయ్యంగార్
సి) లోక్‌సభకు తొలి మహిళా స్పీకర్ - మీరాకుమార్
డి) పదవిలో ఉండగా మరణించిన లోక్‌సభ స్పీకర్ - జి.వి.మౌలాంకర్, జీఎంసీ బాలయోగి.
1) ఎ, సి, డి 2) ఎ, బి, డి
3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి



జి.వి.మౌలాంకర్


10. కింద పేర్కొన్న అంశాల్లో సరైన జవాబును గుర్తించండి.
ఎ) లోక్‌సభలో గుర్తింపు పొందిన మొదటి ప్రధాన ప్రతిపక్ష పార్టీ నాయకుడు - వై.బి.చవాన్
బి) లోక్‌సభలో గుర్తింపు పొందిన మొదటి ప్రధాన ప్రతిపక్ష పార్టీ - కాంగ్రెస్ (ఐఎన్‌సీ)
సి) ఆరో లోక్‌సభ కాలంలో తొలిసారిగా ప్రధాన ప్రతిపక్ష పార్టీని గుర్తించారు.
డి) ప్రధాన ప్రతిపక్ష పార్టీ నేతకు కేబినెట్ మంత్రి హోదా, సౌకర్యాలు కల్పిస్తారు.
1) ఎ, సి, బి 2) ఎ, బి, డి 3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి

11. లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ పదవిని ప్రతిపక్షాలకు కేటాయించే సంప్రదాయం దేశంలో ఎప్పటి నుంచి అమలులో ఉంది?
1) 1951 2) 1962 3) 1967 4) 1977

12. లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికైన ఎవరు 1967లో తన పార్టీ (కాంగ్రెస్) సభ్యత్వానికి రాజీనామా చేశారు?
1) సర్దార్ హుకుంసింగ్ 2) అనంతశయనం అయ్యంగార్
3) నీలం సంజీవరెడ్డి 4) సుమిత్రా మహాజన్

13. లోక్‌సభకు రెండుసార్లు స్పీకర్‌గా వ్యవహరించిన వారికి సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
ఎ) బలరాం జక్కర్ బి) జీఎంసీ బాలయోగి
సి) ఓం బిర్లా డి) శివరాజ్ పాటిల్
1) ఎ, బి, డి 2) ఎ, బి, సి
3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి

14. ప్రస్తుతం కొనసాగుతున్న 18వ లోక్‌సభకు స్పీకర్ ఎవరు?
1) సుమిత్రా మహాజన్
2) ఓం బిర్లా
3) మీరాకుమార్
4) శివరాజ్ పాటిల్



15. కింద పేర్కొన్న అంశాల్లో సరైన జవాబును గుర్తించండి.
ఎ) లోక్‌సభ సమావేశాలు నిర్వహించేందుకు కావాల్సిన కనీస సభ్యుల హాజరును 'కోరం' అంటారు.
బి) రాజ్యాంగంలోని ఆర్టికల్ 100 'కోరం' గురించి వివరిస్తుంది.
సి) లోక్‌సభలో 'కోరం'ను నిర్ణయించేది 'స్పీకర్'.
డి) 'కోరం' సభ్యుల సంఖ్య 1/10వ వంతు.
1) ఎ, సి, డి 2) ఎ, బి, డి
3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి

16. సభాధ్యక్షుల అనుమతి లేకుండా చట్టసభ సభ్యుడు వరుసగా ఎన్ని రోజుల పాటు సభా సమావేశాలకు గైర్హాజరు అయితే సభ్యత్వాన్ని కోల్పోతారు?
1) 30 రోజులు 2) 45 రోజులు
3) 60 రోజులు 4) 90 రోజులు

17. ఆర్టికల్ 102 ప్రకారం పార్లమెంటు సభ్యులు ఏ సందర్భంలో తమ చట్టసభ సభ్యత్వాన్ని కోల్పోతారు?
ఎ) పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం సభాధిపతిచే అనర్హుడిగా ప్రకటించినప్పుడు.
బి) భారతీయ పౌరసత్వాన్ని కోల్పోయినప్పుడు.
సి) న్యాయస్థానం 'దోషి'గా నిర్ధారించినప్పుడు
డి) మతిస్థిమితం కోల్పోయినప్పుడు.
1) ఎ, బి, డి 2) ఎ, సి, డి
3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి

18. ఆర్టికల్ 103 ప్రకారం పార్లమెంటు సభ్యులను అనర్హులుగా ప్రకటించేది ఎవరు?
1) రాష్ట్రపతి 2) ఉపరాష్ట్రపతి
3) స్పీకర్ 4) సుప్రీంకోర్టు

19. మొదటి లోక్‌సభకు ఎన్నికైన మహిళల సంఖ్య?
1) 18 2) 21 3) 22 4) 36

20. లోక్‌సభకు తొలి మధ్యంతర ఎన్నికలు ఎప్పుడు జరిగాయి?
1) 1962 2) 1967 3) 1969 4) 1971

21. కింద పేర్కొన్న అంశాల్లో సరైన జవాబును గుర్తించండి.
ఎ) దేశంలో ఎక్కువ కాలం కొనసాగిన లోక్‌సభ - 5వ లోక్‌సభ
బి) 5వ లోక్‌సభ పదవీకాలం 1971 - 1977.
సి) 5వ లోక్‌సభ కాలంలో జి.ఎస్.థిల్లాన్, బలిరాం భగత్ స్పీకర్లుగా వ్యవహరించారు.
డి) ఈ లోక్‌సభ కాలంలోనే ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదని అలహాబాద్ హైకోర్టు ప్రకటించింది.
1) ఎ, బి, డి 2) ఎ, సి, డి
3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి

22. ఆరో లోక్‌సభ ప్రత్యేకతకు సంబంధించి సరైన జవాబు గుర్తించండి.
ఎ) మొదటి కాంగ్రెసేతర ప్రభుత్వంగా జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పడింది.
బి) అతితక్కువగా 19 మంది మహిళలు ఎన్నికయ్యారు.
సి) మొరార్జీ దేశాయ్ ప్రధానిగా వ్యవహరించారు.
డి) తొలి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది.
1) ఎ, బి, డి 2) ఎ, సి, డి
3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి


23. ఎనిమిదో లోక్‌సభకు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
ఎ) ఇందిరా గాంధీ హత్యానంతరం జరిగిన ఎన్నికల ద్వారా ఏర్పడింది.
బి) ఈ లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీ స్థానాలు - 414
సి) రాజీవ్ గాంధీ ప్రధానిగా వ్యవహరించారు.
డి) ఈ లోక్‌సభ పదవీ కాలం 1985 - 1990
1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

24. ఎనిమిదో లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్షంగా అవతరించిన ప్రాంతీయ పార్టీ ఏది?
1) ద్రవిడ మున్నేట్ర కజగం (డీఎంకే)
2) తెలుగుదేశం పార్టీ (టీడీపీ)
3) అస్సాం గణ పరిషత్ (ఏజీపీ)
4) బహుజన సమాజ్‌వాదీ పార్టీ (బీఎస్పీ)

25. దేశంలో ఏ లోక్‌సభ ఎన్నికల అనంతరం 'హంగ్ పార్లమెంటు' ఏర్పడింది?
1) 8వ లోక్‌సభ 2) 7వ లోక్‌సభ
3) 9వ లోక్‌సభ 4) 10వ లోక్‌సభ

26. వివిధ లోక్‌సభల పదవీ కాలాలకు సంబంధించి సరైన జవాబు గుర్తించండి.
ఎ) 6వ లోక్‌సభ - 1977 నుంచి 1980
బి) 7వ లోక్‌సభ - 1980 నుంచి 1984
సి) 8వ లోక్‌సభ - 1984 నుంచి 1988
డి) 9వ లోక్‌సభ - 1989 నుంచి 1991
1) ఎ, బి, డి 2) ఎ, బి, సి,
3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి

27. ఏ లోక్‌సభ ఎన్నిక అనంతరం నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం వి.పి.సింగ్ ఆధ్వర్యంలో ఏర్పడింది?
1) ఏడో లోక్‌సభ
2) ఎనిమిదో లోక్‌సభ
3) తొమ్మిదో లోక్‌సభ
4) పదో లోక్‌సభ



28. అత్యధికంగా 8 సార్లు అవిశ్వాస తీర్మానాలు ఏ లోక్‌సభ కాలంలో ప్రవేశపెట్టారు?
1) 9వ లోక్‌సభ 2) 10వ లోక్‌సభ
3) 11వ లోక్‌సభ 4) 12వ లోక్‌సభ

29. వివిధ లోక్‌సభల పదవీకాలాలకు సంబంధించిన సరైన జవాబును గుర్తించండి.
ఎ) 10వ లోక్‌సభ - 1991 నుంచి 1996
బి) 11వ లోక్‌సభ - 1996 నుంచి 1998
సి) 12వ లోక్‌సభ - 1998 నుంచి 1999
డి) 13వ లోక్‌సభ - 1999 నుంచి 2004
1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి



రచయిత: బంగారు సత్యనారాయణ

సమాధానాలు

1-2; 2-4; 3-2; 4-4; 5-3; 6-4; 7-1; 8-3; 9-4; 10-4; 11-3; 12-3; 13-2; 14-2; 15-4; 16-3; 17-4; 18-1; 19-3; 20-4; 21-4; 22-4; 23-1; 24-2; 25-3; 26-1; 27-3; 28-2; 29-4.



ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
రీజనింగ్

సంక్లిష్ట సమీకరణాలు సరళీకరణతో సులువు

సూక్ష్మీకరణ - BODMAS నియమం

సంక్లిష్టమైన గణిత సమీకరణాలను సరళ పద్ధతిలోకి మార్చి సమాధానాలు కనుక్కోవడానికి సూక్ష్మీకరణ ఉపయోగపడుతుంది. ఈ అంశం సంఖ్యా సామర్థ్యం అనే విభాగంలోకి వస్తుంది. ఇందులో భిన్నాలు, దశాంశాలు కూడా ఉంటాయి. ఈ విధమైన సమస్యలను సాధించేందుకు కూడికలు, తీసివేతలు, గుణకారాలు, భాగహారాలు లాంటి ప్రాథమిక గణిత ప్రక్రియలు అవసరమవుతాయి. ఈ విభాగంలో ప్రశ్నలు ఛేదించేందుకు 'BODMAS' నియమాన్ని వినియోగిస్తారు.

మాదిరి ప్రశ్నలు

సూచన (ప్ర. 1 – 12): దిగువ ఇచ్చిన ప్రశ్నల్లో (?) గుర్తు స్థానంలో ఏం వస్తుందో గుర్తించండి.

1. $250 \div 5 + 18 \times 12 = ?$

1) 201 2) 190 3) 250 4) 266

సాధన: BODMAS నియమాన్ని వర్తింపజేస్తే,

$250 \div 5 + 18 \times 12 \Rightarrow 50 + 216 = 266$

సమాధానం: 4

2. $28^2 + 16 = ?\ \%\ \text{of}\ 20$

1) 4000 2) 2000 3) 2500 4) 3000

సాధన: $28^2 + 16 = 784 + 16 = 800.$

$800 = ?\ \%\ \text{of}\ 20$

$\Rightarrow 800 = \frac{?}{100}(20)$

$\Rightarrow 800 \times 100 = 20 \times ?$

$\Rightarrow ? = \frac{80000}{20} \Rightarrow ? = 4000$

సమాధానం: 1

3. $\frac{128}{4} + \frac{450}{9} = ? \times 2$

1) 51 2) 43 3) 41 4) 45

సాధన: $\frac{128}{4} + \frac{450}{9} = ? \times 2$

$32 + 50 = ? \times 2 \Rightarrow 82 = ? \times 2$

$\frac{82}{2} = 41 \Rightarrow ? = 41$

సమాధానం: 3

4. $\frac{1}{3}\ \text{of}\ 366 + \frac{2}{9}\ \text{of}\ 540 = ? \div 4$

1) 967 2) 968 3) 997 4) 978

సాధన: $\frac{1}{3}\ \text{of}\ 366 = \frac{1}{3} \times 366 = 122$

$\frac{2}{9}\ \text{of}\ 540 = \frac{2}{9} \times 540 = 120$

$122 + 120 = ? \div 4$

$242 = \frac{?}{4} \Rightarrow ? = 242 \times 4 = 968$

సమాధానం: 2

5. $\sqrt{1521} + 11 = ? + 15$

1) 39 2) 48 3) 35 4) 42

సాధన: $\sqrt{1521} + 11 = ? + 15$

$39 + 11 = ? + 15$

$50 = ? + 15$

$? = 50 - 15 = 35$

సమాధానం: 3

6. $1.8 \times 4 + 22.5 + 124.5 = ?$

1) 189.8 2) 136.6 3) 123.2 4) 154.2

సాధన: $1.8 \times 4 + 22.5 + 124.5 = ?$

$= 7.2 + 22.5 + 124.5$ (BODAMAS నియమం ప్రకారం)

$29.7 + 124.5 = 154.2$

సమాధానం: 4

7. $240 - 120 + 349 - 109 = ?$

1) 360 2) 240 3) 120 4) 180

సాధన: $240 - 120 + 349 - 109$

$240 + 349 - 120 - 109$

$= 589 - 120 - 109 = 469 - 109 = 360$

సమాధానం: 1

8. $2^4 \div 32 \times 4^2 = 2^?$

1) 1 2) 3 3) 5 4) 4

సాధన: $2^4 \div 32 \times 4^2 = 2^?$

$16 \div 32 \times 16 = 2^?$

$\frac{1}{2} \times 16 = 2^?$

$\Rightarrow 8 = 2^?$

$\Rightarrow 2^3 = 2^? \Rightarrow ? = 3$

సమాధానం: 2



రచయిత
రాజేశ్ మధు, విషయ నిపుణులు

9. $28\%\ \text{of}\ 400 + 125\%\ \text{of}\ 80 = ?^3 - 4$

1) 1 2) 2 3) 4 4) 6

సాధన: $\frac{28}{100}(400) + \left(\frac{125}{100}\right)(80) = ?^3 - 4$

$(28 \times 4) + \frac{10000}{100} = ?^3 - 4 \Rightarrow 112 + 100 = ?^3 - 4$

$\Rightarrow 212 + 4 = ?^3 \Rightarrow 216 = ?^3$

$\Rightarrow 6^3 = ?^3 \Rightarrow ? = 6$

సమాధానం: 4

10. $19.2 \times 4 - 0.4 \times 3 = ? - 1.5 \times 4$

1) 81.6 2) 87.4 3) 82.3 4) 86.5

సాధన: $19.2 \times 4 - 0.4 \times 3 = ? - 1.5 \times 4$

$76.8 - 1.2 = ? - 6 \Rightarrow 75.6 = ? - 6$

$? = 81.6$

సమాధానం: 1

11. $512 \div ? \times 6 = 192$

1) 11 2) 16 3) 12 4) 18

సాధన: $\left(\frac{512}{?}\right) \times 6 = 192$

$\frac{512}{?} = \frac{192}{6} \Rightarrow \frac{512}{?} = 32$

$\frac{512}{32} = ? \Rightarrow ? = 16$

సమాధానం: 2

12. $756 \div 14 \times 5 - \sqrt{7921} = ?$

1) 183 2) 178 3) 181 4) 199

సాధన: $756 \div 14 \times 5 - \sqrt{7921} = ?$

$54 \times 5 - 89 = ?$

$270 - 89 = ? \Rightarrow ? = 181$

సమాధానం: 3

Word of the Day 856

Paragon

Telugu meaning: శ్రేష్ఠత, ఉన్నతం

English meaning: The word paragon (పేరగాన్) is a noun that refers to a person or thing regarded as a perfect example of a particular quality.

Synonyms: Model, Ideal ***Antonyms:*** Flaw, Imperfection

Usage: 1. She is considered a paragon of honesty in the organization because of her unwavering integrity.

2. The teacher praised him as a paragon of discipline and academic excellence.

Latest Updates

Project Associate Posts

CSIR - Central Leather Research Institute (CLRI), Chennai, Tamil Nadu, invites applications for the post of Project Associate on a temporary basis. The total number of posts is 12. Eligible candidates can appear for the interview on 23 December 2025.

Havildar & Naib Subedar Posts

Indian Army invites applications from Unmarried Indian Male and Female candidates to appear in recruitment trials of outstanding sportspersons to join the Indian Army as Direct Entry Havildar and Naib Subedar (Sports) Intake 05/ 2025 Under Sports Quota Entry. The last date for receipt of offline applications is 15 December 2025.

Assistant Manager, Junior Officer Posts

Balmer Lawrie & Co Ltd invites online applications for the Assistant Manager, Junior Officer posts. The total number of posts is 10. Eligible candidates can apply online before 19 December 2025.

Did You Apply..?

Today (December 10) is the last date for the following Jobs/ Apprentice posts

☛ RRB - 2,569 Junior Engineer, Metallurgical Assistant Posts. ***Qualification:*** Diploma (Engineering), B.Sc. degree.

☛ Assistant Professor Jobs in IIIT Nagpur. ***Eligibility:*** BE/B.Tech/ ME/ M.Tech/ PhD

☛ 210 Trade, Technician, Graduate Apprentice Trainee posts in MIDHANI. ***Qualification:*** Diploma, Graduate, ITI.

☛ 38 Trade Apprentice posts in DRDO-CFEES. ***Eligibility:*** ITI pass.

☛ 20 Scientist Posts in CSIR-AMPRI. ***Eligibility:*** BE/B.Tech, ME/M.Tech, Ph.D.

For more information and other notifications - scan QR code

మానవ హక్కుల దినోత్సవం

డిసెంబరు 10
చరిత్రలో ఈనాడు

జాతి, కులం, లింగం లేదా మరే ఇతర హోదాతో సంబంధం లేకుండా మానవులందరికీ స్వేచ్ఛ, సమానత్వం, భావప్రకటన లాంటి మౌలిక హక్కులు ఉంటాయి. పరిస్థితులతో సంబంధం లేకుండా ప్రతి వ్యక్తి సమాజంలో ఒక సభ్యుడిగా అనుభవించే కనీస హక్కులనే 'మానవ హక్కులు' అంటారు. వీటి పరిరక్షణకు ఆయా దేశాలు చట్టబద్ధత కల్పించాయి. ప్రజలందరికీ తమ హక్కులపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఏటా డిసెంబరు 10న 'మానవ హక్కుల దినోత్సవం'గా (Human Rights Day) నిర్వహిస్తారు. హక్కుల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యల గురించి తెలియజేయడం, వాటి రక్షణ కోసం పోరాడుతున్న వ్యక్తులు - సంస్థలను గౌరవించుకోవడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

ఛైర్మన్ – సభ్యులు:

జాతీయ మానవ హక్కుల కమిషన్‌లో ఒక ఛైర్మన్, నలుగురు సభ్యులు ఉంటారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా లేదా సాధారణ న్యాయమూర్తిగా పనిచేసిన వ్యక్తిని కమిషన్‌కు ఛైర్మన్‌గా నియమిస్తారు. సుప్రీంకోర్టులో న్యాయమూర్తిగా పనిచేస్తున్న లేదా పనిచేసిన వ్యక్తిని ఒక సభ్యుడిగా, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్న లేదా పనిచేసిన వ్యక్తిని మరొక సభ్యుడిగా నియమిస్తారు.

▮ ఛైర్మన్, సభ్యుల పదవీకాలం 5 ఏళ్లు లేదా వారికి 70 ఏళ్ల వయసు వచ్చే వరకు ఉంటుంది.




చారిత్రక నేపథ్యం

రెండో ప్రపంచ యుద్ధ సమయంలో ప్రపంచవ్యాప్తంగా మానవులపై అనేక దురాగతాలు చోటుచేసుకున్నాయి, తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘన జరిగింది. మనుషులపై జరిగే దారుణాలను నిరోధించి, వారి గౌరవాన్ని కాపాడే లక్ష్యంతో ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ 1948, డిసెంబరు 10న విశ్వమానవ హక్కుల ప్రకటనను (Universal Declaration of Human Rights - UDHR) ఆమోదించింది. దీనికి గుర్తుగా ఏటా డిసెంబరు 10న 'మానవ హక్కుల దినోత్సవం'గా జరుపుకోవాలని 1950లో ఐరాస జనరల్ అసెంబ్లీ తీర్మానించింది. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం దీన్ని నిర్వహిస్తున్నారు. వివక్ష, అసమానతలు, అణచివేత లాంటి వాటికి వ్యతిరేకంగా మానవ హక్కులకు సంబంధించి కొనసాగుతున్న పోరాటాల గురించి అవగాహన కల్పించడం లాంటివి ఈ రోజు చేస్తారు.

ఎన్‌హెచ్ఆర్‌సీ ఏర్పాటు, గత పరీక్షల్లో అడిగిన ప్రశ్నల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - బయాలజీ

వైరస్‌లు



వైరస్ అనే పదం లాటిన్ భాష నుంచి వచ్చింది. దీని అర్థం 'విషం' లేదా 'వీనమ్'. వీటిని జీవ రసాయనికంగా వ్యాధిని కలిగించే న్యూక్లియో ప్రొటీన్లుగా పేర్కొంటారు. వైరస్‌ల గురించి అధ్యయనం చేసే జీవశాస్త్ర శాఖను 'వైరాలజీ' అంటారు. ఇవి సాధారణంగా జీవకణాల్లో ఉండే అవికల్ప పరాన్నజీవులుగా మాత్రమే జీవిస్తాయి. ఇవి స్వేచ్ఛగా జీవి లక్షణాలను ప్రదర్శిస్తూ జీవించ లేవు. ఇవి అతిథేయి లేదా హోస్ట్ సమక్షంలో మాత్రమే ప్రత్యుత్పత్తి జరుపుకుంటాయి.

లక్షణాలు

వైరస్‌లలో జన్యుపదార్థంగా RNA లేదా DNA ఏదో ఒకటి మాత్రమే వ్యవస్థితమవుతుంది. సందర్భానుసారం వైరస్‌లు నిర్జీవ, సజీవ లక్షణాలు ప్రదర్శిస్తాయి. నిర్జీవులకు, సజీవులకు మధ్య సంధానసేతువులుగా వైరస్‌లను పేర్కొంటారు.

- వైరస్‌లు నిర్మాణరీత్యా బాహ్య కవచం, కాప్సిడ్, జన్యు పదార్థాలను కలిగి ఉంటాయి. అయితే బాహ్యకవచం కొన్ని వైరస్‌లలో మాత్రమే కనిపిస్తుంది. ఇది ప్రొటీన్లు, లిపిడ్లు, కార్బోహైడ్రేట్లతో నిర్మితమై ఉంటుంది. ఈ బాహ్య కవచ ప్రమాణాలను పెప్లోమియర్లు అంటారు. ఈ బాహ్యకవచం లోపించిన వైరస్‌లను నగ్నవైరస్‌లు అంటారు.

వైరస్‌ల ఆకారాలు, జన్యు పదార్థాలు - రకాలు, హానికర వైరస్‌లు మొదలైన అంశాలతో పాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

కరెంట్ అఫైర్స్

సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు యునెస్కో నిర్వహిస్తున్న సదస్సు 2025, డిసెంబరు 8న దిల్లీలోని ఎర్రకోటలో ప్రారంభమైంది. ఇలాంటిది మన దేశంలో జరగడం ఇదే తొలిసారి. సదస్సులో వారసత్వ జాబితాల్లో చేర్చడానికి వచ్చిన ప్రతిపాదనల్ని అంతర్ ప్రభుత్వ కమిటీ పరిశీలిస్తుంది. దీని ముందుకు దీపావళి పండుగ సహా 67 నామినేషన్లు వచ్చాయి. 2025, డిసెంబరు 13 వరకు ఇది జరుగుతుంది.



భారత అంతరిక్ష రంగ వ్యాపారం రాబోయే 8-10 ఏళ్లలో సుమారు రూ.4 లక్షల కోట్ల (45 బిలియన్ డాలర్లు)కు చేరొచ్చని భారత అంతరిక్ష కార్యకలాపాల శాఖ మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. 2035 కల్లా భారతీయ అంతరిక్ష స్టేషన్ పేరుతో ఒక అంతరిక్ష కేంద్రం (స్పేస్ స్టేషన్) ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అంతరిక్ష సాంకేతికతలో ప్రపంచంలోనే అగ్రగామిగా భారత్ అవతరించేందుకు, ప్రైవేట్ పెట్టుబడుల వైపు ప్రభుత్వం మొగ్గు చూపుతోందని తెలిపారు.



స్థూల జాతీయాదాయం పెరుగుతున్నప్పటికీ చాలా దేశాల్లో ఆర్థిక అసమానతలు మాత్రం ఆశించిన స్థాయిలో తగ్గడం లేదని నేచర్ సస్టెయినబిలిటీ అనే జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం వెల్లడించింది. 2023 నాటికి ప్రపంచవ్యాప్తంగా దాదాపు సగం జనాభా.. ఆదాయ అసమానతలు పెరిగిన దేశాల్లోనే ఉందని పేర్కొంది. దేశాల్లో, దేశాల మధ్య అసమానతలను తగ్గించడం ఐక్యరాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో (ఎస్‌డీజీ) పదోది. దాన్ని సాధించడంలో ప్రపంచ పురోగతిని గుర్తించేందుకు ఫిన్లాండ్‌లోని ఆల్టో విశ్వవిద్యాలయం సహా పలు ఇతర సంస్థలకు చెందిన పరిశోధకులు భారత్, బ్రెజిల్, చైనా తదితర దేశాల్లో ఉమ్మడిగా తాజా అధ్యయనాన్ని నిర్వహించారు.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Idioms & Phrases

Directions (1 - 17): *Fill in the blanks with the correct idiom/phrasal verb to make the sentence grammatically and contextually correct.*

1. The athlete trained hard every single day to ensure he would not .... during the final race.

A) blow the lid off
B) grease the wheels
C) cut to the chase
D) roll out the carpet
E) drop the ball

2. When the company lost a major client, the CEO had to .... to regain investor confidence.

A) shoot the breeze
B) cut the mustard
C) weather the storm
D) fish for compliments
E) spill over

3. The teacher advised students not to .... the exam and instead prepare seriously.

A) take a rain check
B) make light of
C) lay down the law
D) blow off steam
E) move mountains

4. Raj's plan to start a cafe was initially criticized, but he proved everyone wrong and finally began to ....

A) find his feet
B) throw his weight around
C) turn the tables D) eat his words
E) draw a blank

5. The sudden increase in prices has .... many households already struggling financially.

A) hit home B) kept tabs on
C) fallen apart D) taken its toll on
E) gone the extra mile

6. During negotiations, the lawyer managed to .... an agreement that satisfied both parties.

A) muddle through B) cook up
C) shoot down D) drag on
E) iron out

7. The young entrepreneur was determined to succeed and refused to .... even when facing repeated failures.

A) throw in B) let up
C) cave in D) call the shots
E) go under

8. The new intern always tries to .... by agreeing with everything the boss says.

A) brown-nose B) dig in
C) gloss over D) lash out
E) squirrel away

Bank Exams

English

9. She finally decided to ...... her disappointment and focus on improving her performance.

A) bottle up B) shake off
C) jump at D) let up
E) harp on

10. The coach told the players to .... their differences and work as a team.

A) step on toes B) bury the lead
C) put aside D) throw in
E) crack up

11. The CEO's sudden resignation .... speculation among the employees.

A) chipped in B) ticked off
C) held out D) eased off
E) stirred up

12. The journalist promised not to .... the confidential sources who provided information.

A) let up B) split hairs
C) give away D) crack down on
E) bail out

13. The committee decided to .... the proposal after finding several inconsistencies.

A) turn down B) check in
C) fizzle out D) go overboard
E) fall back

14. The teacher encouraged students to .... new ideas rather than just memorizing facts.

A) gloss over B) back out
C) hammer out D) mull over
E) crack up

15. The committee was accused of trying to .... the truth about the financial irregularities.

A) sweep away B) cover up
C) pan out D) chicken out
E) crop up

16. The startup struggled initially, but things began to .... after they secured funding.

A) look up B) run dry
C) square off D) peter out
E) lash out

17. He tried to .... by blaming his teammates for the failure.

A) pass the torch B) give in
C) shift gears
D) pass the buck
E) wind up

Scan the QR code for Key

Writer: P. Manoj Kumar, Subject Expert

ఎంసీఏ పూర్తయింది. వయసు 37 ఏళ్లు. ఎయిర్‌పోర్టులో పనిచేయాలనుంది. అక్కడ ఎలాంటి ఉద్యోగాలు ఉంటాయి? -వై.అరుణ

ఎయిర్‌పోర్టులో ఏ ఉద్యోగాలు?



■ సాధారణంగా ప్రభుత్వరంగ సంస్థ అయిన ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియాలో ఉద్యోగాలకు గరిష్ఠ వయసు 27 నుంచి 30 ఏళ్ల మధ్య ఉంటుంది. సామాజిక రిజర్వేషన్లు ఉన్న వారికి గరిష్ఠంగా మరో ఐదేళ్ల వరకూ సడలింపు వర్తిస్తుంది. కాబట్టి 37 సంవత్సరాల వయసులో మీరు ప్రభుత్వ ఉద్యోగం పొందే అవకాశం లేదు.

✦ ప్రైవేట్ రంగంలోని ఎయిర్‌లైన్స్, గ్రౌండ్ హ్యాండ్లింగ్ సంస్థలు వయసు విషయంలో కొంత సడలింపు ఇస్తాయి. అయితే అది కూడా ప్రధానంగా ఉద్యోగ అనుభవం ఉన్నవారికి మాత్రమే వర్తిస్తుంది. మీ వయసు 37 సంవత్సరాలు అని పేర్కొన్నా, గత ఉద్యోగానుభవం గురించి వివరాలు ఇవ్వలేదు. ఎలాంటి అనుభవమూ లేకపోతే ప్రైవేట్ ఎయిర్‌లైన్స్‌లోనూ టెలికమ్యూనికేషన్ లేదా ఎయిర్‌పోర్ట్ టెక్నికల్ విభాగాల్లో ఉద్యోగం పొందడం కష్టమే. కానీ, ఇతర విభాగాలకు మాత్రం వయసు పెద్ద సమస్య కాకపోవచ్చు. ముఖ్యంగా టికెట్ కమ్యూనికేషన్స్, గ్రౌండ్ స్టాఫ్, కస్టమర్ సర్వీస్, కార్గో హ్యాండ్లింగ్, ఐటీ సపోర్ట్ నెట్‌వర్క్, ఆపరేషన్స్ లాంటి విభాగాల్లో కొన్ని ప్రైవేట్ విమానయాన సంస్థలు వయసుతో సంబంధం లేకుండా నియామకాలు చేపడుతున్నాయి. ఇవి ప్రయాణికులతో వ్యవహరించే లేదా ఆపరేషనల్ సపోర్ట్ అందించే విభాగాలు కావడంతో.. వయసు కంటే కమ్యూనికేషన్, కస్టమర్ హ్యాండ్లింగ్, బేసిక్ కంప్యూటర్ నైపుణ్యాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాయి.

✦ ఎంసీఏ పూర్తి చేసిన మీలాంటి వారికి ఎయిర్‌పోర్ట్‌లో ఐటీ హెల్ప్ డెస్క్, సిస్టమ్స్ సపోర్ట్, నెట్‌వర్క్ టెక్నీషియన్, ఎయిర్‌లైన్స్ టికెటింగ్ సిస్టమ్స్ ఎగ్జిక్యూటివ్, ఎంఐఎస్ డేటా అసిస్టెంట్ లాంటి ఉద్యోగాలు అందుబాటులో ఉంటాయి. మీ వయసు రీత్యా కొంతమేర ప్రతికూలత ఉండొచ్చు. అయినప్పటికీ టెక్నికల్ స్కిల్స్. నెట్‌వర్కింగ్, సిస్టమ్ ట్రబుల్ షూటింగ్, డేటా మేనేజ్‌మెంట్, సర్వర్ బేసిక్స్ తెలిస్తే వయసుతో నిమిత్తం లేకుండా మీ ఉద్యోగావకాశాలు పెరుగుతాయి.

✦ టికెట్ కమ్యూనికేషన్స్ లేదా గ్రౌండ్ స్టాఫ్ ఉద్యోగాలు పొందాలంటే ఇంగ్లిష్ కమ్యూనికేషన్, కస్టమర్లతో మాట్లాడే నైపుణ్యం, కంప్యూటర్ బేసిక్స్ తప్పనిసరి. వీటితో పాటు కొన్ని ఎయిర్‌లైన్ టికెటింగ్ సాఫ్ట్‌వేర్లపై శిక్షణ పొందితే ఎయిర్ పోర్ట్‌లో ఉద్యోగం పొందే అవకాశాలు మెరుగవుతాయి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

మల్టీ టాస్కింగ్ స్టాఫ్

నేషనల్ జియోగ్రాఫికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, హైదరాబాద్.. మల్టీ టాస్కింగ్ స్టాఫ్(ఎంటీఎస్) ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● మల్టీ టాస్కింగ్‌స్టాఫ్ (ఎంటీఎస్): 12 పోస్టులు

అర్హత: పదో తరగతి, ఇంటర్‌తో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** జనవరి 5, 2026 నాటికి 25 ఏళ్లు ఉండాలి. **వేతనం:** నెలకు రూ.35,973.
దరఖాస్తు ఫీజు: రూ.500. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 5, 2026. **ఎంపిక:** రాత పరీక్షతో
వెబ్‌సైట్: https://www.ngri.res.in/openings-at-ngri.php

జూనియర్ ఇంజినీర్లు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, హైదరాబాద్.. ఒప్పంద ప్రాతిపదికన జూనియర్ ఇంజినీర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

● జూనియర్ ఇంజినీర్(ఎలక్ట్రికల్): 02
● జూనియర్ ఇంజినీర్ (సివిల్): 02

అర్హత: బీఈ/బీటెక్ (ఎలక్ట్రికల్/సివిల్)తో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 40 ఏళ్లలోపు ఉండాలి.
వేతనం: నెలకు రూ.50,000.
ఇంటర్వ్యూ తేదీలు: డిసెంబరు 22, 23.
వెబ్‌సైట్: https://www.iith.ac.in/careers/

అగ్రికల్చర్ ఇన్‌స్టిట్యూట్‌లో..

ఇండియన్ అగ్రికల్చర్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, న్యూదిల్లీ.. ఒప్పంద ప్రాతిపదికన యంగ్ ప్రొఫెషనల్, జూనియర్ రిసెర్చ్ ఫెలోల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

● జూనియర్ రిసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్): 01
● యంగ్ ప్రొఫెషనల్-2: 02

అర్హత: సంబంధిత విభాగంలో పీజీతో పాటు పని అనుభవం ఉండాలి.
వయసు: 35 ఏళ్లు మించరాదు.
వేతనం: నెలకు జేఆర్ఎఫ్‌కు రూ.31,000, యంగ్ ప్రొఫెషనల్-2కు రూ.42,000. **ఇంటర్వ్యూ తేదీలు:** డిసెంబరు 29, 30.
వెబ్‌సైట్: https://www.iari.res.in/bms/announcements/jobs.php

టీఐఎఫ్ఆర్‌లో వర్క్ అసిస్టెంట్లు

టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చ్, ముంబయి.. వివిధ విభాగాల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● వర్క్ అసిస్టెంట్ (ఆగ్జలరీ): 03 ● వర్క్ అసిస్టెంట్ (ఫిట్టర్): 01 ● ప్రాజెక్ట్ సైంటిఫిక్ అసిస్టెంట్(బీ): 01 ● ప్రాజెక్ట్ ట్రేడ్స్‌మ్యాన్(బీ): 01 ● ప్రాజెక్ట్ ఫిజికల్ ఇన్‌స్ట్రక్టర్: 01

అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, డిప్లొమా, ఐటీఐ, డిగ్రీతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 28 నుంచి 31 ఏళ్లలోపు ఉండాలి.
వేతనం: నెలకు వర్క్ అసిస్టెంట్‌కు రూ.35,973. ప్రాజెక్ట్ సైంటిఫిక్ అసిస్టెంట్‌కు రూ.63,900. ప్రాజెక్ట్ ట్రేడ్స్‌మ్యాన్, ఫిజికల్ ఇన్‌స్ట్రక్టర్లకు రూ.41,100.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 3, 2026.
ఎంపిక: రాత పరీక్ష/స్కిల్ టెస్ట్‌తో.
వెబ్‌సైట్: https://www.tifr.res.in/maincampus/careers.php

అలహాబాద్ యూనివర్సిటీలో

అలహాబాద్ యూనివర్సిటీ.. ఒప్పంద ప్రాతిపదికన కోచ్ ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. ● కోచ్ - 06

విభాగాలు: అథ్లెటిక్స్, హాకీ, వాలీబాల్, బాస్కెట్‌బాల్, క్రికెట్, ఫుట్‌బాల్.
అర్హత: సంబంధిత క్రీడా విభాగంలో డిప్లొమా, డిగ్రీ ఉండాలి.
వేతనం: నెలకు రూ.25,000. - రూ.35,000. **ఇంటర్వ్యూ తేదీ:** 20.12.2025. **వేదిక:** ది యూనివర్సిటీ గెస్ట్ హౌస్, చైతమ్ లైన్స్, యూనివర్సిటీ ఆఫ్ అలహాబాద్. **వెబ్‌సైట్:** https://www.allduniv.ac.in/recruitment_show/203

స్తబ్ధుగా ఉన్న విశ్వ ఆర్థిక వ్యవస్థకు గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ)లు జవసత్వాలు అందిస్తున్నాయి. ఇవి దేశ ఆదాయంలో ముఖ్యమైన వనరులుగా రూపాంతరం చెందుతున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ పలు విభాగాల్లో జీసీసీలు ఏర్పాటవుతున్నాయి. భవిష్యత్తులో మరిన్ని సంస్థలూ ముందుకొస్తాయి. ఈ పరిణామాలతో భిన్న విద్యా నేపథ్యాలున్న పట్టభద్రులు మేటి అవకాశాలెన్నో అందుకోవడానికి మార్గం సుగమమైంది.

జీసీసీలు.. పట్టభద్రులకు వరం



ప్రపంచ స్థాయి ప్రమాణాలు: అంటే గ్లోబల్ ఎక్స్‌పోజర్. కార్పొరేట్ కెరియర్లలో హోదాలూ, వేతనాలూ ఎంత ముఖ్యమో.. చేసే పని, నేర్చుకునే నైపుణ్యాలూ అంతే ప్రధానం. హోదాలు వర్తమానంలో తృప్తినిస్తే.. నేడు చేస్తున్న పని రేపటికి పునాది అవుతుంది. జీసీసీల్లో ప్రపంచ స్థాయి బృందాలతో కలిసి పనిచేయాలి. విభిన్న సంస్కృతులు, నేపథ్యాలు పరిచయమవుతాయి. విశ్వ వేదికగా అనుసరిస్తున్న విధానాలూ తెలుస్తాయి. ఇవన్నీ కొత్త పని అనుభూతిని సొంతం చేస్తాయి.

కెరియర్‌లో వృద్ధి: జీసీసీల్లో ప్రతి హోదాకూ అనుబంధంగా స్కిల్ సెట్, దానిని మించి కొత్త స్కిల్స్ నేర్చుకోగలిగితే అధిరోహించే హోదాలు కళ్ల ముందు కనిపిస్తుంటాయి. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలను అందుకుంటూ పనిచేసే గొప్ప అనుభూతిని ఇవి ఇస్తున్నాయి.

నైపుణ్యాల మెరుగుదల: జీసీసీల్లో అనివార్యంగా ఉద్యోగార్థి తనకు ఇప్పటికే వచ్చిన స్కిల్ సెట్‌కు పదును పెట్టాలి. ప్రాజెక్టు లక్ష్యాలు, మార్కెట్ అవసరాల రీత్యా నూతన నైపుణ్యాలూ నేర్చుకోవాలి.



అత్యుత్తమ ప్యాకేజీలు: జీసీసీల్లో పని సంస్కృతి, వినియోగించే సాంకేతికత, ప్రాజెక్టులు డిమాండ్ చేసే నైపుణ్యాలు ఎంత ఉన్నతంగా ఉంటాయో హోదాకు తగ్గ ప్రతిఫలం అంతే స్థాయిలో ఉంటుంది. స్థానిక సంస్థలకూ, పేరున్న జీసీసీలకూ వేతనంలో ఊహించనంత అంతరం ఉంటుంది.

ఖండాంతరాల్లో అవకాశాలు: జీసీసీల్లో పనిరీత్యా నైపుణ్యాల దృష్ట్యా ఎదిగితే వేర్వేరు దేశాల్లో అవకాశాలు వస్తాయి. ఇవి రెండు రకాలుగా ఉంటాయి. ప్రస్తుతం పనిచేస్తున్న జీసీసీల ఇతర దేశాల కేంద్రాల్లో అవకాశం రావచ్చు లేదా ఇతర బహుళ జాతి కార్పొరేట్ సంస్థల జీసీసీల్లో మెరుగైన హోదాలో కొలువులు దక్కొచ్చు.

ఇంతటి ఆకర్షణీయమైన కెరియర్ అందించే జీసీసీల్లో 2030 నాటికి 20 లక్షల మంది వేర్వేరు విభాగాల్లో, విభిన్న నేపథ్యాలతో నిపుణుల అవసరం ఏర్పడుతోంది. వీటిలో గుండెకాయ వంటి ఐటీ, టెక్నాలజీతో పాటు ఇతర ఎన్నో శాఖలకూ నిపుణుల అవసరం ఉంది.

అమెరికా లేదా యూరప్‌లో ఉండే ఒక భారీ కార్పొరేట్ సంస్థ ఇండియాతో సహా వివిధ దేశాల్లో నెలకొల్పే జీసీసీలు కేవలం టెక్నాలజీ అవసరాల కోసమే కాదు.. ఫైనాన్స్, అనలిటిక్స్, మేనేజ్‌మెంట్ విధులకూ కేంద్రాలవుతున్నాయి.

ఫైనాన్స్ అండ్ అనలిటిక్స్: ఆర్థిక సేవలు, విశ్లేషణ కొత్త అవకాశాలను కనుగొనే ఫైనాన్షియల్ అనలిస్టులు, ప్రిన్సిపల్ అనలిస్టులు, రిస్క్ కంప్లయెన్స్ స్పెషలిస్టులు, ఇన్వెస్టిమెంట్ రిసెర్చ్ అనలిస్టులు, రెవెన్యూ అకౌంటెంట్, బిల్లింగ్ స్పెషలిస్ట్ లాంటి పొజిషన్లు ఎంబీఏ ఫైనాన్స్ చేసిన వారికి అందుబాటులో ఉంటున్నాయి.

సేల్స్ అండ్ మార్కెటింగ్: జీసీసీలు వందలాది సంస్థలకు సేల్స్, మార్కెటింగ్ సొల్యూషన్స్ అందజేస్తుంటాయి. ఈ విభాగంలో సేల్స్ మేనేజర్, బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్/మేనేజర్, ట్రేడ్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, మార్కెటింగ్, కన్జ్యూమర్ అనలిస్ట్, డిజిటల్ మార్కెటింగ్ స్పెషలిస్ట్ లాంటి హోదాలకు అవకాశం ఉంది.

ఆపరేషన్స్ అండ్ సప్లయ్ చెయిన్: ఒకప్పుడు వస్తు సేవలకే పరిమితమైన సప్లయ్ చెయిన్ ఆపరేషన్స్ నేడు సేవల్లోనూ భాగమైంది. ఈ విభాగంలో లాజిస్టిక్ మేనేజర్, డిమాండ్ ప్లానర్, ప్రాసెస్ ఎక్సలెన్స్ కన్సల్టెంట్, స్టోర్ మేనేజర్ లాంటి హోదాలకు సంబంధిత విద్యా నేపథ్యాలున్న యువతకు అవకాశం లభిస్తోంది.

ఇతర పొజిషన్లు: కొన్ని జీసీసీల్లో మేనేజ్‌మెంట్ అండ్ స్ట్రాటజీ విభాగంలో గ్లోబల్ కెపాసిటీ సెంటర్ హెడ్, ప్రోడక్ట్ ఓనర్, బిజినెస్ ప్రాసెస్ కన్సల్టెంట్ లాంటి కెరియర్లకూ వీలుంటోంది. ఇంకా.. హెచ్ఆర్ విభాగాల్లోనూ అవకాశాలు వస్తున్నాయి. అసిస్టెంట్ మేనేజర్, మేనేజర్-హెచ్ఆర్, కస్టమర్ స్పెషలిస్ట్, బిజినెస్ అనలిస్ట్ కెరియర్లు ఉంటున్నాయి.

అంటే జీసీసీలు కేవలం టెక్నాలజీ నెలవులే కాదు. ఇవి నెలకొల్పే కార్పొరేట్ ఏ బిజినెస్ సెగ్మెంట్లో పనిచేస్తుందో దానికి అనుబంధంగా.. ఆపరేషన్స్, ఆర్ అండ్ డీ, ఇన్నొవేషన్ (కొత్త ఆవిష్కరణలు) కోసం ఈ కేంద్రాల స్థాపన జరుగుతోంది. అందువల్ల కేవలం ఐటీ యువతే కాకుండా వేర్వేరు సబ్జెక్టు నేపథ్యాల నుంచి వచ్చిన ఉద్యోగార్థులకూ జీసీసీలు స్వర్గధామంగా నిలుస్తాయి. అయితే అంతర్జాతీయ ప్రమాణాలతో పనిచేసే జీసీసీల్లో అడుగు పెట్టేందుకు అవకాశం వచ్చాక రాణించేందుకు ఎలాంటి నైపుణ్యాలు ఉండాలో అవగతం చేసుకుంటే అవి సాదరంగా స్వాగతం పలుకుతాయి.

జీసీసీలతో.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను పరుగులు పెట్టించవచ్చు. దేశాల ఆర్థిక వనరులను మెరుగు పరచవచ్చు. కార్పొరేట్ సంస్థల బ్యాలెన్స్ షీట్లను పటిష్ఠం చేయవచ్చు. అయితే.. కొత్త కొలువులు ఆశించే ఉద్యోగార్థికి ఇవి ఇచ్చేదేమిటి? ఈ కోణంలో పరిశీలించినప్పుడు భవిష్యత్తులో ఎన్నో అవకాశాలు విభిన్న విద్యా నేపథ్యాలతో సొంతం చేసుకోవచ్చని తెలుస్తుంది.

ఉపాధి పథం
నైపుణ్య సాధనం



యస్.వి. సురేష్
సంపాదకుడు, ఉద్యోగ సోపానం

సోషల్ మీడియా.. ప్రపంచానికి వేదికగా మారింది. ఎంతో మంది దీనిద్వారా కొత్త నైపుణ్యాలు నేర్చుకుని, ఉన్నత అవకాశాలు పొందుతున్నారు. కానీ, కొంత మంది ముఖ్యంగా విద్యార్థుల విషయంలో ఇదొక వ్యసనంగా మారింది. జీవనశైలిలో అంతర్భాగమైన దీన్ని నివారించడం కష్టమైనప్పటికీ.. సరైన పద్ధతిలో ఉపయోగించుకుంటే చదువులోనూ, కెరియర్ నిర్మాణంలోనూ ఎంతో మేలు చేస్తుంది.

సరిగా వాడితే.. అద్భుత అస్త్రమే..

మణి ఎనిమిదో తరగతి చదువుతోంది. తనకి బొమ్మలు గీయడం అంటే చాలా ఇష్టం. స్కూల్‌లో ఎన్నో బహుమతులు అందుకుంది. అయితే మెల్లగా ఇన్‌స్టాగ్రామ్‌కు అలవాటైంది. స్కూల్ నుంచి రాగానే రీల్స్ చూస్తూ గడిపేది. దీంతో తనకెంతో ఇష్టమైన బొమ్మలేయడాన్ని పక్కకు పెట్టేసింది. అమ్మానాన్నలు మందలిస్తే ఏడుస్తుంది. ఆమెకు అప్పటికే ఫోన్ చూడటం వ్యసనమైపోయింది.

● విద్యార్థుల్లో సోషల్ మీడియా వినియోగం బాగా పెరిగింది. చాలా మంది ఇందులోనే పూర్తిగా లీనమైపోయి, సమయాన్ని వృథా చేసుకుంటున్నారు. కొంత మంది వ్యసనాలకు బానిసలవుతుండగా, మరి కొందరు సైబర్ మోసాలకూ బలవుతున్నారు. దీంతో చాలా మంది తల్లిదండ్రులు ఎంతో ఆవేదన చెందుతున్నారు. కొన్ని సర్వేల ప్రకారం 69 శాతం టీనేజర్లు తమ భావాలను తెలియజేయడానికి సోషల్ మీడియాను వేదికగా చేసుకుంటున్నారు. ఈ అలవాటును చదువు పరంగా మెరుగవ్వడానికి ఉపయోగిస్తే మంచి ఫలితాలు ఉంటాయి.

సానుకూల ప్రభావం: ప్రస్తుత విద్యా వ్యవస్థలో స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్లెట్లు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లను విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. విద్యార్థులకు సమాచారాన్ని అందుబాటులో ఉంచుతూ, యూట్యూబ్ మొదలైన వేదికల ద్వారా వీడియో పాఠాలు విని, అర్థం చేసుకోవడం ఎంతో సులువైంది. వీటి ద్వారా వేగంగా సమాచారం తెలుసుకుని నేర్చుకుంటున్నారు. మారుమూల గ్రామాల్లో ఉంటూ, ఆన్‌లైన్‌లో క్లాసులు విని ఉద్యోగాలు పొందినవారూ ఉన్నారు.



నైపుణ్యాలకు మెరుగులు: మనకు ఇష్టమైన పనే చేస్తూ, సామాజిక మాధ్యమాల్లో మంచి పేరు తెచ్చుకోవచ్చు. అజయ్‌కి డ్రాయింగ్ అంటే ఇష్టం. వేసవి సెలవుల్లో స్మార్ట్ ఫోన్ వచ్చాక దానిపై దృష్టి తగ్గింది. అయితే వాళ్ల అమ్మ ఫోన్ వాడకుండా ఆంక్షలు పెట్టినప్పటికీ, దారి మళ్లించ లేకపోయింది. బాగా ఆలోచించి, ఫోన్‌లో నీ డ్రాయింగ్స్ అప్‌లోడ్ చేయి అని సూచించింది. అలా మొదలైన అజయ్ డ్రాయింగ్ పోస్టులకు విశేష ఆదరణ లభించింది. వాటి ద్వారా ఆదాయం పొందుతూ, చదువూ కొనసాగిస్తున్నాడు. దీని వల్ల అతడిలో ఆత్మవిశ్వాసం పెరిగి, నైపుణ్యాలను మెరుగు పరుచుకోవడంపై దృష్టి సారించాడు.

● అనవసరమైన వాటికి ఉపయోగించకుండా.. నైపుణ్యాలు ప్రదర్శించడం, అభిరుచులను వ్యక్తపరచడం, ఆన్‌లైన్ ద్వారా నేర్చుకోవడం, నెట్‌వర్క్ పెంచుకోవడం ఇలాంటి వాటికి సామాజిక మాధ్యమాలను ఉపయోగించుకోవచ్చు.

ఉద్యోగావకాశాల్లోనూ: కొన్ని సంస్థలు ఉద్యోగుల ఎంపికలో అభ్యర్థుల సోషల్ మీడియా ఖాతాల వివరాలూ అడుగుతున్నాయి. వాటి ద్వారా వాళ్ల నెట్‌వర్క్, ట్రోల్స్, పోస్టులు వారి సొంత బ్రాండ్ ఇలాంటివన్నీ తనిఖీ చేస్తున్నాయి. సోషల్ మీడియాలో ఉన్న తీరును బట్టి వారు ఉద్యోగాలకు అర్హులా, కాదా అని నిర్ణయిస్తున్నాయి. మంచి పేరు ఉంటే సంస్థకూ ప్రయోజనమే అని, అలాంటి వారినే ఎంచుకుంటున్నాయి.

డిజిటల్ అక్షరాస్యత: బ్రాండ్ మార్కెటింగ్, సోషల్ మీడియా ఎస్ఈవోల గురించి పూర్తిగా తెలుసుకుంటే భవిష్యత్తుల్లో అనేక అవకాశాలను అందుకోవచ్చు. సోషల్ మీడియా సంస్థలు, వేదికల్లో సేవలూ అందించవచ్చు. మంచి కంటెంట్ అందించినవారు ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారి సంపాదిస్తూ, సంతృప్తినీ పొందవచ్చు.

సోషల్ మీడియాను ఎందుకోసం, ఎలా ఉపయోగిస్తున్నామో కీలకం. దాన్ని ఉపయోగకరంగా మార్చుకుంటే అస్త్రంగా మారుతుంది. అలా కాకుండా వినోద సాధనంగా వాడితే బద్ధకస్తులు, వ్యసనపరులుగా మార్చేస్తుంది. అంతేకాకుండా సైబర్ మోసాలకూ గురికావొచ్చు. మానసికంగానూ ఎంతో ఒత్తిడినీ ఎదుర్కోవాల్సి వస్తుంది. చదువులోనూ వెనకబడిపోతారు. ఆరోగ్య సమస్యలూ మొదలవుతాయి. కాబట్టి సోషల్ మీడియాను ఉపయోగకరంగా వాడుకోవాలి. అవసరం లేని కంటెంట్ రాకుండా ఫోన్‌ను నియంత్రించుకోవాలి. అటువంటి వాటి జోలికి వెళ్లకుండా మనసును అధీనంలో పెట్టుకోవడం ఎంతో ముఖ్యం.

– మండ్ల స్వాతి
ఈజేఎస్

ఇండియా ఆప్టెల్ లిమిటెడ్ (ఐఓఎల్), రాయ్‌పుర్ 149 ప్రాజెక్ట్ టెక్నీషియన్ పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన భర్తీచేయనుంది. ముందుగా ఏడాది కాలానికి ఎంపిక చేసినప్పటికీ మరో మూడేళ్లు పొడిగించే అవకాశం ఉంటుంది. పదోతరగతి, ఎన్‌టీసీతో దరఖాస్తు చేసుకోవచ్చు.



ఐఓఎల్‌లో టెక్నీషియన్లు

మొత్తం ఖాళీల్లో ప్రాజెక్ట్ టెక్నీషియన్-పీటీ (ఫిట్టర్ ఇన్‌స్ట్రుమెంట్స్)-61, పీటీ (ఫిట్టర్ ఎలక్ట్రానిక్స్)-49, పీటీ (మెషినిస్ట్)-7, పీటీ (ఆప్టికల్ వర్కర్)-23, పీటీ (ఎలక్ట్రోప్లేటర్)-5, పీటీ (పెయింటర్)-4 ఉన్నాయి.

ప్రాథమికంగా ఏడాది కాలానికి నియమించినప్పటికీ నాలుగేళ్లు పొడిగించే అవకాశం ఉంటుంది.

ఎంపిక: ఎన్‌టీసీ/ ఎన్‌ఏసీలో పొందిన మార్కులతో షార్ట్‌లిస్ట్ చేసి ట్రేడ్‌టెస్ట్ (ప్రాక్టికల్)కు ఎంపిక చేస్తారు. ఇది అర్హత పరీక్ష మాత్రమే. ఎన్‌టీసీ/ ఎన్‌ఏసీలో పొందిన మార్కులతోనే తుది ఎంపిక చేస్తారు.

◗ ట్రేడ్‌టెస్ట్ అడ్మిట్‌కార్డ్/ కాల్ లెటర్లను అభ్యర్థులకు ఈమెయిల్ చేస్తారు.

గమనించాల్సినవి: ఐఓఎల్ వెబ్‌సైట్ నుంచి అప్లికేషన్ ఫార్మాట్‌ను డౌన్‌లోడ్ చేసుకుని పూర్తిచేయాలి. దీనికి విద్యార్హతలు, అనుభవానికి సంబంధించిన ధ్రువపత్రాలను జతచేసి పోస్టులో మాత్రమే పంపాలి. ◗ ప్రస్తుతం ఉపయోగిస్తోన్న ఈమెయిల్ ఐడీ, మొబైల్ నంబర్లను మాత్రమే దరఖాస్తులో రాయాలి. ఉద్యోగ సమాచారాన్ని వీటి ద్వారానే తెలియజేస్తారు. ◗ ఎస్సీ/ ఎస్టీ/ ఓబీసీ-ఎన్‌సీఎల్, ఈడబ్ల్యూఎస్, మాజీ సైనికోద్యోగులు, దివ్యాంగులకు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సడలింపులు, రిజర్వేషన్లు వర్తిస్తాయి. ◗ ఎంపికైనవారి వివరాలను వెబ్‌సైట్‌లో ప్రకటిస్తారు. తాజా ఉద్యోగ సమాచారం కోసం తరచూ వెబ్‌సైట్‌ను సందర్శించాలి. ◗ ఎంపికైనవారిని ఐఓఎల్‌కు దేశవ్యాప్తంగా ఉన్న యూనిట్లలో ఎక్కడైనా నియమిస్తారు.

అర్హతలు: మెట్రిక్యులేషన్, నేషనల్ ట్రేడ్ సర్టిఫికెట్ (ఎన్‌టీసీ)/ నేషనల్ అప్రెంటిస్ సర్టిఫికెట్ (ఎన్‌ఏసీ) ఉండాలి. ◗ ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, అడ్వాన్స్ మెకానిక్ (ఇన్‌స్ట్రుమెంట్స్), ఎలక్ట్రానిక్స్ మెకానిక్, మెకానిక్ మెకట్రానిక్స్, ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్, మెకానిక్ పవర్ ఎలక్ట్రానిక్స్, మెషినిస్ట్, ఆప్టికల్ వర్కర్, ఎలక్ట్రోప్లేటర్, పెయింటర్ ట్రేడ్‌తో ఎన్‌టీసీ/ ఎన్‌ఏసీ సర్టిఫికెట్ ఉండాలి.

◗ ఎన్ఏసీ/ ఎన్‌టీసీ సర్టిఫికెట్ లేకుండా ఇంజినీరింగ్ డిగ్రీ/ డిప్లొమా చేసినవాళ్లు దరఖాస్తుకు అనర్హులు.

వయసు: 32 సంవత్సరాలు మించకూడదు. ఎస్సీ/ఎస్టీకి ఐదేళ్లు, ఓబీసీ-ఎన్‌సీఎల్‌కు మూడేళ్లు, దివ్యాంగులకు పది నుంచి పదిహేనేళ్ల సడలింపు ఉంటుంది.

వేతనం: మూలవేతనం నెలకు రూ.20,000, ఇండస్ట్రియల్ డీఏ, హెచ్ఆర్ఏ అదనం.

చిరునామా: ద ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్, ఇండియా ఆప్టెల్ లిమిటెడ్, ఓఎఫ్ఐఎల్‌డీడీ క్యాంపస్, రాయ్‌పుర్, దేహ్రాదూన్ (ఉత్తరాఖండ్)-248008.

పోస్టు ద్వారా దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ: 29.12.2025

వెబ్‌సైట్: https://ddpdoo.gov.in/

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్
సేల్స్ అండ్ ఔట్‌రీచ్ (ఎస్అండ్ఓ)

సంస్థ: షి కెన్ ఫౌండేషన్
నైపుణ్యాలు: బిజినెస్ అనాలిసిస్, బిజినెస్ రిసెర్చ్, క్లయింట్ ఇంటరాక్షన్, క్లయింట్ రిలేషన్‌షిప్, డేటా అనాలిసిస్, మార్కెటింగ్ క్యాంపైన్స్, మార్కెటింగ్ స్ట్రాటజీస్, మార్కెట్ రిసెర్చ్, సేల్స్
స్టైపెండ్: రూ.1,500-15,000 (ఒకేసారి)
దరఖాస్తు గడువు: జనవరి 2
☛ https://shorturl.at/R7TVX

బడ్డింగ్ మారినర్స్‌లో
1. కెమిస్ట్రీ టీచింగ్

నైపుణ్యాలు: కెమిస్ట్రీ, కొలాబరేషన్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఇంటర్‌పర్సనల్ స్కిల్స్, మెటీరియల్ మేనేజ్‌మెంట్, మెటీరియల్ సోర్సింగ్, టీచింగ్
స్టైపెండ్: రూ.1,500-2,000
దరఖాస్తు గడువు: జనవరి 3
☛ https://shorturl.at/KEp81

2. ఫిజిక్స్ టీచింగ్

నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఇంటర్‌పర్సనల్ స్కిల్స్, మెటీరియల్ మేనేజ్‌మెంట్, మెటీరియల్ సోర్సింగ్, ఎంఎస్-ఎక్సెల్, ఫిజిక్స్, సబ్జెక్ట్ మేటర్ ఎక్స్‌పర్ట్ (ఎస్ఎంఈ), టీచింగ్, టైమ్ మేనేజ్‌మెంట్
☛ https://shorturl.at/aqVBp

యూఐ/యూఎక్స్ డిజైనర్ (విక్స్)

సంస్థ: బ్రెయిన్ క్వెస్ట్ **నైపుణ్యాలు:** విక్స్, ఫిగ్మా, యూఐ/యూఎక్స్ డిజైన్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్ **స్టైపెండ్:** రూ.5,000
దరఖాస్తు గడువు: జనవరి 3
☛ https://tinyurl.com/ymxrtkn4

మార్కెటింగ్

సంస్థ: నౌయునో **నైపుణ్యాలు:** అడోబ్ ఫొటోషాప్, కేన్వా, కంటెంట్ ఎడిటింగ్, కంటెంట్ రైటింగ్, సోషల్ మీడియా మార్కెటింగ్
స్టైపెండ్: రూ.5,000-7,000
దరఖాస్తు గడువు: జనవరి 3
☛ https://tinyurl.com/3aebsb9k

మార్కెటింగ్ అసిస్టెంట్ (మెల్‌బోర్న్ డివిజన్)

సంస్థ: సేత్ అసోసియేట్స్ (మెల్‌బోర్న్, ఆస్ట్రేలియా) **నైపుణ్యాలు:** మార్కెటింగ్, మార్కెటింగ్ స్ట్రాటజీస్
స్టైపెండ్: రూ.1,000-5,000
దరఖాస్తు గడువు: జనవరి 3
☛ https://tinyurl.com/2rt7427t/R

15 నుంచి రాహుల్ జర్మనీ పర్యటన



దిల్లీ: లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ.. ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకూ జర్మనీలో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా ఆయన ప్రవాస భారతీయులతో భేటీ అవుతారు. పలువురు జర్మనీ మంత్రులను కలుస్తారు. రాహుల్ వెంట ఓవర్సీస్ కాంగ్రెస్ ఛైర్‌పర్సన్ శాం పిట్రోడా జర్మనీ పర్యటనకు వెళ్తారు.

మద్రాసు హైకోర్టు జడ్జి తొలగింపునకు విపక్షం నోటీసు

దిల్లీ: మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.ఆర్.స్వామినాథన్‌ను విధుల నుంచి తొలగించాలని కోరుతూ డీఎంకే నేతృత్వంలోని విపక్ష ఎంపీలు మంగళవారం లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాకు నోటీసు సమర్పించారు. తిరుపరకుండ్రం కొండపై ఒక దర్గా సమీపంలోని దీపస్తంభం వద్ద దీపం వెలిగేలా చూడాలని సుబ్రమణ్య స్వామి ఆలయానికి జడ్జీ ఇచ్చిన ఆదేశాలను వారు దీనిలో ప్రస్తావించారు. తొలి ఆదేశాలను అమలు చేయకపోతే ఈ నెల 3న మరోసారి ఆదేశాలిచ్చి, భక్తులకు రక్షణ కల్పించాల్సిందిగా సీఐఎస్ఎఫ్‌కు సూచించారని తెలిపారు. 120 మంది సంతకాలతో కూడిన నోటీసును ప్రియాంకా గాంధీ, అఖిలేశ్ యాదవ్, కనిమొళి, టి.ఆర్.బాలు తదితర నేతలు అందజేశారు.

చంద్రుడి దక్షిణ ధ్రువంలో క్రియాశీల విద్యుత్ వాతావరణం

బెంగళూరు: చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతంలో ఉపరితలానికి చేరువలో విద్యుత్ వాతావరణం.. గతంలో అంచనావేసిన దాని కన్నా మరింత క్రియాశీలంగా ఉందని తేలింది. భారత్ ప్రయోగించిన చంద్రయాన్-3 ల్యాండర్ అందించిన డేటాను విశ్లేషించినప్పుడు ఈ విషయం వెల్లడైంది. 2023 ఆగస్టు 23 నుంచి సెప్టెంబరు 3 మధ్య అందిన ఈ డేటా.. చందమామ ప్లాస్మా వాతావరణానికి సంబంధించి కీలకమైన క్షేత్రస్థాయి వాస్తవాలు అందించింది. ప్లాస్మాను పదార్థానికి సంబంధించిన నాలుగో దశగా పరిగణిస్తారు. ఇందులో ఆవేశిత రేణువుల మిశ్రమం ఉంటుంది. మొత్తంమీద విద్యుదావేశం పరంగా చూసినప్పుడు ప్లాస్మా తటస్థంగా ఉంటుంది. అయినా విద్యుదయస్కాంత క్షేత్రాలకు బలంగా స్పందిస్తుంది.

ప్రాథమిక ఆరోగ్యపరిరక్షణ వ్యవస్థ ద్వారా కుంగుబాటుకు స్క్రీనింగ్ మేలు

- రూ.48 వేల కోట్ల ఆదా

దిల్లీ: భారత్‌లో మానసిక కుంగుబాటు సమస్యను గుర్తించడానికి ప్రాథమిక ఆరోగ్యపరిరక్షణ వ్యవస్థ ద్వారా సార్వత్రిక విధానాన్ని అమలు చేయాలని పరిశోధకులు సూచించారు. దీనివల్ల రూ.29వేల కోట్ల నుంచి రూ.48,200 కోట్ల వరకూ ఆదా కావొచ్చని పేర్కొన్నారు. ఇది దేశ జీడీపీలో 0.19 నుంచి 0.32 శాతంతో సమానమని వివరించారు. చండీగఢ్‌లోని పీజీఐఎంఈఆర్, బెంగళూరులోని నిమాన్స్ సంస్థలు ఈ అధ్యయనాన్ని నిర్వహించాయి. ఈ వివరాలు 'ద లాన్సెట్ రీజినల్ హెల్త్ సౌత్ఈస్ట్ ఏషియా'లో ప్రచురితమయ్యాయి. దాదాపు 30 ఏళ్ల పైబడ్డవారితో పోలిస్తే 20 ఏళ్ల వయసువారికి స్క్రీనింగ్ నిర్వహించడం చౌకని పరిశోధకులు పేర్కొన్నారు. ప్రస్తుతం ఇతర సమస్యలకు పరీక్ష చేస్తున్నప్పుడు యాదృచ్ఛికంగా ఈ కుంగుబాటు సమస్య బయటపడుతోందని వివరించారు. మానసిక సమస్యలు, మేధోపరమైన వైకల్యం సహా 22 రకాల విధానాలకు ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి- జన్ ఆరోగ్య యోజన కింద నగదురహిత ఆరోగ్యపరిరక్షణ సేవలు అందుతున్నాయి.


రష్యాలో కూలిన సైనిక రవాణా విమానం

మాస్కో: రష్యాలోని సెంట్రల్ ఇవనోవో ప్రాంతంలో మంగళవారం 'ఆంటొనోవ్ యాన్-22' సైనిక రవాణా విమానం కూలిపోయింది. ప్రమాద సమయంలో విమానంలో ఏడుగురు ఉన్నారు. వారి పరిస్థితిని తెలుసుకునేందుకు సహాయక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి తరలి వెళ్లారు.

వందేమాతరం 'ముక్క'లే దేశ విభజనకు హేతువు

- రాజ్యసభలో అమిత్ షా విమర్శలు
- భాజపా, కాంగ్రెస్ వాగ్వాదం

దిల్లీ: వందేమాతరం గేయాన్ని 1937లో ముక్కలు చేయడమే ఆ తర్వాత దేశ విభజనకు దారితీసిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. ఈ గేయంపై ప్రత్యేక చర్చను మంగళవారం రాజ్యసభలో ఆయన ప్రారంభించారు. కాలంతో సంబంధం లేకుండా ఈ గేయం దేశ ప్రజల్లో ఎప్పటికీ స్ఫూర్తి నింపుతూనే ఉంటుందన్నారు. గేయ రచయిత బంకించంద్ర చటర్జీ బెంగాల్‌కు చెందినవారైనప్పటికీ.. ఈ గేయం కేవలం బెంగాల్‌కే పరిమితం కాదన్నారు. ఆ రాష్ట్రంలో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు దీనిని ముడిపెట్టడం ద్వారా గేయం ప్రాధాన్యాన్ని దిగజార్చేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. వందేమాతరం ఆలపించకముందే అనేకమంది విపక్ష నేతలు వెళ్లిపోతున్న విషయాన్ని తాను కళ్లారా చూస్తున్నానని చెప్పారు. దానికి ఆధారాలు చూపాలని కాంగ్రెస్ సభ్యుడు జైరాం రమేశ్ డిమాండ్ చేశారు. దరిమిలా అమిత్‌షా పలువురి పేర్లతో కూడిన జాబితాను ఛైర్మన్‌కు లేఖరూపంలో పంపించారు. భాజపాలో ఒక్క సభ్యుడైనా వందేమాతరం పట్ల అగౌరవం చూపబోరన్నారు.



వందేమాతరంపై చర్చ సందర్భంగా రాజ్యసభలో మాట్లాడుతున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా

ఇది గేయమే కాదు.. భక్తిభావన: రాధాకృష్ణన్

మాతృభూమిపై ప్రేమను పెంచి, దేశాన్ని ఒక్కటి చేసే శాశ్వత గేయంగా వందేమాతరం నిలిచిపోతుందని రాజ్యసభ ఛైర్మన్ సి.పి.రాధాకృష్ణన్ పేర్కొన్నారు. ఐక్యతే బలమనేది అందరూ గుర్తుపెట్టుకోవాలని, భరత మాతే మన ఆత్మ అని చెప్పారు. ఈ గేయాన్ని ఆలపించుకుంటూ నిర్భయంగా ఉరికంబమెక్కిన స్వాతంత్ర్య సమరయోధులను ఆయన స్మరించుకున్నారు. అదొక గేయం మాత్రమే కాదని, గుండె లోతుల్లోంచి ఉప్పొంగిన భక్తిభావన అని చెప్పారు. అసలైన సమస్యల్ని పక్కనపెట్టి, బెంగాల్లో ఎన్నికల లబ్ధి కోసమే ప్రభుత్వం వందేమాతరం అంశాన్ని చర్చకు తీసుకువచ్చిందని రాజ్యసభ విపక్షనేత మల్లికార్జున ఖర్గే విమర్శించారు. చైనా గురించి ఒక్కమాటైనా మాట్లాడలేనప్పుడు 56 అంగుళాల ఛాతీ ఉండి ఏం ప్రయోజనమని ప్రధానిని ఉద్దేశించి ప్రశ్నించారు. చర్చను పక్కదారి పట్టిస్తున్నారని అధికారపక్షం అభ్యంతరం తెలిపింది. ఒకదశలో ఇరుపక్షాల వాదోపవాదాలతో సభ వేడెక్కింది. తప్పుడు సమాచారం చెబుతున్నారంటూ జైరాం రమేశ్ (కాంగ్రెస్), రాధామోహన్ దాస్ (భాజపా) పరస్పరం నిందించుకున్నారు. తాను చెప్పింది అవాస్తవమైతే పదవికి రాజీనామా చేయడానికి సిద్ధమని, జైరాం సయితం దానికి సిద్ధపడాలని దాస్ సవాల్ విసిరారు.



భూకంపం కారణంగా జపాన్‌లోని తొహూకులో రహదారి ధ్వంసం కావడంతో గుంతలో పడిపోయిన కారు

సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌పై తప్పుడు ప్రచారమా?

- తప్పుబట్టిన విశ్రాంత జడ్జీలు




దిల్లీ: రోహింగ్యా వలసదారులపై దాఖలైన కేసు విచారణ సందర్భంగా సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ చేసిన వ్యాఖ్యలపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని సుప్రీం కోర్టు, హైకోర్టుల విశ్రాంత జడ్జీలు అభ్యంతరం వ్యక్తం చేశారు. 'సుప్రీం కోర్టును అప్రతిష్ఠ పాల్జేసే ఇటువంటి ప్రచారం అంగీకారయోగ్యం కాదు. న్యాయ విచారణ ప్రక్రియలపై విమర్శలు సహేతుకంగా, న్యాయబద్ధంగా ఉండాలి' అంటూ మంగళవారం పలువురు విశ్రాంత న్యాయమూర్తులు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. 'మనం చూస్తున్నది.. సూత్రప్రాయమైన అసమ్మతి కాదు. రొటీన్‌గా జరిగే కోర్టు గది కార్యకలాపాలను దురభిమానంతో తప్పుగా చూపించి.. న్యాయ వ్యవస్థ ఔన్నత్యాన్ని దెబ్బతీసేందుకు చేసిన ప్రయత్నం. అతి సాధారణ న్యాయపరమైన ప్రశ్నను అడిగిన సీజేఐపై విమర్శల దాడి చేస్తున్నారు. భారత గడ్డపై ఏ ఒక్క పౌరుడుగానీ, విదేశీయుడుగానీ హింసకు గురి కాకూడదని, అతడిని అదృశ్యం చేయరాదని, అమానవీయంగా ట్రీట్ చేయడానికి వీల్లేదని, ప్రతి ఒక్కరి గౌరవాన్ని కాపాడాలని విచారణ సందర్భంగా ధర్మాసనం చేసిన వ్యాఖ్యలను తొలగించి మిగిలిన అంశాల ఆధారంగా జస్టిస్ సూర్యకాంత్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారు. వీటిని తొక్కిపట్టి కోర్టు అమానవీయంగా వ్యవహరించిందని ఆరోపించడం వాస్తవంగా ధర్మాసనం చెప్పినదాన్ని వక్రీకరించడమే' అని విశ్రాంత జడ్జీలు పేర్కొన్నారు. సంయుక్త ప్రకటనపై 40 మంది సంతకం చేశారు.

అసలేం జరిగిందంటే..

భారత్‌లో రోహింగ్యా శరణార్థులు కస్టడీ నుంచి అదృశ్యం అవుతున్నారంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ నెల 2వ తేదీన సీజేఐ ధర్మాసనం కొన్ని వ్యాఖ్యలు చేసింది. వాటిని తప్పుబడుతూ ఈ నెల 5వ తేదీన కొంత మంది విశ్రాంత జడ్జీలు, న్యాయవాదులు, క్యాంపెయిన్ ఫర్ జ్యుడీషియల్ ఎకౌంటబిలిటీ అండ్ రిఫార్మ్స్ (సీజేఏఆర్) ప్రతినిధులు ఒక లేఖ రాశారు. ధర్మాసనం వ్యాఖ్యలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ లేఖకు ప్రతిగా విశ్రాంత జడ్జీలు మంగళవారం ప్రకటన విడుదల చేశారు.

సౌర తుపాను నిగ్గు తేల్చడంలో ఆదిత్య-ఎల్1 తోడ్పాటు

బెంగళూరు: రెండు దశాబ్దాల్లో ఎన్నడూ లేని స్థాయిలో గత ఏడాది సంభవించిన బలమైన సౌర తుపాను గురించి శోధించడంలో శాస్త్రవేత్తలకు భారత్‌కు చెందిన ఆదిత్య ఎల్-1 సౌర అబ్జర్వేటరీ సాయం అందించింది. అమెరికాకు చెందిన ఆరు ఉపగ్రహాలతో కలిసి ఇది ఆ పరిణామంపై దృష్టిసారించింది. నాటి సౌర తుపాను ఎందుకు అంత అసాధారణంగా ఉందన్నది గుర్తించడంలో సాయపడిందని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) తెలిపింది. అత్యంత కచ్చితత్వంతో అయస్కాంత క్షేత్ర కొలతలను అందించడం ద్వారా ఈ కసరత్తులో తోడ్పాటు అందించిందని పేర్కొంది.



గత ఏడాది మేలో సంభవించిన ఆ సౌర తుపానుకు 'గ్యానన్స్ స్టార్మ్' అని పేరు పెట్టారు. అది భూవాతావరణంపై తీవ్ర ప్రభావం చూపింది. నాడు సూర్యుడిలో విస్ఫోటాలూ చోటుచేసుకున్నాయి. వీటిని కరోనల్ మాస్ ఎజెక్షన్స్ (సీఎంఈ)గా పిలుస్తారు. వీటిలో తీవ్రస్థాయి వేడి వాయువులు, అయస్కాంత శక్తితో కూడిన బబుల్స్ ఉంటాయి. వీటివల్ల భూఅయస్కాంత క్షేత్రం తీవ్ర కుదుపులకు లోనైంది. కొన్నిసార్లు నింగిలోని ఉపగ్రహాలకు, నేలపైనున్న పవర్ గ్రిడ్లకు ఇబ్బందులు ఎదురవుతుంటాయి.

గ్యానన్స్ స్టార్మ్‌కు సంబంధించి భారత శాస్త్రవేత్తలు ఒక అధ్యయన పత్రాన్ని ప్రచురించారు. "ఆ సౌరతుపానులో సూర్యుడి అయస్కాంత క్షేత్రాలకు సంబంధించి అసాధారణ తీరును గమనించాం. ఈ క్షేత్రాలు సౌర తుపానులో మెలితిరిగిన తాళ్లలా ఉంటాయి. అవి విచ్ఛిన్నం కావడం, తిరిగి అతుక్కోవడం జరుగుతుంటుంది. సాధారణంగా ఒక సీఎంఈలో మెలితిరిగిన 'అయస్కాంత తాడు' ఒకటి ఉంటుంది. అవి పుడమిని చేరుకోగానే భూఅయస్కాంత కవచంతో చర్య జరుపుతాయి. గ్యానన్స్ స్టార్మ్‌లో మాత్రం ఇది భిన్నంగా జరిగింది. అందులో రెండు సీఎంఈలు విశ్వంలో పరస్పరం బలంగా ఢీకొన్నాయి. ఫలితంగా ఒకదానిలోని అయస్కాంత క్షేత్ర రేఖలు తెగిపోయి.. తిరిగి అనేక విధాలుగా అతుక్కున్నాయి. ఈ ప్రక్రియను మ్యాగ్నెటిక్ రీకనెక్షన్ అంటారు. ఇలా అకస్మాత్తుగా అయస్కాంత క్షేత్రం తీరు మారిపోవడం వల్ల సౌర తుపాను తీవ్రంగా మారింది. నాడు రేణువులు అకస్మాత్తుగా వేగాన్ని అందుకోవడాన్ని ఉపగ్రహాలు గుర్తించాయి. దీన్నిబట్టి వాటి శక్తి పెరిగినట్లు స్పష్టమవుతోంది. మ్యాగ్నెటిక్ రీకనెక్షన్‌కు ఇది నిదర్శనం" అని అందులో వివరించారు.

శుద్ధ ఇంధనాల తయారీలో జోధ్‌పుర్ ఐఐటీ ముందంజ

జోధ్‌పుర్: వాతావరణ మార్పులకు దారితీస్తున్న కర్బన ఉద్గారాలను నివారించే హరిత హైడ్రోజన్, ఆక్వియస్ జింక్ అయాన్ బ్యాటరీల ఉత్పత్తిలో ఐఐటీ-జోధ్‌పుర్ పరిశోధకులు విజయం సాధించారు. ఎలక్ట్రోకెమికల్ ఎనర్జీ కన్వర్షన్ అండ్ స్టోరేజ్ (ఈ2సీఎస్) ల్యాబ్‌కు చెందిన ఈ పరిశోధక బృందానికి ప్రశాంత్ కుమార్ గుప్తా నాయకత్వం వహించారు. ప్రస్తుతం ఖరీదైన ఎలక్ట్రాలసిస్ ప్రక్రియ ద్వారా ఒక కిలో హైడ్రోజన్ తయారీకి 30 లీటర్ల స్వచ్ఛ జలం అవసరమవుతోంది. ఇంత జలం అన్ని ప్రాంతాల్లో అందుబాటులో ఉండదు. గుప్తా బృందం స్వచ్ఛ జలంతో పనిలేకుండా నేరుగా సముద్ర జలాన్నే ఎలక్ట్రాలసిస్ చేయడానికి తోడ్పడే ఉత్ప్రేరకాలను రూపొందించింది. అవి పారిశ్రామిక వ్యర్థ జలాలను సైతం ఎలక్ట్రాలసిస్ చేసి చాలా తక్కువ ఖర్చుతో హరిత హైడ్రోజన్ తయారీకి ఉపకరిస్తాయి. ఈ పద్ధతిలో కిలో హరిత హైడ్రోజన్ తయారీకి రూ.90 కన్నా తక్కువ ఖర్చవుతుంది.

నేడు విద్యుత్ వాహనాలు, అనేక ఇతర సాధనాలలో లిథియం అయాన్ బ్యాటరీల వాడకం పెరిగింది. లిథియం అరుదైన ఖనిజమే కాకుండా చాలా ఖరీదైనది. ఈ పదార్థంతో తయారుచేసే బ్యాటరీలకు సులువుగా నిప్పంటుకుంటుంది. సీసం బ్యాటరీలతో కాలుష్యం ఎక్కువ. వీటన్నింటికీ ప్రత్యామ్నాయంగా ఆక్వియస్ జింక్ అయాన్ బ్యాటరీలను గుప్తా బృందం రూపొందిస్తోంది. వీటితోపాటు నేరుగా గాలి నుంచి ఆక్సిజన్‌ను స్వీకరించే జింక్ ఎయిర్ బ్యాటరీలపైనా పరిశోధన జరుపుతోంది.

దిల్లీ కారు పేలుడు కేసులో నిందితుడైన మరో డాక్టర్ అరెస్టు

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో ఎర్రకోట సమీపంలో కారు పేలుడు కుట్రకు సంబంధించి నిందితుడైన మరో డాక్టర్‌ను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) మంగళవారం అరెస్టు చేసింది. దీంతో ఇప్పటి వరకు ఈ కేసులో అరెస్టైన వారి సంఖ్య 8కి చేరింది. ఆత్మాహుతికి పాల్పడిన డాక్టర్ ఉమర్ ఉన్ నబీకి కశ్మీర్‌లోని బారాముల్లాకు చెందిన డాక్టర్ బిలాల్ నసీర్ మల్లా గతంలో ఆశ్రయం కల్పించాడని దర్యాప్తు సంస్థ వెల్లడించింది. ఈ కుట్రకు సంబంధించిన ఆధారాలను బిలాల్ నసీర్ చెరిపివేయడానికి ప్రయత్నించారని తెలిపింది. కోర్టులో హాజరు పరచగా నిందితుడిని ఏడు రోజుల పాటు ఎన్ఐఏ కస్టడీకి అప్పగిస్తూ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి నిర్ణయం వెలువరించారు.

అనంతనాగ్ అడవుల్లో రహస్య స్థావరాలు

కారు పేలుడు కేసులో అరెస్టైన నిందితులు డాక్టర్ అదీల్ అహ్మద్, జాసిర్ బిలాల్‌లను పోలీసుల సహాయంతో ఎన్ఐఏ అధికారులు అనంత్‌నాగ్‌కు తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. వారిచ్చిన సమాచారంతో అనంత్‌నాగ్ జిల్లాలోని మట్టన్ అటవీ ప్రాంతంలో ఉగ్ర ముఠాలు ఆశ్రయం పొందే పలు రహస్య స్థావరాల ఆచూకీ కనుగొన్నారు. కొన్ని అనుమానిత వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

ఇండిగో సేవలు మెరుగు

- సాధారణ స్థితికి చేరాయన్న సంస్థ సీఈవో ఎల్బర్స్
- అయినా 422 విమాన సర్వీసుల రద్దు



ఏ నగరం నుంచి ఎన్ని రద్దు	
దిల్లీ	152
బెంగళూరు	121
హైదరాబాద్	58
చెన్నై	50
ముంబయి	41

ముంబయి: దేశంలోనే అతి పెద్ద విమానయాన సంస్థ ఇండిగో ఇంకా గాడిన పడలేదు. మంగళవారం ఆరు మెట్రో నగరాల నుంచి 422 విమాన సర్వీసులు రద్దయ్యాయి. ఈ సంస్థకు చెందిన విమాన సర్వీసులు భారీగా రద్దు కావడం వరుసగా ఇది ఎనిమిదో రోజు. అయితే తమ కార్యకలాపాలు సాధారణ స్థితికి చేరాయని సంస్థ సీఈవో పీటర్ ఎల్బర్స్ తెలిపారు.

అందరికీ రిఫండ్ చేశాం

విమాన సర్వీసుల రద్దు, ఆలస్యం కారణంగా ప్రయాణాలను రద్దు చేసుకున్న లక్షల మందికి ఛార్జీలను రిఫండ్ చేస్తున్నామని ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్ తెలిపారు. ఇప్పటికే చాలా మందికి అందాయని, మిగిలిన వారి రిఫండ్ ప్రాసెస్‌లో ఉందని వెల్లడించారు. సంస్థ కార్యకలాపాలు సాధారణ స్థితికి చేరుకున్నాయంటూ మంగళవారం ఆయన వీడియో సందేశం విడుదల చేశారు. చివరి నిమిషంలో విమానాలు రద్దయి ప్రయాణం చేయలేకపోయిన వారికి పరిహారంపై ఆయన స్పందించలేదు. పౌర విమానయానశాఖ నిబంధనల ప్రకారం.. రెండు వారాల ముందుగా సర్వీసు రద్దుపై ప్రయాణికులకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. లేకుంటే పరిహారం చెల్లించాలి. 'ఇండిగో సాధారణ స్థితికి చేరింది. మా కార్యకలాపాలు స్థిరంగా కొనసాగుతున్నాయి. ప్రధాన ఆపరేషన్లను గాడిలో పెట్టాం. అందరికీ క్షమాపణ చెబుతున్నా' అని ఎల్బర్స్ పేర్కొన్నారు. 'ఈ నెల 15వ తేదీకల్లా కార్యకలాపాలను సాధారణ స్థితికి చేరుస్తామని గతంలో చెప్పాం. కానీ మంగళవారం నాటికే పూర్తి చేశాం' అని వివరించారు.

ప్రజలను వేధించడానికి కాదు: మోదీ

ఇంటర్నెట్ డెస్క్: ఇండిగో సంక్షోభంపై ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారి స్పందించారు. వ్యవస్థలను మెరుగుపరిచేందుకే నిబంధనలని.. ప్రజలను వేధించడానికి కాదని స్పష్టం చేశారు. ఎన్డీయే పక్ష సమావేశంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. 'ప్రభుత్వంవల్ల ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూసుకోవాలి. నియమ నిబంధనలు మంచివే. అయితే వ్యవస్థను మెరుగుపరిచేందుకు వాటిని రూపొందించాలి. అవి ప్రజలను వేధించకూడదు' అని ప్రధాని వ్యాఖ్యానించారని తెలిపారు. 'సామాన్య పౌరుల్ని ఇబ్బందిపెట్టే చట్టం, నిబంధన ఉండకూడదని ప్రధాని మోదీ స్పష్టంగా చెప్పారు. చట్టాలు ప్రజలపై భారంగా పరిణమించకూడదని స్పష్టం చేశారు' అని వెల్లడించారు.

విమానాశ్రయాల్లో తనిఖీలు

ఇండిగో సంక్షోభం నేపథ్యంలో విమానాశ్రయాల్లో పరిస్థితులను అంచనా వేయడానికి సీనియర్ అధికారులు తనిఖీలు చేపట్టారని పౌర విమానయానశాఖ కార్యదర్శి సమీర్ కుమార్ సిన్హా తెలిపారు. విమానయాన నియంత్రణ సంస్థ డీజీసీఏ ఆదేశాల మేరకు విమానాశ్రయాలను వ్యక్తిగతంగా సందర్శించి, విమానాల కార్యకలాపాలను పరిశీలించి, ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నారని వెల్లడించారు. అధికారులు ముంబయి, బెంగళూరు, హైదరాబాద్, కోల్‌కతా, చెన్నై, అహ్మదాబాద్, పుణె, గువాహటి, గోవా, తిరువనంతపురం విమానాశ్రయాల్లో ప్రత్యక్ష తనిఖీలు చేపట్టినట్లు వివరించారు.

పంజాబ్ కాంగ్రెస్‌లో 70% మంది మద్దతు నాకే

- నవ్‌జోత్ కౌర్ సిద్ధూ వ్యాఖ్య



చండీగఢ్: కాంగ్రెస్ నుంచి సస్పెండైన పంజాబ్ నాయకురాలు నవ్‌జోత్ కౌర్ సిద్ధూ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర కాంగ్రెస్‌లో 70% మంది మద్దతు తనకే ఉందని పేర్కొన్నారు. ఏఐసీసీలోనూ 90% మంది మద్దతు తనకుందని చెప్పారు. 'రూ.500 కోట్లు ఇచ్చినవారే సీఎం అవుతారు' అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో నవ్‌జోత్ కౌర్ పార్టీ నుంచి సోమవారం సస్పెండయిన సంగతి తెలిసిందే. సస్పెన్షన్ వేటుపై పటియాలాలో విలేకర్లతో ఆమె మంగళవారం మాట్లాడారు. అధిష్ఠానంతో సంప్రదింపులు కొనసాగుతున్నాయని, వాటి వివరాలు ప్రస్తుతానికి బయటకు వెల్లడించలేమని చెప్పారు. పంజాబ్‌లో నలుగురైదుగురు స్వపక్ష నేతలు కాంగ్రెస్‌ను నాశనం చేస్తున్నారని.. వారిని పక్కన పెడితేనే రాష్ట్రంలో పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలుగుతుందని పేర్కొన్నారు. పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ స్వయంగా పంజాబ్‌కు వచ్చి పరిస్థితుల గురించి తెలుసుకోవాలని తాను కోరుకున్నట్లు నవ్‌జోత్ కౌర్ తెలిపారు. కానీ ఆయన చుట్టూ ఉన్న వ్యక్తులు ఆయన్ను రానివ్వలేదన్నారు. పార్టీలోని కొందరు నేతలకు రాహుల్ పీఏలు అమ్ముడుపోయారని ఆరోపించారు.





బోధ్ గయాలో నాణేల రాజు

ఈటీవీ భారత్: బిహార్‌లోని బోధ్ గయాలో ఉంటున్న బ్రహ్మ్ ఖలీఫా అలియాస్ కమల్‌కు చిన్నప్పటి నుంచీ అరుదైన నాణేలు సేకరించడం అలవాటు. అలా ఇప్పటిదాకా సేకరించిన 8,000కు పైగా నాణేలు ఆయనకు జీవనోపాధిగా మారాయి. బోధ్ గయా మొహల్లాలో కమల్‌ను అందరూ 'నాణేల రాజు' అంటారు. ఈయన వద్ద మొగల్ పాలనాకాలం నుంచి బ్రిటిష్ హయాం నాటి వరకు వచ్చిన నాణేలు ఉన్నాయి. అంతకు ముందు రాజుల కాలం నాటివి కూడా కొన్ని సేకరించారు. ఇందులో మొగల్, క్వీన్ విక్టోరియా కాలం నాటి నాణేలు ఎక్కువ ధరకు అమ్ముడుపోతున్నట్లు కమల్ తెలిపారు. పర్యాటక ప్రాంతమైన బోధ్ గయాను సందర్శించే ఆంగ్ల పర్యాటకులు వీటిని ఎక్కువగా కొనుగోలు చేస్తుంటారని చెప్పారు. టూరిస్టులు బాగా వచ్చే సీజనులో రోజుకు రూ.5,000.. మామూలు రోజుల్లో రూ.1000 వరకు ఆదాయం ఉంటుందన్నారు.

నర హంతకుడికి 20 ఏళ్ల జైలు

ది హేగ్: రెండు దశాబ్దాల క్రితం సూడాన్‌లోని దార్ఫుర్ ప్రాంతంలో యుద్ధ నేరాలకు, మానవాళిపై దారుణాలకు పాల్పడిన అలీ మహమ్మద్ అలీ అబ్దుల్ రహమాన్‌కు (76) అంతర్జాతీయ నేర న్యాయస్థానం (ఐసీసీ) 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. సూడాన్‌లో జంజావీద్ దళ నాయకుల్లో ఒకడైన రహమాన్ అత్యంత క్రూరంగా హత్యలు, మానభంగాలు, చిత్రవధలకు పాల్పడ్డాడని, పిల్లలతోసహా కనీసం 213 మంది మరణానికి కారకుడయ్యాడని ప్రాసిక్యూషన్ ఆరోపించింది. 16 మంది మహిళలు, బాలికలపై అత్యాచారాలకూ అతడు బాధ్యుడని తెలిపింది. 2003-2004లో గొడ్డలి తీసుకుని ఇద్దరిని చంపాడని ఆరోపించింది. దార్ఫుర్‌లో తిరుగుబాటును అణచివేయడానికి ప్రభుత్వం ఒక పథకం ప్రకారం రహమాన్ వంటి జంజావీద్ నాయకులను నియోగించింది.

భూభాగాల అప్పగింతకు జెలెన్‌స్కీ ససేమిరా

రోమ్: రష్యాకు తమ భూభాగాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అప్పగించబోమని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ తేల్చిచెప్పారు. అలా అప్పగించేందుకు తమకు అధికారాలు లేవని కూడా స్పష్టం చేశారు. "మేం మా భూభాగాలను వదులుకోవాలని రష్యా ఒత్తిడి చేస్తోంది. కానీ మేం వాటిని వదులుకోబోం. పోరాటం కొనసాగిస్తాం. భూభాగాల అప్పగింత హక్కు మాకు లేదు. ఉక్రెయిన్ చట్టాలు, రాజ్యాంగం, అంతర్జాతీయ చట్టాల ప్రకారం చూసుకున్నా అంతే" అని జెలెన్‌స్కీ సోమవారం రాత్రి మీడియా ప్రతినిధులతో వాట్సప్ చాట్‌లో పేర్కొన్నారు. మరోవైపు- శాంతి ప్రణాళికకు అంగీకారం తెలపాలంటూ అమెరికా నుంచి ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో.. ఉక్రెయిన్‌కు అనుకూలంగా ఐరోపా దేశాల మద్దతు కూడగట్టుకునే ప్రయత్నాలను జెలెన్‌స్కీ ముమ్మరం చేశారు. తాజాగా ఆయన పోప్ లియో-14తోనూ భేటీ అయ్యారు. వివిధ దేశాల్లో సుడిగాలి పర్యటనలతో తీరిక లేకుండా గడుపుతుండటంతో.. జెలెన్‌స్కీ సంప్రదాయ విధానాల్లో జరిగే విలేకర్ల సమావేశాలకు దాదాపు దూరంగా ఉంటున్నారు. విమాన ప్రయాణంలో ఉండగా మీడియా ప్రతినిధులతో వాట్సప్ చాట్ ద్వారా పలు వివరాలు పంచుకుంటున్నారు.

ఉక్రెయిన్ సర్కారు సహకరించాలి: ట్రంప్

ఉక్రెయిన్-రష్యా యుద్ధం ముగింపునకు తాము ప్రతిపాదించిన శాంతి ప్రణాళికకు అంగీకారం తెలపాలంటూ జెలెన్‌స్కీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒత్తిడి పెంచుతూనే ఉన్నారు. రష్యాకు భూభాగాలను అప్పగించేందుకు ఉక్రెయిన్ సమ్మతించాలని తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆయన సూచించారు. ప్రస్తుతం మాస్కోది పైచేయిగా ఉందని, కాబట్టి జెలెన్‌స్కీ సర్కారు సహకరించాలని వ్యాఖ్యానించారు.



పశ్చిమబెంగాల్‌లో సర్ అమలు వద్దంటూ కోల్‌కతాలో మంగళవారం ఆందోళన చేస్తున్న టీఎంసీ మహిళా కార్యకర్తలు

విదేశీ వృత్తి నిపుణులకు రష్యా సరికొత్త వీసా

ఇంటర్నెట్ డెస్క్: విదేశీ వృత్తి నిపుణులను ఆకర్షించేందుకు రష్యా సరికొత్త వీసాలను ప్రకటించింది. ఈ కొత్త వీసా కింద పలు రంగాల నిపుణులకు ఆ దేశంలో మూడేళ్లపాటు తాత్కాలిక, శాశ్వత నివాసం పొందే అవకాశాన్ని కల్పిస్తోంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇటీవల భారత్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈ పర్యటనకు ముందే పుతిన్ ఈ వీసాకు సంబంధించిన ఉత్తర్వులపై సంతకాలు చేసినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ కొత్త వీసా కార్యక్రమం వచ్చే ఏడాది ఏప్రిల్ 15 నుంచి అందుబాటులోకి రానున్నట్లు ఓ అధికారి తెలిపారు. విదేశీయులు, వారి కుటుంబ సభ్యులకు సైన్స్, ఆర్థిక, పారిశ్రామిక, విద్యా, సాంస్కృతిక, వ్యాపార, క్రీడల వంటి రంగాల్లో ఈ వీసాలు జారీ చేస్తామన్నారు. ఇమిగ్రేషన్ కోటాతో సంబంధం లేకుండా రష్యా భాషకు సంబంధించిన పరీక్షలో ఉత్తీర్ణత సాధించకపోయినా మూడేళ్లు తమ దేశంలో నివాసం కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

రాజధానికి తాగునీటి సరఫరా ప్రాజెక్టుల పనులకు అనుమతులు

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతికి తాగునీటి సరఫరాకు సంబంధించిన 43, 44 ప్యాకేజీల పనులకు ప్రభుత్వం పాలనాపరమైన అనుమతులు జారీ చేసింది. ప్యాకేజీ 43 పనుల్ని రూ.494.86 కోట్లతో, ప్యాకేజీ 44 పనుల్ని రూ.560.57 కోట్లతో చేపడతారు. ఇన్‌టేక్ వెల్, అప్రోచ్ బ్రిడ్జి, రా వాటర్ పంపింగ్ మెయిన్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, క్లియర్ వాటర్ రిజర్వాయర్, క్లియర్ వాటర్ పంప్ హౌస్ వంటివి ఈ ప్రాజెక్టుల్లో భాగంగా నిర్మిస్తారు. స్కాడా, ఏఐ ఆధారిత సెంట్రలైజ్డ్ వాటర్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (సీడబ్ల్యూఐఎంఎస్) వంటివి ఏర్పాటు చేస్తారు.

ఇంటర్‌లో అదనపు సెక్షన్లకు అనుమతి

ఈనాడు, అమరావతి: ప్రైవేటు, ఎయిడెడ్ కళాశాలలు అనుబంధ గుర్తింపు, అదనపు సెక్షన్లు తదితర మార్పులకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తూ ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యదర్శి రంజిత్ భాషా ఉత్తర్వులు జారీ చేశారు. 2026-27 విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ప్రాథమిక అనుబంధ గుర్తింపు రెన్యువల్, అదనపు సెక్షన్లు, కొత్త కోర్సులు, కోర్సుల మార్పు, మాధ్యమం, రెండో భాష మార్పు, ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి కళాశాల తరలింపు తదితరాలకు అవకాశం కల్పించారు. ఇందుకు సంబంధించి ఫిబ్రవరి 28 లోపు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

వివాదాల సత్వర పరిష్కారానికి 'లిటిగేషన్ పాలసీ'

- సిఫారసులు చేసేందుకు మంత్రుల కమిటీ నియామకం

ఈనాడు, అమరావతి: లిటిగేషన్ పాలసీ-2025 రూపకల్పన, ఖరారుకు ఐదుగురు మంత్రులతో ప్రభుత్వం కమిటీని నియమించింది. న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి ఎన్ఎండీ ఫరూక్, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, హోం మంత్రి వంగలపూడి అనిత, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, కుటుంబ, ఆరోగ్య సంక్షేమశాఖ మంత్రి సత్యకుమార్ సభ్యులుగా ఉంటారు. అనవసర వివాదాలను నివారించడం, వివాదాల్ని సకాలంలో సమర్థంగా పరిష్కరించడం, న్యాయపరమైన అంశాల్ని పారదర్శకంగా, జవాబుదారీతనంతో సమర్థంగా నిర్వహించడం, కోర్టుల్లో పెండింగ్ కేసుల సంఖ్యను తగ్గించడం, ప్రత్యామ్నాయ వివాద పరిష్కార పద్ధతుల్ని ప్రోత్సహించడం, వివిధ శాఖల మధ్య సమన్వయంతో వేగంగా న్యాయపరమైన పరిష్కారాలు సాధించడం ఈ పాలసీ ముఖ్యోద్దేశం. ఇందులో పొందుపరచాల్సిన అంశాల్ని మంత్రుల కమిటీ సిఫారసు చేస్తుంది.

రాజధాని పనులకు గ్రావెల్, రోడ్‌మెటల్ సరఫరా పర్యవేక్షణకు కమిటీల నియామకం

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతి పరిధిలోని పనులకు అవసరమైన గ్రావెల్, రోడ్ మెటల్, ఇసుక తదితరాల సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడటం, వేగంగా వీటి లీజులు మంజూరయ్యేలా చూసేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీలను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది.

- ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు, ఏలూరు జిల్లాల కమిటీలకు ఆయా కలెక్టర్లు ఛైర్మన్లుగా ఉంటారు.
- జిల్లా గనులశాఖ అధికారి మెంబర్ కన్వీనర్‌గా, సీఆర్‌డీఏ ప్రతినిధి, సంబంధిత ఆర్డీవో, కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) జోనల్ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్, జిల్లా అటవీ అధికారి, సీఆర్‌డీఏలోని గుత్తేదార్ల ప్రతినిధులు కొందరు సభ్యులుగా ఉంటారు.
- ఈ జిల్లా కమిటీ సీఆర్‌డీఏ సూచించిన గుత్తేదారు సంస్థలకు గ్రావెల్, రోడ్ మెటల్, మట్టి లీజులకు సంబంధించిన దరఖాస్తులను వేగంగా పరిశీలించి, వాటికి రెవెన్యూ శాఖ నుంచి ఎన్వోసీ, పీసీబీ నుంచి పర్యావరణ అనుమతులు వంటివన్నీ వేగంగా దక్కేలా చూస్తుంది.
- ఈ కమిటీ వారానికోసారి సమావేశమై రాజధాని పనులకు మెటీరియల్ సరఫరా జరుగుతున్న తీరు, ఇంకా అవసరమైన అనుమతులు వంటివి పర్యవేక్షిస్తుంది.
- సింగిల్ విండో ప్లాట్‌ఫామ్ ద్వారా అనుమతులు మంజూరయ్యేలా చూస్తుంది.
- రాష్ట్రస్థాయి కమిటీకి సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ ఛైర్మన్‌గా ఉంటారు.
- గనులశాఖ సంచాలకులు మెంబర్ కన్వీనర్‌గా ఉంటారు.
- పీసీబీ ప్రతినిధి, పర్యావరణ మదింపు సంస్థ ప్రతినిధి, అటవీశాఖ ప్రతినిధి, అయిదు జిల్లాల కలెక్టర్లు సభ్యులుగా ఉంటారు. సీఆర్‌డీఏలో కాంట్రాక్టర్లు/ ప్రాజెక్ట్ అధికారులు ప్రత్యేక ఆహ్వానితులుగా ఉంటారు.
- రాష్ట్రస్థాయి కమిటీ ప్రతి 15 రోజులకోసారి భేటీ అవుతుంది. జిల్లాస్థాయి కమిటీల నిర్ణయాలు, అవి అమలవుతున్న తీరుని పరిశీలిస్తుంది.
- ఏవైనా సమస్యలుంటే వారంలో పరిష్కరించేలా చూస్తుంది.
- పీసీబీ, పర్యావరణ మదింపు సంస్థ, అటవీ, రెవెన్యూ అధికారులతో సమన్వయం చేస్తుంది.
- ప్రకాశం బ్యారేజ్ నుంచి ఇసుక డిసిల్టేషన్, ఆ ఇసుక సీఆర్‌డీఏ పనులకు సరఫరా అవుతున్న తీరును పర్యవేక్షిస్తుంది.

వక్ఫ్ బోర్డు చట్టబద్ధతను ప్రశ్నిస్తూ హైకోర్టులో వ్యాజ్యం

ఈనాడు, అమరావతి: వక్ఫ్ బోర్డు చట్టబద్ధతను తేల్చాలంటూ కడప జిల్లాకు చెందిన న్యాయవాది షేక్ ఆరిఫ్ మంగళవారం హైకోర్టులో వ్యాజ్యం వేశారు. ప్రస్తుత బోర్డులో 8 మంది నామినేటెడ్ సభ్యులుంటే.. ముగ్గురే ఎన్నికైన వారు ఉన్నారన్నారు. ఎమ్మెల్యే కోటా కింద సభ్యులను ఎన్నుకోవాల్సి ఉండగా.. అందుకు భిన్నంగా ప్రభుత్వం వారిని నామినేట్ చేసిందన్నారు. ఈ నేపథ్యంలో బోర్డు, సభ్యులు ఎన్నుకున్న ఛైర్మన్ నియామకం చెల్లదని పిటిషన్లో పేర్కొన్నారు.

వైకాపా ఎంపీటీసీ సభ్యుడి తండ్రి పేరిట మా భూమిని రాశారు

- తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితుల ఫిర్యాదు
- గ్రీవెన్స్‌లో మంత్రి పయ్యావుల కేశవ్‌కు వినతుల సమర్పణ

ఈనాడు, అమరావతి: 'మా గ్రామంలో సర్వే నం.328-1బీలో 0.04 సెంట్లు, 341-2బీ1లో 0.67 సెంట్లు కలిపి 0.71 సెంట్ల భూమి ఉంది. పట్టాదారు పాస్ పుస్తకమూ ఉంది. భూమి మా అధీనంలో ఉంది. కానీ, ఆన్‌లైన్‌లో వైకాపా ఎంపీటీసీ సభ్యుడి తండ్రి పేరుతో నమోదైంది. స్థానిక తహసీల్దార్‌కు విన్నవించినా న్యాయం జరగలేదు. మాకు న్యాయం చేయండి' అని పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం రచ్చమళ్లపాడుకు చెందిన ప్రమీల మంగళవారం తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల నుంచి ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఛైర్మన్ కుప్పం రాజశేఖర్ వినతులను స్వీకరించి వారికి భరోసా కల్పించారు. ఆ అర్జీల్లో కొన్ని.

లంచం తీసుకున్న మాజీ వాలంటీర్

'వైకాపా హయాంలో వాలంటీర్‌గా పనిచేసిన వైకాపా సర్పంచ్ మేనకోడలు రూ.2లక్షల లంచం తీసుకుని ఆశా వర్కర్ ఉద్యోగం ఇప్పించారు. దీనిపై విచారణ జరిపించి అర్హులకు ఉద్యోగం ఇవ్వాలి.'

– వెంకటరావు, పద్మనాభం మండలం, విశాఖపట్నం.

◆ 'గ్రామంలో మాకు 4.14 సెంట్ల భూమి ఉంది. ఇందులో 1.06 సెంట్లు నా భార్య పద్మకుమారి పేరున రిజిస్టరైంది. తాజాగా తహసీల్దార్ కార్యాలయం వారు మా అమ్మ బొడ్డా లక్ష్మీతులశమ్మ పేరున ఎక్కించారు. మా అన్న కొడుకు అక్రమంగా వచ్చి పంట తీసుకుపోతున్నాడు. దీనిపై పలుమార్లు పోలీసులకు, తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదుచేసినా న్యాయం జరగలేదు.'

– సాంబశివరావు, ఆముదాలపల్లి, ఉంగుటూరు మండలం, కృష్ణా జిల్లా

◆ 'మా గ్రామంలో మాకు సర్వే నెం.1306/1లో 0.98 సెంట్ల భూమి వారసత్వంగా వచ్చింది. గ్రామంలోని కొందరు ఆ భూమిని ఆక్రమించి మమ్మల్ని బెదిరిస్తున్నారు. దారులనూ మూసేసి గూండాగిరీ చేస్తున్నారు. స్థానిక అధికారులూ వారివద్ద డబ్బులు తీసుకుని వారికే మద్దతిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకుని మా సమస్యను పరిష్కరించండి.'

– శ్రీనివాస్, గవరపాలెం, అనకాపల్లి జిల్లా.

◆ 'గ్రామంలో మాకు 3.80 ఎకరాల భూమి ఉంది. గ్రామానికి పక్కనే ఉండటంతో ఈ భూమిని కొంత మంది వ్యక్తులు ఆక్రమించి గుడిసెలు వేసుకున్నారు. ఖాళీ చేయాలని అడిగితే మమ్మల్ని చంపేస్తామని బెదిరిస్తున్నారు. మాకు న్యాయం చేయండి.'

– పురుషోత్తమయ్య, కుంకనూరు, దేవనకొండ మండలం, కర్నూలు జిల్లా.

◆ 'ఉగ్గినపాలెం రెవెన్యూ గ్రామ శివారు బుచ్చయ్యపేట పంచాయతీ పరిధిలో సర్వే నం.222/2లో 2.86ఎకరాలను మేం 18మంది కలిసి 2016 అక్టోబరులో కొన్నాం. ఉద్యోగరీత్యా బయటప్రాంతాల్లో ఉంటున్నందున మాలో కొందరు ఈ భూమి పట్టాదారు పాస్‌పుస్తకాలు తీసుకోలేకపోయాం. సర్వే చేసి మాకు పాస్ పుస్తకాలు ఇవ్వాలని కోరితే పట్టించుకోవడం లేదు.

– పోలిశెట్టి వెంకటేశ్వరరావు ఉగ్గినపాలెం, కశింకోట మండలం, అనకాపల్లి జిల్లా

◆ మా కుమారుల భూమిని అమ్మి రాజశేఖర్, పాండురంగనాథ పేర్లపై గుడ్లవల్లేరులో రిజిస్ట్రేషన్ చేశాం. అందుకు రూ.5లక్షలు ఇవ్వాల్సి ఉన్నా ఇప్పటివరకూ ఇవ్వలేదు. భూమి పత్రాలను వారి తల్లి శేషం రమణ పేరుతో బందరులో రిజిస్ట్రేషన్ చేసి, ఆ పత్రాలను గుడ్లవల్లేరు సహకార బ్యాంకులో తనఖా పెట్టి రుణాలు తీసుకున్నారు. మేం డబ్బు అడిగితే దాడి చేసి, బెదిరించారు. మాకు న్యాయం చేయండి.'

– సామ్రాజ్యం, విజయవాడ

ఇంటికో ఏసీ.. వీధిలో డ్రైనేజీ పైపు కనపడవు

- పైపులైన్లు, విద్యుత్తు తీగలు, చెత్తసేకరణకు భూగర్భ వ్యవస్థ
- ఆధునికతకు చిరునామాగా గుజరాత్ గిఫ్ట్ సిటీ

గుజరాత్ నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి



గిఫ్ట్ సిటీలోని భూగర్భ పైప్‌లైన్ వ్యవస్థ

మురుగునీటి పైపు లైన్ కనపడదు.. విద్యుత్తు తీగలు గాల్లో వేలాడవు.. చెత్త తీసుకెళ్లే బండ్లూ రావు.. విద్యుత్, నీటి సరఫరా, చెత్త సేకరణ కోసం కేంద్రీకృత యుటిలిటీ టన్నెల్ ఉంటుంది. ప్రతి ఇంటికీ ఏసీ పెట్టుకునే పని లేకుండా డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్ ద్వారా ప్రతి భవనానికి శీతలీకరణ సదుపాయం.. ఒకటా రెండా.. ప్రపంచ స్థాయి భవనాలు, మెరుగైన మౌలిక సదుపాయాలు, కార్యాలయాలకు దగ్గరగా నివాసాలతో అలరారుతోంది గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్-సిటీ (గిఫ్ట్ సిటీ). ఇది ప్రపంచ వ్యాపారం కోసం దేశంలో నిర్మించిన మొట్టమొదటి స్మార్ట్ సిటీ. గుజరాత్ రాజధాని గాంధీనగర్- అహ్మదాబాద్ మధ్య సబర్మతీ నదిని ఆనుకుని 886 ఎకరాల్లో ఏర్పాటైన గిఫ్ట్ సిటీ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, వసతులతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ◆ భారత్‌లోని మొదటి పూర్తి ఆటోమేటెడ్ వ్యర్థ నిర్వహణ వ్యవస్థను గిఫ్ట్ సిటీ కలిగి ఉంది. పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించే అవసరం లేకుండా ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా పెద్ద పెద్ద భవనాల్లోని అంతస్తుల నుంచే నేరుగా చెత్తను పైప్ లైన్‌లో వాక్యూమ్ ద్వారా సేకరిస్తున్నారు. చెత్త సేకరణ వ్యవస్థతో పాటు, మంచినీరు, విద్యుత్ సరఫరాకు అతిపెద్ద భూగర్భ పైప్ లైన్ వ్యవస్థను నెలకొల్పారు. ◆ ప్రపంచస్థాయి ప్రాణాలతో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు (డబ్ల్యూటీపీ), మురుగునీటి శుద్ధి ప్లాంట్లు (ఎస్‌టీపీ) ఉన్నాయి. నిత్యం నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అవుతోంది. ◆ డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్‌లో భాగంగా శుద్ధి చేసిన మురుగు జలాలను 5 డిగ్రీలకు శీతలీకరిస్తున్నారు. శీతలీకరించిన జలాలను నగరంలో ఎయిర్ కండిషనింగ్ కోసం వాడుతున్నారు. దీంతో ఈ నగరంలో ఏసీ ఔట్‌డోర్ యూనిట్లు ఉండవు. నగరంలో వలయంగా ఏర్పాటు చేసిన శీతలీకరణ పైప్‌లైన్ ద్వారానే ప్రతి భవనానికి ఎయిర్ కండిషనింగ్ ఉంటుంది. ఇది పట్టణ సౌందర్యాన్ని మెరుగుపరచడంతో పాటు కాలుష్యాన్ని తగ్గిస్తుంది. సాధారణ ఏసీలతో పోలిస్తే 30% తక్కువ శక్తిని ఉపయోగిస్తుంది.

◆ గిఫ్ట్ సిటీలో దేశంలోని మొదటి యుటిలిటీ టన్నెల్ ఉంది. విద్యుత్, నీటి సరఫరా, చెత్త సేకరణ ఇలా అన్ని సదుపాయాలు ఈ టన్నెల్‌లో ఉంచడంతో మరమ్మతులు, నిర్వహణ వంటి పనుల కోసం రోడ్లను తవ్వాల్సిన అవసరం ఉండదు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా 5.8 కి.మీ యుటిలిటీ టన్నెల్ అందుబాటులోకి తెచ్చారు.

ఏపీలో పంచాయతీరాజ్ నిధుల మళ్లింపేమీ జరగలేదు

- వైకాపా ఎంపీ ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీరాజ్ నిధుల మళ్లింపేమీ జరగలేదని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్‌రంజన్‌సింగ్ స్పష్టంచేశారు. "రూ.500 కోట్ల పంచాయతీరాజ్, రూ.1,129 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులను స్థానిక సంస్థల ఖాతాల్లో డిపాజిట్ చేయలేదని వచ్చిన కథనాల గురించి ప్రభుత్వానికి తెలుసా? ఒకవేళ అలా చేసి ఉంటే దానికి కారణాలేంటి?" అని అరకు వైకాపా ఎంపీ జి.తనూజారాణి మంగళవారం లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి సమాధానమిచ్చారు. అలాంటిదేమీ జరగలేదని స్పష్టంచేశారు. "రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన గ్రాంట్ ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరంలో 2వ విడత కింద విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులు (టైడ్, అన్‌టైడ్) రూ.1,121.20 కోట్లను బదిలీ చేయడంలో చోటు చేసుకున్న జాప్యం కాలానికి సంబంధించి అపరాధ వడ్డీ రూ.55.31 కోట్లు కలిపి సంబంధిత స్థానిక సంస్థల బ్యాంకు ఖాతాల్లో జమచేశారు" అని పేర్కొన్నారు. రాష్ట్రంలో సర్పంచుల చెక్ పవర్‌ను ఉపసంహరించినట్లు రాష్ట్ర ప్రభుత్వం నుంచి తమకేమీ సమాచారం అందలేదని చెప్పారు. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు 2020-21 నుంచి 2025-26 మధ్యకాలంలో ఏపీకి రూ.12,856 కోట్లు కేటాయించి మొత్తం రూ.11,653 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర మంత్రి రాజీవ్‌రంజన్‌సింగ్ మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. 14వ ఆర్థిక సంఘంతో పోలిస్తే కేటాయింపులు 48.55%, నిధుల విడుదల 43.43% పెరిగినట్లు వెల్లడించారు.

ఏపీలో ఏటా పెరుగుతూ వస్తున్న జీఎస్టీ వసూళ్లు

ఆంధ్రప్రదేశ్‌లో జీఎస్టీ వసూళ్లు ఏటా పెరుగుతూ వస్తున్నాయి. 2022-23లో రూ.28,589 కోట్ల ఆదాయం రాగా, 2023-24లో అది రూ.31,606 కోట్లకు, 2024-25లో రూ.33,301 కోట్లకు చేరింది. 2025-26లో నవంబరు నెల వరకు రూ.22,393 కోట్లు వచ్చింది. ఇది గత ఏడాది ఇదే సమయానికి వచ్చిన రూ.21,998 కోట్ల కంటే 1.79% ఎక్కువ.

ఏపీలో ఈ ఏడాది 65,695 టీబీ కేసులు

రాష్ట్రంలో ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబరు వరకు 65,695 టీబీ కేసులు రిపోర్ట్ అయినట్లు కేంద్ర వైద్యారోగ్యశాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ తెలిపారు. మంగళవారం ఆమె రాజ్యసభలో ఓ ప్రశ్నకు సమాధానంగా ఈ విషయం చెప్పారు. డబ్ల్యూహెచ్‌వో గ్లోబల్ టీబీ రిపోర్ట్ 2025 ప్రకారం 2024లో భారత్‌లో 21.7 లక్షల టీబీ కేసులు రిపోర్ట్ అవగా, 3 లక్షల మరణాలు సంభవించినట్లు వెల్లడించారు.

దేశంలో అత్యధిక పారిశ్రామిక పార్కులు ఏపీలోనే

ఆంధ్రప్రదేశ్‌లో 638 పారిశ్రామిక పార్కులు ఉన్నట్లు కేంద్ర వాణిజ్య శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద తెలిపారు. దేశంలో అన్ని రాష్ట్రాలకంటే ఇక్కడే అధిక సంఖ్యలో పార్కులున్నట్లు వెల్లడించారు. మంగళవారం లోక్‌సభలో తెదేపా సభ్యులు పుట్టా మహేష్‌కుమార్, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలు అడిగిన ప్రశ్నకు ఈ మేరకు బదులిచ్చారు. దేశవ్యాప్తంగా 4,597 పార్కులుంటే అందులో ఏపీ (638), మహారాష్ట్ర (527), రాజస్థాన్ (460), కర్ణాటక (384), తమిళనాడు (372)తొలి 5స్థానాల్లో నిలిచినట్లు చెప్పారు.

మళ్లీ పేపర్ బ్యాలెట్‌కు మళ్లాలి

- మేం గెలిచినా, ఓడినా ఈవీఎంలపై మా అనుమానాలు యథాతథం
- లోక్‌సభలో వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి

ఈనాడు, దిల్లీ: ఈవీఎంల ద్వారా ఓటింగ్ ప్రక్రియపై అనుమానాలున్నందున మళ్లీ పేపర్ బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలకు మళ్లాలని లోక్‌సభలో వైకాపాపక్ష నేత పీవీ మిథున్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆయన మంగళవారం లోక్‌సభలో ఎస్ఐఆర్‌పై జరిగిన చర్చలో మాట్లాడారు. "ఎన్నికల ప్రక్రియపై చాలా అనుమానాలు, సమస్యలు ఉన్నాయి. మేం వాటిని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లాం. ఆంధ్రప్రదేశ్‌లో గత ఎన్నికల్లో 6 గంటల తర్వాత 15% పోలింగ్ రికార్డు అయ్యింది. గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదు. ఒడిశాలోనూ ఇలాంటి ఫిర్యాదే ఉంది. ఒక్కసారిగా ఇంత పోలింగ్ ఎలా పెరిగిందన్నది తెలియాలి. దీనిపై మా ఫిర్యాదును ఈసీ పట్టించుకోలేదు. స్ట్రాంగ్‌రూమ్ సీసీటీవీ ఫుటేజ్ అడిగినా ఇవ్వలేదు' అని ఆరోపించారు. ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా అభివృద్ధి చెందిన యూరోప్ దేశాలు ఈవీఎంల నుంచి పేపర్ బ్యాలెట్‌కు మళ్లుతున్నాయని మిథున్‌రెడ్డి చెప్పారు. 'అమెరికాలో 92% బ్యాలెట్‌పైనే జరుగుతున్నాయి. ఈవీఎంలను సులభంగా హ్యాక్ చేయొచ్చని ఎలాన్ మస్క్ చెప్పారు. మేం ఈవీఎంలతో 2019లో గెలిచాం. 2024లో ఓడిపోయాం. నేను మూడు ఎన్నికల్లోనూ ఈవీఎంలతోనే గెలిచాను. అయినప్పటికీ వాటిపై అనుమానాలున్నాయి' అని పేర్కొన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకూ అంగీకారమైతే ఎస్ఐఆర్‌కు తమ పార్టీ సమ్మతమేనని చెప్పారు. పోలింగ్ బూత్‌ల నుంచి వెబ్‌కాస్టింగ్ చేయాలని, వాటి సీసీటీవీ ఫుటేజీలను అన్ని పార్టీలకు అందుబాటులో ఉంచాలని ఆయన సూచించారు.

ఆలయాల్లో భక్తులకు మెరుగైన సేవలందించాలి

ఈనాడు, అమరావతి: భక్తుల నుంచి సంతృప్త స్థాయి చాలా తక్కువగా ఉన్న నాలుగు ఆలయాల ఈవోలు వెంటనే అక్కడ మెరుగైన సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని దేవాదాయ కమిషనర్ రామచంద్ర మోహన్ ఆదేశించారు. అన్నవరం సత్యనారాయణ స్వామి, విజయవాడ కనకదుర్గమ్మ, గుంతకల్లు సమీపంలోని కసాపురం ఆంజనేయస్వామి, బేతంచెర్ల సమీపంలోని ఆర్ఎస్ రంగాపురం వద్ద ఉన్న మద్దిలేటి నరసింహస్వామి ఆలయాల్లో దర్శనాలు, ప్రసాదంలో నాణ్యత, తాగునీరు వంటి వసతులు, పారిశుద్ధ్య నిర్వహణపై భక్తుల నుంచి సంతృప్తస్థాయి తక్కువగా వచ్చింది. ఇటీవల దీనిపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఈ ఆలయాల్లో భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలని, రద్దీ వేళల్లో కూడా సరైన విధానంలో వేగంగా దర్శనాలు అయ్యేలా చూడాలని, పారిశుద్ధ్య పనులు మెరుగ్గా నిర్వహించాలని కమిషనర్ ఆదేశించారు.

ప్రజలు తిరస్కరించినా, ఉనికి కోసం పార్లమెంటులో అబద్ధాలు

వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డిపై కలిశెట్టి అప్పలనాయుడు ధ్వజం

ఈనాడు, దిల్లీ: గత సార్వత్రిక ఎన్నికల్లో ఏపీ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని లోక్‌సభలో వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని తెదేపా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆరోపించారు. ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని విధ్వంసం చేసిన పాపానికి ప్రజలు ఆ పార్టీని తిరస్కరించారని, అయినా ఉనికి కాపాడుకునేందుకు మిథున్‌రెడ్డి అబద్ధాలు చెప్పి పార్లమెంటును తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. ఆయన మంగళవారం దిల్లీలోని ఏపీభవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. 'గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రోజువారీ కూలీలను లైన్లో నిలబెట్టి ఓటేయించిన వాళ్లు కూడా ఓట్ల చోరీ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉంది. 2021 తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికలో తమిళనాడు నుంచి బోగస్ ఓటర్లను తరలించి దొంగ ఓట్లు వేయించిన చరిత్రను మిథున్‌రెడ్డి మరిచిపోయారా? వైకాపా హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులు కనీసం నామినేషన్ కూడా వేయకుండా అడ్డుకున్న వాళ్లు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటమా? నాడు వ్యవస్థలను ధ్వంసం చేసిన వైకాపా నాయకులు.. నేడు నీతులు చెప్పడం సరి కాదని మండిపడ్డారు. రాష్ట్రంలో ఓట్ల చోరీకి తెరదీయడంతో పాటు ఎన్నికల సంఘం అధికారులను భయపెట్టిన చరిత్ర వైకాపాదేనని కలిశెట్టి ఆరోపించారు.

12న విజయవాడలో ఎన్ఎంయూఏ రాష్ట్ర మహాసభ

ఈనాడు, అమరావతి: నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) రాష్ట్ర ద్వితీయ మహాసభను ఈ నెల 12న విజయవాడలో నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ రమణారెడ్డి, వై.శ్రీనివాసరావు తెలిపారు. ఇందిరాగాంధీ మున్సిపల్ మైదానంలో జరిగే మహాసభకు మంత్రులు రాంప్రసాద్‌రెడ్డి, అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, కొల్లు రవీంద్ర, పార్థసారథి, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు తదితరులు హాజరవుతారని తెలిపారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సంఘం నేతలు మంగళవారం ఆవిష్కరించారు.

జగన్ రాయలసీమ ద్రోహి

- చంద్రబాబు వల్లే సీమలో ప్రాజెక్టులు.. పరిశ్రమలు
- తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి

ఈనాడు, అమరావతి: జగన్ కడప బిడ్డ కాదు, కర్ణాటక బిడ్డ అని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి అన్నారు. 'నాడు తండ్రి వైఎస్ అధికారంలోకి రాగానే రాష్ట్రానికి వచ్చారు. తండ్రి అధికారాన్ని అడ్డంపెట్టుకొని రూ.వేల కోట్లు అక్రమంగా సంపాదించి కర్ణాటకలో పెట్టుబడులు పెట్టారు. తర్వాత తాను రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్లూ ఇక్కడ దోచుకున్న డబ్బును తీసుకువెళ్లి కర్ణాటకలోనే పెట్టుబడులు పెట్టారు. రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా చేసి, ప్రాజెక్టులనూ అధోగతి పాల్జేసిన జగన్ రాయలసీమ ద్రోహి' అని మండిపడ్డారు. మంగళవారం ఆయన తెదేపా కేంద్ర కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. 'ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌తోనే రాయలసీమకు ఈ 17 నెలల్లో భారీగా పెట్టుబడులొచ్చాయి. తెలుగుగంగ, హంద్రీ-నీవా, గాలేరు-నగరి లాంటి ప్రాజెక్టులు తెదేపా తెచ్చినవే. ప్రాజెక్టులను వేగంగా నిర్మించి రాయలసీమ రైతులకు సాగునీరు అందించే లక్ష్యంతో పనిచేస్తున్నారు' అని చెప్పారు.

పూర్వోదయతో 3 ప్రాంతాల అభివృద్ధి

- అందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: 'పూర్వోదయ పథకం కింద రాష్ట్రానికి వచ్చే నిధులతో మూడు ప్రాంతాల అభివృద్ధికి సత్వరం ప్రతిపాదనలు రూపొందించాలి. సాగునీటి ప్రాజెక్టులు, ఉద్యాన పంటల విస్తరణ, గ్రామీణ రహదారుల వంటి మౌలిక వసతుల కల్పనకు ఈ నిధులు వినియోగించేలా ప్రణాళికలు ఉండాలి' అని సీఎం చంద్రబాబు ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి పూర్వోదయతో పాటు సాగునీటి ప్రాజెక్టులు, పోలవరం నల్లమలసాగర్ అనుసంధానం వంటి అంశాలపై ఆయన సమీక్షించారు. మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమీక్షలో సీఎం ఏం చెప్పారంటే...

◆ ప్రకాశం జిల్లాతోపాటు రాయలసీమ జిల్లాల్లో 82 క్లస్టర్లలో 20 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలను విస్తరించాలి. పూర్వోదయలో రూ.40 వేల కోట్లతో ప్రాజెక్టులు చేపట్టేందుకు ప్రతిపాదనలు రూపొందించాలి. ఇందులో రూ.20 వేల కోట్లతో సాగునీటి ప్రాజెక్టులు, మరో రూ.20 వేల కోట్లతో మౌలిక వసతుల ప్రాజెక్టులు చేపట్టాలి. ఇందులో రూ.5 వేల కోట్లు ప్రత్యేకంగా గ్రామీణ రహదారులను రాష్ట్ర, జాతీయ రహదారులతో అనుసంధానం చేసేందుకు ఖర్చు చేయాలి.

◆ ప్రకాశం, రాయలసీమ జిల్లాల పరిధిలో మొత్తం 23 భారీ, మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టులు, 1,021 చెరువుల నిర్మాణం పూర్తి చేసి ఉద్యాన పంటలకు నీరందించాలి.

◆ పోలవరం- నల్లమలసాగర్ అనుసంధాన పనులు త్వరలో చేపట్టాలి. పోలవరం నుంచి 200 టీఎంసీలు, నాగార్జునసాగర్ నుంచి 50 టీఎంసీలు కృష్ణా వరద జలాలను బొల్లాపల్లికి తరలించే యోచన చేయాలి.

◆ ఉత్తరాంధ్ర జిల్లాలు ఆయిల్‌పామ్, ఇతర ఉద్యాన పంటల సాగుకు అనుకూలం. రూ.5 వేల కోట్లతో ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించాలి. రూ.169 కోట్లతో వంశధార, నాగావళి అనుసంధానం పూర్తి చేయాలి.

◆ హిరమండలం జలాశయం, నారాయణపురం ఆనకట్టలను అనుసంధానించాలి. దీంతో 5 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీళ్లు ఇవ్వవచ్చు.

వివిధ సంస్థల ప్రతినిధులతో మంత్రి లోకేశ్ భేటీలు

ఈనాడు, అమరావతి: పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అమెరికాలో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన అక్కడ వివిధ సంస్థల ప్రతినిధులతో వరుస భేటీలు నిర్వహించారు. ఆ వివరాలు ఇవీ..






శాన్‌ఫ్రాన్సిస్కోలో ఓపెన్ ఏఐ సంస్థ చీఫ్ టెక్నాలజీ అధికారి శ్రీనివాస్ నారాయణన్‌తో భేటీ అయిన మంత్రి లోకేశ్ ◆ ఓప్స్ ర్యాంప్ సీఈవో కూనపనేని వర్మతో





శాన్‌ఫ్రాన్సిస్కోలో ఏఎండీ సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వంశీ బొప్పనకు జ్ఞాపిక అందజేస్తున్న మంత్రి లోకేశ్ ◆ శాన్‌ఫ్రాన్సిస్కోలో ఓమియం సంస్థ చీఫ్ సైన్స్, టెక్నాలజీ అధికారి చొక్కలింగంతో





సేల్స్ ఫోర్స్ సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ రమేశ్‌తో మంత్రి లోకేశ్ ◆ శాన్‌ఫ్రాన్సిస్కో కాన్సుల్ జనరల్ ఆఫ్ ఇండియా శ్రీకర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి లోకేశ్



ఆటోడెస్క్ సంస్థ ముఖ్య టెక్నాలజిస్ట్ దేవ్ పటేల్ బృందంతో చర్చిస్తున్న మంత్రి లోకేశ్

మూడు నెలల్లో అందుబాటులోకి రాష్ట్ర ల్యాబ్

మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి



మంగళగిరిలోని కార్యాలయం నుంచి వర్చువల్‌గా ఔషధ నియంత్రణ శాఖ భవనాలు ప్రారంభిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, చిత్రంలో డీజీ గిరీశా తదితరులు

మంగళగిరి, న్యూస్‌టుడే: విజయవాడలో నిర్మాణంలో ఉన్న ఔషధ నియంత్రణ శాఖ రాష్ట్ర స్థాయి ల్యాబ్‌ను మరో మూడు నెలల్లో అందుబాటులోకి తెస్తామని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. మంగళగిరిలోని వైద్య ఆరోగ్య శాఖ ప్రధాన కార్యాలయం నుంచి వర్చువల్‌లో విశాఖ, కర్నూలులలోని ప్రాంతీయ ప్రయోగశాలలతోపాటు.. శ్రీకాకుళం, అమలాపురం, నరసరావుపేట, ఒంగోలు, కావలి, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, మదనపల్లెలలో పరిపాలన కార్యాలయాలను ఆయన మంగళవారం ప్రారంభించారు. రూ.11.12 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ 11 భవనాలు అందుబాటులోకి రావడంతో అద్దె భవనాల సమస్య పరిష్కారమైందన్నారు. 'ప్రస్తుతం విజయవాడలోని ప్రయోగశాలలో ఏడాదికి 4,000 మందుల నమూనాల నాణ్యతను పరీక్షిస్తున్నాం. కొత్తగా ప్రారంభించిన ప్రాంతీయ ల్యాబుల్లో 3,000 నమూనాల పరీక్షలకు అవకాశం ఉంది. రాష్ట్రస్థాయి ల్యాబ్ అందుబాటులోకి వస్తే అదనంగా మరో 7,000 నమూనాల పరీక్షలకు వీలుంటుంది' అని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ డీజీ గిరీశా, సంచాలకులు ఎంపీఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.